

# అన్వేషకుడు

మాస్టర్ పార్వతీకుమార్




# అమనస్కుడు

## మాస్టర్ పార్వతీకుమార్

సత్యాన్వేషణము జీవికి తుది మలుపు. అనేక రకముల ఆసక్తి, అన్వేషణములు జన్మలతరబడి జరిగిన వెనుక అమృతతత్త్వము, శాశ్వతత్త్వము అను విషయములపైకి జీవుని మనస్సు ఆకర్షింపబడును. అంతవరకునూ వివిధాంశములపైన అనురక్తితో తీరుబడి లేక జన్మలెత్తు జీవి అంతఃప్రబోధము కారణముగ సత్యదర్శనమునకు ఆరాటపడును.

అమనస్కుడొక సత్యాన్వేషి, అతడు అట్టి సత్యాన్వేషణ ఆరాటమున ఆరోహణా క్రమముగ సాగించిన ప్రయాణ విషయమే ఈ గ్రంథము.

సత్యాన్వేషకులకు మాత్రమే ఈ గ్రంథము ఉపయోగకరము.

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# అన్వేషకుడు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2007 ప్రతులు : 1,000

ద్వితీయ ముద్రణ : 2017 ప్రతులు : 1,000

వెల : **రూ. 100-00**

© ధనిష్ఠ

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002

ఫోన్ : 0891-2701531, 2509154,

website : www.dhanistha.org.

info@dhanistha.org

ISBN : 978-81-89467-77-7

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

విశాఖపట్నం-530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ'' 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము''గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : **మాస్టర్ పార్వతీకుమార్**

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 33 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "**డాక్టర్ ఆఫ్ లెటర్స్**" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత

అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్ గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తననుతాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్ గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ప్రస్తావన

భారతీయ సంప్రదాయము సమగ్రము. అందు వివిధత్వ మున్నను, దీక్షతో పాటించినచో ఏకత్వమునే చేర్చును. సంప్రదాయపు విలువలను తెలిసి, అవగాహనతో ఆచరించువారికి, భారతీయ సంప్రదాయము సత్య దర్శనము గావించగలదు. ఇది ముమ్మాటికిని సత్యము.

ఈ నవలయందు సంప్రదాయ కుటుంబమున జన్మించిన యువకుడు సంప్రదాయమును వదలి, సత్యాన్వేషణ సాగించుచు, తాను విసర్జించిన సంప్రదాయమునందలి విలువలను గ్రహించును. అతడే సిద్ధార్థుడు.

సిద్ధార్థు డొక అన్వేషకుడు. సత్యదర్శనమునకై తపన చెందిన వాడు. స్వతంత్ర బుద్ధి యున్నను, త్రికరణశుద్ధి యున్నవాడు. అతనికి ఎట్టకేలకు సత్యదర్శనమైనది. అన్వేషణ మార్గమున పలు అగచాట్లకు గురియై చివరికి సత్యదర్శనము చేయును.

ఈ నవల యందు సౌదామని ఒక ప్రత్యేకమైన పాత్ర. ఆమె జీవనము అవగాహన చేసుకొనవలెనన్నచో, సత్య దర్శనమునకు బాహ్యావృత్తి ఏదైనను, అంతరాయము కాజాలదని తెలియును. ఆత్మ పరిశీలనము ప్రవృత్తిగా గలవారు అంతరంగ జీవనులై,

బహిరంగమును, అంతరంగమును విడమరచుకొని మట్టి యందు మాణిక్యమువలె ఎట్లుండవచ్చునో తెలియజేయబడినది. ఈమె పాత్ర అపూర్వము, వినూత్నము.

నవల యందు గోవిందుడను మరియొక అన్వేషి గోచరించును. అతడు మొదట స్వతంత్ర బుద్ధిగ యున్నప్పటికిని, అటుపైన గురు స్పర్శతో తరించుట తెలుపబడినది.

పరబ్రహ్మశాస్త్రి దంపతి సత్సంప్రదాయమునకు ప్రతీక. సంప్రదాయమున నుండి క్షేమంకరముగ, శుభకరముగ, సత్యదర్శన సోపానమెట్లు నిర్వర్తించుకొన వచ్చునో తెలియజేయు పాత్రలు. వీరు నవల ఆసాంతము దర్శనమిచ్చుచునే యుందురు.

బుద్ధుడు, సిద్ధుడు, గోపన్న పాత్రలు త్రికరణశుద్ధిగా సత్య దర్శనమునకై ఆరాటపడువారిని అనుగ్రహించుటకు ప్రకృతి ఏర్పాటు చేయు పాత్రలు.

ఈ నవలయందు మిక్కుటమగు శాశ్వత సత్యములు, ధర్మ సూత్రములు, సాధన రహస్యములు చాల లోతులలో తెలియజేయ బడినవి. పాఠకుల యందలి ప్రేమానురాగములను ఎప్పుడును గుర్తించు ధనిష్ఠ, చాల వరకు ఈ విషయములను ముద్రణ యందు ప్రస్ఫుటముగ తెలియజేయుచున్నది. అట్లు ముద్రణ చేసినవి కొన్నియే!

నిజమునకు సత్యదర్శన ఆకాంక్ష తీవ్రముగా గల జిజ్ఞాసువు లకు ఈ నవల యందు ఎన్నియో ఉపాయము లందగలవు. మాస్టర్

పార్వతీకుమార్ గారు రచించిన "**అమనస్కుడు**" చాలమంది పాఠకులను ప్రచోదనము గావించినది. అట్లే "**అసంగుడు**"ను. ఇప్పుడు అందించబడుచున్న ఈ నవల "**అన్వేషకుడు**". అకార కూటమిగా నున్న ఈ మూడు నవలల యందును మాస్టరుగారు అవగాహన లోతులను సాధకులకు అందజేయవలెనన్న తపన ప్రస్ఫుటముగా గోచరించును. వారు రచించిన ఈ నవల మరల మరల పఠింప వలసిన విషయము.

ఆంగ్లమున సిద్ధార్థ అను నవల యొకటి భౌగోళికముగా వ్యాప్తి చెందినది. ఆ నవలతో కొంత సారూప్య మున్నప్పటికిని, ఈ నవల దానికన్న సమగ్రము, సంపూర్ణము, వైవిధ్యము కూడ. సంప్రదాయము విసర్జించుట తగదని హెచ్చరించు నవల ఇది. ఆధునిక యువ సాధకులకు ఈ నవల ఎంతయో ఉపయోగకరము.

ఈ ద్వితీయ ముద్రణమును సత్యాన్వేషణలో నున్న ఒక మాతృమూర్తి సమర్పితము. వారికి మాస్టరుగారి శుభాశీస్సులు!

శ్రీ హేవిళంబి
కార్తీక పూర్ణిమ

**ధనిష్ఠ**

# 1

బ్రాహ్మీ ముహూర్తమున మంగళవాయిద్యములు మ్రోగినవి. పరబ్రహ్మశాస్త్రిగారు నిదురలేచి గోదావరి నదీ జలములందు శాస్త్రోక్తముగ స్నానమాచరించి గృహమునకేగి భస్మధారణము గావించి, ధావళిని ధరించి కంచు పంచపాత్రను పట్టుకొని తూర్పు ముఖముగ వసారాలో కూర్చొని వేదఘోషను గావించినారు. ప్రభాత సమయమున సంధ్యావందనమును గావించి, గాయత్రి మంత్రమును 108 మార్లు జపించి, 72 నిముషములపాటు ధ్యానము కావించుకొని కనులు తెరిచి వ్యాసప్రోక్తమగు స్తోత్రాదికములు గావించినారు. వారి కార్యక్రమము ప్రతి ఉదయము 4 గంటల నుండి 8 గంటల వరకు ఇట్లే సాగుచుండును. ఆయనతో పాటు ఆయన కుమారుడు సిద్ధార్థుడు కూడ అదియే అనుష్ఠానమును తన ఏడవ సంవత్సరము నుండి పాటించుచున్నాడు. ఉపనయనము అయిన దాదిగ 11 సంవత్సరముల పాటు తండ్రి వెనుక పై విధముగ దినమారంభమగును. అటుపైన వేదాధ్యయనము తండ్రి వద్దనే నేర్వవలెను.

పరబ్రహ్మశాస్త్రిగారికి వేదమే స్ఫూర్తి. గాయత్రియే పరదేవత. పరబ్రహ్మమే ఉపాస్య దైవము. పరహితమే జీవనము. వైదిక నిష్ఠా నియమముల ననుసరించుచు వారు క్రమశిక్షణతో జీవించు చుందురు. వైదిక సంప్రదాయమును పరిపూర్ణముగ పాటింతురు. వారి సతీమణి సుశీలాదేవి వారికి అనుకూలవతియైన భార్య. శాస్త్రిగారికి అన్ని విషయముల యందు సహకరించుచు, తలలో నాలుకవలె వారితో జీవించుచు వారిని సేవించుచుండును. వైదిక నిష్ఠానియమములు గొప్పవని భావించి, తన భర్త సమస్తము తెలిసిన వాడను పరిపూర్ణ నమ్మకముతో వారి ననుసరించు చుండును. వేదరహస్యము తెలియనంత మేధావి కాకున్నప్పటికిన్ని మనసా, వాచా, కర్మణా తన భర్త చేయు క్రతువులు, హోమములు, పూజల యందు పాల్గొనుచుండును. ప్రతి సాయంత్రము భర్త చేయు భారత, భాగవత, రామాయణాది ప్రసంగములయందు పాల్గొని, ధర్మమును దైవమును శాస్త్రిగారు తెలుపురీతిని గ్రహించి ఆనందించు చుండును. శాస్త్రిగారిది స్ఫూర్తి. సుశీలాదేవి జీవనము విశ్వాసపూరిత జీవనము.

వారి ఏకైక సంతానము సిద్ధార్థునకు మాత్రము యీ సమస్త కార్యక్రమము ఒక యాంత్రిక జీవనము. అతనికి 11 సంవత్సరముల అనుష్ఠాన జీవనమున ఎట్టి రుచి కలుగ లేదు. తండ్రివలె స్ఫూర్తి లేదు. తల్లివలె విశ్వాసమును లేదు. అట్లని తల్లిదండ్రుల యెడల నిర్లక్ష్యముగాని, అశ్రద్ధగాని, భక్తి లేకుండుటగాని లేదు. అతని కన్నియు ప్రశ్నలే. ప్రశ్నలన్నింటికిని తండ్రి సమాధానములు తెలుపుచున్నప్పటికిన్ని మరల ప్రశ్నలే పుట్టుచుండును. ప్రశ్న లెక్కువ. సమాధానపడుట తక్కువ. తన ప్రశ్నలకు తన వద్ద

సమాధానము లేదు. తండ్రి సమాధానము తెలిపినను మనసునకు నచ్చదు. అట్లని తండ్రిని విసిగించడు. సమాధానము తండ్రి తెలుపుచున్నను, ఈ లోపలనే తన మనస్సున పరిపరి విధములగు ప్రశ్నలు పుట్టును. అందుచేత సమాధానము వినడు. వినుట, విన్నది వివరించుకొనుట, అందలి సత్యాసత్యములను పరిశీలించుట చేయడు. సహనము తక్కువ. మనసు వేగము ఎక్కువ.

అతనికి 18వ పుట్టినరోజు పక్షము రోజులలో రానున్నది. 17 సంవత్సరములు పూర్తి కావచ్చు చున్నవి. 11 సంవత్సరముల నిష్ఠా జీవనము కేవలము యాంత్రిక మగుటచే, మనసున స్పర్థ పెరుగుచున్నది. కలవరము మొదలైనది.

సిద్ధార్థునికి గోవిందుడను ప్రాణ స్నేహితు డున్నాడు. అతడొక రోజు సిద్ధార్థుని వద్దకు వచ్చి "సిద్ధూ! నేనొక మంచి విషయమును వింటిని. గంగా తీరపు దట్టమైన అరణ్యములో కొంతమంది ధ్యాన పరుల బృందము కలదట. వారందరును కేవలము జలము గ్రోలి మౌనముగ నుందురట. వారికి ఆకలి లేదు. ఆకలిని జయించి నారట. నిద్రను కూడ జయించినారట. ఆహారమును, నిద్రను జయించి కౌపీన వస్త్రధారులై, మౌనముగ నివసించుచు ధ్యానము చేయుదురట. వారు కనులు తెరచుకొని ధ్యానము చేయుదురట. కనులు మూసుకొని కూడ ధ్యానము చేయుదురట. సమస్తమునందలి దైవమును దర్శించుచు జీవించు చుందురట."

*సిద్ధార్థుడు :* వేద పఠనములు, ఆచమనములు, క్రతువులు, వేషధారణములు లేవా?

*గోవిందుడు :* లేవట. సూటిగ భావముతో, దైవముతో యోగించి జీవించు విధానమట.

*సిద్ధార్థుడు :* ధావళిలు, కంచు పాత్రలు, విభూతి ధారణమును దాటినా రన్నమాట. చాల సంతోషము. సంధ్యావందనములు, ఉపవాసములు అని కొన్ని సమయములలో మాత్రమే దైవమును స్మరించి, యితర సమయములలో సాంసారిక విషయాసక్తులగుట లేదన్న మాట. అనునిత్యము దైవయోగమే.

*గోవిందుడు :* వారు అనుసరించు మార్గమున ఆలోచనా శక్తి, వివేచనాశక్తి విశేషముగా వృద్ధి చెందగలవట. ఏ విషయము నైనను కూలంకషముగ ఆలోచించు శక్తి కలుగునట. తత్త్వ విచారణమునకు యిట్టి శక్తి అవసరమని మన పెద్దలు గూడ తెలుపుదురు.

*సిద్ధార్థుడు :* మన పెద్దల కేమిలె. వారు అన్నియూ తెలుపుదురుగాని ఏమియు ఆచరింపరు. కర్మకాండ మెండుగ నుండి ముఖప్రీతికై దైవము నారాధింతురు. వారికి అనన్యభావము వచ్చుట కష్టము. ఆలోచనా శక్తిని ఎన్నడో అటకెక్కించినారు. గొఱ్ఱెల మందల వలె ఆలోచింపక, విచారింపక, వివేకింపక మా పెద్దలు తెలిపినా రనుచు ఆచరించుచుందురు. సొంత ఆలోచన తక్కువ. తామెందుకు ఒక పూజగాని, క్రతువుగాని చేయుచున్నారో వారికే తెలియదు. వారికి తెలిసినదల్లా మితిలేని కోరికలు దైవమును కోరుటయే. దానికి భక్తి అని నామకరణము చేసినారు.

*గోవిందుడు :* నాకు మన పెద్ద లాచరించు మార్గమున సమస్తము అగమ్య గోచరముగ నున్నది. వారు సూటిగ "యిది చేయుము" అని తెలుపరు. వారు చేయుచున్నవి గమనించినచో గందరగోళముగ ఏమేమో చేయుచున్నా రనిపించును. ఏమి యడిగినను 'చేసినచో తెలియును' అందురుగాని వారికేమి తెలిసినదో తెలుపరు. మన వాఙ్మయము గూడ అతివిస్తారమై ఒక మహారణ్యమువలె గోచరించును. వివరించి మనకు తెలుపు ఉపాధ్యాయులు లేరు. **తెలియని గొప్ప విషయముల ననుసరించుట కన్న తెలిసిన చిన్న విషయమును ఆచరించుట సులభము. మనసును సరియైన కారణముతో సమాధాన పరచిననే గాని, అది మనము చేయదలచుకున్న పనియందు సహకరించదు. మనసు తోడైననే కదా, ఏమియైనను చేయగలము.** మనసును నిశ్శబ్దము చేయుటకు, నిశ్శబ్దము పాటించుట మేలేమో. అది శమనులు చేయుచున్నారు. వారి సాంగత్యమున కొంత పరిష్కారము మనకు లభించునేమో అనిపించుచున్నది.

సిద్ధార్థుడు, గోవిందుడు తెలిపిన మాటలు విని ఏకాంతముగ గోదావరి తీరమునకు చని ఆలోచింపసాగినాడు.

తన తండ్రి పవిత్రమూర్తి. సాక్షాత్తు మూర్తీభవించిన భక్తి, జ్ఞాన, వైరాగ్య యోగమూర్తి. అతడు చేయు పనులేవియు తనకు నచ్చుట లేదు. నచ్చకపోవుటకు కారణము తెలియదు. తన తండ్రి తనను ఏ విషయమునను నిర్బంధించ లేదు. నిజమునకు తనకు నచ్చిన జీవితమును తాను నడుపుకొనుచున్నాడు. స్వాధ్యాయము, తపస్సు, పరహితము త్రికరణశుద్ధిగా నాచరించుచు, సంఘ

మున పూజింపబడుచు యున్నాడు. తన తండ్రికి దైవమే సమస్తము. సమస్తమును దైవమునకు చేయు సేవగ భావించుచు నిర్మలముగనే యుండును. అహంభావము లేదు. అట్లని దేనికిని తలవంచడు, యాచించడు. అతని జీవిత మద్భుతము. తన తల్లి భర్త ననుసరించుట, కుటుంబ విషయములను చూచుకొనుట, దైవమును పూజించుట, పతికి సహకరించుట చేయుచు తృప్తిగ నున్నది. వారిరువురికి తృప్తిగలదు. సంతోషము కలదు. వారి జీవితము యాంత్రికముగ కనిపించినను వారు దానిని క్రతువుగ నిర్వర్తించుచున్నారు. స్ఫూర్తితో, తృప్తితో జీవించుచున్నారు. ఒకరి అవసరములు ఒకరు యెరిగి ప్రవర్తించు చున్నారే కాని, యెవరిని యెవరూ శాసించరు. వారిద్దరు భార్యాభర్తలు అనుటకన్న ప్రాణమిత్రులు అన్నచో సబబుగ ఉండునేమో. ఆమె కాయన యందు భక్తి, ఆయన కామె యందు ప్రేమ. భక్తి ప్రేమలు చక్కగ మేళవింపబడిన ఆదర్శమైన దాంపత్యము వారిది. వారికి ఏ విషయముననూ భేదములు లేవు. ఎక్కువ తక్కువలు లేవు. ఇద్దరును సర్వస్వతంత్రులే.

ఇంత స్ఫూర్తిదాయకమగు తల్లిదండ్రులకు తాను జన్మించి నాడు. తండ్రి ననుసరించి విద్యాబుద్ధులు గరపినాడు. వారి జీవితమును తా నెందువలననో అనుసరించలేదు. తండ్రి చేయు పనులయందు పూర్ణగౌరవ మున్నను, వాటి ననుసరించుట యందు ఆసక్తి లేదు. స్ఫూర్తి లేదు. ఈ తతంగమంతయు కాక మరియేదో వున్నదని మాటిమాటికిని అనిపించును. ఇంతకన్న మరే జీవన విధానము సమగ్రము కాదని తండ్రి ప్రసంగములు సహేతుకముగ

తెలుపుతున్నప్పటికిన్ని అంతరంగమున పూర్ణాంగీకారము లేదు. తండ్రితో వాదించి తాను గెలువలేడు. వారు ఏ ప్రశ్ననైనను సమాధానపర్చగలరు. తల్లితో సంప్రదించుటకు అవకాశమే లేదు. ఆమె ప్రేమ నిచ్చు తల్లియే కాని, తర్కము, జ్ఞానము ఆమెకు తెలియవు. ప్రేమ, భక్తి, ఆరాధన, సేవ మాత్రమే తెలియును. తండ్రి కన్నియును తెలియునుగాని, తాను ప్రశ్నింపలేడు. తనకు తండ్రి యన్న భయమా అని ప్రశ్నించుకున్నప్పుడు భయము లేదని తెలియును. దానికి కారణము తండ్రియే. ఆయన యెన్నడును తనపై అధికారము చూపలేదు. వాత్సల్యముతోనే పెంచినాడు. తనకు వలసిన వన్నియు తాను కోరక మునుపే తీర్చెడి తండ్రి యితడు. తనను శాసించడు, నిందించడు, కోపించడు. నిజమునకు తండ్రి గారు అందించిన స్వతంత్రత మరి యే కొడుకును, యే తండ్రి వద్దా పొందలేడేమో!

కాని తనలో ఏదో తెలియని ఆందోళన, తెలుసుకొనవలెనను తపన, అన్వేషణ కొరకై ఆరాటము, అన్వేషణ మెట్లు చేయవలెనో తెలియదు. కాని ఈ పరిసరములను వదలి తనకు తానుగా అన్వేషణ సాగించవలెను. అది తన 17 సంవత్సరముల జీవిత పరిసమాప్తి రాత్రి, తండ్రి అనుమతిగ పొందవలెను.

సిద్ధార్థుడు 17 సంవత్సరములు నిండి మరునాడు పదునెనిమిదవ సంవత్సరములో ప్రవేశించనున్నాడు. ఆ రోజు రాత్రి నెమ్మదిగ తల్లి వద్దకు చేరి ఇట్లనెను: “అమ్మా! రేపు నాన్నగారి కార్యక్రమము లేమి? రేపు వారితో నేను మాట్లాడవలసి యున్నది. నాకు సమయము దొరుకునా?”

అది విని తల్లి చిరునవ్వుతో "ఏమి మాట్లాడవలెను? నీకు సందేహము లేమైన వున్నవా? వారికి నీవు అత్యంత ప్రియమైన పుత్రుడవు. నీవు తెలిపినచో వారు నీ పనియే ముందు చూతురు. వారు పైకి ప్రకటింపరుగాని, వారి హృదయమున నీకు ఒక ప్రత్యేక స్థానమున్నది. నిన్నుగూర్చి నీ తండ్రిగారి నెపుడైన నేను విచారించినపుడు, వారెప్పుడూ ఒకటే మాట పలుకుదురు" అని తెలిపెను.

''ఏమని పలుకుదురు?''

''వాడు నా పుత్రుడు, స్థిరచిత్తుడు. స్వంతముగ నాలోచింప గలవాడు. వానికి ప్రత్యేకముగ నేను ఏమియు నేర్పవలసిన సుద్దులు లేవు. వానిని గూర్చి నీకు చింత వలదు.'' అని పలుకుదురు. "వారికి నీపై అమితమైన విశ్వాసము." అని తల్లి పలికినది.

"అవును. వారికి నాపై విశ్వాసము అమితము. నీకు వారిపై విశ్వాసము అమితము. నాకు మీ ఇద్దరి యెడల గౌరవము అమితము." అని సిద్ధార్థుడు పలికినాడు.

"అంటే?"

"అంటే మీ ఇద్దరియందు నాకు భక్తి, గౌరవము మెండు. తండ్రిగారు తెలిపినట్లు నాకు స్వంత ఆలోచనలు ఎక్కువ. అది అదృష్టమో, దురదృష్టమో తెలియకున్నది. మీ జీవనమంతయు వేదపరము. తపస్సు, స్వాధ్యాయము, బోధన, పరహితములతో నిండియున్నది. ఇది పరిపూర్ణమైన ఆర్యజీవనము. నాన్నగారిది ఆచార్యజీవనము. బ్రాహ్మీ ముహూర్తము నుండి రాత్రి నిదురించు

వరకు క్రతుబద్ధముగను, సంప్రదాయబద్ధముగను జీవింతురు. దంతధావనము, స్నానము, వస్త్రధారణము, తిలకధారణము సమస్తము క్రతుబద్ధమే, సంప్రదాయబద్ధమే. మీకు అట్లు జీవించుటలో స్ఫూర్తి యున్నది. ఆనందమున్నది. మీరు త్రికరణశుద్ధిగ అట్లు జీవించుచున్నారు. మీ జీవలక్షణముల కది సరిపడినది. నా దౌర్భాగ్యమేమో తెలియదు కాని నాకది యాంత్రికముగ గోచరించు చున్నది. దివ్యజీవనమునకు యింత కట్టుబాటు అవసరమా? అనిపించుచున్నది. నాన్నగారి దగ్గర చేరినవారు, వారి ననుసరించు వారు యాంత్రికముగ అట్లే చేయుచున్నారు గాని, ఇతర సమయములలో వారి ప్రవర్తనము తద్భిన్నముగ గోచరించుచున్నది. మీయందు గల త్రికరణశుద్ధి వారియందు నాకు గోచరింపదు. ఇష్టమున్నను లేకున్నను అట్లు జీవించుట గౌరవప్రదమని, వారిని వారు రొష్టు పెట్టుకొనుచున్నారు. నాకది నచ్చదు. ఏ పని చేసినను త్రికరణశుద్ధిగ చేయవలెనే కాని మరియొక పద్ధతి ధర్మము కాదు. నాకీ విధముగ జీవించుట నచ్చుట లేదు. చేయుచూ నుండగ నచ్చు నేమోనని ఐదు సంవత్సరముల నుండి నన్ను నప్పించుకొనుటకు ప్రయత్నించితిని. అయినను నచ్చుట లేదు.

బహుశః నా జీవలక్షణము భిన్నముగ నున్నదేమో? నాకు మీ యందు అమితమైన భక్తి, గౌరవము లున్నవి. మిమ్ములను నొప్పించినచో నాకు నేను చాల బాధపడుదును. అట్లని యిట్లే జీవించినచో నా అంతరాత్మ సమాధానపడుట లేదు. అందువలన రేపు నా పదునెనిమిదవ జన్మదినము. కార్తీక పౌర్ణమి. నాన్నగారు విశేషమైన పూజ, అభిషేకములలో మునిగి తన్మయత్వము చెంది

యుందురు. నా పదునెనిమిదవ జన్మదిన కానుకగ, సత్యదర్శనము నకై నా జీవలక్షణముల ననుసరించి అన్వేషణమునకు జనవలె ననుకొనుచున్నాను. దానికి మీరిరువురి అనుమతి నా పుట్టినరోజు కానుక. ఆ కానుక మీరు నాకిచ్చు వరము కాగలదు. మీరు ఎప్పుడునూ నా హృదయముననే యుందురు. మిమ్ములను కాదని వెళ్ళుట నా మతము కాదు. తల్లిగ నీకిది కొంత కష్టము కలిగించును. తండ్రిగారు స్థితప్రజ్ఞులు. వారు అనుమతింతురనే నా విశ్వాసము. వారితో నేనింత వివరముగ మాటాడలేను. వారి ముందు నిలచి నపుడు నాకు మాటయే పెగలదు. అది భయము వలన కాదు. వారిపై నాకు గల ఆరాధనా భావము. వారు ఎప్పుడును నన్ను భయపెట్టలేదు. శాసించలేదు. నిర్దేశించలేదు. మిత్రత్వమే చూపిరి. ఆ మిత్రత్వ మందలి వాత్సల్యము నన్ను కట్టివేయును. అందులకే నా సొద అంతయు నీకు వివరించు చున్నాను. నీవీ రాత్రి వారికి విషయమంతయు వివరముగ అందించినచో రేపు వారి తీరిక సమయమున కలిసి అనుమతి గొనెదను" అని పలికి సిద్ధార్థుడు అశ్రుధారలతో తల్లికి నమస్కరించెను.

సిద్ధార్థుని తల్లి నిర్ఘాంతపోయినది. నిశ్చేష్టురాలైనది. ఆమెకు నోటి నుండి మాట రాలేదు. తనయుని తల నిమిరినది. కన్నుల లోనికి చూచినది. ఆమె నేత్రములు కూడ అశ్రుధారా పూరితము లైనవి. "ఇంతలో ఎంతవాడవైతివిరా నా తండ్రీ!" అని పలికినది.

ఆనాడు కార్తీక పౌర్ణమి. పరబ్రహ్మశాస్త్రిగారు, వారి సతీమణి, సిద్ధార్థుడు ఎప్పటివలె బ్రాహ్మీముహూర్తమున నిదురలేచిరి. కాలకృత్యములు గావించుకొని యథావిధిగా

ప్రాణాయామము, ధ్యానము, వేదపఠనము గావించిరి. ప్రభాత సమయమున గాయత్రి గానము సాగినది. అటుపైన శాస్త్రిగారి అనుయాయు లందరూ కుటుంబములతో రాగా రుద్రాభిషేకము, హోమము, మహాలక్ష్మీపూజ సామూహికముగ గావించిరి. అప్పటికి సమయము 12 గంటలైనది. అటుపైన మధ్యాహ్న సంధ్య గావించి పిండివంటకములతో కూడిన మృష్టాన్న భోజనములు గావించిరి. శాస్త్రిగారు వచ్చిన కుటుంబముల నన్నింటిని ఆప్యాయముగా పలుకరించుచు వారందరిని సాగనంపి తాను విశ్రమించుట కుపక్రమించిరి. వారి సతీమణి కూడ వారి ననుసరించినది. సిద్ధార్థుడు ఒంటరిగ భోజనాలయమున ఆలోచనాపరుడై కూర్చుండి యుండెను. ఉదయము మూడు గంటలకు నిదురలేచి 11 గంటల పాటు తన తండ్రి ఏకాగ్రతతో, నిష్ఠతో కార్యములు నిర్వహించి పరివారము నంతటినీ ఆత్మీయతతో పలకరించి విశ్రాంతి గొనుచున్నాడు. ఈ మొత్తము కార్యమంతయు తన్మయత్వమున తన తల్లిదండ్రులు నిర్వర్తించుట తనకు క్రొత్త కాదు. వారి స్ఫూర్తి, ఆనందము తన కెప్పుడును ఆశ్చర్యము కలిగించునదే. తానీరోజు తల్లిదండ్రుల వద్ద శెలవుగొని శమనుల వద్దకు పోవలయును. తన భావములు తల్లికి తెలిపినాడు. తండ్రికి తెలుపమని కోరినాడు. ఆమె తెలిపియే యుండును. తనకు మాత్రము వారిరువురి నుండి యింకను సమాధానము రాలేదు. సమాధానమిచ్చుటకు వారికి తీరిక లేదు కదా! ప్రస్తుతము వారు విశ్రాంతి గొనుచున్నారు. అనంతరము వారి ఎదుట నిలబడెదను.

సిద్ధార్థుడు యింకనూ ఆలోచింప సాగినాడు. ఆనాడు తన 18వ జన్మదినము. కార్తీక పౌర్ణమి. తాను **కృత్తిక నక్షత్రమందే**

**జన్మించినాడు. తనకు పట్టుదల ఎక్కువ. స్వతంత్రబుద్ధి ఎక్కువ. అంతఃకరణమున నమ్మినదానినే ఆచరింపవలెనని తన సిద్ధాంతము. అంతఃకరణమున నచ్చని సంప్రదాయము ఎంత మంచిదని సంఘము, పెద్దలు తెలుపుతున్నను, తా నాచరించ లేదు. నచ్చని పని మంచిదని చేయుట వలన ఘర్షణ పుట్టనని తన సిద్ధాంతము.** తనకు నచ్చిన పని యితరులకు సంఘర్షణము కలిగించునచో, తాను నిర్వర్తింప కూడదని కూడ తన సిద్ధాంతము. సంప్రదాయైక జీవనము తనకు నచ్చుట లేదు. నప్పించుకొనుటకు ప్రయత్నించి నను, అంతఃకరణమున సమన్వయము కుదురుటలేదు. బాహ్యమున పెద్ద లందరు తనయందు తృప్తి చెందియున్నారు. "తండ్రికి తగ్గ కొడుకు. తలలో నాలుకవలె అన్ని విషయములు తండ్రి దగ్గర శుశ్రూష చేయుచు నేర్చుకొనుచున్నాడు. బుద్ధిమంతుడు. శాస్త్రిగారు ధన్యులు. వారి యజ్ఞార్థ కార్యములు తరువాతి తరములకు కూడ కొనసాగ గలవు" అని భావించుచున్నారు. అట్లు జరుగుట వారికి సౌఖ్యమేమో గాని తనకు మాత్రము కాదు. పెద్దలు మెచ్చుదురని తన జీవితము బలి చేసుకొనలేదు. తన దృష్టిలో అది త్యాగము కాదు. త్యాగము కూడ అంతఃఘర్షణ లేక జరుగవలెను.

తనకు ప్రస్తుతమున ఉన్న ఘర్షణ ఒకటియే. ఈ వైదిక జీవనము నుంచి తాను వైదొలగవలెను. దాని విలువ తనకంద లేదు. సత్యదర్శనమునకు మరియొక ఉపాయము ఉండకపోదు. ప్రస్తుతము శమనుల మార్గము తన మనసునకు నచ్చుచున్నది. అదియును ప్రస్తుతమునకు వినికిడియే. ఆచరించిననే కాని రుచి తెలియదు. సిద్ధాంతపరముగ తనకు నచ్చినది. కావున తానది బలీయముగా కోరుచున్నాడు. కాని తాను తలిదండ్రులకు కష్టము

కలిగించలేదు. తండ్రిగారి అనుమతితోనే తానీ పథమున సాగ వలెను. అన్ని విషయముల యందు నా కాయనయే గురువు. వారికి గల ఉన్నతమైన అవగాహన తనపై గల సత్యమైన ప్రేమ, తన కనుమతి నిచ్చుననియే తన నమ్మకము. ముందు వెనుకలాడక తానిపుడు తండ్రి ఎదుట నిలబడవలెను. వారి విశ్రాంతి ఈసరికి పూర్తి కాగలదు. ముఖద్వారమున నిలబడినచో వారే పలకరింతురు అని భావించుచు సిద్ధార్థుడు తండ్రి విశ్రాంతిగొను గది ముఖ ద్వారమున నిలబడెను.

పరబ్రహ్మశాస్త్రిగారు విశ్రాంతి నుండి లేచి సాయంత్రము కార్యక్రమమునకై ఉపక్రమించిరి. ముఖద్వారము కడ తన ఏకైక కుమారుడు సిద్ధార్థుడు నిలచియున్నాడు. చిరునవ్వుతో అతనిని పిలిచిరి. సిద్ధార్థుడు తండ్రిగారి శయ్యవద్దకు చేరి పాదములకు నమస్కరించెను. శాస్త్రిగారు కుమారుని శిరస్సును ఆప్యాయముగ నిమిరి ఆశీర్వదించుచు యిట్లని పలికిరి : "సిద్ధూ! ఈ రోజు నీ జన్మదినము. పదిహేడు సంవత్సరములు నిండి పదునెనిమిదవ సంవత్సరము వచ్చినది. ఈ సంవత్సరము నీ కెంతయూ శుభ ప్రదము. పదునెనిమిదవ సంవత్సరమును "జయ" సంవత్సరమని పలుకుదురు. నీ జీవితము జయప్రదము కావలెను. **జయ మనగా సాంఘిక జయము మాత్రమే కాదు. ధనము, కీర్తి, ప్రతిష్ఠ, సాంఘిక జయములు. విద్యాబలము కూడ సంఘమున కీర్తి ప్రతిష్ఠలకే నిర్వర్తింపబడుచున్నది. ఆత్మవిద్యాబలమే నిజమగు జయము. ఇది పొందనివాడు పేదవాడే. ఎన్ని పొందినను మరల కోల్పోవుట జరుగును. ఆత్మవిద్యను పొందినచో సమస్తము తనయందే ధారణ**

**చేయబడును. ఆత్మవిద్యకు యోగవిద్యయే రాజమార్గము. శ్రీకృష్ణు డందించిన పదునెనిమిది అధ్యాయముల యోగాభ్యాసము ప్రపంచ వాఙ్మయము నందు తలమానిక వంటిది.** ఈ మహద్గ్రంథమును ప్రమాణముగ చేసుకొని జీవించుము. నీ జీవనము జయప్రదమై, నీ నామము సార్థకమై సిద్ధార్థుడవై నిలువుము.

నీవు పుట్టిన దినము ఆధ్యాత్మికముగ నాకు మెట్టిన దినము. కార్తీక పౌర్ణమినాడే నాకు ఆత్మదర్శనమైనది. కార్తీక పౌర్ణమినాడు నీవు పుట్టుట నా హృదయమును అమితముగ రంజింపచేసినది. **కార్తీకమాసము అత్యంత పుణ్యప్రదమగు మాసము. ఈ మాసమున జన్మించిన వారికి పట్టుదల, కార్యదీక్ష మిక్కుటముగ నుండును. తన స్వభావము నందలి బలహీనతలను దమించ గలిగినచో వీరికి కలుగు జయము శీఘ్రమగును. లేనిచో వీరు అతి శీఘ్రముగ పతనము కూడ చెందగలరు. ఈ రాశివారు వారిని వారే నియ మించుకొనవలెను. ఇతరులు నియమించినచో ఒప్పరు. తమకు తాముగ నియమముల నేర్పరచుకొని పాటించుచు వృద్ధి చెందుట వీరి మార్గము. అట్లుకానిచో వాసనాబలము ప్రబలమై నశించ గలదు. కార్తికేయునివలె అంకుశమును ధరించి తమ యందలి వాసనలను తామే దమించవలెను. అరిషడ్వర్గమును దమించ గలిగినచో వీరి యందలి షట్చక్రములు క్రమముగ వికసింపగలవు. షణ్ముఖునివలె శివసాన్నిధ్యమును పొందగలరు.**

వాసనలను దమించుటకు వీరు తమకు తామై కట్టుబాట్లు, దీక్ష ఏర్పరచుకొనవలెను. నీ జీవితము నింతవరకును నా

సాన్నిధ్యమున దీక్షాయుతముగనే సాగినది. ఇక నుండి నీవే స్వచ్ఛందముగ దీక్షలను స్వీకరించుచు ముందుకు సాగుము. నీకు తెలుపవలసిన ప్రాథమికమగు విద్యలను, జీవన విధానమును ఉపనయనము నుండి నీకు నేను అందించితిని. నీకు దీక్షాయుత జీవనమే శరణ్యము. నీలోని తీవ్రమగు స్వేచ్ఛాభావము అహంకార మను పొరతో క్రప్పబడి యుండును. **అహంకారముతో కూడిన స్వేచ్ఛ ప్రమాదకరము. స్వేచ్ఛ సహజమగు జీవలక్షణమే. యోగులు, సిద్ధులు, ఆత్మదర్శనులు స్వేచ్ఛాయుతులే. అది సత్త్వ ప్రధానమగు స్వేచ్ఛ. సత్త్వాతీతమగు స్వేచ్ఛ కూడను. ఋషులు, యోగులు, సిద్ధులు అందరును స్వేచ్ఛా జీవనులే. వారి స్వేచ్ఛయందు ప్రశాంతత, దయ, కరుణ, ప్రేమ ప్రవహించు చుండును. అహంకారముతో కూడిన స్వేచ్ఛ రజోగుణ దోషము కలిగి అశాంతి నేర్పరచు చుండును. అశాంతికి కారణము అహంకారమే. అహంకారము అడ్డుపడుచుండగ స్వేచ్ఛను గూర్చి విపరీత నిర్వచనములు, సంప్రదాయములు ఏర్పడు చున్నవి. స్వేచ్ఛ స్వరూప స్వభావములు సత్త్వగుణ సంపన్నులకే తెలియగలవు.** ఇతరులకు తెలియరావు. నీవు నిర్వర్తించబోవు జీవితమున నీ వెప్పటికప్పుడు నీయందు పొడచూపు అహంకారమును పరిశీలించుకొనుచుండుము. ఇహపర సాధనకు ఆత్మపరిశీలనము అనునిత్యమును జరుగుచుండవలెను. అట్లు పరిశీలనము గావించుచు ముందుకు సాగుము.''

పరబ్రహ్మశాస్త్రిగారు తెలిపిన విషయమును సిద్ధార్థుడు భక్తి శ్రద్ధలతో విన్నాడు. అతని హృదయము పొంగినది. ఇట్లు భావించ సాగినాడు. తన తండ్రి శాంత గంభీర స్వరూపుడు. తన స్వరూప

స్వభావములను పూర్తిగ తెలిసినవాడు. తన స్వతంత్ర బుద్ధి, స్వేచ్ఛాభావము, పట్టుదల, తీవ్ర సంకల్పము తాను చెప్పకయే తెలిసిన వాడు. అట్టి ఉదాత్తమైన వ్యక్తి ఎదుట తానేమి పలుకగలడు. తన క్షేమమును కోరు నిజమైన మిత్రుడు తన తండ్రియే అని అంతరాత్మ తనకు బోధించుచునే యున్నది. కాని తనలో ఏదో తపన ఎక్కడికో పయనించవలెను. దేనినో అన్వేషించవలెను. తన అన్వేషణ ఇక్కడ సాగునని తనకు నమ్మకము లేదు. అట్లని తన తండ్రివంటి పుణ్యమూర్తిని నిర్జించి తాను ముందుకు సాగలేడు. తన తండ్రి తనను బంధించుట లేదు, బాధించుట లేదు. తన స్వతంత్రమునకు అడ్డు తగులడు. ఆయన ప్రేమ స్వచ్ఛమైనది. అందు మమకారపు పొడలు కనపడవు. కావున వుండుటకు గాని వెళ్ళుటకు కాని నిర్ణయము తనదే. ఆయన తనను వుండమని కాని వెళ్ళమని కాని ప్రోత్సహించడు. తన స్వేచ్ఛనే ప్రోత్సహించు అరుదైన తండ్రి ఆయన. కావున బాధ్యత తనదే. ఇట్లు భావించు చున్న సిద్ధార్థుని యందు యొక ప్రశ్న జనించినది. వివరణకై తండ్రి నిట్లడిగినాడు.

“తండ్రీ! మీరు స్వేచ్ఛాజీవులు. స్వేచ్ఛావాదులు కూడను. సంప్రదాయబద్ధ జీవనమంతయు మీరు మీ ఇచ్ఛతో ఆనందముగ నిర్వర్తించుకొనుచున్నారు. మీ యందు సమస్తమును సమన్వయము చెందియున్నది. మీ నుండి జనించిన నేను సంప్రదాయిక విషయములపై విముఖత కలిగియుండుటకు కారణమేమి? మీ జీవ లక్షణములకు, నా జీవ లక్షణములకు యింతటి వ్యత్యాస మెట్లేర్పడినది. ఇది కేవలము వ్యత్యాసమే కాక, వ్యతిరేకముగ కూడ కనపడుచున్నది. నిజమునకు మీరు నాకు కేవలము తండ్రియే

కాదు, సర్వవిధముల గురువు, దైవమును కూడ. నా హృదయము చాల కలవరముగ నున్నది. నేను సత్యాన్వేషణకై మరియొక మార్గమున పయనించుటకు దృఢముగ నిశ్చయించుకొంటిని. ఏదియో, ఎక్కడో అన్వేషించవలెనని తపనతో యున్నాను. ఇచ్చట నాకు దైనందిన జీవనమంతయు యాంత్రికముగ గోచరించు చున్నది. మీకు గల స్ఫూర్తి, ఆనందము నాకు కలుగుట లేదు. దిన దినమునకు చిరాకు, కోపము, విముఖత పెరుగుచున్నవి. అట్లని ఎచటికో చనుటకు మీ ప్రేమానురాగములు నన్ను అరికట్టు చున్నవి. మీరు నిర్బంధించరు. నిర్బంధించినచో తీవ్రస్వభావము కల నేను త్రెంచుకొని పోయెడివాడను. కారణము నా ఆనందమే మీ ఆనందము. మీరు నా ఆనందమునకై సర్వమునకు సిద్ధమే. పుత్రభావమును కూడ త్యాగము చేయగలరు. నేను స్వార్థపరుడను. నా ఆనందము కొరకై మిమ్ములను దుఃఖ పెట్టుదునేమో అని బాధ కలుగుచున్నది. ఎట్లైనను ఇల్లు వదలి వెళ్లి అన్వేషింపవలెనను భావము ప్రస్తుతము తీవ్రముగ నున్నది, అది మీ అనుజ్ఞగ జరిగినచో నాకు కొంత తృప్తి యుండును. లేనిచో ఎచట నున్నను కలవరమిట్లే వుండును. నాకేమియు తోచుట లేదు. మీరే నా సమస్యను పరిష్కరింపుడు.''

పరబ్రహ్మశాస్త్రిగారు తనయుని ఆవేదన, అతని ఆలోచనా శక్తి, వివేచనము, భాషణము విని మరింత గంభీరులైరి. ప్రశాంత వదనముతో ఇట్లు పలికిరి.

“నీ జీవలక్షణము, నా జీవలక్షణముకన్న భిన్నముగ నున్నదని, వ్యతిరేకముగ నున్నదని నీవనుకొనుచున్నావు.

నిజమున కది సత్యము కాదు. నీ వయస్సున నున్నప్పుడు నేనును తీవ్రమగు సత్యాన్వేషినే. నా యందు కూడ స్వతంత్ర భావ మెక్కువ. **నన్ను నేనే పరిపాలించుకొనవలెను. ఇతరులచే పరిపాలింపబడకూడదు. ఇతరులను పరిపాలింపకూడదు కూడ. కోరినచో సహాయమును, సలహాను నిచ్చుటయే కాని ఎవరిని నిర్బంధించ కూడదు. నా నమ్మకములు, విశ్వాసములు ఇతరులపై రుద్దకూడదు కూడ.** ఇట్లనేకానేక భావములు ఉద్రేక పూరితములై యుండెడివి. వాని నన్నింటిని క్రమబద్ధము చేసుకొని నాదైన పద్ధతిన ఒక జీవితము మలచుకొన్నాను. నా జీవితమునకు నేనే రాజు. నా రాజరిక మంతయు నన్ను నేను నియమించుకొనుట, పరిపాలించుకొనుటయే కాని మరియొకటి కాదు. నా అన్వేషణమున నాకు స్ఫురించిన విషయము దేవతారాధనము. దేవతల నారాధించుచు వారి సహాయ సహకారములతో సత్యదర్శనము సులభముగను, శీఘ్రముగను పొందవచ్చునని నా భావము.

"నీ జీవలక్షణము కూడ సత్యాన్వేషణమునే కోరుచున్నది. కావున నా కన్న నీవు భిన్నము కాదు. వ్యతిరేకము కూడ కాదు. నాకును స్వతంత్రేచ్ఛ కలదు. నీకును కలదు. నీ ఇచ్ఛను మన్నించు టయే నా యిచ్ఛ కూడ. నీకు సంప్రదాయమందు విముఖత కలుగుటకు ధర్మసూక్ష్మమేదియో యుండి యుండును. **సత్యాన్వేషణ మార్గములు పలురకములు. సత్యమొకటే. నా మార్గమే నీ మార్గ మేల కావలెను? మన గమ్య మొక్కటే, మార్గములు వేరుగ కన్పట్టు చున్నవి. ఈశ్వరుడు జీవుల నెట్లనుగ్రహించ దలచినాడో జీవుల కేమి తెలియును? కాలమే తెలుపగలదు.**

సంప్రదాయము నందు నీకు గల విముఖత నన్ను కలవర పెట్టుటలేదు. కావున నీవును కలవరపడ నవసరము లేదు. నా భావమున దైవారాధనము, అర్థవంతమగు **సంప్రదాయ జీవనము క్షేమకరము. అది కోట యందుండి యుద్ధము చేయువానికి గల సౌకర్యము వంటిది. కోట వెలుపల యుండి యుద్ధము చేయుట కష్టతరము. నీవది కోరుచున్నావు. తప్పులేదు. కాని శ్రమ ఎక్కువ వుండును. నచ్చని విశ్వాసము ననుసరించుటకన్న ఆత్మ ప్రబోధము ననుసరించుటయే శ్రేష్ఠము.**

“నీవు నా నుండి వచ్చినావని నీవంటివి. నా ద్వారా వచ్చిన వాడివే కాని, నా నుండి వచ్చినవాడవు కావు. **జీవు లందరును ఈశ్వరుని నుండి దిగివచ్చిన వారే. కావున నీదైన జీవలక్షణము నీ యందుండును. నా ద్వారా వచ్చుటచే నా జీవలక్షణము కూడ నీ యందుండును. కాల ప్రభావము, సంఘ ప్రభావము కూడ జీవులపై నుండును.**

సత్యాన్వేషణమున ముఖ్య సూత్రములు అన్ని మార్గముల యందును ఒకటే. అవి :

1. **సర్వము ఈశ్వరుడే అని భావించి సమస్త రూపము లందు, ప్రవర్తనములందు ఈశ్వరుని నర్తనత్వము చూచుట.**

2. **సత్యము, ధర్మము పాటించుట.**

3. **జీవులయందు దయ, కరుణ కలిగియుండుట.**

4. **శుచిత్వము పాటించుట.**

5. **అపరిగ్రహము, అస్తేయము, అహింస పాటించుట.**

6. **తత్త్వ విచారము చేయుట.**

7. **సృష్టి ఆకర్షణలకు లోనుగాక యుండుట.**

8. **అహంకరింపకుండుట.**

9. **ప్రతి చిన్న సన్నివేశము నందును పరిశీలనాత్మక దృష్టి యుండుట.**

పరబ్రహ్మశాస్త్రిగారు సిద్ధార్థునితో యింకను ఇట్లనినారు. "సత్యాన్వేషణమే జీవితమున ఉత్తమోత్తమమైన ఆశయము. నీవు దాని యందు రుచిగొని యున్నావు. నేనును నీ వయసున ఈ ఆశయముతోనే యుంటిని. సత్య సాధనకు కేవలము తపస్సే కాక సంఘసేవ, స్వాధ్యాయము కూడ ముఖ్యమని తెలిసి, బాధ్యతలను నిర్వర్తించుటలోనే సాఫల్యమున్నదని తెలిసి నన్ను నేను సంఘమున, ధర్మమున నియమించుకొని సత్యదర్శనమునకై తపస్సు సాగించితిని. ఈ మార్గమున సంఘము వలన, కుటుంబము వలన తపస్సు తీవ్రముగ జరుగు అవకాశముండదు. అయినను సంఘ జీవనమున మనదైన స్వతంత్ర జీవనమును బుద్ధితో ఏర్పరచుకొనుటకు సంకల్పించితిని. 12 సంవత్సరములకు బాధ్యతలతో కూడిన స్వతంత్ర జీవనమును మలచుకొంటిని. అటుపైన తపస్సునకు, స్వాధ్యాయమునకు సమయ మేర్పరచుకొంటిని. ఈనాటి కీవిధముగ భక్తి జ్ఞాన వైరాగ్యముల

ద్వారా యోగమున నిలచియున్నాను. ఈ మొత్తము నందు పురుష ప్రయత్నమున లోపము లేకుండుటకై జాగ్రత్త పడితిని. దైవాను గ్రహము తోడగుటవలన సాధన సిద్ధించుచున్నది.

ఋషులీ మార్గమునే మనకందించిరి. ఇది సరళమైన మార్గము. అంతమాత్రమున యితర మార్గములు లేవని, పనికి రావని నేను సిద్ధాంతీకరించను. భగవంతుడు ఏ జీవునకు ఏ మార్గమున అనుగ్రహించునో మానవునికేమి తెలియగలదు?

నీ యందలి తీవ్ర సత్యాన్వేషణా బలమే దైవము. **దైవప్రేరణ లేనిదే దైవమును తెలుసుకొను బుద్ధి కలుగదు. ఆ తెలుసుకొనుటలో నీకు గల తీవ్రత నా దృష్టిలో దైవ ప్రేరణయే కాక అనుగ్రహము కూడ.** అతడు నిన్నెట్లనుగ్రహించునో నేనును ఉత్సుకతతో వేచి చూచెదను. నీ సంకల్పమునకు అంతరాయము కలుగనంత వఱకు నీ వే మార్గమున నడచినను శుభమే యగును. సత్యాన్వేషణ సంకల్పము సన్నగిల్లినచో అపాయములు, బంధములు ఏ మార్గమున నైనను కలుగగలవు. నీ వెన్నుకొన్న మార్గమునకు నీవే బాధ్యుడవు. బాధ్యత గొనుటలో వెనుకాడ పనిలేదు. పూర్వాపరములను వివేకించుకొనుచు ముందుకు సాగుము. నా తర్కముతో నిన్నడ్డ గించుట నేను చేయలేను. దానికి కారణము నీ యందు నాకున్న ప్రేమయే.''

*సిద్ధార్థుడు :* తండ్రీ! మీరందించిన సందేశము నాకు కొంత తృప్తి కలిగించినది. నేనీరోజు సాయంత్రమే నా మిత్రుడు గోవిందుడితో కలసి గంగా తీర అరణ్యములలోనికి జన తలచితిని. మీ రనుగ్రహింపవలెను. అచట శమను లనువారు సంఘములు

సంఘములుగ సత్యాన్వేషణము కొఱకై తపస్సు చేయుచున్నారట. వారనుసరించు విధానము నాకు నచ్చుబాటగునని యనిపించు చున్నది. అచట నుండి నా అన్వేషణను సాగింతును. మీరందించిన శిక్షణము, యిపుడు తెలిపిన నవ సూత్రములు నా యందు ఎల్లప్పుడు నిలిచి యుండగలవు. ప్రతిదినము మీకును, తల్లికిని నమస్కరించుకొని నా సాధనా కార్యక్రమమును ప్రారంభించు కొందును. నేను దేవతారాధనము చేయనప్పటికి మీ యిరువురి ఆరాధనము నిత్యము చేసెదను. మీరే నాకు గురువులు, దేవతలు మరియు పరదైవతము కూడ. మరియిక ఏ ఆరాధనము లుండవు. బ్రహ్మోపదేశము చేసిన మిమ్ములను బ్రహ్మముగ ఆరాధింతును కాని గాయత్రీ మంత్ర జపము, ధ్యానము, గానము యిక చేయను. తపస్సు, స్వాధ్యాయమును చేయుదును. మార్గమున సందేహము కలిగినపుడెల్ల మిమ్ములను స్మరింతును.

*పరబ్రహ్మశాస్త్రి :* అట్లే కానిమ్ము. ఇంతకును శమనుల మార్గమేమి?

*సిద్ధార్థుడు :* వారు మిక్కుటముగ తపస్సు చేయుదురట. స్వాధ్యాయము పేరున తత్త్వవిచారము చేయుదురట. తీవ్రమైన ఆలోచనాపరులట. ఆహారము అత్యవసరమైనచో స్వీకరింతురట. ఉపవసించుట ఎక్కువగ నుండునట. ఎల్లప్పుడును నిశ్శబ్దమున జీవింతురట.

*పరబ్రహ్మశాస్త్రి :* బాగున్నది. ఇది కఠినము, పాషండము అగు మార్గము. నీకు తగిన మార్గమే ఎంచుకున్నావు. మార్గము నచ్చనిచో మరల మార్చుదువా? **మార్గమును మార్చుచూ కాలహర**

**ణము చేయకుము. త్రికరణశుద్ధిగ ప్రయత్నింపుము. అయిననూ నచ్చకున్నచో మార్చుకొనుటకు సందేహింపకుము. అన్వేషణము కొనసాగవలెను. అదియే ధ్యేయము. నీకు అన్నివిధముల శుభము కలుగుగాక! నీ వెచ్చట యున్నను, నా ఆశీర్వచనబలమున క్షేమము గనే నుండగలవు.**

నీ తల్లి ఆశీర్వచనముగొని ముందుకు సాగుము. ఆమె నిన్నేమియు ప్రశ్నింపదు. జరిగిన రాత్రి నేనామె కంతయు వివరించితిని. నీకు మా ఆశీర్వచనములు పరిపూర్ణముగ నుండును. నీకు సర్వము శుభమగు గాక!

పరబ్రహ్మశాస్త్రిగారు కుమారుని తల నిమిరి కౌగిలించుకొని, నుదుటిపై ముద్దిడి ఆప్యాయముగ కన్నులతో నవ్విరి. సిద్ధార్థుడు తండ్రి భాషణమునకు, అనుమతికి, ఆప్యాయతకు పరవశించెను. కన్నుల నుండి నీరు జాలువారుచుండగ తండ్రి పాదములకు నమస్కరించి, వీడ్కొని తల్లివద్దకు జనెను. భాషణము లేదు కాని తల్లికూడ అతనినట్లే ఆశీర్వదించెను. తల్లితండ్రుల దీవెనలతో సిద్ధార్థుడు సత్య సాధనకై కార్తీక పౌర్ణమి శుభ ఘడియలలో ఇల్లు వదలెను.



# 2

సిద్ధార్థుడు, గోవిందుడు కుతూహలముతో, అమితోత్సాహముతో ఇల్లు వదలి శమనులు వుండు వనముల దిశగా కాలి నడకన సాగినారు. గోవిందుడు శమనుల జీవన విధానము గురించి ఈ విధముగా వర్ణించినాడు. "శమనులు మౌనము ప్రధానముగ జీవింతురు. అత్యవసర పరిస్థితులలో గాని వారు మాట్లాడరు. మనసున ఎల్లప్పుడూ తత్త్వవిచారమే గావించుచుందురు. ఆహారము కూడ దేహము యొక్క అత్యవసరము బట్టి భుజింతురు. దాదాపు ఉపవాసమే జరుగుచుండును. అవసరమును బట్టి జలములను, రాలిన పండుటాకులను, రాలిన పండ్లను భుజింతురు. వారు తపస్సునకే ప్రాధాన్యమిత్తురు. దేహావసరములను దాదాపుగ వర్జింతురు. కౌపీనమే కాని మరి యే ఇతర వస్త్రధారణము వుండదు. చలికి, వేడిమికి, గాలికి, వర్షమునకు కూడ దేహమునకు రక్షణ కల్పింపరు. వారు పాంచభౌతిక దేహమును పంచభూతములకే వదలిపెట్టుదురు. ఒక రకముగ వారి మార్గమున దేహమునకు, ఇంద్రియములకు, పోషణ వుండదనే చెప్పవలెను. మనసున

మాత్రము తత్త్వమును గూర్చిన ఆలోచనను పదను పెట్టు చుందురు.”

*సిద్ధార్థుడిట్లు పలికెను :* “మన వారు దేహమును పుష్టికరముగ పోషించుట, సంస్కరించుట యందు కొంత విలువను చూచుదురు. పుష్టి కలిగించు ప్రయత్నమున ఆహారములో రుచులు మరిగిరి. షడ్రశోపేత భోజనములు మరిగిరి. నేతులు త్రాగుచు క్రొవ్వును పెంచిరి. అనేకానేక రుచులను ఏర్పరచుకొనిరి. దాని వలన దేహము మదించి దేహావసరములను తీర్చుకొనుటకై జీవుని బానిస చేసినారు. అక్షరాభ్యాసము, ఉపనయనము, వివాహము ఆదిగా గల సంస్కారము లన్నియు నామమాత్రపు వేడుకలైనవి. **మదించిన దేహమును సంస్కరించుకొనుట కష్టము. దేహమును పోషించుచు, సంస్కరించుకొనుచు జీవుడు యానము గావించవలెనని ఋషుల మతము. పోషణ విషయమున రుచులు మరిగినచో సంస్కరించుట కష్టము.** సంస్కారాది క్రతువులను నిర్వహించు తల్లిదండ్రులే మోహము, మమకారము కారణముగ సంస్కారముల యందు తెలుపబడిన వివిధమగు దీక్షలను నిర్వర్తింపచేయుట యందు అలసత్వము కలిగి యున్నారు. అక్షరాభ్యాస క్రతువున పెద్దలచే పసివానికి ఓంకారము ఉపదేశింప చేయుట, లిఖింపచేయుట కేవలమొక ప్రదర్శనమే. ఆ రోజున తల్లితండ్రులు పడు తాపత్రయము మిక్కుటము. తమ పిల్లవానికి విద్య అద్భుతముగ అబ్బవలె నని వారి ఆకాంక్ష. కాని ఆకాంక్షకు తగిన కర్తవ్యమును మరునాడే మరతురు. పిల్లవానిచే ఓంకారము ఉచ్చరింపచేయుట, లిఖింపచేయుట అను కర్తవ్యమును

నిర్వర్తింపరు. అది కారణముగ అక్షరాభ్యాసము కేవలమొక నామ మాత్రపు తంతే కాని, సంస్కారముగ దేహమునందేర్పడదు.

**"నిజమునకు ఓంకారము ఉచ్ఛరించుట, చిన్నతనము నుండి (5 సంవత్సరముల నుండి) అభ్యాసమైనచో అట్టివాని శరీర ధాతువు లన్నియు చక్కని పరిణామము చెందగలవు. ఈ సత్యము పసివానికి తెలియదు. పెద్దలకు తెలిసియు దాని నాచరింప చేయరు. వారే ఆచరింపరు గనుక వారి కందలి సత్యము కూడ తెలియదు. అట్లే బ్రహ్మోపదేశము, గాయత్రి మంత్రోపదేశము కూడ సంఘమున ప్రదర్శనాత్మకమే కాని స్ఫూర్తిమంతము, దీక్షాయుతము మాత్రము అగుట లేదు."**

ఉపనయన సంస్కారమున బాలుని చిత్తము స్థిరమగుటకై అనేక దీక్షలను ఏర్పరచిరి. ప్రాతః కాలముననే నిద్ర లేచుట, సూర్య నమస్కారములతో కూడిన యోగాసనముల ద్వారా వ్యాయామము చేయుట, దేహమునకు మెరుగుగ తైలమును రుద్దుకొనుట, తలనిండ చన్నీటి స్నానము చేయుట, సంధ్యా సమయమున సంధ్యాదేవికి వందన మాచరించి అటుపైన గాయత్రి జప మాచరించుట, కొంత విరామ మిచ్చి క్షీరము గ్రోలి, వేద సూక్తములను గాని, ఋషిప్రోక్త స్తోత్రములను కాని ఒక గంట సమయము గానము చేయుట, అటుపైన ఉపాహారమును గొని లౌకిక విద్యలను అభ్యసించుటగా మధ్యాహ్నము వరకు కార్యక్రమములు సాగుచుండెడివి. భోజన సమయమున అన్న సూక్తమును శ్రద్ధతో పఠించి వైశ్వానరునకు నమస్కరించి, పోషకమగు పదార్థములను భుజించుట జరుగు చుండెడిది. పోషకమగు ఆహారమును స్వీకరించుటకే రుచిగాని,

రుచికరమగు ఆహారమును వండుకొనుట, తినుట యుండెడిది కాదు. సాయం సమయమున క్రీడలు, సాయం సంధ్యావందనము, గాయత్రి గానము అయిన పిదప లలితకళలు నేర్చుట ఏర్పరుచ బడినది.

**"అన్నియు తెలిసియు ఆచరింపరు హైందవులు. వారికి తెలియనిది లేదు. కాని ఆచరణము దాదాపు శూన్యమే. ఆచరించు వారు కూడ యాంత్రికముగ ఆచరింతురే కాని స్ఫూర్తి యుండదు.** ఈ శమను లట్లు కాదు. వారు నమ్మినదానిని వారు పరిపూర్ణముగ విశ్వసించి ఆచరించు చున్నారు. మన హైందవ సంప్రదాయమున తామర తంపరగ అనేక మార్గములు సత్యాన్వేషణ కేర్పడి యున్నవి. జీవలక్షణమును బట్టి ఎవరికి నచ్చిన మార్గమున వారు పయనించ వచ్చును. స్వేచ్ఛ, స్వాతంత్ర్యము సత్యాన్వేషణములో ముఖ్యాంశమని తెలిపినారు. కాని అట్టి స్వేచ్ఛ వలన నిర్దిష్టమగు ఒక మార్గమున సాధకుడు ప్రాథమిక దశలో పయనించలేడు. చపలచిత్తు డగుటచే వివిధ మార్గములకు వివిధ సమయములలో ఆకర్షితు డగుచుండును. తత్కారణముగ పయనమాగును. సాధన సాగదు. పండ్లతోటలోని కోతివలె ప్రతి మార్గమును కొంత రుచి చూచి వదలుట, మార్గములు మార్చుటగా యుండును కాని నిర్దిష్టముగ ఒక మార్గమున పయనింపడు. పండ్లతోటలో కోతి కూడ యిట్లే ప్రవర్తించును. ఏ పండును పూర్తిగ భుజింపదు. కొంత కొరికి ఆవల పారవేయును. అటుపైన మరియొక పండు. దానినీ భుజింపక చెట్టును మార్చును. ఇట్లు కొమ్మలు, చెట్లు మార్చుచు, ఫలములను కొరుకుచు, ఎంగిలి చేయుచు, భుజింపక పారవేయు చుండును. సగటు హైందవుడు చేయుపని యిదియే. భరత

ఋషులు తపస్సులు గావించి, సత్యమును దర్శించి వారి దర్శన మార్గమును అనుయాయులకు తెలిపిరి. జీవ లక్షణమును బట్టి అన్వేషణమున వైవిధ్యమున్నను సత్యదర్శనమున ఏకత్వమున్నది. ఏకాభిప్రాయమున్నది. కాని వారి తపస్సు అచంచలమై దృఢమై యుండెడిది. **సత్యదర్శనమునకు వివిధ మార్గము లుండుట వైభవము, సౌలభ్యము. జీవుడు తన స్వభావమును బట్టి తనకు నచ్చిన యొక మార్గమును నిర్దిష్టముగ అనుష్ఠింపవలెను. గమ్యమునకు పది మార్గము లున్నవని, పది మార్గముల యందు కొంత నడచి చూచుట వృథా శ్రమయే కాని, నడచువాడు గమ్యమునకు చేరువ కాడు కదా! మార్గమును స్వయముగ నిర్దేశించుకొని కష్టనష్టముల కోర్చుచు అందే నడచుట దీక్షయగును.** ఇష్టాయిష్టములను బట్టి మార్గమును మార్చుట వ్యభిచార మగును.

శమనులు తాము నమ్మిన మార్గమున ఏకాగ్రచిత్తముతో ముందుకు సాగుచున్నారు. వారు ఏకాగ్రత వలన స్థిరము, దృఢము అయిన చిత్తమును పొంది తత్త్వదర్శనమునకే పాటుపడుచున్నట్లు అనిపించుచున్నది.''

సిద్ధార్థుడిట్లు పలుకగ గోవిందుడు "తినబోతూ రుచి గూర్చి విచికిత్స యెందులకు? మార్గము మంచిదే కావచ్చును. మనకు రుచించునో? లేదో? రుచింపనిచో అందు స్థిరపడలేము కదా! మనవారు నడచు మార్గము మనకు రుచింపలేదు. అందువలన వారందరిని, ఈ క్రొత్త రుచికొరకై వదలి వచ్చితిమి. రుచించినచో అదృష్టమే. లేనిచో మరల మరియొక మార్గము నన్వేషించుకొన వలెను కదా!''

*సిద్ధార్థుడు :* "నీ వన్నదియు నిజమే. మా తండ్రిగారు కూడ ఈ విషయముననే ప్రశ్నించినారు. రుచించనిచో స్థిరపడుట సాధ్యము కాదు. నేను స్వతంత్ర బుద్ధిని, నాకు రుచింపనిచో నిర్మొహమాట ముగ విసర్జించి మరియొక మార్గమునకై అన్వేషింతును. అట్లని నా ప్రయత్నమున చిత్తశుద్ధి యుండకపోదు. త్రికరణశుద్ధిగ శమన మార్గము ననుసరింతును. కష్టనష్టముల కారణముగ మార్గము మార్చను. కాని ఎంత ప్రయత్నించినను అంతరంగమున ఘర్షణ యున్నచో మార్చుకొనుటకు వెనుకాడను. ఇది నా మతము. నన్ను నేను వంచించుకొనలేను. **పదార్థ మెంత రుచికరమైనది అయినను మనకు ఆకళింపు కావలెను కదా! తనకు జీర్ణము కానిది ఎంత అమోఘమగు ఆహార పదార్థమైనను మనలను యిరుకున పెట్టునే కాని ఆనందము నీయదు.** అందువలన ఈ విషయమున మనము తగు జాగ్రత్తతో నుండవలెను.

*గోవిందుడు :* "తినగ తినగ వేము తియ్యనగును. అభ్యాసము వలన రుచి ఏర్పడును. ముందు రుచిగ నుండి తరువాత వికటించు దానికన్న, ముందు చేదుగ నున్నను తరువాత రుచిగ నుండు మార్గము శ్రేయస్కరమని పెద్దలు తెలుపుదురు. ఔషధము లన్నియు అనారోగ్యమును పరిష్కరించుటలో ఈ విధముగనే పనిచేయుచున్నవి. అందువలన ఓర్పుతో అభ్యాసము సాగించవలెనే కాని నీవు చెప్పిన కోతివలె మార్చుకొనరాదు సుమా!"

*సిద్ధార్థుడు :* "నేను తెలిపినదియు అదియే. కాని తినగ తినగ, యింకను తినగ, మరియు మరియు తినగ కూడ వేము తీపి కానిచో, విసర్జించుట ఉత్తమ మని నా మతము."

సిద్ధార్థుడు శమనులను చేరు మార్గమున తన వ్యక్తిగతమగు దుస్తులను, పరికరములను పేదలకు దానమిచ్చెను. గోవిందుడును అట్లే చేసెను. ఇద్దరును కేవలము కౌపీనములను మాత్రము ధరించి శమనులు నివసించు ప్రదేశమున కేగిరి. వారిని తమ సంఘమున చేర్చుకొనవలసినదిగా ప్రార్థించిరి. వారందించిన నియమములను అవలంబించుటకు సిద్ధపడిరి. తత్కారణముగ శమనులు సిద్ధార్థునకు, గోవిందునకు దీక్ష నిచ్చి సంఘమున ప్రవేశ మొసగిరి.

సిద్ధార్థుడు మొదటి మాసమున దినమున కొక్కమారే భుజించెను. రెండవ మాసమున అపక్వాహారము భుజించెను. మూడవ మాసమున పక్షము రోజులు అపక్వాహారము భుజించి, మరల పక్షము రోజులు కేవలము జలమును గొనుచు గడిపెను. నాలుగు, ఐదు మాసములట్లే గడచినవి. ఆరవ మాసమున కేవలము జలములు గొనుచు జీవించెను. దేహ మందలి క్రొవ్వు, మాంసము క్రమముగ కరగిపోయెను. కన్నులు లోతుల లోనికి పోయెను. చెక్కిళ్ళు దవడలకు అతుకుకొని పోయి కేవలము చర్మము మాత్రమే యుండెను. తల వెంట్రుకలను సంస్కరింపక వదలెను. కాలి, చేతి వేళ్ళ గోళ్ళను కత్తిరించుకొనలేదు. దేహము పరిపూర్ణముగ శుష్కింప సాగెను. కేవలము కదలుచున్న అస్థిపంజరమువలె ఒక సంవత్సరమునకు శరీరము శుష్కించినది.

దేహమందలి రక్తమాంసాదులు యిగిరి పోవుటచే ఇంద్రియ ములు కూడ శుష్కించినవి. ఎండిపోయిన చెట్టువలె, యింద్రి యార్థములకు ప్రతిస్పందించక నిలచి యుండెను. అతని కిప్పుడు ఆహారముతో అంత అవసరము లేదు.

ఒక్క సంవత్సరముననే ఉపవాస దీక్షను పరిపూర్ణము గావించిన సిద్ధార్థుని శమనులు చూచిరి. ఆశ్చర్యపడిరి. అతని సంకల్పబలమునకు ఆనందపడిరి. పదునెనిమిది సంవత్సరముల వయస్సులో నున్న యువకుని ఆర్తిని గుర్తించిరి. వారు సిద్ధార్థునితో యిట్లనిరి.

“నీవు అసామాన్యరీతిన ఉపవాస దీక్ష యందు సిద్ధి పొందినావు. శరీరము శుష్కించినది. ఇంద్రియములు కూడ శుష్కించినవి. నీ ఇంద్రియము లిపుడు యింద్రియార్థములకు లొంగవు. సామాన్యముగ సాధకులీ స్థితిని సంసారమున నుండగ పొందలేరు. నీ సంకల్పబలము అసామాన్యము. నీవిపుడు సమీపమున గల గ్రామమునకు పోయి మనవారి కొఱకై భిక్షాటనము చేయవలెను. నీ యింద్రియముల ద్వారమున నీవు చూచు ప్రపంచము మునుపటి కన్న భిన్నముగ గోచరించును. రుచిని జయించుటచే యితర ఇంద్రియములు కూడ నీకు వశము కాగలవు. జితేంద్రియ స్థితి అనగ నేమో నీకు తెలియగలదు.”

శమనుల ఆదేశానుసారము, సిద్ధార్థుడు సహచరులతో సమీప గ్రామమున భిక్షాటన మారంభించెను. అది అంత కుగ్రామము కాదు, మహానగరమూ కాదు. అచట అన్ని సామాన్య సౌకర్యములు గలవు. అందు సంచరించుచున్న సిద్ధార్థునకు ప్రాపంచిక విషయములలో మునిగి తేలుచున్న ప్రజలనుచూచి కొంత ఏవగింపు కలిగెను. పూర్వము తానా ప్రపంచముననే మునిగి తేలుచుండెను. అపుడు కూడ అతడు వానియందు నిమగ్నుడై వున్నప్పటికిని ఏవగింపు లేదు. ఇపు దేవగింపు ఏర్పడుచున్నది.

కారణమేమి? సంవత్సరము పాటు లంకణము చేసెను కదా! పది లంకణముల తరువాత పంచభక్ష్య పరమాన్నములతో విందు భోజన మేర్పరచిన రోగి భుజించలేడు కదా! దేహమందలి రక్తమాంసాదులే ప్రాపంచిక విషయములను కోరును. అవి శుష్కించుటచే ఆకర్షణ తగ్గి వికర్షణ ప్రారంభమయ్యెనని తెలిసినది. ఆకర్షణము బంధమే, ఆకర్షణను తాను జయించినట్లు భావన కలిగినది. ఇట్లాలోచించు చుండగ అంతఃకరణమున–

"వికర్షణ మాత్రము బంధము కాదా?" అని వినబడెను.

సిద్ధార్థు డులిక్కిపడెను. ఆలోచింపసాగెను. **ఇష్టమైనది కోరుట, ఇష్టము లేని విషయముల ఏవగింపు, కోరిక యొక్క ద్విముఖములుగ గోచరించినవి. కావలె ననుకొనుట నాణెమునకు బొమ్మయైనచో, ద్వేషించుట బొరుసు యగును. ఏవగింపు ద్వేషమునకు సంబంధించినదే కదా! రాగము వదలి తనయందు ద్వేషము పుట్టెనా?** యని ఆలోచించుచు భిక్షాటనము సాగించుచుండెను.

సిద్ధార్థుడు గ్రామమున భిక్షాటనము అసక్తుడై చేయుచుండెను. ఆడంబరముగను, అందముగను దుస్తులను ధరించిన వారిని చూచి పెదవి విరచెను. వ్యాపారస్తుల మోసపు మాటలను విని అసహ్యించుకొనెను. మరణించిన వారిని చూచి ఏడ్చువారు కనబడగ, వారిని గూర్చి జాలిపడెను. వైద్యులను, విద్యావంతులను, మతాధికారులను చూచి వారెవ్వరును సత్య సాధన చేయువారు కారని, మాయకులోనై జీవించువారని, తెలియనివారని నిర్లక్ష్యభావనతో చూచెను. అసత్య భాషణమే

ప్రధానముగ ప్రాపంచిక జీవనము సాగుచున్నదని, ఆశ, భ్రమ, భ్రాంతి అందరిని నడిపించుచున్నదని భావించెను. అతనికి నానాటికిని ప్రపంచముపై ఏవగింపు అధికమయ్యెను.

సిద్ధార్థుని గమ్యము అతనిని విడువ లేదు. సత్యదర్శనముపై గల ఆసక్తి అగ్నిశిఖవలె పెరుగుచునే యున్నది. ద్వంద్వాతీతమైన సత్యము కొఱకై వెదకుచు హృదయము నుండి సమస్తమును నెట్టివేయు చున్నాడు. తన హృదయము సమస్తమైన కోరికల నుండి విముక్తి చెంది తానే మిగలవలె ననియు, తా నెరిగిన తాను మరణించి మరియొక తాను తెలియవలెనని అహర్నిశలు కృషి జరుపుచున్నాడు. ఉపనిషత్తుల యందు తెలిపిన "నేను"ను తెలియ వలెనని, శమనులు తెలిపిన మార్గమున అవిరామముగ కృషి చేయుచున్నాడు. అట్లు మరియొక సంవత్సరము గడచినది.

ఒకనా డతను ఉదయించుచున్న సూర్యుని చూచుచు అట్లే నిలబడిపోయెను. సూర్యుని కాంతి ప్రచండమైనను కన్నులు మూయ లేదు. కన్నుల నుండి నీరు కారుచు కొంత తడవునకు కన్ను లెండిపోయినవి. అతను పట్టించుకొనలేదు. కాళ్ళు పీకుచున్నను సాయం సంధ్య వరకట్లే నిలచెను. మరియొక మారు వర్షమున కూడ నిశ్చలుడై అనుభవించెను. కుండపోతగ వర్షము పడుచున్నను అట్లే నిలచియుండెను. వేసవియందు మండుటెండను కూడ లెక్కచెయ్యక నోరెండు చున్నను నిశ్చలుడై నిలచియుండెను. తుమ్మముండ్ల బాటలో నడచెను. రక్తము కారుచున్నను లెక్క చేయలేదు. పుండ్లేర్పడినను చికిత్స చేసుకొనలేదు. అతనిపై ఋతువుల ప్రభావము నశించినది. పాషండ మార్గమున దేహ

ప్రభావమును కూడ నశింప చేసికొనినాడు. భావమును దాదాపుగ నిశ్చలము చేసినాడు.

మూడు సంవత్సరములు గడచినవి. సిద్ధార్థుని దీక్షను గమనించిన శమనులు అతనిని మనో నిరోధముతోపాటు శ్వాస నిరోధము కూడ సాధించుమని తెలిపిరి. **అతడు పద్మాసనాశీనుడై శ్వాసను మొదట క్రమబద్ధము చేసెను. క్రమముగ శ్వాసను హృదయమున బంధించుట ప్రారంభించెను. అట్టి బంధనమున స్పందనమును వినెను. స్పందనము కూడ శమించు టారంభించెను. క్రమశః స్పందనము సూక్ష్మ స్పందనము కాగా నిశ్చలుడై అంత రంగమున నిలచెను. అంతర్ముఖుడై దీర్ఘకాలము వుండసాగెను.**

అతడు చేసిన సాధన అంతయు దమన మార్గమున సాగెను. శరీరమును, ఇంద్రియములను, చిత్తమును రజోగుణ బలముతో దమించెను. దేహాత్మను జీవాత్మకు అనుసంధానము చేయు సరళ మార్గమునకు బదులుగ దేహాత్మను హింసించుటయే సాధనగ సాగినాడు. మనో నిరోధము, శ్వాస నిరోధము గూడ చేయగలిగినాడు. ప్రపంచ నిరాకరణ మార్గమున సాగినాడు. సహజ సంకల్ప బలముగల సిద్ధార్థుడు రజోగుణ మాధారముగ దేహ ప్రవృత్తిని నిర్జించినాడు. స్వభావమును దాదాపుగ దాటినాడు. తన్ను తాను ఎప్పటికప్పుడు పరిశీలించుకొనుచు మరియొక సంవత్సరము గడిపినాడు.

**"శమనుల సాధనా మార్గమున ఇంద్రియ మనోప్రవృత్తులను దమించినప్పటికిని, చిత్తమున మరల స్వభావము మొలకెత్తుట సిద్ధార్థుడు గమనించెను. ఐదు సంవత్సరముల పాటు అతి తీవ్రమగు**

**సాధనను సాగించినను తన స్వభావము మరల మొలకెత్తుట సిద్ధార్థున కమితాశ్చర్యము కలిగించినది. ఇదియేమి? స్వభావము నశించినట్లు భావించితినే! మరల మరల మొలకలెత్తు చున్నది. చేసిన సాధన అంతయు శ్రమయేనా?** ఇది అంతయూ వృథా ప్రయాసయేనా? శిశిర ఋతువున ఎండిన చెట్టు, వసంత ఋతువున చిగిర్చినట్లుగ నా స్వభావము ఎండినదే గాని, నశించినట్లు లేదు." సిద్ధార్థుడు చింతాక్రాంతుడైనాడు.

తనతోపాటు దీక్ష నందుకొన్న గోవిందుడు ఇదే మార్గమున సాధన చేయుచున్నప్పటికిని, అతడింకను మనో నిరోధము చేయలే కుండెను. గత 5 సంవత్సరములలో వారిరువురును అరుదుగ కలుసుకొనిరి. ఎవరి మార్గమున వారు సాధన చేయుటయే గాని, వారిరువురును చర్చించుకొనుట జరుగలేదు. ఒకనాడు గోవిందుడు తటస్థపడగ సిద్ధార్థు డిట్లు ప్రశ్నించెను.

"గోవిందా! నీవేమి భావించుచున్నావు? మనము ఆశయ సిద్ధిని ఈ మార్గమున చేరుద మందువా?"

*గోవిందుడు :* మనము చాల నేర్చితిమి. సాధన చక్కగ సాగుచున్నది. పురోగతి బాగుగనే యున్నదనిపించు చున్నది. నీవు మాత్రము అద్భుతమగు రీతిన పురోగమించుచున్నావు. నీవు త్వరలోనే ఒక గొప్ప శమనుడవు కాగలవు. నీవు నాకన్న మిక్కుట మైన ఏకాగ్రత గలవాడ వగుటచే అచిర కాలముననే ప్రసంశనీయ మగు పురోగతి పొందినావు. పెద్దలగు శమనులు కూడ నిన్ను గూర్చి ప్రసంగమున ప్రశంసించుచుండగ నేను వింటిని. నా సంగతి యేమో గాని, నీవు తప్పక గమ్యము చేరగలవు.

*సిద్ధార్థుడు :* ఏమో నాకట్లనిపించుట లేదు. మిత్రుడా! నా సాధనా ప్రయత్నము నాకంత సంతృప్తి నీయుట లేదు. నాకీ మార్గమున కొన్ని ప్రశ్నలుదయించు చున్నవి. సంతృప్తి తగ్గుచున్నది. నన్ను నేను వంచించుకొనలేను కదా! నీవు నా ప్రాణమిత్రుడవు. అందుచే నీతో మనసు విప్పి మాట్లాడుచున్నాను.

*గోవిందుడు :* నీవు హాస్యమునకై ఇట్లు పలుకుచున్నట్లున్నది. నీవు దేహావసరములను నిర్జించ గలిగితివి. మనసును నిరోధించ గలిగితివి. శ్వాసను నిర్జించి స్పందనమున నిశ్చలముగ నిలిచితివి. నీ విట్లు పలుకుట కేవలము హాస్యాస్పదము

*సిద్ధార్థుడు :* నీవన్నది నిజమే. కాని దమించిన దంతయు దేహమున మరల పొటమరించుచున్నది. అది నా కాశ్చర్యము కలిగించుచున్నది. భావములు మరల ఉద్భవించుచునే యున్నవి. ఈ మొత్త మంతయు నాతో నేను జరుపుచున్న పోరాటమువలె నున్నది. దమించినచో దేహేంద్రియ మనో ప్రవృత్తులు జయింప బడవని తెలియుచున్నది. చేయుచున్న సాధన వలన ప్రపంచ మొక భ్రమయని, భ్రాంతి యని తెలిసినచో చాలదు కదా! తెలియ వలసినది తెలియనే లేదు. ఈ మార్గమున సాధన యందు తీవ్రతే గాని ఆనందము గోచరించుట లేదు. మనో ప్రవృత్తులను నిర్జించి నంత మాత్రమున జయించినట్లగునా? **పశువును బంధించినంత మాత్రమున దాని ప్రవృత్తి నశించినట్లు కాదు కదా! పలుపు విప్పగనే మరల అట్లే ప్రవర్తించును. నా స్వభావము కూడ నాకట్లే గోచరించు చున్నది.** ఇదివరకు కన్న ఇప్పుడు ప్రపంచముపై ఏవగింపు పెరిగినది. ఇది సరికాదేమో అనిపించుచున్నది. జ్ఞాన మబ్బినదని

చెప్పలేను. వికాసము కలిగినదని బొంకను అని సిద్ధార్థుడు నిర్వికారముగ పలికెను. గోవిందుడు సమాధానము లేక మౌనము వహించెను.

ఒకనాడు గోవిందునితో సిద్ధార్థుడు సంఘము కొఱకై గ్రామము నందు భిక్షాటనమునకు బయలుదేరెను. అపుడు సిద్ధార్థుడు గోవిందు నిట్లు ప్రశ్నించెను. "గోవిందుడా! ఈ మార్గమున మనము చేరి ఏడు సంవత్సరము లగుచున్నవి. మనకు జ్ఞానమేదైనా కలిగిన దందువా? బంధములు తొలగి మోక్షమునకు చేరువగు చున్నామా? ఒక చక్ర భ్రమణము నుండి విడివడి మరియొక చక్ర భ్రమణమున తిరుగుట లేదు కదా? వున్నది వదలి మరియేదో వున్నదని అడవులకు చేరితిమి. ఇచట చేయు కార్యములు కూడ నాకు సంతృప్తి నీయుటలేదు. నా అంతరాత్మ కలవర పడుచున్నది. ఏమియో సాధించవలెనని వచ్చితిని కాని, మరల తిరిగి మొదటి స్థితికే చేరితిని. తండ్రిగారు తెలిపినట్లు సాధించవలసినది వున్న చోటనే సాధించవచ్చునేమో! ఇల్లు వదలి వచ్చుటలో నాకిపు డావేశము గోచరించు చున్నది. ఆశయసిద్ధికై ఆవేశపడితిమా? నేను చాల ఆలోచనాపరుడనని గర్వపడితినా? అనుభవ లేమిచే మనమిట్లు చేయుట లేదు కదా! ఈ మార్గమున ఆశయము సిద్ధించనిచో కేవలము తల్లిదండ్రులను బాధించినవాడనే అగుదును. నాకిపుడు నీవే సరియగు విమర్శకుడవు. నా ఈ సందేహములను నివృత్తి చేయుదువా?

సిద్ధార్థుని ప్రశ్నలకు గోవిందుడు గంభీరుడై ఇట్లు పలికెను.

"మనము చాల విషయములను నేర్చితిమి. ఇంకను

నేర్వవలసినది వున్నది. మనము నీవు తెలిపినట్లు వృత్తములందు తిరుగుట లేదు. వృత్తములుగ కనిపించు చున్నను ప్రతి వృత్తము, ముందు వృత్తము కన్న ఉత్తమమైనది. ఈ వృత్తమార్గము ఊర్ధ్వగతిగ ఏర్పడి యున్నట్లు నాకు తోచుచున్నది (Spiral but not circular path). ఇది సోపాన మార్గమే కాని గానుగ మార్గము కాదు. గానుగ మార్గము యాంత్రికము. సోపానమార్గ మట్లు కాదు. **అజ్ఞానికి ప్రతి సూర్యోదయము, సూర్యాస్తమయము చర్విత చరణముగ గోచరించును. కాని నిజమునకు ఒక సూర్యోదయమును పోలి మరియొక సూర్యోదయము లేనేలేదు. ప్రతి ఉదయము, ప్రతి మాసము, ప్రతి ఋతువు మరల మరల వచ్చుచున్నను మునుపటి వలె అవి యుండవు. సృష్టి యందు సమస్తము నిత్యనూతనమే. అపూర్వమే.** అది రంగులరాట్నము వంటిది కాదు. నీ మనసున ఏదో అస్వస్థత ఏర్పడినది. అందులకే ఇట్లు భావించుచున్నావు. నా అనుభవము నీ అనుభవముకన్న భిన్నముగ నున్నది. సత్యాన్వేషణ మున మనము పురోగతి చెందుచున్నామనే నా భావన.

*సిద్ధార్థుడు :* శమనుల సంఘమునగల వారందరిలోను వయో వృద్ధుడు, జ్ఞానవృద్ధుడు, మన ఉపాధ్యాయుడు నీకు తెలియును కదా! అతని వయసేమాత్రముండ గలదు?

*గోవిందుడు :* అతని కీ మధ్యనే అరువది ఏండ్లు నిండినట్లు వినియుంటిని.

సిద్ధార్థుడు : అతని సాధన శమన మార్గమున ఎన్ని సంవత్సరముల నుండి సాగుచున్నది?

*గోవిందుడు :* అతడును నీ వలెనే పదునెనిమిది సంవత్స రములకు ఇల్లు వదలెనట. నిజమునకు నీవును, అతనివలె శమన సంఘమునకు భవిష్యత్తున ఉపాధ్యాయుడ వగుదువని శమనులలో కొందరనుకొను చున్నారు. నీవలెనే అతనును దీక్షాపరుడుగ నుండెడి వాడట. ఏకాగ్రతతో సాధన చేసెడి వాడట. తన సహాధ్యాయుల కన్న మిన్నగ పురోగతి చెందినాడట. నీవు కూడ అట్లగుదు వని నా దృఢ నమ్మకము.

*సిద్ధార్థుడు :* అది అట్లుండనిమ్ము. అతడు నలుబది రెండు సంవత్సరములు సాధన చేసినట్లే కదా! అతడింతవరకు నిర్వాణమును పొందనే లేదట. ద్విజత్వము రానేలేదట. మా తండ్రిగారు యేబది సంవత్సరములకే ద్విజత్వము చెందినారు. ఈ విషయమున నాకు కలవరము హెచ్చుగ నున్నది. నీకును, నాకును కూడ అరువది యేండ్లు రాగలవు. డెబ్బది యేండ్లు కూడ రాగలవు. ఎనుబది యేండ్లు కూడ వచ్చునేమో? అంతకాలము యిట్లే ఉపవసించుచు, భిక్షాటన చేయుచు, గోచీ గుడ్డలతో తిరుగుచు, జీవించుటేనా? మన ఉపాధ్యాయుడు పొందని నిర్వాణము మన మెట్లు పొందగలము? పోనిమ్ము మన శమన సంఘమున ఏ ఒకరైనను నిర్వాణమును పొందిరా? మనమేదో కొన్ని చమక్కులు నేర్చితిమి. ప్రజలు మనలను గౌరవించుచున్నారు. అందువలననే భిక్షము సమృద్ధిగ దొరుకుచున్నది. మనమేమీ తెలియని బికారుల మని వారికి తెలియదు కదా! అందులకే వారికి మన మీద గౌరవము. వారు వినయముతో నమస్కరించి భిక్ష యొసగినపుడెల్ల నా అంతరాత్మ నన్ను చూచి నవ్వుచున్నది. ప్రశ్నించుచున్నది. తెలియని వానిని జూచి, తెలిసిన వాడనుకొని, మరియొక తెలియని

వాడు నమస్కరించుట ఎంత హాస్యాస్పదము. మనకేమీ తెలియదన్నను వారు తెలుసుకొనలేరు కదా! ఇది అంతయు ఒక నాటకముగ తోచుచున్నది.

*గోవిందుడు :* నీ మాటలు నాకు భయమును కలిగించుచున్నవి. నిరుత్సాహమును కూడ కలిగించుచున్నవి. ఎందరినో పండితులను చూసితిమి. బ్రాహ్మణులను చూసితిమి. పరమ పవిత్రులగు శమనులను చూచితిమి. సాధుజనులను చూచితిమి. వీరెవ్వరికిని సత్యము గోచరింపలేదా? అదెట్లు సాధ్యము? ఏదియో ఒక మార్గమున ఆసాంతము మనము నడువవలెను. లేనిచో జీవితము వ్యర్థము కాగలదు. నీవు నాకన్న నిశితమగు బుద్ధి గలవాడవు. నీ విశ్వాసము నా విశ్వాసమును బలపరచును. నీ అవిశ్వాసము నన్ను తికమక పెట్టును. నీవు మరికొన్నాళ్ళు మార్గము మార్చక కృషి చేసినచో నీవు ఫలితములు చూడగలవు. నాకును విశ్వాసము బలపడగలదు. కేవలము 7 సంవత్సరముల దీక్షతో సత్య దర్శన మగునని భావించుట దురాశ కాదా? ఓర్పు వలయును.

*సిద్ధార్థుడు :* మిత్రుడా! అట్లే కానిమ్ము, నచ్చుబాటుకే సర్వ విధముల ప్రయత్నింతును. కేవలము నా మనోభావములను నీతో పంచుకొంటిని కాని, అవి నిన్ను కలవర పెట్టునని నేను భావింప లేదు. మరికొంత ప్రయాణము సాగింతును. అంతరాత్మ ప్రబోధమును కాదనలేను కదా! అందులకే కదా ఇల్లు వదలి వచ్చితిని.

గోవిందునితో సంభాషణ పిమ్మట సిద్ధార్థుడిట్లు తలపోసెను. "గోవిందునకు శమనుల మార్గము నచ్చినట్లున్నది. అతడు బహుశః ఈ మార్గమున స్థిరపడిపోవునేమో! కావున అతనితో ఈ మార్గమును గూర్చి విచికిత్స చేయరాదు. తనయందు తానే విచికిత్స చేసుకొన వలెను. చిన్నతనము నుండి తనకు జ్ఞానము నందు ఆకలి యున్నది. ఈనాటికీ చాల ప్రశ్నలు మిగిలి యున్నవి. మొదట బ్రాహ్మణులను ప్రశ్నించితిని. అటుపైన వేదములను ప్రశ్నించితిని. ప్రశ్నించక, ఆత్మ పరిశీలన చేయక గ్రుడ్డిగ సాగినచో బాగుండెడిదేమో! కేవలము ఆచారములను పాటించుచు, పవిత్రుడనని అనిపించుకొనుచు తెలివిగ బ్రతికి యుండవలసినదేమో! కాని లో నుండి అనునిత్యము ప్రశ్న పుట్టుకొచ్చుట వలన సమాధానము దొరకనిదే ముందుకు సాగలేని సంకట స్థితి నాది. చాలాకాలము నన్ను సమాధాన పరచుకొనుచునే అన్వేషణా మార్గమున నడచుచున్నాను. నాలోని పృచ్ఛకుడు తృప్తిచెందనిదే నాకు విశ్రాంతి లేదు. నేర్చుకొనుటకు అంతే లేదు. ఎంత నేర్చినను ఇంకను నేర్వవలసినది యుండును. అనేకానేకములగు జ్ఞానపరమగు అంశములకు ఆధారముగ నున్నది తెలిసిన, సమస్తమును తెలియును. అది తెలియనిచో ఎన్ని తెలిసినను ఒక్కటియే. దానిని తెలుసుకొను మార్గము తెలియలేదు. అది తెలియుటకు తెలుసుకొను ప్రయత్నము సమగ్రము కాదేమో! ఈ తెలుసుకొనుచు పోవుట, చివరకు తెలియలేమని తెలుసుకొనుటకా? తెలుసుకొనుట జరుగునపుడు తెలిసినది తెలుసుకొను వాడికన్న భిన్నముగ నున్నది కదా! తెలుసుకొను ప్రయత్నమున తెలుసుకొను వాని నుండి తెలియవలసినది వచ్చుచున్నది. అది తనకన్న భిన్నమగు చున్నది. తా నుండుట వలన తెలియుచున్నది. తానెట్లు

ఉన్నాడు? తాను వుండుట అనగా నేమి? అది తెలియదు. ఈ తెలుసుకొను మార్గమునకు అంతము లేదు. తానున్నాడు. ఈ ఉండుట యేమో తెలియునా? తెలియదా? దీనిని ఆత్మ యనిరి. ఇది నా యందు, గోవిందుని యందు, తెలిసిన వానియందు, తెలియని వానియందు కూడ నున్నది. కనపడు దానియందంత ఇదే నిండియున్నది. **కావున జ్ఞానము నాశ్రయించి జ్ఞాన సముపార్జన యందు మాత్రమే నిమగ్నమగుటవలన సత్యమునుగూర్చి తెలియు నేమోగాని సత్యానుభూతి కలుగనేరదు. సత్యమునకు వలసిన కొద్ది జ్ఞానమును ఔపోసన పట్టుము. చెఱువునందెంత నీరున్నదను ప్రశ్న మానుము అని శ్రీకృష్ణుడు సున్నితముగా భగవద్గీతయందు హెచ్చరించినాడు కదా!** జ్ఞాని, జ్ఞానము, జ్ఞేయము అను త్రిభుజము దగ్గర తా నాగియున్నాడు. తెలుసుకొనువాడు, తెలుసుకొనుట, తెలిసిన అంశము. ఈ ముక్కోణపు పోకడ ఎంతకాలము? ముక్కోణమున కాధార బిందువేది? లోని కెట్లు జనవలెను? అందులోకి జనినచోగాని ఈ త్రిభుజము లయము కాదు.

పై విచికిత్స ఇక నెవ్వరితోను చేయరాదు. నాలోనే చేయుచూ వేచియుందును. గోవిందు నిక కలవర పెట్టను. తలవంచుకొని తన దారిన తాను నడువవలెను, అనుకొనుచూ మరి మూడు సంవత్సరములు గడిపినాడు.

దేహధాతువుల శుద్ధి కొఱకు తన ఆహారమున తానెన్నో మార్పులు చేసికొని యున్నాడు. జలములు, పండుటాకులు, రాలిన పండ్లు తప్ప నేమియు తాను తినుట లేదు. శమనులవద్ద చేరి పది సంవత్సరములైనది. తాను పదకొండు సంవత్సరముల వైదిక

సాధన జరిపి అసంతృప్తితో శమనుల సాధనా మార్గమున చేరినాడు. ఇపుడిచట కూడ పదకొండవ సంవత్సరము ప్రవేశించినది. ఈ మార్గమున శరీరావసరములను చాల మటుకు నిర్జించి అతి తక్కువ ఆహారముపై నిలచునట్లు చేసినాడు. ఇది అంతయు దేహశుద్ధి, దేహ పవిత్రత అను భావమున చేసినాడు. తాను పవిత్రుడైనాడా? అయినాడని సంఘము వారందురు. తనకు తెలియదు. మరియొక అంశము ఈ మార్గమున తన కభ్యాసమైనది మౌనము. తానెంత కాలమైనను మౌనముగ నుండగలడు. మూడవ అంశముగా తనకు తోచినది ఆలోచనాశక్తి తా నెంత కాలమైనను ఒకే విషయమును గూర్చి ఆలోచన చేయగలడు. దాని లోతులలోనికి పోగలడు. ఇది అంతయు క్రమశిక్షణ. **క్రమశిక్షణ, క్రమశిక్షణ కొఱకే కాదు. తాను దేనికోసమై తీవ్రమగు శిక్షణను స్వీకరించి యున్నాడో అది మాత్రము తనకింకను అందని ఫలమే.** అన్వేషణ సాగుచునే యుండును. పది వత్సరములు గడచినవి. పదకొండుని చేరినాడు. తన కిపుడు 29వ సంవత్సరము నడచుచున్నది.

సిద్ధార్థు డొకనాడు శమన సంఘమున ఒక నూతన అలజడి గమనించినాడు. గాలి కబురుగ ఎవరో ఒక సిద్ధపురుషుడు సమీపా రణ్యమున ప్రత్యక్షమైనాడని శమనులకు తెలిసినది. వారు రకరక ములుగ అతనిని గూర్చి చర్చించుకొనుచు యున్నారు. అతని పేరు గౌతముడట. అతడు బుద్ధుడట. అతడు సమస్త దుఃఖములను జయించెనట. జనన మరణ చక్రములను దాటినాడట. దేశాటనము చేయుచుండెనట. బోధలు చేయునట. పరివార పరివిష్టుతుడై యుండునట. ఇల్లు, వాకిలి లేనివాడట. భార్య, పిల్లలు లేనివాడట. విశాలమగు వెలుగుతో కూడిన ఫాలభాగము గలవాడట.

కనుబొమలు, కనులు అతి విశాలములట. భ్రూమధ్యము విస్తారమై యుండునట. బ్రాహ్మణులు, రాజులు అతనికి మొక్కుదురట. చాలమంది బ్రాహ్మణ, క్షత్రియులు అతని అనుయాయులట.

గౌతమబుద్ధుని గూర్చి తాను విన్న మాటలకు సిద్ధార్థుడు పులకితుడైనాడు. శమన సంఘమున సమీప గ్రామమున కూడ ఏ నోట విన్న అతని మాటయే. కొందరు కీర్తించు చుండగ కొందరు నిందించుట కూడ విన్నాడు. అతడు సంప్రదాయము వీడినాడట. రాజకుమారుడట. రాజ్యమును కూడ వీడినాడట. కట్టుబట్టలతో అరణ్యములకు బోయెనట. తపస్సు చేసెనట. బుద్ధుడైనాడట. సంప్రదాయమును వీడుటచే నిందింపబడుచున్నాడు. బుద్ధుడగుట వలన ప్రశంసింపబడుతున్నాడు. బుద్ధుడగుటకు ముందతడు తీవ్ర మగు అన్వేషియట. అన్వేషణ అత్యంత తీవ్రమగుటచే భార్యను, పుత్రుని, రాజ్యమును కాదని, సత్యమునకై అడవులకు బోయెనట. ఇపుడు దేశాటన చేయుచు జీవులను ప్రచోదనము గావించు చున్నాడట.

తానును అన్వేషియే. తాను వివాహమునకు పూర్వమే సర్వమును విసర్జించి అడవులకు వచ్చెను. తాను కూడ తపస్సు చేయుచున్నాడు. ఇట్లు తలపోయగ సిద్ధార్థునకు బుద్ధుని జీవ లక్షణములకు తన లక్షణములకు సారూప్య మున్నదనిపించు చున్నది.

కాలము గడచుచుండగ గౌతమబుద్ధుని గూర్చి తన ప్రయత్నము లేకయే ఎన్నియో సద్విషయములు తన చెవినబడినవి. అతడు జ్ఞాన నిధియని, నిర్వాణమును పొందినవాడని, తన

పూర్వజన్మములు కూడ అతనికి గుర్తు వచ్చెనని, ఎన్నియో అద్భుతములు, ఆశ్చర్యకరములగు కార్యము లతని నుండి జరుగుచున్నవని తెలిసినవి. అతనిది పాషండ మార్గమని, యజ్ఞములను, క్రతువులను గర్హించు నని, భార్యను, పుత్రుని బాధ్యతారహితముగ వదలి వేసినాడని, వృద్ధుడగు తండ్రిని శోక సముద్రమున ముంచెనని గూడ విన వచ్చెను. మొత్తము మీద బుద్ధుని మాట వినుటకు సిద్ధార్థుని చెవి ఉత్సుకత చూపు చుండెడిది. అతనిని గూర్చి తనయందు క్రమముగ యిష్ట మేర్పడినది. తెలియకయే తనయందు ఒక క్రొత్త ఆశ యేర్పడుతూ వచ్చినది.

అరణ్యమున సాగిపోవు యాత్రికులను సిద్ధార్థుడు కలియుచు బుద్ధుని గూర్చి వారు విన్న విషయములు తెలుసుకొనుటకై ప్రయత్నించుట ఆరంభించెను. అన్నిటికన్న మిన్నగ అతడు నిర్వాణము చెందెనను వార్త సిద్ధార్థుని ఆకర్షితుడిని చేసినది.

గోవిందు డొకనాడు సిద్ధార్థుని చేరి ఉత్సాహముతో నిట్లనెను. “సిద్ధార్థా! నేనీరోజు గ్రామమున భిక్షాటనము చేయుచుండగ బ్రాహ్మణు డొకడు అతని యింట ప్రవేశింపమని కోరెను. లోపలి కేగితిని. అచట అతని కుమారుడుండెను. అతడు మగధ నుండి వచ్చినాడట. అతడు బుద్ధుని చూచెనట. అతని బోధన వినెనట. బుద్ధుని బోధలు తెలుపగ నా శరీరము పులకించినది. ఏదో ఒక రోజు ఈ జీవితమున బుద్ధుని జూచినచో జన్మ సాఫల్యమగు ననిపించినది. నీవు, నేను అతని బోధలేదో ఒక రోజున స్వయముగ వినినచో మన జన్మ ధన్యమగు ననిపించినది.”

*సిద్ధార్థుడు :* గోవిందా! నీవు నాకాశ్చర్యము కలిగించు చున్నావు. నా మిత్రుడు గోవిందుడు శమనుల మార్గమున స్థిరపడెనని భ్రమ చెందితిని. అరువది డెబ్బది సంవత్సరములైనను నీవు యిందే వుందువని భావించితిని. నిన్ను గూర్చి చాలా తెలిసినవాడి ననుకొంటిని. ఏమియు తెలియదని ఇప్పుడే తెలిసినది. నీ హృదయమును నేను అవగాహన చేసుకొనలేదు. నీ విపుడొక క్రొత్త మార్గమును ఎంచుకొంటివా ఏమి? ఇక బుద్ధుని అనుసరింతువా? శమనుల మార్గమును గూర్చి నా మనోగతమును తెలిపినపుడు నీవు కలవర పడితివి. నీ విప్పు డింకొక మార్గమునకు సంసిద్ధుడవగు చున్నావని తెలియుచున్నది. ఇది నా కానందమును, ఆశ్చర్యమును కూడ కలిగించుచున్నది. నీ యందలి పృచ్ఛకుడు మరణించలేదని తెలిసి ఆనందము, బుద్ధుని గూర్చి నీ వీ సమయమునకే చాల గ్రహించితివని ఆశ్చర్యము.

*గోవిందుడు :* నీకు నేను ఎపుడును హాస్యముగనే అనిపింతును. ఆనందమని ఆశ్చర్యమని హాస్యము చేయుచున్నావు. నీవు నా ప్రాణ మిత్రుడవు. నీ హాస్యము నాకు సమ్మతమే. బుద్ధుని మార్గము కూడ సమ్మతమే. నిజమునకు నీవు మాత్రము బుద్ధుని గూర్చి ఆలోచింపలేదా? ఆకర్షితుడవు కాలేదా? నీవు నాకన్న లోతు. కాని మన ఇద్దరి జీవ లక్షణ మొక్కటే. నీ విది వఱకే శమనుల మార్గమున ఎంతో కాలము యానము సాగించనంటివి. నేనిపు డదేమాట యనుచున్నాను."

గోవిందుని మాటలకు సిద్ధార్థుడు పకపక నవ్వెను. గోవిందు నితో ఇట్లనెను.

"మిత్రుడా! నీవు చక్కగ బలికితివి. మూడు సంవత్సరముల క్రితము నేను పలికిన మాటలు నా కప్పజెప్పితివి. ఈ మూడు సంవత్సరములలో నాయందు యింకను మార్పులు జరిగినవి. నాకిపుడు బోధనలపైన గాని, అవగాహనలపైన గాని నమ్మకము లేదు. నే నే పథములను ఇపుడు నమ్మెడి స్థితిలో లేను. కాని నీవిపుడు శమనుల నుండి వెలువడుటకు సిద్ధముగ నున్నావు. గౌతమబుద్ధుడు ఇందుల కుపయోగపడునేమో! ఇల్లు, సంప్రదాయము వదలుటకు శమనుల వార్త కారణము. ఇపుడు శమనుల నొదలుటకు గౌతమబుద్ధుడు కారణ మగుచున్నాడు. ఏదియో యొక ఆలంబనమునకై ప్రయత్నము జరుగుచునే యున్నది. శమన వార్త నాకు నీవే అందించినావు. ఇపుడు గౌతముని వార్తలకు కూడ నీవే దూతవైనావు. బాగున్నది. మనము తప్పక ఒకనాడు గౌతమబుద్ధుని దర్శింతుము గాక! అటుపై నెటుపోదుమో కూడ చూతము. **మన యందు మరియొక మార్గమున అన్వేషించు బుద్ధి నిర్ణయము జరిగినపుడు మనము శమన సంఘములో నుండుట నీతికాదు.** మన మిప్పుడే వృద్ధ శమనునకు ఈ విషయము తెలిపి సెలవు గొనెదము."

అప్పటికప్పుడే సిద్ధార్థుడు గోవిందుని వెంటనిడుకొని శమన ఉపాధ్యాయుని వద్దకు చేరిరి. వినయ విధేయతలతో ఉపాధ్యాయు నికి తన నిర్ణయమును తెలిపెను. ఉపాధ్యాయుడు మండిపడెను. ఇద్దరిని పెద్దగ నఱచుచు చీవాట్లు పెట్టెను. గోవిందుడు విభ్రాంతి చెందెను. సిద్ధార్థుడు గోవిందుని భుజముపై చెయ్యివేసి వారి మాతృభాషలో నెమ్మదిగ నిట్లనెను. "గోవిందుడా! కలవరపడకుము. ఇతను నేర్పిన విద్యను నే నిపుడితని మీదనే ప్రయోగింతును. నీవు

చూడుము.” అనుచూ సిద్ధార్థుడు ఉపాధ్యాయుల దగ్గరకు జని అతని కన్నులలోనికి తీక్షణముగ చూచుచు అతనియందు వశీకరణ విద్య ప్రయోగించెను. ఉపాధ్యాయుని చూపులతో శాంతింపజేసి మూగవానిని కూడ చేసెను. అతని బుద్ధిని వశపరచుకొని అనుమతి నిమ్మని మరల వినయముగ తెలిపెను. ఉపాధ్యాయుడు నిర్వీర్యుడై, శాంతుడై సిద్ధార్థుని కోరికను మన్నించెను. వారికి పదే పదే ఆశీః పూర్వక వీడ్కోలు నందించెను. ఉపాధ్యాయుడు వీడ్కోలు నమస్కా రము చేయగ యువకు లిద్దరును కూడనట్లే గావించిరి. గోవిందుడు తన స్నేహితుని ఆశ్చర్యమున పరికించుచు, ఇతడు చాల విద్యలు నేర్చినాడు. కొలది దినములలో నీటిపైన నడచునేమో కూడ అని అనుకొనినాడు. ఇంతలో సిద్ధార్థుడు “మిత్రమా! నీటిపై నడచు కోరిక నాకు లేదు. ఈ విద్యలు శమనులకే వదలివేయు చున్నాను. నేను కోరినవి ఇవికాదు. సత్య దర్శనము. ఇవి అన్నియు గారడీ విద్యలు. నా కనవసరము. నా మార్గమున కివి అవరోధములు. పద పోవుదము” అనినాడు.



# 3

జేతవన ప్రాంత గ్రామములందు ఏ నోట విన్న బుద్ధుని నామమే. పిల్లల నుండి పెద్దల వరకు బుద్ధుని మాటకు ప్రచోదితులై యున్నారు. బుద్ధుని నామము చెప్పినచో పాంథునకు కూడ సంతోషముగ భోజనము పెట్టుచున్నారు. భిక్ష స్వీకరించుట కచట ఎట్టి సంకటమును లేదు. భిక్షకు డుండవలెను గాని భిక్షకు కొదవలేదు. బౌద్ధ భిక్షువులు అచట పుష్కలముగ భిక్షను గొనుచున్నారు. సిద్ధార్థుడు, గోవిందుడు కూడ ఆ గ్రామము నందు పయనించుచు, భిక్ష స్వీకరించుచు ముందుకు సాగినారు. ఒక గృహమున భిక్ష స్వీకరించుచు సిద్ధార్థుడు గృహిణితో నిట్లనెను: ''తల్లీ! మేము దైవ స్వరూపుడగు బుద్ధుని చేర తహ తహ లాడుచున్నాము. మేమిరువురము అరణ్యము నుండి వచ్చిన శమనులము. పరిపూర్ణుడగు బుద్ధుని చూడవలెనని, అతని ముఖము నుండి వెలువడు అమృత తుల్యమగు వాక్కులను వినవలెనని ఆతురత చెందియున్నాము. అతడెట నున్నాడో మాకు తెలవీయ గలవా?''

*గృహిణి :* మీరు సరియైన ప్రదేశమునకే వచ్చిరి. బుద్ధుడిటనే గల జేత వనమందు ఉన్నాడు. మీరీ రాత్రికి వనమునందే నిదురించుడు. అచట సందర్శకులకు అన్ని సదుపాయములు గలవు. రేపు ఉదయము అతని బోధనలను వినవచ్చును.

శమను లిరువురును వడివడిగ జేతవనము వైపుకు పోవుచున్నారు. గోవిందుడు పసివానివలె పొంగిన హృదయము కలవాడై యిట్లనెను: "ఆహా! ఇన్నాళ్ళకు గమ్యము చేరబోవుచున్నాము. మన అన్వేషణకు యిది తుదిగడియ, మన సాధనకు సిద్ధి."

సిద్ధార్థుడు మౌన గంభీరుడై గోవిందుని మాటలను పట్టించుకొనక నడచుచు యున్నాడు. తాము నడచు మార్గమున మరి యెందరో సాధువులు కూడ నడచుచున్నారు. అందరిది జేతవనము దారే. జేతవనము చేరగనే బుద్ధుని శిష్యుడు సందర్శకులను ఆహ్వానము చేసి వారుండు విశ్రాంతి స్థలములను చూపుచున్నారు. శమను లిద్దరికిని అట్టి ప్రాంతము, అచ్చట నివసించు తీరు తెలియనిది కాదు. వారు పది సంవత్సరములుగ అట్లే జీవించుచున్నారు. మరొక వృక్షము పంచన చేరి ఆ రాత్రికి విశ్రాంతి గొనినారు. రాత్రి అంతయు దూరప్రదేశముల నుండి సందర్శకులు వచ్చుచునే యున్నారు. ఉదయమునకు వారు లేచి చూడగ అక్కడ చేరిన జనసమూహము వారిద్దరికిని అమితాశ్చర్యము కలిగించినది.

జనసమూహములో కుతూహలమునకై వచ్చినవారు మెండు. అది మానవ సహజము. బుద్ధుని విశ్వసించి అతని

బోధనలను వినుటకు వచ్చినవారు కూడ చాలమంది యున్నారు. కొందరపుడే దీక్షలు గొని పచ్చని వస్త్రములు ధరించి వనమందు ధ్యానము చేయుచున్నవా రున్నారు. మరికొందరు ధ్యాన ముద్రనుగొని బుద్ధుని బోధనకై వేచియున్న వారున్నారు. వారందరును కన్నులు మూసుకొని స్ఫూర్తి చెందుటకు సిద్ధముగ నున్నారు. అచట బౌద్ధభిక్షువు లందరు ఏకభుక్తమే దీక్షగా గొనినారు. భిక్షా పాత్రను చేతియందుంచుకొని కొందరప్పటి కప్పుడే భిక్షకు బయలుదేరినారు. అట్లు బయలుదేరిన బృందములందు సిద్ధార్థుడు యొక విశిష్టమూర్తిని చూసెను. గోవిందుని తట్టి "అతడే బుద్ధుడు, చూడుము." అని పలికినాడు. గోవిందుడు చూచినాడు. ఆశ్చర్యపడినాడు. "చూచితివా! అందరిలో నొకడుగ వున్నాడు. అట్లున్నను ప్రత్యేకముగ గోచరించుచుండును" అని సిద్ధార్థుడు పలుకగా గోవిందుడు "నిజమే, అతడునూ పచ్చని వస్త్రము లందున్నాడు. భిక్షా పాత్రను గైకొని మౌనముగ సమీప గ్రామమునకు బయలుదేరినాడు. అందరిలో నొకడుగ నున్నాడు." అని అనినాడు. ఇరువురును బుద్ధుని వెంటబడినారు. బుద్ధుని పరీక్షగా చూచుచు నడచు చున్నారు.

**గౌతమబుద్ధుడు నిదానముగ నడచు చున్నాడు. అతని వదనము నిర్వికారముగ నున్నది. అందానందము లేదు. దుఃఖ మును లేదు. చిరునవ్వు అంతర్ముఖముగ నున్నది. కనులు నేలను చూచుచున్నవి. అవి అర్థ నిమీలిత నేత్రములు. అతని నడక చాల ప్రశాంతముగ నున్నది. అవయవముల కదలిక లన్నియు చూచు వారికి కూడ ప్రశాంతత కలిగించు నట్లున్నవి. అతని చేతి వ్రేళ్ళు**

**అన్నియు శాంతిని ప్రసాదించు చున్నట్లుగ గోచరించును. ఆ వ్రేళ్ళ యందొక పరిపూర్ణత యున్నది. ఆ హస్తములు సృష్టి యందు దేనిని కోరవు. వేనిని అనుకరించవు. శాంతమే వాటి స్వభావముగ కనిపించుచున్నది. ఆ హస్తములు ప్రకాశించుచుండెను. వాటినుండి ప్రసరించుచున్న శాంతియుత తరంగములు విశ్వమునే జయించు చున్నట్లు గోచరించు చున్నది. అవి శాంతములు, దివ్యములు. బుద్ధుని భిక్షాటనము జీవుల ననుగ్రహించుకొరకే. దర్శన, స్పర్శనాదు లొసగుటకే. కనులద్వారా జీవులను ప్రచోదనము గావించుటకొరకే. భిక్షాటనము నిజమునకు అతనికి అవసరము కాదు అని సిద్ధార్థుడు భావించెను.**

శమను లిద్దరును బుద్ధుని కనులార చూచుచు అతని కదలికలను హృదయమున ప్రశంసించుచు బుద్ధునితో పాటు ఆ ఉదయము భిక్షను గావించినారు.

భిక్షణ గావించుకొని గౌతమబుద్ధుడు మరల జేతవనమున ప్రవేశించినాడు. సిద్ధార్థుడు, గోవిందుడు కూడ గౌతమబుద్ధుని అనుసరించుచు మరల జేతవనము చేరినారు. బుద్ధుని ప్రవచనము లకై గోవిందు డెదురు చూచుచున్నాడు. సిద్ధార్థుడు మాత్రము గౌతమబుద్ధుని స్థితిని గూర్చి యోచించుచున్నాడు. అతడు గమ్యము చేరినాడు కదా! తానది చేరవలెనుకదా ! అందువలన గౌతముని బోధలకంటే అతని స్థితిని, అతని కదలికలను, అతని దేహ సౌందర్య మును, అతనినుండి వికసించుచున్న కాంతి సౌరభమును గూర్చి ఆలోచించుచున్నాడు. అతనికి ప్రవచనముల పైన, బోధనలపైన ఆసక్తి లేదు. నఖశిఖ పర్యంతము బుద్ధుని చూచుటయే తడవుగ

అతనికి కలిగిన ఆనందమును మరల మరల నెమరు వేసుకొను చున్నాడు. అతని నుదురు, భుజములు, ఆజానుబాహువులు, పాదములు సిద్ధార్థుని హృదయమును ప్రభావితము చేసినవి. చేతి వ్రేళ్ళు, కాలివ్రేళ్ళు అన్నియు అత్యంత సౌందర్యముగ నున్నవి. అవియే సిద్ధార్థుని తలపునకు వచ్చుచున్నవి. సిద్ధార్థునకు గౌతమ బుద్ధుడు ఒక పరమ పవిత్రమూర్తిగ గోచరించినాడు. అతడెన్నడును ఒక మనిషినంతగ గౌరవించలేదు. ఇపుడు గౌరవమే కాదు భక్తి, ప్రేమ కూడ కలుగుచున్నవి.

సిద్ధార్థు డిప్పుడున్న పరిస్థితిలో తనకు బోధ లనవసరమని తలచుచున్నాడు. నిజమునకు బుద్ధుని బోధల సారాంశము అతను పూర్వమే విన్నాడు. అతని మనసున బుద్ధుని చూచుట ముఖ్యము కాని, వినుట ముఖ్యము కాదు. ఎవరు బోధించినను మూల సూత్రములే బోధింతురు. ధర్మమునే బోధింతురు. బోధనల యందు వైవిధ్యము ఉండవచ్చును కాని, సారాంశ మెప్పుడునూ ఒక్కటే. *"ఏకం సత్ విప్రా బహుధా వదంతి"* ఒకే సత్యమును విప్రులు అనేక రకములుగ వివరించు చున్నారని ఉపనిషత్ వాక్యము. ఎవరైనను చెప్పవలసినవి సత్యము, ధర్మము, దయ, కరుణ, క్షమ, శాంతి, ప్రేమ, యజ్ఞము, దానము, తపస్సులే కదా! ఒక్కొక్కరు ఒక్కొక్క అంశమును ఎక్కువగా ప్రకటింపచేతురు కాని మొత్తము మీద సారాంశ మొక్కటియే. అందువలన సిద్ధార్థుడు బోధన కన్న ఆచరణ, సిద్ధినం దెక్కువ మక్కువ కలిగియున్నాడు.

బుద్ధుడు తాను పొందిన భిక్షను పరివార పరివేష్టితుడై ఒక మామిడి చెట్టుక్రింద భుజించినాడు. నిజమున కతడు భుజించునది

ఒక పక్షి భుజించిన దానికన్న తక్కువ. సిద్ధార్థున కది ఆశ్చర్యము కలిగించినది. తానంతకన్న ఎక్కువే తినుచున్నాడు. తన శరీరము బాగ కృశించినది, ఎండిపోయినది, కాంతికూడ మాసినది. తనకన్న తక్కువ భుజించుచున్న బుద్ధుని శరీరము పుష్టిగ నున్నది. కాంతివంతముగ నున్నది. ఎక్కడను ఎముకలుగాని, నరములుకాని కనబడుట లేదు. అతి సున్నితముగ, సుకుమారముగ అతడు గోచరించుచున్నాడు. తాను సాధన యందున్నాడు. బుద్ధుడు సిద్ధుడైనాడు. తేడా సులభముగనే కనబడుచున్నదని యనుకొని నిరాశతో తన్ను గూర్చి నవ్వుకొనెను. సిద్ధార్థుడు, గోవిందుడు ఆ రోజు భుజించుటకు పూనుకొనలేదు. వారికి బుద్ధుని చూచుటయే భోజనమైనది.

సాయంకాలమైనది, జేత వనమందలి యాత్రికులందరు భోజనానంతర బడలికలు తీర్చుకొని బుద్ధుని బోధనలను వినుటకై సమావేశమైరి. బుద్ధుడు ప్రసంగము ప్రారంభించినాడు. **అతని కంఠము నుండి వాక్ప్రవాహము ప్రవహించుచున్నది. అది సెలయేటి వలె వినువారి హృదయములకు చల్లని స్పర్శ కలిగించినది. అతని భాష స్పష్టముగను, ఆకర్షవంతముగను యున్నది. సమవేగము కలిగియున్నది. ఆనాడు గౌతముడు మానవ జీవితమందలి దుఃఖమును గూర్చి, బాధను గూర్చి ప్రసంగించినాడు. ప్రపంచము దుఃఖమయమని, దాని నుండి జీవుడు తనను తాను ఉద్ధరించు కొనవలెనని, దానికి మార్గమున్నదని బోధించు చున్నాడు. అతని వాక్కు యందు మెత్తదన మున్నది. కాని చాల బలముగ శ్రోతల ఇచ్ఛా శక్తిని ప్రచోదన మొనర్చుచున్నది. అనేక ఉదాహరణములతో మరల**

**మరల ముఖ్య సూత్రములను బోధించినాడు. వినిన వారందరు చాల సంతృప్తిని చెందిరి.** ఆ సమయమునకు చీకటి పడినది. జన సమూహములో చాలమంది బుద్ధుని చేరి దీక్ష యొసగుడని ప్రార్థించిరి. బుద్ధు డంగీకరించెను. "బుద్ధ భగవానుని బోధనలు వినినారు కదా! బుద్ధ సంఘమును చేరుడు. అహింసా మార్గమును, ఆత్మానందమును పొందుడు. దుఃఖమయములగు జీవితములకు స్వస్తి వాక్యము పలుకుడు." అను వాక్యములు రజోగుణ ప్రేరితులైన బుద్ధుని శిష్యపరివారము నుండి వినపడినవి.

గోవిందుడు ముందుకేగి "నన్ను మీ సంఘమున చేర్చుకొనుడు. నాకు దీక్ష నందించుడు. నేను మీ మార్గమున నడతును" అని పలికెను. బుద్ధు డంగీకరించి దీక్ష నిచ్చినాడు. దీక్ష నందుకొని వచ్చిన గోవిందుని చూచుచు సిద్ధార్థుడు మౌనముగ నిలుచుండి పోయెను. గోవిందుడు సిద్ధార్థుని ప్రశ్నార్థకముగ చూచుచు నిలబడెను.

దీక్షనొంది అమితోత్సాహముతో వచ్చిన గోవిందునకు సిద్ధార్థు డొక మొండిమనిషివలె కనిపించినాడు. సిద్ధార్థునితో యిట్లనినాడు: సిద్ధూ! నీ వింత మొండివానివేమి? నీది మొండితనమో, గర్వమో నాకు తెలియుట లేదు. నీవు బౌద్ధదీక్ష నొందుటకు సందేహించు చున్నావా? నీకు గౌతమబుద్ధుని యందు దివ్యత్వము గోచరించ లేదా? అతనిని చూచినావు, వినినావు. అతని మార్గమున నడచి మోక్షమును పొందవలెనని నీకు లేదా? నీ ఆలోచనలకు పరిష్కార మిచ్చుట లభించలేదా? నీవెందుల కిచటే నిలబడినావు. చిన్నతనము నుండి ఒకరినొకరము

మన్నించుకొనుచూ, ప్రోత్సహించుకొనుచూ యింత దూరము వచ్చినాము. నీ వెప్పుడును నీ ఆలోచనలను వ్యక్తము చేయక మౌనము రూపమున మరుగున యుంచితివి. నేను నీ యందు చూపిన స్పష్టత, విశ్వాసము, నీవు నాయందు చూపలేదు. నీ వెప్పుడును ప్రతి విషయమును గూర్చి ఎక్కువగ నాలోచించెదవు. నీ ఆలోచన తెగదు, నిర్ణయమునకు రావు, ఎవరితోను నీ భావమును పంచుకొనవు. మనమిక కలిసి సత్యాన్వేషణము చేయుదమా? లేక నన్ను నీవు వదలి నీ మార్గమును వేరే చూచుకొందువా? నా ప్రాణ స్నేహితుడవని నీపైగల అభిమానముతో కోరుచున్నాను.

సిద్ధార్థుడు తన లోతైన భావలోకముల నుండి బయల్పడి గోవిందుని మాటలు విని ఉలిక్కిపడి యొక ముహూర్తము కాలము గోవిందుని ముఖమును చూచుచు మౌనముగ నున్నాడు. అటుపైన మృదువుగ యిట్లు పలికినాడు: "గోవిందా! మన మెప్పటికిని స్నేహితులమే. నీ వెప్పుడును నా నిర్ణయమును తెలుసుకొని నీ నిర్ణయమును చేసుకొనెడి వాడివి. దాదాపుగ చిన్నతనము నుండి నేను చేసినట్లు నీవు చేయుచు నుండెడి వాడవు. అది నీకు నాపై గల విశ్వాసము. నే నెన్నడును నీ విశ్వాసమును దెబ్బతీయలేదు. ఈనాడు నా గోవిందుడు తనంతట తాను నిర్ణయము తీసుకొన గలిగినాడు. ఇది నా కానందము నిచ్చుచున్నది. నాకన్న ముందుగ నీవొక అడుగు వేయుట నాకు చాల సంతోషముగ నున్నది. నీయందు నాకు గౌరవము కూడ చాల పెరిగినది. స్వంతముగ నిర్ణయము తీసుకొనుట జీవితములో చాలా అవసరము. ఇంకొకరి నిర్ణయము ననుసరించుట తన యందు తనకు పరిపూర్ణ విశ్వాసము లేదని

చాటుట. ఈనాడు ఆ అపరిపూర్ణతను నీకుగ నీవు నిర్మూలించుకొన గలిగినావు. నిన్ను గూర్చిన నిర్ణయమును నీవు తీసుకొన గలిగినావు. నీ జీవితము పైన నీకే సర్వాధికార మున్నది. దానికి నీవే స్వామివి. ఇట్టి సంతోషకర సమయమున నీవెందులకు వ్యధ చెందుచున్నావు. నన్ను గూర్చి నీవు పలికినదంతయు సత్యము. "నాకు మొండితన ముండుట సత్యము. మిక్కుటముగ ఆలోచించుట కూడ సత్యమే. గర్వమున్నదని నేను భావించుట లేదు. నీవిపుడు తెలిపినావు గనుక దానిని తప్పక నాయందు పరిశీలింతును."

**"మొదటినుండి నాది స్వతంత్రబుద్ధి. నేను నిజమున కెవరిని అనుసరింపలేదు. నన్ను నే ననుసరింతును. ఇతరుల యందు నచ్చినది పరిపూర్ణముగ ప్రశంసింతును. అంత మాత్రము చేత వారి ననుకరించలేను. ఇది నా సమస్య.** నా హృదయమున మా తండ్రిగారు ఎల్లప్పుడును పూజింపబడు చుందురు. అట్లే గౌతమ బుద్ధుడు కూడను. గౌతమబుద్ధుని మనసార నేను హృదయమున పూజింపగలను. చిన్నతనమున నా జీవితమును ప్రభావితము చేసినవారు తండ్రిగారు. అటుపైన నాపై మిక్కిలి ప్రభావము చూపిన వారు గౌతమ సిద్ధార్థుడే. నిజమునకు గౌతమబుద్ధుని స్థానము నా హృదయమున మా తండ్రిగారి స్థానముకన్న ఉన్నతముగ నున్నది."

**"నా దృష్టిలో సిద్ధులను, పెద్దలను మన్నించుట, పూజించుట, నమస్కరించుట, వారనుసరించిన మూలసూత్రముల నెరుగుట ముఖ్యము.** నేనా సూత్రములను యథాతథముగ పాటింపలేను. అందు నా కనుగుణమైనవి నా జీవితమునకు సరిపడునట్లుగ

మలచుకొని సాగుదును. బహుశః నా జీవలక్షణము ఎవరినీ అనుసరించుటకు సమ్మతించదేమో! **నాకుగ నేనై సత్యదర్శనము చేయవలెనని, ఒకరు అనుసరించిన మార్గమునే అనుసరించి సత్యమును దర్శించుట వీలుపడదని నా భావన.**"

"తల్లితండ్రుల వద్ద చాల నేర్చితిని. అట్లే శమనుల వద్ద కూడ చాల నేర్చితిని. గౌతమబుద్ధుని చూసి అమితానందము పొందితిని. అతనివలెనే నేనును సాగవలెనని నా కోరిక. అది నాకుగ నేను చేయుట నాకు తృప్తి. నా జీవితమున కాయన మరియొక మార్గదర్శి. ఆయన నా గమ్యము కాదు. సత్యము నా గమ్యము. ఆయన సత్యమును చేరినాడు. ఏదో ఒక రోజున నీవు, నేను కూడ చేరుదుము."

*గోవిందుడు :* అట్లైన నీవు కూడ దీక్షనుగొని చేరినచో మనము కలిసి మార్గమున పయనింతుము కదా!

సిద్ధార్థుడు : నీవు చేరితివి. నీకు శుభమగు గాక! నీవు తప్పక సత్యదర్శనము చేయుదువు గాక! నీవు గమ్యమును చేరి సుఖింతువు గాక!

గోవిందుని కన్నుల వెంట నీరు కారుచుండగ, సిద్ధార్థా! అని గట్టిగ కౌగలించుకొని దుఃఖించెను.

దుఃఖించుచున్న గోవిందుని భుజము తట్టుచు, వీపు నిమురుచు సిద్ధార్థుడు ప్రేమతో యిట్లు పలికెను: "మిత్రమా! నీవిపుడు బౌద్ధ దీక్షను స్వీకరించిన సన్యాసివి. బౌద్ధ సన్యాసివి.

నీ విప్పటికే తల్లిదండ్రులను, తోబుట్టువులను, బంధువులను సన్యసించినావు. నీ వూరును, నీ వారిని వదలిపెట్టినావు. ఆస్తిపాస్తులను, ప్రాపంచిక విషయములను కూడ వదలినావు. ఇది అంతయు సత్యదర్శనము కొరకే కదా! సత్యదర్శనాభిలాషికి సత్యముకన్నా ప్రియమైనది మరియొక టుండరాదు. నీవిపుడు సన్యాసి మార్గమున చివరి ఘట్టము చేరినావు. నీవిపుడు నన్ను విడచుటచే నీ సన్యాసము పూర్తికాగలదు. బౌద్ధ భిక్షువుగ నీవిపుడు దుఃఖించుట సమంజసము కాదు. మనసును దిటవు చేసుకొనుము. సత్యదర్శన మార్గమున మనము చాల వరకు కలసి నడచితిమి. చివరి దశయందు ఏకాకుల మగుచున్నాము. **ఏకాంతము సత్యానుభూతికి అత్యంతావశ్యకము.** అది నీకును, నాకును ఒకేమారెపుడూ సంభవించు చుండును. నీవు బైటికి దుఃఖించు చున్నావు. నేను మౌనముగ దుఃఖించు చున్నాను. మన మెప్పటికిని ప్రాణమిత్రులమే. ఒకరినొకర మాశీర్వదించుకొనుచు ఏకాగ్రుల మగుదము. ఇది నీకును, నాకును కూడ మేలు చేయగలదు. ఈ రాత్రి, రేపు పగలంతయు మనము ఈ వనమంతయు కలసి విహరింతుము. రేపు సాయంకాలము నా దారిన నేను పోయెదను.”

గోవిందుడు క్రమముగ స్థిరచిత్తుడైనాడు. ఇద్దరును చిన్ననాటి నుండియు కలసిమెలసి తిరుగుచు పెరిగినవారు. ఒకరినొకరు బాగుగ నెరిగినవారు. సమస్త విషయములను వారు నెమరు వేసుకొనుచు వనమంతయు తిరిగిరి. తెల్లవారుచుండగ స్నానాదికములు గావించిరి. ఇంతలో నూతనముగ దీక్షగొనిన సన్యాసు లందరిని సమావేశ మగుడనియు, దీక్షా వస్త్రముల

నిత్తురనియు, దీక్షలోని ప్రాథమిక సూత్రములను వివరింతురనియు వార్త వచ్చెను. గోవిందుడు సిద్ధార్థుని గట్టిగ కౌగలించుకొని "మిత్రమా! నీకు శుభమగు గాక!" అని పలికెను. సిద్ధార్థుడును గోవిందునట్లే ఆకాంక్షించెను. మిత్రులిరువును ఒకరినొకరు, మరల మరల ఆలింగనము చేసుకొనుచు వీడ్కోలు చెప్పుకొనిరి. గోవిందుడు బుద్ధ సంఘములోనికి పోవుచుండగ సిద్ధార్థుడు మందస్మితముతో సాగనంపెను.

సిద్ధార్థుడు ఒంటరిగ ఆ దినమంతయు జేతవనమున సంచరించ నారంభించెను. మనసు కూడ తీవ్రమగు ఆలోచనము నకు నాంది పలికెను. మనసున తనకొక నిర్దిష్ట ప్రణాళిక నేర్పరచు కొనుటకు సిద్ధార్థుడు తీవ్రముగ ఆలోచించుచుండగ వనమున అతని పాదములు నిర్దిష్ట గమ్యము లేక నడచుచున్నవి. కన్నులు వనమును పరికించుచున్నవే కాని అతని మనస్సు తదుపరి కార్యముపై లగ్నమై యున్నది. తా నిప్పుడేమి చేయవలెను? తన కిప్పుడు ఏ సంఘము లేదు. ప్రాపంచిక సంఘము లేదు. శమన సంఘము లేదు. బుద్ధ సంఘమును కూడ తాను కోరలేదు. తన మిత్రుడు బుద్ధ సంఘమున సంగమించినాడు. తనకిపుడు వలసినది అసంగమము. ఇక దైవముతోనే సంగము. మరియొక సంగము తన కిపుడిక మిగుల లేదు. దైవముతో సంగము భావముతో చేయవలెనా? ధ్యానముతో చేయవలెనా? స్మరణ మార్గమున చేయవలెనా? వృశ్చికరాశి వాడగుటచే తనకు కీర్తనలు, భజనలు అన్న మనసు ద్రవింపదు. స్మరణతో చేయవచ్చునేమో? ఏ నామము స్మరింప వలెను ? అట్లాలోచించుచు దైవముతో సంగమునకు

మార్గమును వెదకుచూ నడచుచున్న సిద్ధార్థునకు ఎదుటి నుండి ఏదియో సూక్ష్మముగ తన్ను స్పృశించిన ట్లనిపించినది. ఇది తా నెరిగిన స్పర్శయే. అది బుద్ధుని కాంతిస్పర్శ. అపుడు సిద్ధార్థుడు భావముల నుండి భౌతికమునకు వచ్చి చూడగ నెదురుగ గౌతమబుద్ధుడు గంభీరుడై అగుపించెను. సిద్ధార్థు డాశ్చర్యముతో అటుపైన శిరస్సు వంచి నమస్కరించెను. బుద్ధుడు మందస్మితము చేసెను. అతని నవ్వు నుండి పరమశాంతి ప్రసారమయ్యెను. సిద్ధార్థు డెదుటపడి, తాను ప్రసంగించుటకై బుద్ధుని అనుమతి వేడెను. బుద్ధు డంగీకరించెను. ఇద్దరును నడచుచుండగ సిద్ధార్థుడు బుద్ధునితో యిట్లనెను.

"మహాత్మా! నిన్నటి తమ ప్రసంగమును విను భాగ్యము నాకు కలిగినది. మీ ప్రసంగ మద్భుతముగ నున్నది. నేను, నా మిత్రుడు దూరదేశముల నుండి మిమ్ములను చూచుటకు, మీ ప్రసంగములు వినుటకు వచ్చితిమి. మిమ్ములను చూచి ఆనందించి తిమి. మీ ప్రసంగము విని పొంగితిమి. నా మిత్రుడు స్ఫూర్తిచెంది, దీక్షగొని మీ సంఘమున చేరినాడు. నేనిపు డేకాకినై నా మార్గమున నేను పోవుచున్నాను."

*బుద్ధుడు :* "నీకు శుభమగు గాక!" అని దీవించెను.

సిద్ధార్థుడు ధైర్యము కూడగట్టుకొని గౌతమబుద్ధునితో నిట్లనెను: "మహాత్మా! మీతో నా భావములను పంచుకొనుటకు అనుమతిండు. త్రికరణశుద్ధిగ మీ యందు నా భావములను ఆవిష్కరింప కోరికగ నున్నది. తమ రనుమతించినచో భాషించెదను."

బుద్ధుడట్లే అనెను. అపుడు సిద్ధార్థు డిట్లనెను : “ముమ్ముందుగ నేను తెలుపవలసినది మీ బోధనయందు నాకు కలిగిన ఆనందము అభిమానము. మీ బోధన సుస్పష్టము. సోదాహరణము. జీవుని యాత్ర, అందతనుపడు యాతన, కార్యకారణ సందర్భములు స్పష్టముగ తెలిపినారు. ఇంత సుస్పష్టమైనటువంటి బోధను ఇంతకు పూర్వ మెవ్వరును అందించలేదు. తప్పక శ్రోతల హృదయములు మీ బోధనలతో స్పందించ గలవు. పండితులు సైతము రంధ్రాన్వేషణ చెయ్యలేని సమన్వయాత్మకమగు బోధనగ మీ భాషణము సాగినది. భాషణమందు దేవతల ప్రసక్తి లేదు. అనుగ్రహ ప్రసక్తి కూడ లేదు. పురుష ప్రయత్నమే ప్రధానముగ భాషణము సాగినది. సృష్టి యందలి ద్వంద్వత్వమును సమన్వయము గావించిరి. ద్వంద్వత్వ మున గల ఏకత్వమును స్పష్టముగ నిరూపించిరి. మహత్తును, అణువును కూడ సమన్వయించిరి. జనన మరణాత్మకమగు చక్రమును సుస్పష్టము చేసిరి.

“సమగ్రమగు మీ బోధనమందు నాకొక లోటు కనిపించినది. అది ఏమన మీరు తెలిపిన నిర్వాణ సిద్ధాంతమే. ద్వంద్వముల కతీతముగ నిలచి మోక్షమును పొందుడని తెలిపినారు. సృష్టి ద్వంద్వము. అందు ప్రవేశ పెట్టబడినవాడు జీవుడు. ద్వంద్వము లేర్పడిన వెనుక జీవుడేర్పడినాడు. అట్టి జీవుడు ద్వంద్వములలోనే యుండును గాని ద్వంద్వాతీతు డెట్లు కాగలడు? ఈ ప్రశ్నకు మీ బోధనయందు సమాధానము దొరకలేదు. అధిక ప్రసంగము చేసినచో నన్ను మన్నింపుడు.”

బుద్ధుడు సిద్ధార్థుడు పలికినది ఆసాంతము ప్రశాంతముగ వినినాడు. తనపై ఆరోపణ సిద్ధార్థుడు చేసినప్పటికిని అతను నిశ్చలుడై సిద్ధార్థునిపై దయ, కరుణ ప్రసరింపజేయుచు యిట్లనెను: ‘‘నీవు ప్రసంగమును బాగుగ వింటివి. నీ మేధస్సు యొక్క పరిణతి నాకు నచ్చినది. నీవు ప్రసంగమును గూర్చి చాలా లోతుగ యోచన చేసినావు. చివరకు రంధ్రాన్వేషణము చేసినావు. నిజమునకు నీవు మరింత యోచన చేయవలసియున్నది. **నీవొక అపాయకరమగు స్థితియందున్నావు. అది నీ జ్ఞానతృష్ణ. జ్ఞానమును గూర్చి నీవు చేయుచున్న విచికిత్స నీ యందు ఒక నిర్ణయాధికారిని ఏర్పరచినది. ఇది మంచి, ఇది చెడు, ఇది సరి, ఇది తప్పు అని విభజించి చూచు నీ దృష్టికి పాండిత్య మబ్బినది కాని సమన్వయ మబ్బ లేదు. ప్రతి విషయముపైనను ఒక నిర్దిష్టమైన అభిప్రాయ మేర్పరచుకొనుట నీకలవాటైనది. అభిప్రాయములు నిన్ను తికమక పెట్టునే కాని వాని వలన ఒరుగున దేమియు లేదు. ఇది యందము, ఇది వికారము, ఇది జ్ఞానము, ఇది యజ్ఞానము, ఇది అంగీకరింప తగినది, అంగీకరింప తగనిది అని ప్రతి విషయమును విశ్లేషించి, విభజించి చూచుటలో నీయందు సమన్వయము కొరవడినది. సమన్వయము కొరవడినవారికి జగత్తునందు సమన్వయము తెలియదు.**’’

‘‘నేను పలికినది నా అభిప్రాయము కాదు. నేను పలుకుట యందలి ఉద్దేశ్యము కూడ దేనిని ఋజువు చేయుట కొరకు కాదు. నేను పలికినది నేను పొందిన పరిష్కారము. నా అనుభూతి. అది ద్వంద్వములనుండి నన్ను తరింపచేసిన మార్గము. నా

అనుభూతియే నేను వివరించుచున్నాను కాని, నేనీ ప్రపంచమున కేమియు బోధించుట లేదు.''

*సిద్ధార్థుడు :* ''మహాత్మా! మీరు నాపై ఆగ్రహింపకుడు. నేను, నా భావములను మీకు తెలుపుటలో మీతో తర్కించవలెనను సంకల్పము నాకు లేదు. అభిప్రాయములు నిరుపయోగములని నాకును తెలియును. మీరు పరిపూర్ణులని, సత్యదర్శులని, మానవుని తుది గమ్యమైన మోక్షసిద్ధిని పొందినారని నా అంతరాత్మ సాక్షిగ నేను నమ్మియున్నాను. ఈ విషయముపై నాకు శంకలేదు. మీరు పొందినది లక్షలాది బ్రాహ్మణులు చేయు ప్రయత్నమున పొందలేనిది. మీ పురుష ప్రయత్నమునందు అన్వేషణ యున్నది, ఆలోచన యున్నది, జ్ఞానమున్నది, ధ్యానమున్నది, తత్ఫలితముగ దివ్యానుభూతి యున్నది. మీరు పెద్దల బోధనలద్వారా పొందిన సిద్ధి కాదిది. కేవలము బోధనలు ఎన్ని విన్నను, ఆచరించినను సిద్ధి కలుగదు. మీరు పొందినది సత్యానుభూతి. అది మీకే సొంతము. దానిని గూర్చి మీరు వివరింతురేమో కాని దానిని వివరించలేరు కదా! మీ వివరణ విను వారికి తదనుభూతి కలిగించదు కదా! స్ఫూర్తిని మాత్రమే కలిగించును. మీరు భుజించిన ఫలమును గూర్చి మీరెంత వివరించిననూ, అది వివరణమే కాని, వినిన వారికి తినిన అనుభూతి కలుగునా? అభిరుచి కలుగవచ్చు, అనుభూతి కలుగదు. దానికి ఎవనికి వాడు కృషి చేయవలసినదే అని నా భావన.''

*సిద్ధార్థుడింకను యిట్లనుచున్నాడు :* ''ధర్మాత్మా! మీరెన్ని ప్రబోధములు చేసినప్పటికిని, ఎంత నిశితము సున్నితము అయిన

పదములతో ప్రవచించి నప్పటికిని మీరు పొందిన ఆత్మానుభూతి స్థితిని లేక నిర్వాణమును తెలుపలేరు కదా! ప్రబోధములు, ప్రవచన ములు అన్నియు సత్ప్రవర్తనను అలవరచుకొనవలెనని, తద్వారా దుష్ప్రవర్తనలను దాటవలెనని తెలుపుచున్నవి. కాని, మీరు పొందిన అనుభూతి భాష కతీతము. భావనకు కూడ అతీతమే. భాష భావము కలిగి తదతీతమైన స్థితిలోకి ప్రవేశించినప్పుడు కలిగిన అనుభూతికి భాష ఎట్లు అందివ్వగలము? ప్రత్యగాత్మ పరమాత్మ యందు కరగియున్న స్థితిలో పొందిన అనుభూతిని ప్రత్యగాత్మ ఎట్లు గుర్తించగలడు? మునిగినట్లు తెలియును గాని పరమాత్మలో మునిగియున్నప్పుడు తెలియదు కదా!

**"మిమ్ములను నేను ఎంతయో శ్రద్ధగ వింటిని. మీరు తెలిపిన విషయము లన్నియు పరమ పవిత్రములే. మీ భాషణము నుండి నేను తెలుసుకొన్న విషయము ఒకటి కలదు. ఆత్మానుభూతి నిర్వ చించుటకు వీలుపడదని, అది నిర్వచనమున కతీతమైనదని, అది యిట్టి లక్షణము కలది అని తెలుపలేము. దానిని గూర్చి తర్కింప లేము. అది అవ్యక్తము. దానిని మీరు అనుభూతి పొందినట్లు మిమ్ములను చూడగనే తెలిసినది. మీ కదలికలో అది గోచరించు చున్నది. మీ యందు పూర్ణముగ నిండియున్నది. తదానందము మిమ్ములను చూచినవారికి దక్కును. ఆత్మానుభూతి మాత్రము ఎవరికి వారే పొందవలెనని తెలిసినది.** ఆత్మానందము పొందిన వారిని చూచినపుడు ఆత్మాన్వేషణులకు ఒక స్ఫూర్తి కలుగును. తాము కూడ దీక్షతో తపస్సు సాగించిన సిద్ధి కలుగవచ్చునను స్ఫూర్తి. ఇది మానవ సాధ్యమే అను ధైర్యము. ఆ స్ఫూర్తి, ధైర్యము

మిమ్ములను చూచుటచే నాకు బలపడినది. *"నాయమాత్మా ప్రవచనేన లభ్యః"* అను ఉపనిషత్ వాక్యము మరల గుర్తుకు వచ్చు చున్నది. కావున నా కర్తవ్యము నాకే మిగిలియున్నది.

"మీ సంఘమును చేరక నేను నా అన్వేషణమున ముందుకు సాగుటలో యింతకన్న మంచి సిద్ధాంతము మరియొకటి దొరుకునని కాదు. మా తండ్రిగారు అన్ని విషయములు తెలిపిరి. అన్వేషణకు యిల్లు వదలితిని. శమనులను జేరితిని. అచ్చట పుష్కరకాలము పాటు సాధన సాగినది. ముప్పది సంవత్సరములకు మీ దర్శన మైనది. నాకు అంతర్ముఖముగ ఎట్టి సందేహములు లేవు. మీరు పొందిన ఆత్మానుభూతిని పొందుటకు నేనిక ఒంటిరిగ సాగవలెనని తెలిసినది. సిద్ధాంతము లన్నియు యింతవరకే. ఇక పైన మిగిలినది పురుష ప్రయత్నము. అది ఏకాంతమున మీబోటి వారికి లభించినది. ఆత్మపరుల మార్గముననే తథాగతుడనై చనుచున్నాను. మీ ఆశీర్వచనము కోరుచున్నాను. మీరు మనసార ఆశీర్వదించినచో మార్గము సులభము కాగలదు." అనుచూ సిద్ధార్థుడు వంగి నమస్కరించెను.

గౌతమబుద్ధుడు సిద్ధార్థుని పలుకులకు శాంత గంభీరుడయ్యెను. సిద్ధార్థుడితో యిట్లనెను : "నీ మేధస్సుకు మెచ్చితిని. నీవొక అన్వేషకుడవని తెలిసినది. నీకు శుభమగు గాక! మిత్రుడా! ఈ సమయమున నాకు తోచిన సూచన యొకటి నీకందించుచున్నాను. నీ మేధస్సుకు పదనుతో పాటు ఒకింత వక్రత యున్నది. అది నిన్ను తిప్పలు పెట్టగలదు. నీవీ

ప్రపంచమున ఎవరిని గూర్చి జాగ్రత్తపడ నవసరము లేదు. నీవు నీ మేధస్సునుండి నిన్ను రక్షించుకొన గలిగినచో నీకు మార్గము సుళువగును. లేనిచో నీ అన్వేషణ అనంతము కాగలదు. తగు జాగ్రత్త వహింపుము. **ఏ మేధస్సు నిన్నింతవరకు గొనివచ్చినదో అదియే నీకు ముందు అంతరాయము. దానిని విసర్జించిననే కాని నీకు పరిష్కారము లభింపదని నా కనిపించుచున్నది. ఇది కేవలము నీపై గల వాత్సల్యముతో పలికిన పలుకులే గాని ఆగ్రహము కాదు సుమా! నీవిక పోయిరమ్ము. సర్వము శుభమగు గాక!"**

బుద్ధుడు చిరునవ్వు నవ్వుచూ ముందుకు సాగెను. ఆ నవ్వు నుండి వచ్చిన కిరణము సిద్ధార్థుని నేత్రముల ద్వారా హృదయమును చేరినది. అతని హృదయము పులకించినది. గౌతమబుద్ధుడు నిలబడిన ప్రదేశమున అతని పాద చిహ్నములను చూచి సాష్టాంగ ముగ నమస్కారము చేసి, నుదుటితో ఆ పాద చిహ్నములను స్పృశించెను. మూడుమార్లు నమస్కరించి ముందుకు సాగెను.



# 4

గౌతమబుద్ధుని స్పర్శతో పులకించిన హృదయము కలవాడై సిద్ధార్థుడు ముందుకు సాగెను. అతని ఆలోచన పరంపర మరల విచ్చుకొనెను. నడుచుచూ జరిగిన జీవితమును నెమరు వేసుకొనెను. తన తండ్రి సర్వమును తెలిసినవాడు. ఉన్నచోటనే యుండి సత్యమును తెలియమని తెలిపినాడు. తనకది నచ్చలేదు. సత్యమును సాధించవలెనని తాను యిల్లు వదలినాడు. తన తండ్రి సిద్ధార్థుడ వగుదువుగాక! అని దీవించి పంపినాడు, ఆయనకు తనపై పూర్ణ విశ్వాసము కలదు. తాను సత్యమును దర్శింపకలడని తండ్రి నమ్మకము. ఆయన ఆత్మానుభూతి పొందిన దినము, తాను పుట్టిన దినము కార్తీక పౌర్ణమి అగుటచే, తన ఆత్మఫలముగ తన కుమారు డుద్భవించెనని ఆయన భావన. అందులకే సంతోషముగ తనను ఆశీర్వదించి పంపినాడు. శమనుల వద్ద తాను అత్యంత తీవ్ర మగు సాధనను గావించినాను. శరీరమును శుష్కింప చేయుట, ఆకలిదప్పులను దాటుట, మౌనముగ నుండుట జరిగినది. అయినను తనయందు స్వభావపు అంకురములు పోలేదు. అసంతృప్తితో

నున్న తనకు బుద్ధుని దర్శనము ఆనందము కలిగించినది. అతడి సంఘమున తాను చేరుట వలన తనకేమీ ప్రయోజనము కలుగదు. బుద్ధుని బోధనలు విన్నచో తృప్తి కలుగుట సహజము కాని అన్వేషకునికి ఆత్మానుభూతియే పరమావధి. అతని అనుయాయి డగుట వలన, అనుయాయుడుగా తృప్తిపడుటయే కాని ఆత్మాను భూతి కలుగునని అనుపించుట లేదు. అనుయాయుడిగ తృప్తి పొంది తనను తాను మోసగించుకొనలేదు. తనకు శాంతి, తృప్తి లభించినంత మాత్రమున మోక్షము లభింపదు కదా! పైగా తృప్తి పడుట వలన వృద్ధి యుండదు. బుద్ధుని దేవునిగ భజించుచు జీవించిన తనకు సత్యము దొరకదు. అందులకే తానా సంఘమున చేరలేదు.

బుద్ధ సంఘమున చేరనప్పటికిని బుద్ధుని రూపము తనను ఆకర్షించినది. చాలాకాలము తర్వాత తాను అంతర్ముఖముగ కూడ ఆనందము చెందినాడు. బుద్ధుని వంటి రూపము తా నింతవరకును చూడలేదు. ఆయన చిరునవ్వు, చూపు, నడక, కదలిక నిరుప మానము. తానుకూడ ఒకనా డట్లగుటకు సాధ్యపడునా? అతని ప్రతి కదలిక యందు ఒక నూతన స్వాతంత్ర్య మున్నది. గంభీరత యున్నది. మనస్సు కందని మాహాత్మ్య మున్నది. అతడు జగత్తును జయించినవాడు. నేను కూడ జగత్తును జయించి స్వతంత్రుడను కాగలను.

నా జీవితమున నేను దైవమును మానుష రూపమున చూచితిని. అతని కన్నులలోనికి చూచినప్పుడు, తాను కన్నులు దించుకొనవలసినదే. ఆ చూపు లెంతటి వానినైనను

లొంగదీయగల నిర్మలత్వము కలిగి యున్నవి. తా నెవ్వరిని చూచినను యింతవరకు కన్నులు దించుకొనుట జరుగలేదు. ఇప్పుడు జరిగినది. నాకిక ఏ బోధనలతోను పనిలేదు. బుద్ధుని బోధనలు ఆత్మప్రేరణను కలిగించునవే కాని ఆత్మానుభూతి నిచ్చునవి కావు. **ఒక అవతారమూర్తి బోధనలు జీవులకు ప్రేరణ నందించుటకే. ఉద్ధారణము పురుష ప్రయత్నముననే జరుగును. కావున యిక బోధనల వెంటపడు నవసరము లేదు.** నిజమునకు బుద్ధుడు తన మనసును దొంగిలించినాడు. తన ఏకైక సహవాసి, సహ యాత్రికుడు, ప్రాణమిత్రుడు అయిన గోవిందుని పూర్తిగ దొంగిలించినాడు. తన వెంట చిన్న తనము నుండి పయనించుచున్న గోవిందు డిపుడు బుద్ధుని వెంటబడినాడు.

బుద్ధు డందించిన సూచన సిద్ధార్థుని మనసుయందపుడు మెదలినది. నిజమే. తన మేధస్సు, తన తెలివిపై తనకు విశ్వాసము కలదు. అందు కొంత గర్వము కూడ యున్నది. మొదటిసారిగ గోవిందుడు నిన్ననే ఈ విషయము హెచ్చరించినాడు. బుద్ధుడు కూడ జాగ్రత్త సుమా! యని హెచ్చరించినాడు. తనను తాను జయించుటకు యింతవరకును తనకు వినియోగపడినదీ తెలివియే. ఇది కూడ విసర్జింపబడవలెను. అపుడే తనకు తారణము. అది ఏనాడో ఒకనాడు జరుగక పోదు.

పై విధముగ తలపోయుచు సిద్ధార్థుడు ఏకాంతుడై ముందుకు సాగెను.

సిద్ధార్థుడు జేతవనమును వదలి తనదారి తను పోవుచుండగ జీవితమున ప్రప్రథమముగ అతనికి చెట్లు, జంతువులు, కొండలు,

ఫలములు, పుష్పములు, నదులు, సెలయేళ్లు, పక్షులు, మేఘములు ఆకర్షణీయముగ కనపడినవి. తాను చిన్నతనమునుండి అన్వేషకుడే. అవ్యక్తమైన తత్త్వమును అన్వేషించుట యందే నిమగ్నమై ఎన్నడునూ ప్రకృతి రమణీయతను గమనించలేదు. అతనికి మొట్టమొదటిసారిగ ప్రకృతి రమణీయతపై దృష్టి మరలెను. ప్రకృతి అతనిని ఆకర్షించెను. సూర్యోదయములు, చంద్రోదయములు, తారలు అందించు వివిధ కాంతులు హృదయమునకు కొంత సేద తీర్చినట్లు అనిపించినది. గౌతమబుద్ధుని దర్శనానంతరము తనకీ విధముగ ప్రకృతి పైకి మనసు మళ్ళుట ఆశ్చర్యముగ నున్నది. ప్రకృతి ఆనంద మిచ్చునను భావము తన కిదివరకు ఎన్నడును కలుగలేదు. పంచభూతాత్మకమైన ఈ సృష్టి అంతయు మిథ్య అను భావమున నిలచి తాను ప్రకృతిని నిరసించెను. నిరాకరించెను కూడ. వేదాంత భావమున ప్రకృతిని నిరాకరించినను తన యందలి ప్రకృతిని ఎంత సాధన చేసినను నిర్జించలేకపోయెను.

తన ప్రకృతి తనకు లొంగలేదు. గౌతముడు తెలివితేటలతో కూడిన నా అహంకారమును నాకెత్తి చూపినాడు. అదే విషయము తన తండ్రి హెచ్చరించినాడు. తన స్వతంత్ర బుద్ధిని మెచ్చుకొనుచునే తండ్రి ఆప్యాయముగ చేసిన హెచ్చరికలు తాను విమర్శించు కొనలేదు. తా నహంకారియా? అను ప్రశ్న మొట్టమొదటగ గౌతముని రెండవ హెచ్చరికగ సోకినది. తాను స్వతంత్రత అనుకొన్నకొలది తన నహంకారిగ మార్చినదా? గోవిందుడు కూడ ఆ మాటే అనినాడు. నా మొండితనమున కతడు దుఃఖము చెందినాడు. నిజమే, తాను సంకల్పబల మనుకొన్నది

మొండితనమైనదేమో! స్వతంత్రబుద్ధి అహంకారముగ కరుడు కట్టినదేమో! అయి వుండవచ్చును.

శమనులతో తాను గడిపిన అన్ని సంవత్సరములు శరీరమును, ఇంద్రియములను, మనస్సును పాశవికముగ దమించుటయే జరిగినది. అయినను మనస్సు, ఇంద్రియములు మరల మరల తమ సహజమగు మొలకలు వేయుచునే యున్నది. అది తన ప్రకృతి. తన ప్రకృతిని తానుగ దాటలేకుండెను. అది తనను మధించు చున్నది. **అహంకారి త్రిగుణములకు లోబడిన జీవి. ఆత్మ తత్త్వము త్రిగుణముల నధిష్ఠించిన స్థితి. త్రిగుణములు అహంకారమునకు లోబడినవు కావు. త్రిగుణముల నుండి పుట్టిన అహంకారము త్రిగుణముల నెట్లు దాటగలదు? బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, శరీరము అహంకారమునకు లోబడి నట్లున్నను, అవియును త్రిగుణముల చేతనే నడిపింపబడు చున్నట్లున్నది. కావుననే తానెంత తీవ్రముగ దమించినను అవి అన్నియు తమ తమ స్వభావములను చూపుచునే యున్నవి.** ఒక విధముగ తన అహంకారము తనను ఒంటరి చేసినదేమో! అహంకారము వలననే సంప్రదాయమును హేళన చేసితిని. అహంకారము కారణముగనే సర్వజ్ఞుడైన తండ్రిని, తల్లిని నిరాదరణ గావించితిని. అహంకారము కారణముగనే గోవిందుని కోల్పోయితిని. చివరికేమైనట్లు? తన కాత్మజ్ఞానము కలుగకపోగా, తనకును తన స్వభావమునకు కూడ సమన్వయము పోయినది. తన స్వభావము తనని కొండచిలువై పట్టుకొనినది. కొండచిలువచే బంధింపబడినవాడు తనకు తానుగ విడిపించుకొనలేడు. తనను అహంకారమను కొండచిలువ పట్టినట్లుగ తనకు తెలియనే తెలియదు. గౌతమబుద్ధుని

హెచ్చరిక తనలో నేదో సంచలనము రేకెత్తించినది. అతడు తన స్వభావమునకు అద్దము పట్టి చూపినాడు.

కనపడుచున్న ప్రకృతిని నిరాదరించి, కనపడని దైవమునకై తాను చేసిన కృషి అంతయు తనకు మూర్ఖముగ తోచుచున్నది. అందిన ఫలములను నిరాదరించి అందని ఫలములకై అఱ్ఱులు చాచుచున్న తన నైజమును వెక్కిరించుచు ప్రకృతి తన రమణీయతను తనకు చూపుచున్నదా?

చిన్నతనము నుండి తనకు ఆలోచన ఎక్కువ? ఆలోచనా శక్తి కలవాడని తాను గర్వించు చుండెడివాడు. ఆలోచనలకు తీవ్రత పెరిగి ఆచరణము తప్పుదారిన నడచు చున్నదేమో! ఇదియును ఆలోచనయే కదా! అందరివలె తాను కూడ సామాన్యముగ నాలోచించుచు సామాన్య జీవితము నెందుకు సాగించకూడదు? తనకు తెలియని గొప్ప విషయమునకు తనకు తానుగ అర్హుడని భావించుటచే యిట్టి స్థితి తనకు పట్టినదా? తను రెంటికీ చెడ్డ రేవడై యున్నాడని సిద్ధార్థున కనిపించినది.

సిద్ధార్థునకు అప్పటికి 30 సంవత్సరములు నిండినవి. తన స్వభావమున బీజప్రాయముగ నున్న కొన్ని ఇహలోక భోగ్య భావములు తనెంత ప్రయత్నించినను తనకు పండ్రెండు సంవత్సర ములుగ (ఇల్లు వదలినప్పటినుండి) తన కంతరాయము కలిగించు చునే యున్నవి. దేహ సహజమైన భోగములు కొన్ని తీరక జీవాత్మ పరమాత్మ వైపునకు పరిపూర్ణముగ మళ్ళుటకు ఆ భావము లడ్డు పడుచునే యున్నవి. అణగద్రొక్కినచో అవి అణగవని, అట్లణగ ద్రొక్కుట రజోగుణ ప్రవృత్తియని తెలియుట కతనికి పండ్రెండు

సంవత్సరములు పట్టెను. పై కారణముగనే గృహస్థ జీవనము శ్రేయస్కరమని తండ్రి తెలిపినాడు. **గృహస్థాశ్రమమున కర్తవ్య నిర్వహణము గావించుచు తగు మాత్రము సంపద, స్త్రీ, సంతాన ముల ననుభవించుచు ఆత్మజ్ఞానమునకు కృషి చేసినచో దేహము, ఇంద్రియములు, స్వభావము కొంత పరితృప్తి చెందుచు నుండగ ఆత్మజ్ఞాన సాధనమున మేల్కొన్న జ్ఞానాగ్ని క్రమముగ రగుల్కొని జీవుడు పురోగతి సాగించుట సులభమని తెలుసుకొనెను.**

అందరును సన్యసింపలేరు. కొందరు పూర్వ జన్మములయందు ఇహలోక భోగ్య విషయముల యందు పరితృప్తి చెంది, జ్ఞానమున కున్ముఖమైన సందర్భమున మరణించుట జరిగినచో అట్టివారికి సన్యసించుట సహజముగ నుండును. వారి సన్యాసము కూడ సత్త్వగుణ సంపన్నమై యుండును. రజోగుణ ప్రవృత్తిచే తనవలె పట్టుదలతో సన్యసించినవారు, తమ ప్రకృతిని దాటలేక త్రిప్పలు పడుచుందురు. తీవ్రమగు కామముతో రావణుడు, క్రోధముతో హిరణ్యకశిపుడు, లోభమోహములతో భస్మాసురుడు, మదముతో మహిషుడు, మాత్సర్యముతో నరకుడు, దైవమునుగూర్చి తపస్సు చేసినను వారి దైవము రజోగుణ ప్రేరితమై వారిని నశింపచేసినది. ఆవేశ కావేశములతో కూడిన భక్తి వేరు, నిర్మలమగు సత్త్వగుణమున నేర్పడిన భక్తి వేరు. అట్లే శోకమునుండి పుట్టిన వైరాగ్యము కూడ, సన్యసించుటకు వలసిన అర్హత నీయదు.

రజస్సు, తమస్సులను సత్త్వగుణారాధనచే సమన్వయించు కొనుచు, సత్త్వమున నిలచినవారికి, వైరాగ్యము సహజము. అత నుండు స్థితియే సన్యాసము. ప్రత్యేకముగ సన్యాసము పుచ్చుకొనుట యుండదు.

సహజముగ పండిన పండుకన్న మగ్గపెట్టిన పండు రుచి యుండదు. మగ్గపెట్టుట తొందరపడుటయే. తానట్లు తొందరపడి నాడని సిద్ధార్థున కనిపించినది. తన స్వభావముతో తాను మైత్రి నేర్పరచుకొని ముందుకు సాగవలెనే కాని కేవలము మొండి పట్టుదల ఉపయోగపడదని తెలుసుకొనెను. రామాయణమున తన స్వీయకథగ విశ్వామిత్ర మహర్షి తెలిపిన సత్యము, తనకిపు డనుభవపూర్వకముగ తెలిసినది. దైవము నెవ్వరును సాధింపలేరు. సాధించు బుద్ధి రజోగుణ ప్రవృత్తము. భక్తితో ఆరాధించుచు వేచియుండుటయే కర్తవ్యము. ఆరాధన ఎట్లైనను సాగవచ్చును. అది పూజాదికములు కావచ్చును, స్తోత్రాదికములు కావచ్చును, క్రతువులు కావచ్చును, భజనము కావచ్చును, గానము కావచ్చును. జపము, తపము, ధ్యానము కావచ్చును. ఇవి అన్నియు భగవంతునితో అనుసంధానము కలుగుటకు సాధకుడు చేయు ప్రయత్నమే. భాగవత రామాయణాది గ్రంథములను బోధించుట, వినుట కూడ దైవానుసంధానము కొరకే. తండ్రి ఇవి అన్నియు దైవముతో నుండుటకు దైనందిన కార్యక్రమముగ రూపొందించుకొనెను. తన కప్పుడందలి రహస్యము తెలియలేదు. తండ్రి చెప్పినను తనకు తెలియకపోవుట వలననే అది రహస్య మయ్యెను. చెప్పినను తెలియనివే దైవ రహస్యములు. 12 సంవత్సరములు అగచాట్ల పిదప, గౌతముడు చెప్పినప్పుడు మొదట తన అహంకారము అంగీకరించలేదుగాని అది ఇప్పుడు లోపల నుండి రహస్యమును ప్రకాశింప చేయుచుండెను.

తనకిపుడు కర్తవ్యమేమి? డంబాచారము వదలి, స్వభావమును కొంత ఆదరించుటయా? నిజమునకు తన

స్వభావము తనెపుడూ ఆదరించలేదు. స్నేహితుడి కన్న ఎక్కువగా అహర్నిశలు అంటి యుండును. స్వభావముతో తాను మైత్రి నెందుకు చేయరాదు. తన స్వభావముకూడ తానే. అది తన యందలి భాగమే. కుక్కతోక కుక్కలో భాగము కాదా! కత్తిరించినను ఆడించుచునే యుండును. తాను చాలసార్లు కత్తిరించినాడు. కాని అది మరల పెరుగుచు, ఆడుచు నున్నది. తనకిక దానితో మైత్రి తప్ప గతి లేదు. మైత్రీ భావము నాశ్రయించుటయే తక్షణ కర్తవ్యమని భావించెను.

ప్రకృతి–పురుషుల అవినాభావ సంబంధము గుర్తించిన సిద్ధార్థుడు ప్రకృతితో మైత్రియే పరిష్కారమని గమనించి బీజ ప్రాయములుగ తనయందున్న స్వభావమును మన్నించుటకు, మైత్రీ భావము నేర్పరచుకొనుటకు నిశ్చయించుకొనెను. అది తన ప్రస్తుత కర్తవ్యమని ఎరిగి, మొట్ట మొదటగ గృహమున కేగి తల్లిదండ్రులకు సాష్టాంగదండ ప్రణామము గావించి గృహస్థు డగుటకు నిశ్చయించుకొనెను. క్రమముగ కొన్ని రోజులకు స్వగ్రామము చేరెను. చిక్కి శల్యమైన తన శరీరము, కళావిహీనమైన తన ముఖము, ముండనము కావించుకొన్న తన శిరస్సు కారణముగ గ్రామస్తు లెవ్వరూ అతనిని గుర్తించలేదు. పండ్రెండు సంవత్సరముల క్రితము అతడు గృహము వదలినాడు. అందరి మనస్సుల నుండి అతనిని గూర్చిన స్మృతి చెరిగిపోయినది. స్వగృహమున కేగినాడు. గృహము పాడుబడి యున్నది. వేసిన తాళములు గూడ చాల పాతవిగ కనపడుచున్నవి. చాల సంవత్సరముల నుండి పరబ్రహ్మశాస్త్రిగారి నివాస గృహము వాడబడుట లేదని తెలిసినది. శాస్త్రిగారి సన్నిహితులైన దక్షిణామూర్తి

గారింటికి సిద్ధార్థుడు వెళ్ళినాడు. ముఖద్వారమును తట్టి నిలబడెను. లోనుండి దక్షిణామూర్తిగారు ద్వారము తెరచి వచ్చిన సిద్ధార్థుని చూచిరి. మొదట ఆయన గుర్తు పట్టలేదు. పరికించి చూచిన వెనుక సిద్ధార్థుడని తెలిసినది. ఆశ్చర్యపడచు యిట్లనెను.

“సిద్ధూ! ఏమి ఇటు వచ్చితివి? నీ ఆత్మాన్వేషణ నిన్ను ఇంటి దారి పట్టించినదా? నీ ముఖవర్చస్సు నీవింకను అన్వేషణముననే యున్నట్లు తెలుపుచున్నది. నీ వొకనాడు తిరిగివత్తువనే నేను భావించు చుంటిని. నే ననుకున్నట్లే నీవు వచ్చితివి. కాని నే ననుకున్న దానికన్న ఆలస్యముగ వచ్చితివి.”

“నా తల్లిదండ్రు లేమైనారు? తీర్థయాత్రలకు చనినారా? మా ఇంటి వైఖరిని చూచినచో వారి యాత్ర దీర్ఘకాల యాత్రగ కనిపించు చున్నది.” అని సిద్ధార్థుడు పలికెను.

“చాల దూరప్రయాణము చేసి వచ్చిన ట్లగుపిస్తున్నావు. విశ్రాంతి గొనుము. అన్నియును తెలిపెదను” అని దక్షిణామూర్తి గారు పలికిరి.

సిద్ధార్థుడు ఇంటి వెనుక భాగమున స్నానాదికములు గావించు కొని, ఉతికిన దుస్తులు ధరించి, మరల ముందు వసారాలో గూర్చుండెను. దక్షిణామూర్తి గారది పరికించి “శమనులు గృహ ప్రవేశము చెయ్యరు కాబోలు! మా యింట ఆహారపానీయములు స్వీకరింతువా? అదియును నిషిద్ధమేనా?” అని పలికిరి.

*సిద్ధార్థుడు :* “నిషిద్ధము లేమియు లేవు. నియమములు

కూడ ఏమియు లేవు. మీరు గ్రహించినట్లే నేనింకను అన్వేషకుడనే. అన్వేషణ మలుపు తిరిగినది. అందులకే యిటు వచ్చితిని."

*దక్షిణామూర్తి :* "ఇప్పుడు శమనుల మార్గము నుండి మరేదైన మార్గమున చేరితివా! నీ మిత్రుడు, నీకు ప్రోద్బల మిచ్చినవాడు, నీ సహాధ్యాయి అగు గోవిందు డేమైనాడు. అతడింకను శమనుడేనా?"

*సిద్ధార్థుడు :* "గోవిందు డిపుడు శమనుడు కాదు. బౌద్ధ భిక్షకుడు. అతడు బుద్ధుని మార్గమున స్థిరపడినాడు. అన్వేషణ మచ్చటనే కొనసాగుచున్నది."

*దక్షిణామూర్తి :* "అయినచో ఇపుడు నీ మార్గమేమి?"

*సిద్ధార్థుడు :* "నే నింకను అన్వేషకుడనే, ఏ మార్గమునను స్థిరపడలేదు."

*దక్షిణామూర్తి :* "స్థిరపడకపోవుటకు కారణము ఏ మార్గమూ నచ్చకపోవుటయా? ఏదియు నచ్చకపోవుట మనో అస్వస్థత యేమో? అయినను నాకెందులకు? నీ వన్నియు తెలిసియే చేయుదువు కదా!"

*సిద్ధార్థుడు :* "తెలిసియే చేయుచుంటి ననుకొంటిని. చేయు చున్నకొలది, తెలియనివి చాల యున్నవని తెలియుచున్నది. ఇపుడిపుడే నాకేమీ తెలియదని తెలియుచున్నది."

*దక్షిణామూర్తి :* "ఏమీ తెలియదని తెలియుట సరియగు మార్గమే. అనగా అహంకారము కరగుచున్నదన్నమాట! తెలియని వారే తెలిసినట్లు భావించు చుందురు, తెలిసినవారు వూరకుందురు.

వారికి భావములు కూడ యూరవు. కేవల ముండుటయే యుండును. ఊరకుండుట సత్త్వగుణుని సహజ లక్షణము.''

*సిద్ధార్థుడు :* "నాకు మొదటి నుండియు ఊట ఎక్కువ, భావములు గుంపులు గుంపులుగ నిర్విరామముగ వచ్చుచునే యుండును. ఇప్పుడిప్పుడే కొంత వేగము తగ్గుచున్నది.''

"ఇంతకును నా తల్లిదండ్రు లెటుపోయినారు? వారెపుడు తిరిగి వత్తురు?''

*దక్షిణామూర్తి :* "అన్నియును తెలిపెదను. నీవు గృహము నకు తిరిగివచ్చుటలోని అంతరార్థము కూడ తెలుపుము. ఇష్టము లేకున్నచో మాత్రము బలవంతము లేదు.''

*సిద్ధార్థుడు :* "ఇష్టము లేకుండుట కేమియును లేదు. మా తండ్రిగారు తెలిసిన వారని నే నెప్పుడును నమ్మితిని. వారు నా స్వతంత్రమున కెప్పుడును అడ్డురాలేదు. కేవలము తండ్రియే కాక, నాకు మంచి స్నేహితులు కూడ. వారి నుండి కొన్ని సమాధానములు పొందుటకు వచ్చితిని. మీరును పితృ సమానులే. కనుకనే మీ దగ్గరకు వచ్చితిని. ఎంత సాధన చేసినను, తపస్సు గావించినను స్వభావము నందలి కొన్ని వాసనలు తొలగుట లేదు. వానిని చాలమార్లు అణగద్రొక్కినను మరల మొలకలు వేయుచు తపస్సున కడ్డువచ్చుచునే యున్నవి. జయించుట, దమించుట, సాధించుట అను పద్ధతులు కొంతవరకే ఉపయుక్తములని తెలిసినది. ఇది రజోగుణ ప్రవృత్తి యగుటచే, పరిష్కారము లభ్యము కాదని కూడ తెలిసినది. సత్త్వమున నిలచి మైత్రీభావముచే పరిష్కరించు

కొనుటయే శ్రేష్ఠ మనిపించినది. జీవుడు, స్వభావము, పురుష ప్రకృతులవలె అవిభాజ్యములు గనుక నా స్వభావమును నే నణచుటలో పరిష్కారము లేదని తెలిసి, దానిని కొంత మన్నించి మైత్రీభావ మేర్పరచుకొని ముందుకు సాగవలెనని, తండ్రి గారిని సంప్రదించి నా అన్వేషణలో భాగముగనే గృహస్థాశ్రమము స్వీకరించవలెనని భావించి యిటు వచ్చితిని."

*దక్షిణామూర్తి :* "చాల సంతోషము, నీ బండి ఇప్పుడు గాడిన పడినదన్నమాట. కాని దైవలీల విచిత్రముగ నున్నది. నీవు సత్త్వ గుణమున చేరి సాధన సాగించు సంకల్పము పొందుసరికి నీ తల్లిదండ్రులు నిష్క్రమించినారు. నీ తల్లి పార్వతమ్మ మూడు సంవత్సరముల క్రితము వైశాఖ పూర్ణిమ శుభఘడియలలో, మీ తండ్రిగారి యొడిలో అనాయాసముగ ప్రాణములు వదలినది. ఆమె యంతటి పుణ్యమూర్తి, సుశీల, తరచు సంఘమున కనబడదు. ఆమె ముమ్మూర్తుల భారత స్త్రీ, సాధుమూర్తి, స్త్రీ మూర్తి, సాక్షాత్తు పార్వతీదేవియే అను భావము మా అందరి హృదయముల స్థిరపడినది. మీ తండ్రిగారు సంవత్సరము పాటు శ్రద్ధాభక్తులతో ఇచ్చటనే యుండి పార్వతమ్మ గారికి శ్రాద్ధక్రియలు నిర్వర్తింపజేసి రెండు సంవత్సరముల క్రితము ఇల్లు వదలినారు. హిమాలయముల కేగి, బ్రహ్మకపాలమున ఆత్మపిండము వేసుకొని, అటుపైన తపస్సు గావించుకొందునని, తనకు ఇక కర్తవ్యము లేమియు లేవని తెలుపుచు నాకొక కర్తవ్యము నందించినారు. వారి దృష్టిలో నీవు సత్యాన్వేషకుడవు. అన్వేషణమున నీవు మరల యింటికి వత్తువని వారి నమ్మకము. అందుచే ఇంటికి తాళము వేసి, తాళము చెవి నా కప్పగించినారు. ఈ రెండు సంవత్సరములలో నే నొకమారు

కూడ యింటి తాళము తీయలేదు. నీవు వత్తువని, నీవే స్వయముగ ముఖద్వారము తెరచి ప్రవేశింతువని వేచియున్నాను. పరబ్రహ్మ శాస్త్రిగారు సిద్ధ సంకల్పులు. వారనుకున్నట్లే నీవు వచ్చితివి. ఇదిగో తాళముచెవి. ఈ పూట కిచట భుజించి నీ గృహప్రవేశము చేయుము. నీ భోజన సదుపాయ మిచటనే యుండును. మన్నింతు వని భావించుచున్నాను."

సిద్ధార్థుని కన్నులశ్రుపూరితములైనవి. తాను మూర్ఖుడేకాదు, దురదృష్టవంతుడు కూడ అని భావించెను. పెన్నిధిని విసర్జించి దరిద్రుడైన వెనుక మరల విసర్జించిన పెన్నిధి విలువ తెలిసి తిరిగి వచ్చుసరికి పెన్నిధి అదృశ్యమైనది. దక్షిణామూర్తిగా రన్నట్లు అంతయు దైవలీల కాదు, తన మూర్ఖత్వము. మూర్ఖుడైన తనకు ఎవరు దారి చూపగలరు. తాను తెలిసీ తెలియని మూర్ఖుడు. అది తెలిసి తండ్రిగారు తమ కెంత కష్టమైనను, దుఃఖపూరితమైనను తన మాటను మన్నించిరి. మూర్ఖునికి తాను మూర్ఖుడనని తెలియదు కదా! తన కిపుడు మూర్ఖుడని తెలియుసరికి ఆలస్యమైనది. మాతా పిత పాదసేవకు నా కర్హత లేదన్నట్లు ప్రకృతి తనపట్ల వికృతియై నిలచినది. అతడు దక్షిణామూర్తిగారితో "ఒకసారి గృహమున కేగి అంతయు పరికించి మరల వచ్చి భుజింతును" అని పలికెను.

సిద్ధార్థు డింటి దారి పట్టి ముఖద్వారము తెరచి లోపలికేగెను. పూర్వ స్మృతులన్నియు ఒక్కసారి మీద పడినట్లయ్యెను.

స్వగృహమున ప్రవేశించిన సిద్ధార్థునకు తల్లిదండ్రులు, వారి కార్యక్రమములు ఒక్కమారుగ జ్ఞప్తికి వచ్చి మనస్సు ఉక్కిరి బిక్కిరియై తగుమాత్రము భావోద్వేగము కలిగినది. తల్లిదండ్రులు

విశ్రాంతిగొను పడకగది ప్రవేశించి నమస్కారము చేసుకొనెను. అటుపైన తన విశ్రాంతి గది యందు ప్రవేశించి అచటనంతను పరికించినాడు. తన వస్తువు లన్నియు యథాతథముగ నచ్చటనే యున్నవి. తాను ఇల్లు విడిచిన తరువాత తొమ్మిది సంవత్సరములు తల్లిదండ్రు లచ్చటనే జీవించి యుండిరి. గది అమరికను చూచి తల్లి గుర్తుకు వచ్చి ఒక్కమారు హృదయము పొంగినది. కన్నుల వెంట నీరు వచ్చినది.

తాను స్వార్థపరుడు. తన ఆత్మసాధన మంతయు కరడుగట్టిన స్వార్థమే. తన తల్లి త్యాగమూర్తి, ఆమె మమకారమును గూడ నా స్వార్థపూరిత ఆశయమునకు బలి చేసినది. తనమీద ఎన్నియో ఆశలు పెట్టుకొని యుండవచ్చును. అవి అన్నియు వమ్ముచేసి ఆమె బాధను కూడ లెక్కచెయ్యక, తానేదో సాధించవలెనని ముందుకు సాగినాడు. తాను స్వహితము చూసుకొనినాడు. ఆమె నా హితము కొరకు తన హితమును త్యాగము చేసినది. మరల తల్లిదండ్రుల విశ్రాంతి గదిలోనికి ప్రవేశము చేసి నమస్కరించి, కొంత ఉపశమనము నొందినాడు.

ప్రతినిత్యము తన తండ్రి అగ్నికార్యము చేయుచుండెడివాడు. ఇపుడా అగ్నికుండము నిర్జీవముగ కనపడినది. అటుపైన పూజా వేదిక యుండు విశాలమగు గదిలోనికి ప్రవేశించినాడు. శివ లింగము, సాలగ్రామములు, ఇతర దేవతా ప్రతిమలు పూజ పునస్కారము లేక ఎవరికొరకో ఎదురు చూచు చున్నట్లున్నది. ఇల్లంతయు పరికించి చూచి సిద్ధార్థుడు భోజనమునకై దక్షిణామూర్తి గారింటికి బయలుదేరెను. భోజనము మౌనముగ సాగినది. తాను

రాత్రి భుజింపనని మరల మధ్యాహ్నమే భోజనమునకు వత్తునని, తన ఏకభుక్త నియమమును తెలిపి సిద్ధార్థుడు దక్షిణామూర్తి దంపతి అనుమతి కోరెను. దక్షిణామూర్తిగారు అటులనే కానిమ్మనుచు ధనముతో కూడిన యొక సంచిని సిద్ధార్థుని చేతి కందించుచు "నీవు వచ్చినపుడు నీకిమ్మని, శాస్త్రిగారు నావద్ద నుంచిన పైకమిది. నీవు యథేచ్ఛగ వాడుకొనుము. ఈ ధనమునకు, ఆ గృహమునకు నీవే సర్వాధికారివి" అని తెలిపిరి. సిద్ధార్థుడు ధన సంచిని అందుకొని మౌనముగ స్వగృహమునకు సాగెను.

ఒక వారము రోజులలో సిద్ధార్థుడు తానే స్వయముగ గృహమును శుభ్రపరచినాడు. ఇంటియందు సుగంధ ద్రవ్యములను, అగరువత్తులను వినియోగించి సువాసనలను స్థిరపరచినాడు. పెరటియందు గల మామిడి యాకులతో ద్వారములకు మకర తోరణము లేర్పరచినాడు. గ్రామము నందలి పుష్పవాటిక కేగి పుష్పములను తెచ్చి పూజావేదిక నలంకరించినాడు. ధూప, దీప, నైవేద్యములను ఏర్పరచినాడు. తన శక్తి మేరకు గృహమునకు పూర్వవైభవము కలుగుటకు ప్రయత్నించినాడు. రాత్రి సమయములో హోమగుండము నందు అగ్ని రగిల్చి తన తదుపరి కర్తవ్యము గూర్చి ఆలోచింపసాగినాడు.

ఒకనాడు భోజన సమయమున, దక్షిణామూర్తిగారి నుద్దేశించి సిద్ధార్థుడిట్లు పలికెను :

"నేను తిరిగి వత్తునని మా తండ్రిగారు దృఢాభిప్రాయము కలిగియుండెడి వారని మీరు తెలిపితిరి. అట్లు తిరిగివచ్చిన నాకు తదుపరి కర్తవ్యమేమో తెలుపమని మీకేమైన తెలిపిరా?"

*దక్షిణామూర్తి :* ‘‘లేదు. ఉత్సుకతతో నేనే అడిగితిని. కాని వారేమీ తెలుపలేదు. నీవు సర్వస్వతంత్రుడవని, నీకై నీవు నిర్ణయించుకొన్నదే నీ వనుసరింతువని, నీకు మార్గదర్శకత్వము వహించ వలసిన కర్తవ్యము దైవము తన కేర్పరచినట్లు లేదని మాత్రము తెలిపినారు.’’

సిద్ధార్థుడు చిన్నబోవుచు తన గృహమున కేగెను. తండ్రి మాటలు దక్షిణామూర్తిగారి ద్వారా విని మరల ఎడతెరపిలేని భావ పరంపరలకు లోనయ్యెను. తనను కన్న తండ్రి సర్వజ్ఞుడు, తనకు బ్రహ్మోపదేశము చేసినవాడు, తనయం దత్యంత ప్రేమానురాగ ములు కలవాడు. తా నాయనను ఎన్నడూ మార్గదర్శకత్వము వహింపుడని కోరలేదు. తన నిర్ణయములే ఆయనకు తెలుపు చుండెడివాడు. ఆయన తనను మన్నించి అంగీకరించు చుండెడి వాడు. నియమము తప్పని తండ్రిగారి నిశ్చలత్వము సిద్ధార్థుని నిర్ఘాంతునిగ చేసెను.

సిద్ధార్థుడు క్రమముగ గ్రామమున సంచరించుట మొదలిడెను. అతడు వీధుల వెంట తిరుగుచుండగ ప్రజల గుసగుసలు తన చెవుల బడుచుండెడివి. నిర్లిప్తుడై వాటిని వినుచుండెడివాడు. గ్రామస్తుల భాషణము లిట్లుండెడివి.

“ఉద్ధారకుడు తిరిగి వచ్చినాడు. ఏదియో ఉద్ధరింతునని, సాధింతునని దైవ సమానులైన తల్లిదండ్రులను విడిచి వెళ్ళిన స్వార్థపరుడు.”

“తల్లిదండ్రులను దుఃఖపెట్టినవాడు ఏమి సాధించగలడు?”

"స్వాతంత్ర్యము, స్వాతంత్ర్యము అనుచు బాధ్యతలను వదలిపెట్టు మూర్ఖులు పరలోకమునందే కాదు, ఇహలోకము నందు కూడ వ్యర్థులే."

"పరబ్రహ్మశాస్త్రిగారి వంశము సర్వోత్కృష్టమై ఇతరులకు ఆదర్శప్రాయముగ చాల తరములనుండి నిలచియున్నది. అట్టి యింట ఇట్టి నాస్తికుడు పుట్టుట విచిత్రము. అంతయును దైవలీల!"

"తండ్రికి తగిన కొడు కనుకొంటిమి. పూవు పుట్టి పరిమ ళించులోపల పురుగు పట్టినట్లైనది."

"తల్లిదండ్రు లవసర మీతనికి లేదు. కాని వారిచ్చిన ఆస్తి పాస్తులు మాత్రము కావలెను. సద్వంశమున యిట్టి పోకడలు కలి ప్రభావమే గాని మరియొకటి కాదు."

"ఇతడీ గ్రామమున నే కార్యములు చేసినను మనము పోనవసరము లేదు. ఇతడు చేసినది నికృష్టమగు పని."

"తల్లిదండ్రు లున్నప్పుడు వచ్చినచో వారు కొంత సంతోషించెడి వారు. వారిని నిరాశ పరచి ఇప్పుడాశగ వారి కొరకు వచ్చినాడు. ఇతడేమి చేయునో చూతము."

ప్రతిదినము గ్రామవీధులలో సిద్ధార్థుడు యిట్టి మాటలు వినుటకే సంచరించెడివాడు. సంఘము పలుకు పలుకులను వినుట వలన అతని హృదయమున ఎట్టి తాపము కలుగలేదు. వారు తనను గూర్చి అట్లు తలచుట సహజమని భావించెను. తన తదుపరి కర్తవ్యమే తనకింకను బోధపడవలెను. లోకుల మాటలు తన నెన్నడునూ ప్రభావితము చేయలేదు.

రాత్రి సమయమున అగ్నిజ్వాలను చూచుచు సిద్ధార్థుడు తదుపరి కర్తవ్య స్ఫురణకై వేచియుండెను. ఒక అమావాస్య రాత్రి అగ్నిజ్వాలను చూచుచు ఆసీనుడై యున్న సిద్ధార్థునకు స్ఫూర్తివంత మగు భావము కలిగినది. అతని ముఖము వికసించినది. తెల్లవారు వరకు తృప్తిగ విశ్రమించినాడు. మరునా డుదయము సంవత్సరాది. అభ్యంగన స్నానము గావించి ధ్యానాదికములు పూర్తిచేసుకొని దక్షిణామూర్తి గారింటికి చని ఇట్లనెను: నేడు 'ఉగాది'. నూతన సంవత్సరారంభము. నేనొక నూతన కార్యమును తలపెట్టినాను. మీరు నాపై దయతో సాయంకాలము ఐదు గంటలకు నాన్నగారికి సన్నిహితులు, మీకు మిత్రులు అయిన వారిని నాన్నగారింటికి ఆహ్వానించుడు. నేను తలపెట్టిన కార్యము, మీ పెద్దలందరకు తెలిపి, అట్లు నిర్వర్తింతును. దక్షిణామూర్తిగారట్లే యనిరి.

సాయంకాలము ఐదు గంటల సమయమునకు, దక్షిణా మూర్తి గారు తనతోపాటు మరి ఆరుగురు సంస్కారవంతులగు శాస్త్రిగారి సన్నిహితులను తోడ్కొని వచ్చినారు. అందరికిని ఆసనములు చూపించి, ఆసీనులను గావించి, చల్లని పానీయమిచ్చి నమస్కరించి, సిద్ధార్థు డిట్లనెను.

"పెద్దలకు నమస్కారము. మీరందరు నాకు పితృసమానులే. సంఘమున కీర్తిప్రతిష్ఠలు, గౌరవము కలవారు. అన్నింటికిని మించి మా తండ్రిగారికి సన్నిహితులు. వారు కర్తవ్యానుసారముగ ఈ గృహమును నాకు సంక్రమింప జేసినారు. ఈ గృహము వారి జీవిత కాలమున వేదపఠనముతోను, క్రతువులతోను, పూజాభిషేక ములతోను, అగ్నిహోత్రముతోను, ఇతిహాస పురాణ బోధనలతోను,

అన్నదానములతోను దివ్యారామమై యుండెడిది. గత రెండు సంవత్సరములుగ అట్టి కార్యము లిచ్చట జరుగుట లేదు. కారణము నేనే అని నాకు తెలియును. నాన్నగారి పూర్వవైభవము పునః ప్రారంభమై ఈ గృహము చిరకాలము వారి సంస్మరణమున నిలచి యుండవలెను. అందుకు మీరందరు సమర్థులు. నాన్నగారిపై మీకు గల ప్రేమాభిమానము లాధారముగ నేను మీకీ విన్నపము గావించు చున్నాను.

సిద్ధార్థుని మాటలకు గ్రామ పెద్ద లందరూ మౌనగంభీరులైరి. సిద్ధార్థుని యందు వారికి గల ప్రతికూలత అదృశ్యమైనది. తండ్రికి తగిన తనయుడన్న భావము ఏర్పడినది. అతనియందు వాత్సల్యబుద్ధి ఏర్పడినది. అందరి మౌనమును భంగపరచుచు దక్షిణామూర్తిగా రిట్లనిరి. “ఉన్నదంతయు సంఘ సేవకు సమర్పించి నీవేమి చేయుదువు?” అని సిద్ధార్థుని ప్రశ్నించిరి.

సిద్ధార్థుడిట్లనెను : “మీకు హాస్యముగ నుండవచ్చును. కాని మొదటినుండియు నా బుద్ధి ఆత్మాన్వేషణమునకై పరితపించినది. నే నిప్పటికిని అన్వేషణయందే యున్నాను. తప్పక నా అన్వేషణ ఫలితము నీయగలదని దృఢ నమ్మకముతో యున్నాను. సర్వజ్ఞులైన మా తండ్రిగారు నన్ను సార్థక నామధేయునిగ ఆశీర్వదించిరి. నే నిచ్చటకు వచ్చుట కూడ అన్వేషణలోని భాగమే. కుటుంబపరమగు ఈ ఆస్తి తాతలనాటి ఆస్తి. మా తండ్రిగారికి కూడ అది పిత్రార్జితమే. నిజమునకు వారే సర్వాధికారి అయినను హిందూ ధర్మశాస్త్రము ననుసరించి వారిది కాదని భావించి, ఈ ఆస్తిపై హక్కులు వారి తదనంతరము నాకు చెందునని దలచి ఈ ఆస్తి భవిష్యత్తును,

మౌనముగ నాకే వదలినారు. అది వారి విజ్ఞత. నాకును ఆస్తిపాస్తులపై ఆకర్షణ లేదు. ఆవశ్యకతను లేదు. మూడు తరములుగ ఈ నివాసము సనాతన ధర్మ కార్యక్రమములకు అంకితమై యున్నది. నాకు వారసులు లేరు. అందుచే పెద్దలైన మీ కప్పగించి పుణ్య కార్యములు నిర్వర్తింపచేయుట నా కర్తవ్యముగ నిశ్చయించినాను. ఈ ఆలోచనయందు ఆవేశము లేదు."

వచ్చిన పెద్దలలో ఒకరైన జగన్నాథశాస్త్రిగా రిట్లనిరి : "నీ విచ్చటనే యుండి ఈ ధర్మ కార్యములు నిర్వర్తించుచు నీ అన్వేషణ కొనసాగించ వచ్చును గదా! దైవమంతటా గలడు. ఎచ్చటనో వెదుకనేల? అప్పుడు మేమందరము సంతోషింతుము. నీ అభివృద్ధిని చూచుచు ఆనందింతుము. మా అందరి హృదయములందు నీపై పుత్రవాత్సల్యము కలదు. నిన్ను చూచినపుడెల్ల మా కాప్తులు, ప్రాణమిత్రులు యగు నీ తండ్రిగారు కనిపించుచుందురు. మా కొరకైనను నిచ్చట వుండవచ్చును కదా!"

ఇంతలో దీక్షితులు ఇట్లనిరి : "అతనిని బలవంత పెట్టకుడు. పరబ్రహ్మశాస్త్రిగారు సిద్ధార్థుని గూర్చి నాకంతయు తెలిపినారు. అతడు బాగా ఆలోచించియే మాట్లాడును. లోపలనే ఆలోచన యంతయు పూర్తి చేసుకొని దృఢమైన నిర్ణయమును మాత్రమే బహిరంగముగ తెలుపును. అది అతని జీవలక్షణము. ఇచ్చటనే యుండి సర్వమును నిర్వహించుకొనుచు, అన్వేషించుట ఇతని వంతు కాదని శాస్త్రిగారు ప్రసంగవశమున నాకు తెలిపినారు." ఇతడుండుట మనకందరి కిష్టమే. "సిద్ధూ! నీ వున్నచో మా కానందమని తెలుపుట సత్యము. అయినను నీ అన్వేషణ లక్షణమును బట్టి స్వయముగ నిర్ణయించి తెలుపుము."

సిద్ధార్థుడిట్లనెను: "ఈ రోజు నుండి జరుగు వసంత నవరాత్రి ఉత్సవములలో పాల్గొని మీ పెద్దలందరూ నిర్వర్తించు సీతా కళ్యాణ మహోత్సవమును సందర్శించి, మీ అందరి ఆశీర్వచనమును పొంది తిరిగిరాని మార్గమున ముందుకు సాగుదును. నవరాత్రి ఉత్సవములను ఇచ్చటనే, ఈ గృహమందే జరిపింపుడు. హోమములు, అభిషేకములు, పూజలు, పారాయణలు, ప్రసంగములు ఇచ్చటనే జరుపుడు. గ్రామస్తులు అందరిని ఆహ్వానించి భోజనాదికములను ఏర్పాటు చేయుదము. నవమినాడు అందరికిని వస్త్రదానము గావించెదము. మీ అనుచరుడుగ పగలు, రాత్రి అన్ని పనులయందు నన్ను వినియోగింపుడు. ఇదిగో, తండ్రిగారు దక్షిణామూర్తిగారి వద్ద నుంచిన ధనము. దీనిని వెచ్చింపుడు. తండ్రిగారి యందు మీకు గల మైత్రీ భావమును పురస్కరించుకొని అన్ని దైవకార్యములు ఇచటనే నిర్వర్తించుచు పుణ్యక్షేత్రముగ ఈ నివాసమును మలచుడు. ఇది నా ప్రార్థన."

సిద్ధార్థుడు పై విధముగ పలికి అందరికిని పాద నమస్కారము చేసెను. అందరి హృదయముల యందు సిద్ధార్థుని కోరిక సమ్మతింప బడినది. పెద్దలలో ఒక రిట్లనిరి: "మీ తండ్రిగారి యందు మాకు గల భావము గురుభావము. వారు మా యందు చూపినది వాత్సల్యపూరిత మైత్రీభావము. ఇది సద్గురువాశ్రమముగనే అన్ని కార్యములు నిర్వర్తింతుము. పర్వదినములలో సంతర్పణములు, సంవత్సరమున కొకమారు వస్త్ర ప్రదానము కూడ చేయుదుము. నీ సంకల్పము శాస్త్రిగారి సంకల్పముగనే భావించి నిర్వర్తింతుము."

ఉగాది సాయంత్రము నుండే సిద్ధార్థుని అభ్యర్థన మేరకు దక్షిణామూర్తిగారు సాయంకాలము ఆరుగంటలకు ప్రార్థనాదికములు గావించి శ్రీమద్రామాయణమందలి 'శ్రీరామ జనన ఘట్టమును' ప్రసంగించినారు. రామాయణ ప్రసంగములు జరుగుచున్నవని తెలిసి గ్రామస్తులు కొందరు కార్యక్రమమున పాల్గొనినారు. మరునాటినుండి శ్రీరామ నవమి వరకును కార్యక్రమములు ముమ్మరముగ సాగినవి.

ప్రతిరోజూ ఉదయం 4 నుండి 4–30 గంటల వరకు నాద స్వరము, మంగళ వాయిద్యములు మోగినవి. 4–30 నుండి 6 గంటల వరకు వేదఘోష జరిగినది. 6 గంటల నుండి శ్రీరాముని, శ్రీ మహా విష్ణువుగా ఆవాహన గావించి, పురుషసూక్త విధానమున షోడశోపచార పూజలు జరిగినవి. పూజలో భాగముగ శ్రీ, పురుష సూక్తములు, విష్ణుసూక్తములతో లక్ష్మీ నారాయణులకు అభిషేకము జరిపిరి. ఈ కార్యక్రమమును దక్షిణామూర్తిగారు నిర్వర్తించగ తదుపరి దీక్షితులుగారు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము గావించిరి. అటుపైన అందరికిని భోజన ఏర్పాట్లు జరిగెను. మరల సాయంకాలము 4 నుండి 6 గంటల వరకు భజన, సంకీర్తన, సంగీత కచేరీలు జరిగినవి. సాయంకాలము లఘు ప్రార్థనతో రామాయణ ప్రసంగము జరిగినది.

ఇట్లు తొమ్మిది రోజుల కార్యక్రమము స్ఫూర్తివంతముగను, భక్తియుతముగను ఊరి పెద్దలు నిర్వహించగ, సిద్ధార్థుడు అహర్నిశలు సమస్త కార్యములయందు సహకరించుచు, తలలో నాలుకవలె మెలగినాడు. అతని భక్తి, వినయము, ఏకాగ్రత,

అప్రమత్తత, నిద్రను కూడ నిర్జించి కృషిచేయు తీరు పెద్దల కాశ్చర్యము, ఆనందముకూడ కలిగించినది. భోజన సమయములో అందరునూ భుజించిన పిదపనే తాను క్లుప్తముగ భుజించెడివాడు.

చైత్రశుద్ధ సప్తమి నాటికి సిద్ధార్థుడు తెలిపిన ఆశయముల మేరకు జగన్నాథశాస్త్రిగారు ధర్మ సంస్థకు వలసిన దస్తావేజులను సమకూర్చినారు. వాటిపై సిద్ధార్థుడు సాక్షుల సమక్షమున సంతకము గావించి, ధర్మకర్త లందరికి నమస్కరించి దక్షిణామూర్తిగారి చేతికందించెను.

నవమినాడు సీతారామ కళ్యాణమును గ్రామ ప్రజల శ్రేయస్సు నుద్దేశించి నిర్వర్తించినారు. దిన దినమునకు కార్యక్రమమున పాల్గొను భక్తుల సంఖ్య పెరిగి సీతాకళ్యాణ సమయమునకు పరబ్రహ్మశాస్త్రిగారి గృహ ప్రాంగణమంతయు కళకళలాడినది. ఆనాటి రాత్రి సత్యహరిశ్చంద్రుని నాటకముతో కార్యక్రమములు పరిసమాప్తి చెందినవి.

మరునాడు దశమి ఆదివారము, బ్రాహ్మీ ముహూర్త సమయమున ధనిష్ఠా తారకలు మిల మిల మెరయుచుండగ సిద్ధార్థుడు స్నానాదికముల నాచరించి పూజావేదికకు ఉన్ముఖుడై తల్లిదండ్రులను స్మరించి ముహూర్తకాలము ధ్యానించెను. అటుపైన చిటాలున లేచి దక్షిణామూర్తిగారి గృహమున కేగెను. దక్షిణామూర్తిగా రప్పటికే శుచియై వేద పారాయణము చేయుచుండిరి. సిద్ధార్థుడు ఉన్ముఖుడై నిలబడగ, దక్షిణామూర్తిగారు తలయెత్తి ప్రశ్నార్థకముగ చూచిరి. సిద్ధార్థు డిట్లనెను.

"నేను వచ్చిన పని అయినది. నా మార్గము ననుసరించి, నేను పురోగమించు చున్నాను. మీకును, యితర పెద్దలకును నా హృదయపూర్వక నమస్కారములు. మీరందరును నా ప్రార్థనను మన్నించి ధర్మకర్తలై నిలచి నా తల్లిదండ్రులను చిరస్మరణీయులుగ, ప్రాతఃస్మరణీయులుగ రూపొందించగలరు. నే నందులకు సదా కృతజ్ఞుడను. సూర్యుడుదయించక మునుపే గ్రామము పొలిమేరలు దాటుట నా నిర్ణయము. కృతార్థుడ నగునట్లు ఆశీర్వదింపు డనుచు పాద నమస్కారము గావించెను.

దక్షిణామూర్తిగారు కృతనిశ్చయుడై యున్న సిద్ధార్థుని చూచి, ఆలింగనము గావించి కన్నులు చమర్చుచుండగ, గద్గద స్వరముతో నిట్లనిరి : "నీ నామము సిద్ధార్థుడు. అది నీ తండ్రి సంకల్పము. సార్థక నామధేయుడవై పరితృప్తి చెందుము. దైవము నిన్ను చల్లగ చూడగలడు." అని పలికిరి.

# 5

సిద్ధార్థుడు స్వగ్రామమును వదలి ప్రాతః కాలముననే అనిర్దిష్టమగు ప్రయాణమును కాలినడకన సాగించెను. సూర్యోదయ మగుసరికి గ్రామము పొలిమేరను దాటి ఆమడ (8 మైళ్ళు) దూరమేగెను. తన కర్తవ్యమిపుడు తాను దమించిన స్వభావముతో మిత్రత్వము సంపాదించుట. **స్వభావము, మనస్సు, ఇంద్రియములు, శరీరము నంటిపెట్టుకొని యుండును. తాను జీవుడుగ దైవము యొక్క ప్రతిరూపముగ నుండు శాశ్వతమైనటువంటి వెలుగు. తన వెలుగు ప్రకాశమే తన బుద్ధి.** తన బుద్ధికిని, తన మనస్సు నంటియున్న స్వభావమునకును మైత్రిని సాధించి తాను ఆత్మానుభూతి పొందుట పెద్ద లందించిన మార్గము. స్వభావమును దమించి లాభము లేదని తనకు తేటతెల్లమగుటచే స్వభావముతో మైత్రిని కోరుకున్నాడు. గుఱ్ఱమునకు తగినంత ఆహారమునిచ్చి, దానిని లాలించి, ప్రేమించి, మైత్రీభావనను సంపాదించి పాలించుట రౌతు చేయవలసిన పని. అంతియే కాని మూర్ఖత్వముతో గుఱ్ఱము నెండగట్టినచో, అది నీరసించును. అట్టి నీరసించిన గుఱ్ఱమును

దమించుటకు ప్రయత్నించినచో అది తిరగబడును. గుఱ్ఱమునకు తిక్క పుట్టినచో రౌతు నెక్కనీయదు. ఒకవేళ దమించి ఎక్కినను, గెంతుచు క్రింద పడవేయును. రౌతు యుద్దేశించిన ప్రయాణము మాత్రము సాగదు.

పంచప్రాణములతో కూడిన శరీరము గుఱ్ఱము వంటిది. లాలించి పాలించవలెనే గాని కేవలము పాలించుటకు ఒప్పుకొనదు. భరతదేశమున పెద్ద లందరును, దేహమును వివిధ జంతు వాహనములతో పోల్చిరి. దేహమును గోవుతో కూడ ఋషులు పోల్చిరి. దేహమనగా మనస్సు, ఇంద్రియములు, శరీరము యొక్క సమూహముగ నిర్వచించిరి. గోవును ప్రేమతో పోషించి, లాలించి నచో క్షీరములను స్రవించును. లేనిచో గోపాలకుని కూడ తన్నును. అట్లే శరీరము కూడ. శరీరమును ద్వేషించుట తగనిపని. మానవ శరీరము సామాన్యగోవు కాదు. అది కామధేనువు. దానియందు గోవువలె స్రవించు లక్షణము కలదు. షట్చక్రములతో అనుసంధా నము చెంది షట్గ్రంథు లుండును. ఈ గ్రంథులు స్రవించునపుడు దేహమున వశించు జీవునకు ఇహపరానుభూతి కలుగును. ఊర్ధ్వమగు మూడు కేంద్రములు స్రవించునపుడు దివ్యానుభూతి, అథస్సున గల మూడు చక్రములు స్రవించునపుడు లోకానుభూతి, జీవుడు ఈ శరీరమునందే పొందగలడు. విశుద్ధి స్రవించునపుడు కామ ధేనువువలె సర్వమును అనుభూతిని చెందగలడు. ఇంద్రగ్రంథి స్రవించునపుడు ఆత్మానుభూతిని పొందగలడు. హృదయగ్రంథి స్రవించునపుడు ప్రేమానుభూతిని పొందగలడు. అట్లే ఉదరవితాన మునకు దిగువ నున్న గ్రంథులు స్రవించునపుడు భావానుభూతి,

ఇంద్రియానుభూతి, భౌతిక శరీరానుభూతి పొందగలడు. అధస్సున గల గ్రంథులు దేహాత్మభావము కలిగియుండగా ఊర్ధ్వమున గల గ్రంథులు ఆత్మానుభూతిని కలిగించును. ఇట్లు శరీరమను గోవును మైత్రీ భావనతో మచ్చిక చేసుకొనవలెనని సిద్ధార్థుడు నిర్ణయించు కొనినాడు.

కాలినడకన సాగుచు దేహావసరమును బట్టి, ధర్మసత్రము లలో భుజించి విశ్రమించుచుండెను. మునుపటివలె కటిక ఉపవాసములు చేయుట మానెను. శరీరమునకు స్నానాదికములు గావించి తగు విశ్రాంతి, నిద్రల నిచ్చుచుండెను. శిరోముండనమును గావించుకొనక, పెరుగుచున్న కేశములను అలంకరించుకొనుట నేర్చెను. మండల కాలము ఇట్లు యాత్రను సాగించుచుండగ గంగా నదీ సమీపమునగల యొక పట్టణము చేరెను. ఆ పట్టణమున నివసించుటకు సంకల్పించెను. శరీరమునకు క్రమముగ జవసత్త్వ ములే గాక సౌష్టవము కలుగుట మొదలైనది.

తానిపుడు కోరుచున్నది ఆత్మానుభూతి కాదు, దేహానుభూతి. తానిపుడు కామియై చూడవలెను. కామి గానివాడు మోక్షకామి కానేరడు అను సూక్తికి అతను ప్రాధాన్య మిచ్చుటచే భోగపర జీవనమున కుద్యుక్తుడయ్యెను. భోగము తదుపరి యోగమునకు ఉపయుక్త మగునట్లుగ తగు జాగ్రత్త కలిగియుండవలెనని కూడ నిశ్చయించెను. రోగగ్రస్థ మగునట్లు భోగజీవనము గడుపరాదని, ఉత్తరోత్తర యోగమున కుపయుక్తమగు భోగము లనుభవించవలె నని సిద్ధార్థుడు భావించెను.

సిద్ధార్థుడు పట్టణమున సంచరించుచుండగ యొక స్త్రీ రూపము అతని కన్నుల నాకర్షించెను. ఆమె సర్వాంగసుందరి. ఆమె యందు సిద్ధార్థునకొక ప్రత్యేకత గోచరించినది. ఆమెను చూచిన క్షణము నుండి మరల మరల ఆమెను చూడవలె ననిపించినది. తన కట్లనిపించుట తన కాశ్చర్యము కలిగించినది. తనకు మునుపు ఎన్నడు అట్లనిపించలేదు. పట్టణములో తిరుగాడుచు తాత్కాలికముగా ధర్మసత్రములలో భుజించుచున్న సిద్ధార్థుడు తన మనస్సు నాకర్షించిన స్త్రీని ప్రతిదినము చూచుట ఒక కార్యక్రమముగ నేర్పడినది. తాను సాక్షీభూతుడుగనే తన భావములను పరికించుచు నవ్వుకొనుచుండెడి వాడు. నిర్దిష్టమగు దైనందిన కార్యక్రమము లేని సిద్ధార్థునకు ఒక నిర్దిష్ట కార్యక్రమము ఏర్పడినది. ప్రతిదినము పట్టణమున సంచరించుచు ఆమె కనబడినచో నఖశిఖ పర్యంత మామెను చూచెడివాడు. అతని మనస్సునకు ఆమె రూపసి. ఆమె కదలికలు, చూపులు, భాషణములు, అతని స్వభావమున కానందము కలిగించు చుండెడివి. స్వభావము పొందుచున్న ఆనందమును తాను గమనించుచు ఆనందించెడివాడు. పిల్లవాడు తీపి పదార్థమున కాకర్షింపబడి దానిని భుజించుచు, ఆనందించుచుండగ, దానిని చూచి ఆనందించు తల్లిదండ్రులవలె, స్వభావము పొందుచున్న ఆనందమును చూచి సిద్ధార్థుడు కూడ ఆనందము పొందుచుండెడి వాడు. తన స్వభావము తన తమ్ముడు, తాను అన్నగారు. తమ్ముడు పిల్లతనముచేత కోరిన వాటిని పెద్దరికముగ అన్నీ అందించి ఆనందించునట్లుగ సిద్ధార్థుడు ఆనందించు చుండెను.

అనుదినము రూపసియైన స్త్రీమూర్తిని చూచుచున్న సిద్ధార్థుని ఒకనా డామె కూడ చూచినది. అటుపైన కొన్ని దినములకు అతడు ప్రతిదినము తనను చూచుటకు వచ్చుచున్నట్లుగ గమనించినది. ఆమెకును అది వింతగ తోచినది. మరికొన్ని దినములు వేచి చూచినది. అతడట్లే క్రమము తప్పక దేవతా దర్శనమునకు వచ్చు భక్తునివలె కనపడుచుండుట చూచి మరింత ఆశ్చర్యపడినది. ఒక శుభదినమున ఆమె అతనిని చూచి చిరునవ్వు నవ్వినది. అతడు ప్రతిస్పందించినాడు. కొన్ని దినములట్లు సాగినది. ఒకనాడు ఆమె తన పరిచారికను సిద్ధార్థుని వద్దకు పంపి తన గృహమునకు తేనీటికై ఆహ్వానించెను. పరిచారిక సిద్ధార్థుని వద్దకు చేరి యిట్లనెను.

"మా అమ్మగారు మిమ్ములను ఆమె నివాసమునకు రమ్మని నన్ను పంపినారు. తమ నామధేయమేమి?"

*సిద్ధార్థుడు :* మీ అమ్మగారి నామధేయమేమి?

*పరిచారిక :* ఆమె నామధేయము సౌదామని. మీ నామధేయము?

*సిద్ధార్థుడు :* అందరును సిద్ధార్థుడని పిలుతురు.

*పరిచారిక :* నిజమునకు మీ నామధేయ మదికాదా?

*సిద్ధార్థుడు :* ఎవరికినీ వారి నామధేయము సత్యము కాదు. వ్యవహారమునకే నామధేయము కాని, నిజమునకు ఎవరికిని నామధేయము లేదు.

*పరిచారిక :* మీరు వేదాంతులు కాబోలు. మీ వేదాంతము నాకు తికమకగ నున్నది. ఇంతకును అమ్మగారి ఆహ్వానమునకు మీ సమాధానము?

*సిద్ధార్థుడు :* ఆహ్వానమును మన్నించుటయే నా అభిమతము. సాయంకాలము ఐదు గంటల సమయమునకు తప్పక మీ సౌదామనీ దేవి నివాసమున కేతెంతును. నాకు చిరునామా నిమ్ము సోదరీ!

పరిచారిక చిరునామా నందించి సిద్ధార్థుని అయోమయముగ చూచుచు నిష్క్రమించెను. యజమానురాలి గృహమున కేగి యిట్లని పలికెను : "అమ్మా! మీరాహ్వానించిన వ్యక్తి చాల తికమకగ యున్నాడు. పేరడిగితిని, వేదాంతము చెప్పినాడు. అతని నందరు సిద్ధార్థుడని పిలుతురట! అట్లైనచో అది మీ నామధేయము కాదా యని నే నడిగితిని. ఎవరికిని నిజమునకు నామధేయములు లేవట! కేవలము వ్యవహారమునకే నామములట! నాకు పంగనామములు పెట్టి పంపినాడు. అతని చూపులు, భాషణములు మాత్రము చాల మృదువుగను, మైత్రీభావముగను గోచరించినవి. చివరికి నన్ను సోదరీ యని సంబోధించి నాతో తన సంబంధము నిశ్చయము చేసినాడు. మీరు కోరిన విధముగ సాయంకాలము తప్పక వచ్చు నట. మీ చిరునామాను కోరి తీసుకొనినాడు. మీ పేరడిగి తెలుసు కొనినాడు. అతడేదో విచిత్ర వ్యక్తివలె గోచరించు చున్నాడు. తెలియని ఆకర్షణ ఏదో అతని యందున్నది.

సాయంకాలము సరిగా 5 గంటల సమయమునకు

సిద్ధార్థుడు సౌదామని గృహమునకేగి గంట మ్రోగించెను. ప్రహరీ గోడవద్ద నున్న ప్రవేశద్వారము వద్ద గంటల నేర్పరచుట ప్రాచీన భారతీయ సంప్రదాయము. ధనికులు, పదవులలో నున్నవారు నివాసము చుట్టును ఎత్తైన ప్రహరీలు ఏర్పరుచుకొనుట నేటికిని విదితమే. ముఖ ద్వారమున మ్రోగిన గంటనుబట్టి సేవకుడు ప్రహరీ ద్వారము తెరువగ సిద్ధార్థుడు లోనికేగెను. సింహద్వారము వద్ద సౌదామని స్వయముగ నిలబడి లోని కాహ్వానించినది. పాదరక్షలను వసారాలో వదలి సిద్ధార్థుడు లోనికేగెను.

సౌదామని గృహము, సౌదామనియే! సౌదామని యనగా సకల వైభవోపేతమని అర్థము. గృహము చాల అందముగ విశాల మైన గదులు కలిగియున్నది. ఇంటి పైకప్పు చాల ఎత్తుగా నుండి దీర్ఘము, విశాలము అగు గవాక్షములు కలిగి, గాలి, వెలుతురు పుష్కలముగ ప్రవేశించునట్లు ఏర్పాట్లు వున్నవి.

అతిథుల నాహ్వానించి, ఆసీనులను చేయు గది విశాలముగ నున్నది. విలువైన వస్తువులెన్నియో గది నలంకరించి, శోభను గూర్చుచున్నవి. తనకై నిర్దేశించిన ఆసనముపై సిద్ధార్థుడు ఆసీను డయ్యెను. సౌదామనిని చూచి మందస్మితము చేయుచు పలుక రించెను. సౌదామని కూడ మందస్మితయై ఉన్ముఖముగ నొక ఆసనము గొనెను. సంభాషణ మిట్లు సాగెను.

*సౌదామని :* గత కొన్ని దినములుగ తాము పరిచితులే. కాని అపరిచితులు. తమ ఊరు, పేరు, సంఘమున వృత్తి, కుటుంబ పరిస్థితి ఏమియును నాకు తెలియవు. మీరు ప్రతినిత్యము నన్ను

చూచుట చూచితిని. అంతకుముం దెన్ని దినముల నుండి చూచు చుండిరో నాకు తెలియదు. దీక్షగ ప్రతిదినము మీరు నన్ను చూచుట చూచి, మిమ్ము నాహ్వానించు సాహసము చేసితిని. మీరెందుకట్లు ప్రతి నిత్యము నన్ను చూచు కార్యక్రమము నేర్పరచుకొనినారో నేను తెలుసుకొనవచ్చునా? తాము ఏ పానీయము స్వీకరింతురు?

*సిద్ధార్థుడు :* పానీయమేదైనను స్వీకరింతును. పానీయ మనగా త్రాగుటకు సముచితమైనది కదా! సముచితమగు పానీయము గ్రోలుట సమ్మతమే. ప్రతి నిత్యము మిమ్ములను నేను చూచు కారణ మేమని అడిగితిరి. కారణ మొక్కటియే. అందము ఆనందము నిచ్చును. ఆనందము దైవస్వరూపము. 'ఆనందో బ్రహ్మ' యని పెద్దలు తెలిపినారు. ఆనందము నిచ్చు అందము దైవమునకు మార్గము. అట్టి అందము మీయం దుండుటచే ఆనందము కొఱకై చూచుచుంటిని. సృష్టి యందలి అందమును చూచుట, ఆనందిం చుట జీవుని సొత్తు. అందమును పొందుట కనుమతి కావలెను గాని, కేవలము చూచి ఆనందించుట కనుమతి అనవసరమని నా మతము. నా చూపు మీ కిబ్బంది కలిగించుచున్నచో ఇక చూడను.

*సౌదామని :* మీ చూపు నా కిబ్బంది కలిగించకపోగా నన్నాకర్షించినది. అందులకే మిమ్మిచ్చటికి ఆహ్వానించితిని. మీ కిష్టమైనచో వివరములు తెలియగోరెదను.

*సిద్ధార్థుడు :* వివరముల కేమున్నది? నేనొక బ్రాహ్మణుడను. నా తల్లిదండ్రులు పరిపూర్ణముగ దైవచింతన భావమున జీవించిన వారు. వారికి కలిగిన ఏకైక కుమారుడను నేను. అవివాహితుడను.

కుటుంబపరముగ సంస్కారధనము, ధనము కలవాడను. ప్రస్తుతము ఒంటరిని. తల్లిదండ్రులు ఊర్ధ్వలోకములకు జనినారు. నా ఆశయము లనుసరించుచు నేను సమస్తము విసర్జించినాను. ప్రస్తుతము నిరుపేదను. పేదరికము కూడ ఎట్లుండునో అనుభవించుచున్నాను. మునుపు సృష్టి అందమునకు విముఖుడను నేను. ఇపుడు సృష్టి అందమును, వైవిధ్యమును ఉపాసించుచున్నాను. నాకు లోకవిద్య లేవియును రావు. ఉపవసించగలను. నెలల తరబడి గూడ ఉపవసించగలను. కావున ఆహారము దొరకనిచో ఇబ్బంది లేదు. దొరికినచో దైవానుగ్రహముగ స్వీకరింతును. నాకు తెలిసిన మరియొక విద్య ఆలోచనా విద్య. ఏ విషయమైనను నిశితముగను, కూలంకషముగను, సుదీర్ఘముగను ఆలోచించగలను. ఆలోచనా పటిమ నాకున్న మరియొక ఆస్తి. మరియొక విద్యకూడ యున్నది. అది మౌనవిద్య. సంవత్సరముల తరబడి మౌనముగ నుండగలను. పుష్కరకాలము అభ్యసించి ఈ మూడు విద్యలను సాధించితిని.

సిద్ధార్థు డింకను యిట్లు పలికెను: "నా కిపుడు ముప్పది సంవత్సరములు. నా కిపు డొక యూరని లేదు. ఒక నివాస మనియు లేదు. సత్రమున నివసించుచు కాలము గడుపుచున్నాను. సంఘమున ఏ వృత్తియు లేదు. కాలమును దైవముగ భావించుచు, సన్నివేశముల నుండి కలుగు సందేశముల నభ్యసించుచున్నాను. ఇంతలో కాలము, దేశము, సన్నివేశము నిన్ను చూపినవి. చూచుచున్నాను."

సిద్ధార్థుని సంభాషణ విని సౌదామని మైత్రీభావముతో నవ్వినది. సిద్ధార్థుడును నవ్వినాడు. నా పరిచయము దాదాపు

పరిపూర్ణము. నీవు కూడ నీ పరిచయము వివరించినచో వినెదనని సిద్ధార్థు డనెను. సౌదామని యిట్లనినది.

“నేనును మీ వలె ఒంటరిదాననే. తల్లిదండ్రులు లేరు. బంధువులును లేరు. అందరును యిచటికి వచ్చి పోవుచుందురు. నేను సంఘమున ఒక భోగ్యవస్తువును. నా తల్లి సత్కుల సంజాత. ఆమె అందాల రాశి. రాజకుమారు డొకడు ఆమెను ప్రేమించి నన్ను ప్రసాదించి పోయినాడు. అత డామెను నిజమునకు ప్రేమించినను, రాచరిక సంప్రదాయము వివాహమునకు అడ్డు వచ్చినది. తనకు జరిగిన అవమానమును భరించలేక నన్ను ప్రసవించిన పిమ్మట నా తల్లి గంగా ప్రవేశము చేసి మరణించినది. నన్నొక పాపఫలముగ భావించి, తాత నన్ను అనాథ శరణాలయమున కందించెను. అచటికొక వేశ్య స్త్రీ వచ్చి నన్ను చూచి చిన్నతనముననే తన యింటికి గొనిపోయినది. నే నచట పెరిగితిని. ఆ యింటి ఆచారములు నా కలవాటైనవి. నన్ను పెంచిన స్త్రీ మరణించిన వెనుక నే నొంటరిగ జీవించు చుంటిని. ఈ పట్టణ మందలి ధనికులు, ప్రభుత్వాధికారులు నన్ను అనుభవించుచు పోషించుచున్నారు. ఈ విశాల భవన ప్రాంగణము వారు నా కందించినదే. సహాయముగ నలుగురు పరిచారిక లున్నారు. సామాన్యులకు నే నందని ఫలమును. పగలందరి చేతను ఛీత్కరింప బడుచున్నాను. రాత్రి మాత్రము ఛీత్కరించినవారు సైతము నెత్తిన పెట్టుకొందురు. సంఘపరముగ ఇది నీచవృత్తి. ఈ వృత్తియందున్న నేను సంఘమును నాదైన విధముగ అవగాహన చేసుకొంటిని. సంఘమున గౌరవింపబడువారిలో నీచ ప్రవృత్తి గలవారు లేకపోలేదు. వారు

తమ అవినీతిని రహస్యముగ నిర్వర్తింతురు. అధికారముతోను, ధనముతోను గర్హింపదగు ప్రవృత్తిని కప్పివేయుదురు. సంఘము దృష్టిలో వారు అందరూ శ్రేష్ఠులే. వారి ప్రవృత్తిలో త్రికరణశుద్ధి లేదు. నీచ మనిపించుకొనుచున్నను నా ప్రవృత్తిలో త్రికరణశుద్ధి ఉన్నది. నా జీవితమున రహస్యముగ నుంచవలసిన విషయము లేవియు లేవు. నా ప్రవర్తన మంతయు పారదర్శకమే. నా త్రికరణశుద్ధియే నాకు ఆత్మశాంతిని కలిగించు స్నేహితుడు. నా పుట్టుక, నా పెరుగుదల, నా వృత్తి, అన్నియు నా ప్రమేయము లేకనే జరిగినవి. పగలు నేను ఒంటరిదానను. ఆత్మావలోకనమునకు పగలంతయు వినియోగింతును. జీవితమంతయు విధి యెట్లు నడిపినచో అట్లు నడచితిని. త్రికరణశుద్ధి, ఆత్మావలోకనము, ఒంటరితనము కారణముగ అంతరంగ జీవనము కూడ నా కబ్బినది. బహిరంగ జీవనమొక నాటకముగ గమనించు చుందును. ఇది నా కథ.

పై విధముగ పలుకుచు సౌదామని శాంతగంభీరమూర్తి యైనది. సిద్ధార్థుడును మౌనగంభీరుడై తదేకదృష్టితో ఆమెను చూచెను. సౌదామని అందించిన ఆతిథ్యమును స్వీకరించి మరి సంభాషించక మరల వచ్చెదనని తెలిపి, సిద్ధార్థుడు మెల్లగ వెలుపలకు నడక సాగించెను.

ఆలోచనేఆయుధముగజీవించుచున్నసిద్ధార్థునకుసౌదామని జీవనము ఒక క్రొత్త సవాలును విసరినది. తా నంతరంగమున నిరంతరముగ నివసించుటకు, బహిరంగమును బహిష్కరించి భంగపడినాడు. సౌదామని బహిరంగ విషయమున ఉదాసీనత

పొందుచు అంతరంగము చేరినది. ఇది యొక సృష్టి విచిత్రము. తాను కోరుచున్నది ఆమెకు లభించినది. తనవలె శాస్త్రాధ్యయనము చేయకయే అట్టి స్థితికి చేరుట ఎట్లు సంభవించినది? **జీవితమే అధ్యయనము చేయువారికి శాస్త్రాధ్యయనములతో పనియేమి?** అని అంతరాత్మనుండి సమాధానము వచ్చినది.

తాను శరీరము, ఇంద్రియములు, మనస్సులను దమించి అంతరంగము చేరదలచెను. తన స్వభావము తిరగబడుటచే భంగపడినాడు. ఆమె స్వభావమున తిరుగుబాటు లేదు. ఉదాసీనత యున్నది. ఆమె గుజ్జుము (దేహము)ను ఎవరైనను ఉపయోగించుకొనవచ్చును. అది తాను కాదని ఆమె భావము. తాను మాత్ర మెవ్వరి అధీనము కాక తన అధీనముననే యున్నది.

సత్రమునకేగిన సిద్ధార్థుడు క్లుప్తముగ భుజించి విశ్రమించి నాడు. అతని మనస్సున ఉవ్వెత్తున భావములు చెలరేగినవి. చిన్నతనము నుండి తాను శరీరమును, ఇంద్రియములను, మనస్సును, వాక్కును దమించి అంతర్గతుడై అంతరంగమున జీవించుటకు, దైవమును దర్శించుటకు పాటుపడినాడు. అంత రంగమున భావమయ ప్రపంచమున చిక్కుపడినాడు. భావముల కతీతమైన స్థితి దక్కలేదు. వెలుగు రుచిని పొందలేదు. తన భావములే తన కడ్డుపడుచున్నవి. తన యందు ఘర్షణ మెండు. ఏ సిద్ధాంతమూ తనకు నచ్చదు. ఏ మార్గమును తాను అనుసరించ లేకపోవు చున్నాడు. దైవమును గూర్చిన తపనయేగాని నిర్దిష్టమగు మార్గము దొరకలేదు. తన తండ్రి పరబ్రహ్మశాస్త్రిగారు తాను

నమ్మిన వైదిక మార్గమున దివ్యత్వము ననుభవించు చుండెడివారు. వారి ముఖమే అందుకు తార్కాణము. ఆయనది ప్రసన్న వదనము, ఘర్షణము లేని భాషణము, చల్లని చూపు, పరహిత జీవనము. ఆశ్రితుల నాదుకొనుచు గృహస్థులై జీవించినను మనస్సున బంధములు లేవు. వారి జీవిత మొక ముక్తస్థితిని ప్రస్ఫుటముగ చూపించినది. తనకా మార్గము నచ్చకపోవుట తన దురదృష్టము. తన తల్లి భర్త ననుసరించి కృతకృత్యురాలైనది. ఆమెకును ఘర్షణ లేదు. నమ్మినదాని నాచరించి తనదైన దివ్యానుభూతి ననుభవించుచు నుండెడిది. శాస్త్రాధ్యయనము తానుగ చేయక భర్త చేయు ప్రవచనములనుండి పొందిన స్ఫూర్తిని, ఆరాధనా మార్గమున పండించుకొని, భర్త నడచిన మార్గమున నడచుచు ఆమెకూడ ముక్తసంగియై యుండెడిది. తనది విపరీత బుద్ధి. అవధులు లేక ఆలోచన తనకు సాగినది. తండ్రి సున్నితముగ నియమించ ప్రయత్నించినను తన ఆలోచనాధోరణి నియమింప బడలేదు. ఇది గమనించిన తండ్రి సిద్ధార్థుని అతని స్వానుభవమునకే వదలినాడు. నిశితము, విమర్శనాత్మకమునగు తన బుద్ధి, తన నడవులకు చేర్చినది.

శమనుల మార్గము వైదికనిష్ఠ నుండి బయల్పడుట కుపయోగించినదే కాని దివ్యత్వ మనుభవించుటకు తనకు దారి చూపలేదు. అది అసంపూర్ణ మార్గమనే ఆ మార్గమును విసర్జించినాడు. నిజమునకు తనకది అసంపూర్ణమైనదికాని ఆ మార్గమున కూడ పరిపూర్ణత సాధించినవారు పూర్వమున కలరు. ప్రస్తుతమున తనకు గోచరింప లేదు.

గౌతమబుద్ధుడు తనకు హృదయపరముగ నచ్చినాడు. స్నేహితుడు గోవిందునకు కూడ నచ్చినాడు. అతడా మార్గమున ప్రవేశించి సాగుచు నున్నాడు. బుద్ధుడు తనకు నచ్చుట జరిగినది కాని అనుసరించుట కెందులకో మనస్సు వెనుకాడినది. తన విపరీతబుద్ధిని గూర్చి బుద్ధుడు హెచ్చరించుట సమంజసమే.

“జరిగినదేదో జరిగినది. సర్వమునకు స్వస్తి చెప్పి తల్లిదండ్రుల వద్ద కేగి వారికి సేవ గావించుకొన వలెనని భావించి” స్వగ్రామమున కేగినాడు. తన అహంకారమునకు చెంప పెట్టుగ వారిరువురును అప్పటికే స్వర్గస్తులైనారు. ఏమి దురదృష్టము! విధి వెక్కిరించినట్లుగ తానొకడే నిలబడినాడు. తాను సాధించదలచిన విషయమునందు తనకు విరక్తి కలిగి సాధారణ జీవితము ఐహికముగ గడుప వలెనని భావించి ఈ పట్టణము చేరినాడు. ఇచ్చట సౌదామని పరిచయమగుట మరల క్రొత్త భావములను మొలకెత్తింప చేయు చున్నది. తను సాధించని దేదో ఆమె సాధించినట్లుగ తనకు తోచుచున్నది. తాను గర్హించి విసర్జించిన బహిరంగమును, ఆమె విసర్జించనూ లేదు, గర్హించనూ లేదు. తానాదరించి అవలంబించిన తపోదీక్షను ఆమె ఎన్నడునూ కోరినది కాదు. ఆమె బహిరంగ విషయమున నిర్లిప్తయై అంతరంగమున జీవించుచున్నది. తాను బహిష్కరించిన బహిరంగము తన తపోదీక్ష కెప్పుడునూ అడ్డుపడుచునే యుండెడిది. **బహిష్కరించుట, గర్హించుట, విసర్జించుట సరియగు విధానము కాదని, సమన్వయించుకొనుట యొక్కటే విధానమని** తండ్రి తెలిపిన విషయము తన కిప్పటి కవగాహన మగుచున్నది.

బహిరంగ జీవనముయొక్క సారము, పారము తెలియవలెనని తాను చేయు ప్రయత్నమున తారసపడిన సౌదామని తనకొక మంచి స్నేహితురాలు కాగలదని భావించి సిద్ధార్థుడు మరునా డామెను మరల కలియుటకు సంకల్పించెను. ఆమె పగలు ఒంటరియే. కావున ఆమెతో సహవాసము తాను పగలు చేయవచ్చును. సంఘమున తనకొక కార్యక్రమము నామె ద్వారా ఏర్పరచుకొనవచ్చును అని భావించినాడు. పరిష్కారము లభించిన మనస్సు నిద్రించినది.

సిద్ధార్థుడు మరునాడు ఉదయము యథావిధిగా ప్రాతః కాలము నందే నిదుర లేచి వ్యాయామము, ప్రాణాయామము గావించి శుచియై కేశాలంకరణము గావించుకొని వున్నంతలో మంచి దుస్తులను ధరించి సౌదామని గృహము వైపునకు నడక సాగించెను. అతనిలో బాహ్యజీవన అనుభూతి ప్రస్తుతము భావలోకములో ప్రాముఖ్యత వహించింది. కామి గానివాడు మోక్షగామి కానేరడన్న సూక్తి ప్రగాఢమై నిలచినది. అతను మోక్షగామియే. ఆ గమ్యానికి అవరోధముగా నిలచిన భావములకు కొంత పరితృప్తి కావించవలెనన్న భావనతో బహిరంగములోకి మరలు చున్నాడు. తన గమ్యములో తాను నిర్లక్ష్యము చేసిన విషయములు తనపై ప్రభావము చూపటము గమనించిన సిద్ధార్థుడు వాటిని దమించగలనని తెలిసి వేసిన తప్పటడుగులను సరిదిద్దుకొనుటకు పూనుకున్నాడు.

మోక్షకామ ముండుట మంచిదే కాని దానికి సోపానములున్న వని మరువటము అవివేకము. ఆశయము ఆవేశము కాకూడదు.

**ఆశయానికి ఆవేశము లేని ఆలోచనే సరియైన దిక్సూచి.** సిద్ధార్థుడు మోక్ష విషయమై ఆవేశ పడినాడు. తండ్రి హెచ్చరికలోని రహస్య మప్పుడు తనకి తెలియలేదు. వృత్తిపరముగ సంఘమునకు సేవ చేయుచూ తగుమాత్రము ధనార్జనను గావించుకొనుచు, దేహేంద్రియ పరితృప్తి గావించుకొనుచు గృహస్థ ధర్మములో జీవించుట యందు గల విలువలు తన కిప్పుడిప్పుడే గోచరించుచున్నవి. సౌదామని యందు తనకు గలిగిన ఆకర్షణ లోన పెరుగుతూ వున్నది. అతనది గమనించుచునే యున్నాడు. ఆమెచేత గుర్తింపు పొందవలెనను భావన అతనిలోని పౌరుషాగ్నికి ఊపిరిపోసింది. అడుగులు వేగముగా పడుతూ వుండగ నడక పరుగువలె సౌదామని గృహము చేరినది.

సిద్ధార్థుడు వచ్చిన సంగతి తెలిసిన సౌదామని అతనిని లోని కాహ్వానించి, తేనీరు అందించి కుశల మడిగినది. సిద్ధార్థుడు తన కుశలము తెలుపుచు తన పూర్వ చరిత్రను క్లుప్తముగ వివరించి, తన ప్రస్తుత అర్థకాంక్షను సూటిగ తెలియపరచెను. వృత్తిపరముగ ధన సముపార్జనమునకు తగు మార్గము చూపమని కోరినాడు. సంఘములో ఆమెకు గల పరిచయములు అనేకానేకము లగుటచేత ఆమె తనకు సహాయము చేయగల స్థితిలో నున్నదని తెలియ పరిచాడు. తనకు వలసిన విషయమును సూటిగాను, స్పష్టముగాను, అరమరికలు లేకుండా తెలిపిన సిద్ధార్థుని చూసి సౌదామని ముచ్చట పడినది. అతని వ్యక్తిత్వములోగల నిర్మలత్వము కూడ గోచరించినది. మొదటిసారిగ అతనిని విస్పష్టముగ చూచినది. అతను స్ఫురద్రూపి యని, దీక్షాపరుడని,

ఏకసంథాగ్రాహి యని తలచినది. సిద్ధింప చేసుకొనగల మనోబలుడని, బుద్ధిబలుడని గూడ గోచరించినది. ఇట్టి వ్యక్తి సంఘములో అరుదుగ కనిపించునని కూడ అనిపించినది. తప్పక అతడడిగిన విధమున సహాయ సహకార మందించవలెనని భావించినది.

ఈ లోపున సిద్ధార్థుడు సౌదామనితో యిట్లనినాడు: నే నడిగినది సంభవము గానిచో ఆ విషయము నాకు స్పష్టముగ తెలుపవచ్చును. మొగమాట మక్కరలేదు. సూటిగ అడిగితిని, అంతసూటిగను సమాధాన మాశించుచున్నాను. సౌదామని నవ్వుతూ ఇట్లు పలికినది: "నీవడిగినది సంభవమే, నా భావమెల్ల నీ సూటితనమును గూర్చియే. నా భావన సాధ్యాసాధ్యముల గూర్చి కాదు. తప్పక సహాయము చేతును. ఇంతకును నీవు నేర్చిన విద్య యేమి? నీకు గల సమర్థత యేమి? తదనుగుణమైన వృత్తిని చూపవలెను కదా!''

సిద్ధార్థు డిట్లనెను : "ఏ పనికైనను సమర్థుడనే. నా మనస్సు పదనుగ ఆలోచించ గలదు. నాకు గల ఆలోచనాశక్తి నా సంపద. మరి రెండు శక్తులు కూడ గలవు. అందు మొదటిది ఉపవాసము. మండలము రోజులైనను జలాహారముపై జీవించగలను. రెండవది మౌనము. నా మౌనశక్తి ఇతరులను వశపరచుకొనగలదు. ఉపవాస దీక్ష వలన నిద్రనుకూడ జయించితిని. అరుదుగ నిద్రింతును. ఈ సమర్థతలను బట్టి నీవు నాకు తగిన వృత్తిని చూపవచ్చును."

సౌదామని నిశ్చేష్టురాలైనది. అతడు నిజముగ సిద్ధార్థుడే అనిపించినది. తలచినది సాధించగల డనిపించినది. మరునాడు

ఉదయము రమ్మని తెలిపి నిష్క్రమించినది. సిద్ధార్థుడు కూడ నిష్క్రమించినాడు. కాని సౌదామని మనోభావముల లోనికి లోతుగ ప్రవేశించినాడు. ఆ పగలంతయు సౌదామనికి సిద్ధార్థుని భావమే.

సిద్ధార్థుడు మరునాడు ఉదయముననే నిదురలేచి ప్రాణా యామము, వ్యాయామములు పూర్తి గావించుకొని శుచియై మరల సౌదామని గృహమున కేగెను. సౌదామని సిద్ధార్థుని రాకకై ఎదురు చూచుచు నున్నది. సిద్ధార్థుడు చిరునవ్వుతో పలుకరించి కుశల మడిగి కూర్చుండి తన విషయమై ప్రశ్నించెను. సౌదామని కూడ కుశలమడిగి అతను కోరిన విషయమై తన ప్రయత్నము సఫల మైనదని తెలిపి, ఇట్లు పలికినది.

"నిన్నరాత్రి ధనగుప్తుడను వణిగ్వరుడొకడు నాతో గడిపినాడు. అతడు ప్రసిద్ధిగాంచిన వ్యాపారి. మగధ రాజ్య పొలిమేరలను దాటి కూడ రకరకములైన వ్యాపారములు చేయుచుండెను. చాల ధనవంతుడు. **ధనాశాపరునికి ధనమును పెంచుటయే జీవన లక్ష్యము.** వ్యాపార నిమిత్తమై చేయు ప్రయాణములలో అప్పుడప్పు డిచ్చటకు వచ్చుచు నుండును. అతనికి మన పట్టణమున కూడ వ్యాపారము లున్నవి. అతడు గుప్తధనుడు. సార్ధక నామధేయుడు. అతనికి నీ విషయమై సమయానుకూలముగ తెలిపితిని. నా మాటను మన్నించి ఈ పట్టణమందలి అతని వ్యాపారములను పర్యవేక్షించుటకు నిన్ను నియమింతునని తెలిపినాడు. అతని చిరునామాను ఈ తాటియాకుపై వ్రాసి యిచ్చినాడు. నీవీ సాయంత్రము లోపల అతనిని కలసినచో అతని వ్యాపారమున నిన్ను నియమించుకొనును."

సౌదామని చిరునామాగల తాటియాకును సిద్ధార్థున కిచ్చినది. సిద్ధార్థుడు స్నేహపూర్వకముగ ధన్యవాదములు తెలిపి కార్యోన్ముఖుడై లేచి నిలబడినాడు. సౌదామని అతనిని వారించి కూర్చుండమనినది. "నీ కభ్యంతరము లేనిచో మన మిరువురము తేనీరు కలిసి తీసుకొందుము. అటుపైన నీ పనిపై నీవు సాగవచ్చును" అని తెలిపినది. సిద్ధార్థు డంగీకరించి కూర్చుండెను. సౌదామని మాట కలుపుచు "ప్రస్తుతము జలాహారముపై జీవించుచున్నా వనుకొందును" అనెను. సిద్ధార్థు డౌనన్నట్లు తలయూపెను. "ఎన్నాళ్ళ నుండియో?" అనుచు సౌదామని నవ్వినది. ఆమె నవ్వును చూచిన సిద్ధార్థుడు, హృదయమున ఆమెను మెచ్చుకొనినాడు. ఆ నవ్వు ఎందరి నాకర్షించినదో! మరి ఎందరిని మతిహీనులను చేసినదో! రాచబిడ్డకదా! నవ్వు యందు కేవల మాకర్షణయే కాక ఠీవి గూడ నున్నది. పలువరుస చక్కని తీరువుగ నుండి కాంతులు వెదజల్లుచు నున్నది. పెదవులు లేత దొండపండ్లవలె ఎఱ్ఱగ నున్నవి. ఆ నవ్వు నందుగల విశిష్టతను సిద్ధార్థుడు గమనించి లోన సంతసించెను. సౌదామని అడిగిన ప్రశ్నకు సమాధాన మిచ్చుట మరచెను. సౌదామని నవ్వుచు, "ప్రశ్న మరచినట్లున్నావు" అనినది. సిద్ధార్థుడు "అవును. ప్రశ్న మరువలేదు గాని మరచినాను. ప్రశ్నను మరపించు భావన మరియొకటి కలిగినది. జలాహారము పదిరోజులుగ సాగుచున్నది" అని పలికెను. "ఇంతకును ప్రశ్నను మరపించిన భావమేదో తెలుసుకొనవచ్చునా?" అని సౌదామని ప్రశ్నించినది. ఇంతలో తేనీ రచటికి పరిచారిక గొనివచ్చినది. ఇరువురును తేనీరందుకొని త్రాగుచూ ఒకరినొకరు కన్నులతో చూచుకొనుచున్నారు. ఒకరిని గూర్చిన భావన లొకరి యందు

వేగముగ గుఱ్ఱములవలె పరుగిడు చున్నవి. తేనీరు యాంత్రికముగ త్రాగుచున్నారే కాని అంతరంగములలో నూతన భావముల పరంపర చిగురెత్త సాగినది. తేనీరు త్రాగుట పూర్తియైన పిదప సిద్ధార్థుడు నిలబడి నవ్వుచు శెలవా! అని పలికెను. సౌదామని తల యూపెను.

సిద్ధార్థుడు నిష్క్రమించినాడు. సౌదామని నిష్క్రమించక, నిష్క్రమించుచున్న సిద్ధార్థుని చూచుచు నిలబడినది. అతడు వెనుకకు తిరిగి చూడక ముందుకు సాగెను. వెనుక చూపులేని మనిషని భావించుచు సౌదామని లోనికి సాగినది.

సిద్ధార్థుడు హుటాహుటిన ధనగుప్తుని చిరునామా ననుసరించి, అతని నివాస స్థానమున కేగెను. అతని నివాస స్థానము చాలా విశాలమై యున్నది. ప్రాంగణమున ప్రవేశించిన సిద్ధార్థుడు, సేవకులకు తన పరిచయము తెలిపి ధనగుప్తుని కలియవలెనని తెలిపెను. సేవకుడు లోనికేగెను. తిరిగి వచ్చి కొంత తడవు వేచి యుండమని సిద్ధార్థునికి తెలిపెను. సిద్ధార్థుడు వేచియుండెను. ఎందరెందరో వ్యాపారులు, సంఘమున పేరు ప్రతిష్ఠలు కలవారు, రాజోద్యోగులు ధనగుప్తుని చూచుటకు వచ్చుచు పోవుచు నుండుట చూచుచు సిద్ధార్థుడు సాయంకాలము వరకు వేచియున్నాడు.

వేచియున్న సిద్ధార్థుని సాయంకాల సమయమున ధనగుప్తుడు తన వద్దకు వచ్చుట కనుమతించినాడు. సిద్ధార్థుడు లోనికి ప్రవేశించి నమస్కరించి తనను తాను పరిచయము చేసుకున్నాడు. ధనగుప్తుడు సిద్ధార్థుని ఆసీనుడు కావలసినదిగ సౌజ్ఞ చేయగ సిద్ధార్థుడు ఆసీనుడైనాడు.

*ధనగుప్తుడు :* ఉదయము నుండి వేచియుంటివి. ముందుగ ఏర్పరచుకొనిన కార్యక్రమముల ఒత్తిడి వలన నిన్ను లోనికి పిలుచుటకు ఆలస్యమైనది. వేచియుండుటలో బాధ కలిగెనా?

*సిద్ధార్థుడు :* కార్యార్థియై వచ్చితిని. కార్యము సిద్ధించు వరకు వేచియుండుట నా కర్తవ్యము. వేచియుండుటలో నాకు అసహనము, బాధ కలుగలేదు.

*ధనగుప్తుడు :* వేచి యుంచితినని భావించి నాపై మనస్సులో ఆగ్రహించితివా?

*సిద్ధార్థుడు :* ఆగ్రహ మనునది నా దరి చేరదు. ప్రశాంత చిత్తుడుగనే యున్నాను.

*ధనగుప్తుడు :* అభిమాన పడితివా?

*సిద్ధార్థుడు :* వ్యాపారము నందు అభిమానము తగదు. అహంకారము కుదరదు. **కోపము లేక సహనము కలిగి అభిమానపడక తన కార్యమును నిర్వర్తించుకొనువాడే వ్యాపారమున రాణించగలడు**. మీరు ప్రసిద్ధిగాంచిన వ్యాపారులు. మీ వద్ద పనిచేసి రాణించుటకు పై గుణము లుండవలెనని నా నమ్మకము.

*ధనగుప్తుడు:* చాలా సంతోషము. వ్యాపారము నిర్వర్తించు టకు వలసిన ముఖ్యగుణములు నీకు తెలియుట నన్నుత్సాహ పరచు చున్నది. వ్యాపార నిమిత్తమై నీవేమి చేయగలవు?

*సిద్ధార్థుడు :* ధర్మపరముగ ఎట్టి బాధ్యత నైనను నిర్వర్తింప గలను.

*ధనగుప్తుడు :* వ్యాపార మనగా అంతో ఇంతో కొంత కలిధర్మ ముండును. అట్టి పరిస్థితులు కలిగినచో ఏమి చేయుదువు?

*సిద్ధార్థుడు :* మీకు విన్నవించి, నిర్ణయములు, బాధ్యతలు మీకే వదలగలను.

*ధనగుప్తుడు :* నాకీ పట్టణమందు విస్తృతమగు అమ్మకము, కొనుగోలు వ్యాపార మున్నది. దానిని నీవు బాధ్యతాయుతముగ నిర్వర్తింపగలవా?

*సిద్ధార్థుడు :* నిర్వర్తింపగలను.

*ధనగుప్తుడు :* అయినచో రేపు ఉదయమే నీవు బాధ్యతను స్వీకరించ వచ్చును. మూడు రోజులు నే నిచ్చటయుండి నీకు వ్యాపార పరిచయము గావింతును. అటుపై నీవే నిర్వర్తించుచు జమా లెక్కలను వ్రాయుచు, సరుకును భద్రము చేయుచు నుండ వలెను. నీ కిరువురు సహాయకు లుందురు. నే నప్పుడప్పుడు వచ్చి పోవుచుందును. వ్యాపారము నాదియైనను, నీదిగ భావించి వృద్ధి చేయుట కూడ నీ కర్తవ్యము. జరిగిన వృద్ధిలో నీకు కొంత శాతము అదనపు వేతనముగ ఏర్పాటు చేయగలను. నెలసరి వేతనము కూడ మూడు రోజుల తరువాత నిర్ణయించి తెలుపుదును. నీకు నచ్చినచో రేపు ఉదయము ఎనిమిది గంటలకు నా వ్యాపార కేంద్రమునకు రావలెను.

సిద్ధార్థుడట్లే యనగ ధనగుప్తుడు చిరునామా తాటియాకుపై వ్రాసి అందించెను.

సిద్ధార్థుడు నిష్క్రమించెను. ధనగుప్తుడు కొంత తడవు విశ్ర మించి అటుపై స్నాన మాచరించి సుగంధములను శరీరమున కద్ది, ఆభరణములను ధరించి సౌదామని గృహమున కేగెను. ఆ రాత్రి అతడు సౌదామని గృహమున గడిపెను.

సిద్ధార్థుడు ఆ రాత్రి సత్రమున తన జీవితమున నేర్పడుచున్న మలుపును గూర్చి సుదీర్ఘముగ నాలోచించి అర్ధరాత్రి దాటిన వెనుక నిద్రించెను. మరునా డుదయమే తన దైనందిన కార్యక్రమమును నిర్వర్తించుకొని ఎనిమిది గంటలకు ధనగుప్తుడు తెలిపిన వ్యాపార స్థలమును చేరెను. ధనగుప్తుడు సిద్ధార్థుని చిరునవ్వుతో ఆహ్వానించి కాలవ్యవధి కాకుండ రోజంతయు వ్యాపార విషయము లన్నియు వివరించుచు పరిచయము గావించెను. సిద్ధార్థుడు ఏకాగ్రచిత్తుడై సమస్తమును అవగాహనము చేసుకొనెను. మరుసటి రెండు రోజులును ధనగుప్తుడు సిద్ధార్థునిచే వ్యాపారము నిర్వర్తింపచేసి సిద్ధార్థుని సమర్థతకు తృప్తిచెంది వ్యాపార మతని కప్పుచెప్పెను. సిద్ధార్థుడు బాధ్యతలను స్వీకరించి వ్యాపారము చేయుట మొదలిడెను. క్రమముగ అతనికి వ్యాపార మందలి ఒడుదొడుకులు అవగాహనకు వచ్చినవి.



# 6

ధనగుప్తుడు సిద్ధార్థునికి తన వ్యాపారమును పరిచయము చేసి సిద్ధార్థుని స్థానిక ప్రతినిధిగా నేర్పరచి, ఇతర వ్యాపార నిమిత్తము ప్రయాణమై వెళ్ళినాడు. సిద్ధార్థుడు ధనగుప్తుని వ్యాపార ప్రతినిధిగ పట్టణములో వ్యాపారము ప్రారంభించినాడు. ఒకనాడు సాయంత్రము పూవులు, పండ్లు తీసుకొని సౌదామని వద్దకు జనినాడు. సిద్ధార్థుని రాక తెలిసి సౌదామని అతని నాహ్వానించి కూర్చుండబెట్టి కుశల మడిగినది. సిద్ధార్థుడిట్లు పలికినాడు.

"నీ చలువ వలన నాకొక కార్యక్రమ మేర్పడినది. ధనగుప్తుడు నాయందు సంతృప్తి చెంది అతని వ్యాపారమునకు ఈ పట్టణమున నన్ను ప్రతినిధిగ నేర్పరచినాడు. నిన్నటి నుండి జలాహారము మాని ఆహార స్వీకరణము మొదలిడినాను. నీవు చేసిన ఉపకారము మరువ తగినది కాదు. స్నేహపూర్వకముగ నీకీ పండ్లు, పూవులు పట్టుకొని వచ్చితిని. నాకీ పట్టణమున నావారెవ్వరునూ లేరు. పరిచయములు ఇప్పుడిప్పుడే కలుగుచున్నవి. నాయందు నిన్ను

గూర్చిన స్నేహభావము, నిన్ను చూచినది మొదలుగ ఏర్పడుచు నున్నది. ప్రస్తుతము నా స్నేహమును వ్యక్తపరచుటకు నీకీ ఫల పుష్పముల నందించు చున్నాను."

అని పలుకుచు సిద్ధార్థుడు ఫల పుష్పములను సౌదామనికి అందించినాడు. సౌదామని స్నేహపూర్వకమగ వాని నందుకుని లోనికంపినది. ఈ లోపల లోనుండి ఒక పరిచారిక ఇద్దరికిని తేనీరు కొనివచ్చినది. స్వీకరించుచున్న వారిరువురి మధ్య బాహ్యముగ మౌనము, అంతరంగమున భావపరంపర సాగినవి. తేనీరైన వెనుక సిద్ధార్థుడిట్లు పలికెను.

"వృత్తి దొరికినది. ఇక గృహ మేర్పరుచుకొని వంట సరుకులు, యిత్యాది సమకూర్చుకొని స్థిరపడవలెను. నీ కెవరైన తెలిసిన వ్యక్తులకు అద్దెకిచ్చుటకు గృహమేమైన వున్నచో వారిని కలిసి గృహ మేర్పరచుకొందును. తెలిసినది నీవే కనుక నిన్నే మరల అడుగుచుంటిని. అన్యథా భావింపకుము."

సౌదామని యిట్లనెను : నా గృహ ప్రాంగణము చాల పెద్దది. ప్రహరీ గోడ నానుకొని వాయవ్యమున ఉప భవనమున్నది. అందొక చిన్న కుటుంబము వసించుటకు వలసిన సౌకర్యము లన్నియు కలవు. నీ విచ్చగలిగినదే అద్దె, నచ్చినచో నీవచ్చట నుండవచ్చును. పరిచారికలు నీకది చూపగలరు. స్నేహము ప్రేమకన్న విలువైనది. నీవావిష్కరించిన స్నేహ భావమును నేను పరిపూర్ణముగ నందుకొని గౌరవింపగలను. మంచి స్నేహితుని కన్న మించిన సంపద ఎక్కడను లభ్యము కాదు. నీ యందు

నాకు కూడ స్నేహభావ మేర్పడుచునే యున్నది. ముందుగ నీవు ప్రకటించితివి. కొంచె మాలస్యముగ నేనును ప్రకటించు చున్నాను. ప్రకటన యందు ఆలస్యమేకాని భావనయందు కాదు.

సిద్ధార్థుడు చిరునవ్వుతో యిట్లనెను : "స్త్రీవి కదా! ప్రకటింపకయే ప్రకటింప గలవు. పురుషుల ప్రకటన కొరకు వేచియుండగలవు. నిజమునకు పురుషుని కన్న స్త్రీయే లోతైన మనస్సు కలిగి యుండునని వింటిని. నేడు చూచితిని. నా వరకు నే నెపుడునూ అన్ని విషయములయందు సూటిగనే ప్రవర్తించితిని. డొంక తిరుగుడు లేదు. వ్యాపారమునుకూడ నట్లే సాగింతును. నీతో స్నేహమును గూర్చి చెప్పనక్కరలేదు. అది నీకే తెలియవలెను."

సిద్ధార్థుని చిరునవ్వు సౌదామని నాకర్షించినది. అతని ముఖము శాంతము, ప్రసన్నమై యుండును గాని, అతని చిరు నవ్వు తానెపుడునూ చూడలేదు. ఆ చిరునవ్వులోగల లోతులు, యితరుల గుండెల లోతులు తెలియగల సౌదామని కందలేదు. అది లోతు తెలియలేని నవ్వు అని భావించినది. అందొక వినూత్న మగు ఆకర్షణ సౌదామనికి కలిగినది. తానును చిరునవ్వుతో యిట్లని పలికెను: "నీవు శాంత గంభీరుడవు. సూటియైన ప్రవర్తన కలవాడవు. ప్రసన్నుడవే గాని మొదటిసారిగ నిప్పుడే నీ చిరునవ్వు చూచితిని. నీ చిరునవ్వు నీ ముఖమునకు ఎనలేని భూషణము. నీవీ చిరునవ్వు ఎప్పుడునూ కలిగియున్నచో ప్రపంచము నీకు వశము కాగలదు.

*సిద్ధార్థుడు :* నీవన్నది నిజమే, నేను కోపిష్ఠివాడను కాను, శాంతుడనే. కాని నిరంతర అన్వేషిని. నా అన్వేషణము ప్రస్తుతము నన్నిక్కడికి చేర్చినది. అన్వేషణము పూర్తి కానిదే హృదయము సంతసింపదు. **హృదయ సంతోషికి చిరునవ్వు భూషణము, అన్వేషికి కాదు.** ఒక్కమాట సత్యము. నా చిరునవ్వు గూర్చి నే నెరుగను. నీ చిరునవ్వును గూర్చి మాత్ర మెరుగుదును. నీ నవ్వు నాకెంతయూ ఆహ్లాదము కలిగించును. ప్రథమానుభవము క్రిందటి సారి నీతో సంభాషించినపుడు కలిగినది. నీ నవ్వు నచ్చినవారెందరో వుండి వుండవచ్చును. ఆ సంఘమున నేనొక నూతన సభ్యుడను. ఇంతకును పరిచారికను పంపుదువా?

సౌదామని పరిచారికను పిలిచి సిద్ధార్థున కప్పగించి వాయవ్య మందలి గృహమును చూపమని తెలిపెను. సిద్ధార్థుడు పరిచారిక ననుసరించి ప్రధాన భవనము నుండి వాయవ్య మందలి గృహమునకు చేరి సౌకర్యములను పరికించి సంతృప్తుడై అందు నివసించుటకు నిశ్చయించుకొనెను. మరునాడే సత్రము నుండి నివాసమును మార్చెను. సత్రమును నిర్వర్తించు కార్యకర్తలకు తన వంతు సహాయ మికపై అందింతునని తెలిపినాడు. వారి స్నేహ భావములు పొందినాడు. అటుపై ప్రతినెల సత్ర ప్రయోజనములకై పది రాగి నాణెములు అందించుట ప్రారంభించెను.

నెలరోజులపాటు తదేకదృష్టితో వ్యాపారమును నిర్వర్తించిన సిద్ధార్థుడు తన నెలసరి వేతనమును అందుకొని ఇంటికి తిరిగి వచ్చుచూ ఫలపుష్పాదులను గొనివచ్చినాడు. స్నానాదికములు

గావించుకొని వంద రాగినాణెములు పట్టుకొని ఫలపుష్పములతో పాటు సౌదామని వద్దకు చేరినాడు. కుశలమడిగి వంద రాగి నాణెములు, ఫల పుష్పములు ఆమెకు అందించినాడు. రాగి నాణెములను చూచిన సౌదామని ప్రశ్నార్థకముగ సిద్ధార్థునివైపు చూచినది. సిద్ధార్థుడు నెలసరి అద్దె అని తెలిపినాడు. సౌదామని నిరాకరించబోగా సిద్ధార్థు డిట్లు పలికెను.

''స్నేహము ఒకరి నొకరు దోచుకొనుటకు కాదు. ఒకరిని ఇంకొకరు దుర్వినియోగము కావించుటకూ కాదు. ఒకరి నొకరు ఆదుకొనుటకు. నీవు గృహమును నాకు నివాస సౌకర్యముగ నేర్పరచక పోయినను, స్నేహము స్నేహముగానే యుండెడిది. **స్నేహము, స్నేహము కొఱకే! స్నేహమునకు లాభనష్టములు లేవు. ఒకరినుండి ఒకరు ఆశించుకొన్నది స్నేహమే అయివుండవలెనుగాని ఇతరములైన విషయములు కావు.** కావున నీవీ రాగి నాణెములను స్వీకరించవలెను. ఈ వంద నాణెములు నీవందించిన వసతికి విలువ కాదు. ప్రస్తుతము నేను చెల్లించగల రుసుమే.''

సౌదామని ఫలపుష్పములను, రాగి నాణెములను అందుకొని లోనికంపినది. ఇరువురును తేనీరు సేవించుచుండగ 'వ్యాపారమెట్లు సాగుచున్నదో?' సౌదామని ప్రశ్నించినది. సిద్ధార్థుడు ఆత్మవిశ్వాసముతో వ్యాపారము తన హస్తములలో పెరుగ గలదని తెలిపినాడు. అది విని సౌదామని సంతసించి ''రాబోవు ఆదివారము నీకు వీలున్నచో మన మిరువురము కలసి భుజింతుము.'' అని పలికినది. సిద్ధార్థుడట్లేయని పలికి సౌదామని వద్ద నుండి శెలవుగొని తన నివాసమునకు బయలుదేరినాడు.

ఆదివారము వచ్చినది. సౌదామని సిద్ధార్థుల హృదయములో ఒకరిని గూర్చిన భావములు మరియొకరికి మనో లోకమున తీవ్రమగుట ఆరంభించినది. ఒకరియం దొకరికి తెలియని ఆకర్షణము. అది కేవల మాకర్షణయే కాదు. ఒకరి పరిణతియందు మరియొకరికి గౌరవము. సిద్ధార్థునకు సౌదామని యన్న గౌరవము. ఆమె అతని దృష్టిలో ప్రవృత్తిపరముగ వేశ్యాస్థితిని దాటినది. అంతరంగమున ఆమె తనవలెనే యొంటరిది. ఏమియు అంటనిది. బహిరంగమున వేశ్య. జీవిగ ఆమె పవిత్రయే. ధరించిన బాహ్యముతో తనకు పనిలేదు. అట్లే తాను కూడ. బహిరంగమున తానిపుడొక వ్యాపారి. కాని అంతరంగమున కాదు. **బహిరంగ కార్యకలాపములు బహిరంగముననే వదలి, అంతరంగమున తాను తానుగ నుండుట జీవుని ఉన్నత పరిణామమును తెలుపును. బాహ్యమున పవిత్ర కార్యములు చేయుచు మలినులై యున్న వారెందరో గలరు.** వీ రధములు, కపటులు, మోసగాళ్ళు. అంతరంగమున పవిత్రులై బహిరంగమున కూడ పవిత్రకార్యములు చేయువారు ఇహపర సౌఖ్యములను పొందుచు నుందురు. బాహ్యమున అపవిత్రులై గోచరించినను, అంతరంగమున పవిత్రులై యుండుట అరుదుగ జరుగును. అట్టివారు విచిత్ర జీవనులు. సంఘముచే ఛీత్కరింపబడుచు నున్నను, అంతరంగమున స్థితప్రజ్ఞులై వీరుందురు. వీరు మట్టియందు మాణిక్యములవంటి వారు. సిద్ధార్థుని దృష్టిలో సౌదామని అట్టి స్త్రీ. ఆమె తెలిపినట్లుగ ఆమె పుట్టుక, పెరుగుదల సంఘము నందు ఆమె జీవనము, ఆమె ప్రమేయము లేకనే నిర్వర్తింపబడినది. ఆమె సాక్షిగ సమస్తమును

దర్శించుచు కర్మసన్యాసినియై నిలచినది. అందువలన ఆమె యన్నచో అతనికి గౌరవము. సహజ సౌందర్యవతియైన సౌదామనియందు అందము, ఆకర్షణయున్నను సిద్ధార్థునికి ఎక్కువగ నచ్చినది ఆమె అంతరంగ సౌందర్యము. నిజమునకు తాను ఆమె బాహ్య సౌందర్యమునకే ఆకర్షితుడైనాడు. క్రమముగ ఆమె భాషణము, ప్రవర్తనము అతని యందు, ఆమెపై గౌరవమును పెంచినది. తన కామెయందు స్నేహభావము కలిగినది. ఈ భావము ఇదివరకెన్నడును, ఎవరిపైన కలుగలేదు. గోవిందుడు నిజమునకు చిన్ననాటి నుండి తనతో యున్నవాడే కాని చిన్నవాడుగనే యుండిపోయినాడు. బహిరంతరములు విడివడలేదు. బహిరంగమే అతనికి అంతరంగమున కూడ నిలచినది. తన తండ్రి తనకు నిజమగు స్నేహభావము రుచి చూపినప్పటికిని, వయోవ్యత్యాసము కారణముగ ఆయనను సన్నిహితునిగ తానంగీకరించలేక పోయినాడు. నిజముగ స్నేహము విలువ తెలిసినవాడు తన తండ్రే. స్నేహభావము చేతనే ఆయన తన స్వతంత్రమున కడ్డు రాలేదు. తండ్రిగ యెన్నడునూ శాసించ లేదు. మరల ఇపుడు స్నేహభావము తనయందు చిగురించుటకు సౌదామని కారణమై నిలచినది. ఇట్లు భావించుచున్న సిద్ధార్థునకు అంతరంగము నుండి యొక వాణి వినిపించినది.

"సిద్ధార్థా! నీకు సౌదామని యందు గల భావము, స్నేహ భావమా? లేక ప్రేమ భావమా?'' సిద్ధార్థు డులికిపడెను.

సిద్ధార్థుని భావ పరంపర సౌదామని గూర్చి సాగుచునుండగ, ఆదివారము ఉదయము సౌదామని భావపరంపర సిద్ధార్థుని గూర్చి

సాగినది. సిద్ధార్థుడు తన జీవితమున ప్రవేశించినది మొదలు అతనితో జరిగిన ప్రతి సమావేశము, ప్రతి సంభాషణము అతని ఋజు ప్రవర్తనమును సౌదామని యందు అతనిపై గౌరవము నినుమడింప జేసినవి. అతని సూటి ప్రవర్తనము ఆమెకు ఆనందము కలిగించినది. తనయం దతనికి ఏహ్యాభావము లేదు. తనపై స్నేహ భావముతో దగ్గరకు చేరుచున్నాడు. చురుకుతనము, తెలివియే గాక, హృదయము కూడ కలవాడు. జీవితమున తా ననుకున్నది సాధించగల దీక్షాపరుడతడు. అట్టివారు స్నేహితులుగ లభించుట తనకు అదృష్టమే. తన వద్ద కందరును తన దేహ సౌందర్యమును చూచి దానికొరకై ఏతెంతురు. తనకును ఒక మనసున్నదని గమనింపరు. కామతృష్ణయేగాని తన్నర్థము చేసుకొన్నవారు లేరు. బహుశః తన జీవితమునకు దైవ మందించిన ప్రథమ సత్ఫల మితడే నేమో!

సిద్ధార్థుడు నన్నొక వ్యక్తిగనే గౌరవించు చున్నాడు. వేశ్యగ కాదు. తనకు వలసిన విషయమును సూటిగ కోరి వానిని పొంది కృతజ్ఞతను ప్రకటించుట యిప్పటికి రెండుమారులు జరిగినది. అతనిలో కామవాంఛ యున్నచో ఏదియో పని కల్పించుకొని తన వద్దకు వచ్చి తనను ప్రశంసించుచూ భాషణము లాడెడివాడు కదా! ఇతర పురుషులందరూ తననట్లు చేరినవారే. వారికి తన సౌందర్యము కావలెను. తా నవసరము లేదు. కావున వారి భాషణములు లోతు లేక యుండును. భాషణములలో వెలితి యుండును. వెకిలి నవ్వులు, చూపులు వుండును. తన్ను భ్రమ పెట్టుట, ఆశ పెట్టుట కూడ చేయుచు నుందురు. వృథా కాలయాపన

చేయుదురు. మజ్జిగకు వచ్చి ముంత దాచునట్లుండును వీరి ప్రవర్తన. సిద్ధార్థుడట్లుగాక భిన్నముగ తనకు గోచరించిన మొదటి పురుషుడు. స్నేహము విలువ తెలిసినవాడు. అతనికి స్నేహము వ్యాపారము కాదు. ఆదుకొనుటయే గాని దోచుకొనుట కాదు. తనకు దోచుకొను బుద్ధి లేదని నిశితముగ పలికినాడు.

సౌదామనికి సిద్ధార్థుని యందు మును పెరుగని కొన్ని అరుదైన విలువలు గోచరించినవి. అతని వద్ద గల పెద్ద సంపద అతని వ్యక్తిత్వమే. ప్రస్తుతమున మరి యే సంపదలు లేనప్పటికి అతడు దరిద్రుడు కాదు. తప్పక అతడు శీఘ్ర కాలముననే అత్యంత సంపన్నుడు కాగలడని తన కనిపించుచున్నది. సంపద యున్నను, లేకున్నను అత నొక్కమాదిరిగనే యుండునని సౌదామనికి గోచరించినది. **భావ దారిద్ర్యము లేనివారిని భౌతిక దారిద్ర్య మేమి చేయగలదు.** లేనప్పుడు జలమును త్రాగి పరుండుట, వున్నప్పుడు భుజించుట నందరికి సాధ్యమా! ఈ సిద్ధార్థుడొక విలువైన మనిషి. తనకు సమీపమున చేరినాడు. ఈ చేరువ తా నూహించినది కాదు. అత డూహించినది కాదు. దైవ సంకల్పము అని భావించినది సౌదామని.

ఏది ఏమైనను తన యాంత్రిక నిర్జీవ జీవన యానమున సిద్ధార్థుని పరిచయము నొక మలుపును సూచించుచున్నది. అదియేమో తనకు తెలియదు. ప్రస్తుతమునకు ఊహ కందని విషయము. ఆనందమగు విషయము. నే డతనిని భోజనమున కాహ్వానించినది సౌదామని. అతను వచ్చెదనని పలికినాడు. తప్పక

వచ్చును. సమయమునకే వచ్చును. అతనికి మంచి భోజన మేర్పాటు చేయవలెను. ఆ భావనతో సౌదామని చటుక్కున లేచి వంట గదికి పోయినది. స్వయముగ తానే వండుటకు నిర్ణయించినది. పరిచారిక లాశ్చర్యపడిరి. మౌనముగ కోరిన సహాయము చేసిరి. రక రకముల వంటలు ఒక దాని వెంట ఒకటి తయారగు చున్నవి. కొన్ని కూరల వంటలు, కొన్ని పప్పుల వంటలు, మరికొన్ని పిండి వంటలు, ఇంకొన్ని తీపి వంటలు, పాయసములు. ఇవిగాక మూడు రకము లాహారములు. రకరకముల పండ్లు. చేసిన వంటలన్నియు భోజనాలయమున పరిచారికలు అందముగ అమర్చినారు. అటుపై సౌదామని వచ్చి చూచినది. పండ్లుకాక పదహారు వంటలు వుండుట చూచి ఆనందపడినది. పరిచారికలు గుసగుస లాడుకొనుచుండిరి. అతిథి ఎవరో రాజకుమారుడై వుండవచ్చునని కొందరు భావించిరి. ఎవరికి వారు వారి వారి అనుభవములను బట్టి, ఊహాగానములను గావించిరి. సమయమునకు సిద్ధార్థుడు ప్రవేశించెను.

సౌదామని విందు ఏర్పాట్లకు విస్తుపోయి గుసగుస లాడుతున్న పరిచారికలకు సిద్ధార్థుని ప్రవేశము అనూహ్యమై నిలచినది. కొందరాశ్చర్య పడినారు. మరికొందరు సంతోషపడినారు. ఇట్లు గుసగుసలాడినారు.

"ఇతడేనా మన మూహించిన రాజకుమారుడు!"

"ఇతడు బ్రాహ్మణుడు కదా! అందులకే శాకాహార భోజనము కాబోలు."

"ఈ విందు భోజనమున కితనే సరియైన అతిథి. ఇతడు స్ఫురద్రూపి, మితభాషి, సుందరుడు, యువకుడును కూడ."

"ఇత డిప్పటికే మన యజమానురాలితో చక్కని మైత్రీ బంధమును పెంచుకొనినాడు."

"ఏది ఏమైనను సౌదామనీ దేవి ఎవ్వరికిని యింతవరకు ఇంటికి పిలచి భోజనము పెట్టలేదు. తాను స్వయముగ వంటచేసి భుజించిన దినములు బహుకొద్ది. బహుశ సిద్ధార్థుని యెడల ఈమెకొక ప్రత్యేక గౌరవభావముండి యుండవలెను."

"ఇతడు మనమెరిగిన మొదటి పగటి అతిథి. కనుక ఇతర పురుషులకన్న భిన్నమైన వాడై వుండవచ్చును."

సిద్ధార్థుడు ప్రవేశించగనే సౌదామని యెదురేగి ఆహ్వానించి ఆసనమును చూపించి తానును కూర్చుండి ఇట్లు పలికినది.

*సౌదామని :* సమయపాలనము నీ కత్యంత ప్రియమగు విషయము కాబోలు. నేనూహించిన సమయమునకే నీ వేతెంచితివి.

*సిద్ధార్థుడు :* **సమయపాలనము కార్యసిద్ధి కత్యంత ముఖ్యము. సమయపాలనము చేయువారిని కాల మనుగ్రహించును. కార్యసిద్ధికి సమయపాలనము ప్రధానమగు లక్షణము.** నేనీ నియమము చిన్న తనముననే మా తండ్రిగారి యొద్ద నేర్చియుంటిని. ఇప్పుడది నా స్వభావమున ఒక భాగము. నిజమునకు ఇంకొంత ముందుగనే వచ్చియుండెడి వాడను. ముందుగ జనుమని మనసు చాల ప్రోత్స

హించెను. కాని ముందుగ వచ్చినచో నీకు సౌకర్యమగునో కాదో యని సమయమునకై వేచియుంటిని.

*సౌదామని :* ముందు వచ్చినచో బాగుండెడిది. అసౌకర్య మయ్యెడిది కాదు. ఇంతకును ముందు రావలెనన్న భావము ఎందు లకు కలిగినది?

*సిద్ధార్థుడు :* నిన్ను ముందుగ చూచుటకే. నేనేదియు దాచు కొనను. నీయందు నాకు మొదటిసారిగ స్నేహభావము కలిగినది. జీవితమున నీవు పొందిన అవగాహనము నాకు నచ్చినది. నా మనసున నీకు గౌరవస్థాన మున్నది. నీతో భాషించినపుడు నాకు సరిసమానమగు మనిషితో మాట్లాడుతున్న భావము కలిగినది. ప్రపంచము నిన్నెట్లు భావించినను నీయందు నాకొక పవిత్రత గోచరించినది. అది నన్నాకర్షించినది. కేవలము అందమే అయినచో బహుశ నా మనస్సు ఆకర్షింపబడెడిది కాదేమో! నీ అందము వెనుక ఒక చీకటిని అందరు చూచెదరు. ఆ చీకటి వెనుక గల వెలుగును నేను దర్శించితిని. జీవితములో లోతు లనుభవించిన వారన్న నా కిష్టము. లోతులలోనే సత్యమున్నది. లోతులలో నిశ్శబ్దము కూడ నున్నది. లోతులలో జీవుడు తాను ఒంటరివాడని తెలియగలడు. ఆ ఒంటరితనమునకు అదే లోతులలో నిశ్శబ్దములో మరియొకరు తోడైన ఆనందము కలుగుచుండును. జీవితపు పై పొరలలో భ్రమలలో అనేకానేక ఆకర్షణలతో జీవించువారు మెండు. లోతు లెరిగినవారు బహుకొద్ది. నీలోని లోతులు బహుశ నన్ను మాటిమాటికి నీవద్దకు కొనివచ్చుచున్న వేమో?

సౌదామని కన్నులు సిద్ధార్థుని భాషణమునకు చమర్చినవి.

*సౌదామని :* నీవన్నది నిజమే. ఈ ప్రపంచ మంతయు గమ్మత్తుగ నుండును. ఒకరిని గూర్చి ఒకరు చేయు భావనము, ఒకరితో నొకరు ఏర్పరచుకొను బంధములు అన్నియు లౌకికములే. **ఒకరితో నొకరికి గల అవసరములను తీర్చుకొనుటకు బంధము లేర్పరచుకొందురు. అవి సంబంధము లనుకొందురు. సంబంధము లైనచో ఒకరిపై నొకరికి హక్కులుండవు. సమ్యక్ బంధమే సంబంధ ములుగ ఒకరి కొరకు బాధ్యత పడుటయేగాని, ఒకరిపై నొకరికి హక్కులేదని తెలిసి ప్రవర్తించుట సంబంధమగును. ఒకరిపై నొకరికి హక్కు లేర్పడినచో అది బంధమే అగును.** ఇదియొక సున్నితమగు అవగాహన. జీవితమున ఈ లోతులు లేనివారి కిది తెలియదు.

*సిద్ధార్థుడు :* ఇంతకును భోజనమునకు వచ్చి సరాసరి గంభీరమగు విషయములలో బడితిమి. ఇంకను ఎవరైన రావలసి యున్నదా?

*సౌదామని :* లేదు. మన మిరువురమే భుజింతుము. భుజించిన వెనుక మాట్లాడుకొన వచ్చును.

సౌదామని లేచి సిద్ధార్థుని భోజనముల గదిలోనికి కొని పోయినది. అచ్చట యిద్దరు పరిచారికలు వేచియున్నారు. వా రిరువురికిని ఆసనములు చూపించినారు. సిద్ధార్థుడు, సౌదామని ఆసీనులైనారు. పరిచారిక యొకతె ఒక వెండిగిన్నె, ఒక గ్లాసులో నీరు సిద్ధార్థుని వద్దకు కొనివచ్చినది. చేతులు కడుగుకొనుటకు

కాబోలు అని భావించి సిద్ధార్థుడు హస్త ప్రక్షాళనము గావించెను. అటుపైన కూర్చున్న ఆసనమున కెదురుగ భుజించుటకు సదుపాయముగ ఇద్దరకును చిన్న బల్లలు పరిచారికలు ఏర్పరచిరి. ఆ బల్లలు చాలా అందముగ నున్నవి. వాటిపైన తెల్లని వస్త్రములు వేసి ఇద్దరికిని పెద్ద వెండి పళ్ళెములు, లోటాలు అమర్చిరి. అన్నము తప్ప మిగిలిన పదహారు వంటకములు చిన్నచిన్న వెండిగిన్నెలలో అమర్చి వెండి పళ్ళెము చుట్టనూ పేర్చిరి. మధ్యలో కొన్ని రొట్టెలు, కొంత అన్నము వడ్డించిరి. పరిచారికలు మౌనముగ అన్ని ఏర్పాట్లు చేయుచుండిరి. సిద్ధార్థుడు గమనించు చుండెను. వారు సుశిక్షితులు. మర్యాదలు తెలిసినవారు. మౌనముగ వడ్డించి వంట, భోజనముల గదులను కలుపు ద్వారము వద్ద నిలబడిరి.

సౌదామని చిరునవ్వుతో భుజింతుమా? అని పలికెను.

*సిద్ధార్థుడు :* లంకణములు చేసినవానికి విందు భోజనమా? పదహారు వంటకము లున్నవి. చూడగనే కడుపు నిండినది. ఇక ఏమి భుజింపగలము? భోజన మనుకొంటిని గాని, ఇది రాజ భోజనము. ఒక పెద్ద విందు. చిన్నతనమున అప్పుడప్పుడు ఇంటిలో యిటువంటి భోజనము చేయుచుండెడివాడను. ఇట్టి భోజనముచేసి పుష్కరము దాటినది. అన్నియును భుజించినచో తప్పక జబ్బు చేయగలదు.

*సౌదామని :* నవ్వుచూ, నీకు కావలసినదియే భుజింపుము. మిగిలినది కూడ సద్వినియోగము కాగలదు అని పలికెను.

*పరిచారిక :* అమ్మగారు స్వంతముగ అన్నియూ మీ కొరకై ప్రత్యేకముగ వండినారు. మే మెన్నడూ ఆమె వండుట చూడలేదు. మా అమ్మగారు అన్నిటియందు సిద్ధహస్తులు. వంట విషయమున కూడ నంతే. ఆమె వండిన తీరు మాకు ఆశ్చర్యము కలిగించినది. మీరు అన్నియునూ రుచి చూచిన మే మానందింతుము.

సిద్ధార్థు డాశ్చర్యపోయినాడు. లోన ఆనంద పడినాడు. సౌదామని వైపు ప్రశంసాత్మకముగ చూచినాడు. ఆమె నవ్వి వలసినదే భుజింపుమని మరల తెలిపినది. సిద్ధార్థు డుపక్రమించి క్రమముగ అంతయును మారడుగక భుజించి త్రేన్చెను. పదార్థములు చాల రుచిగ యున్నవని ప్రశంసించెను. పరిచారికలు ఇరువురికిని చేతులు కడుగుకొనుటకు నీరు, తుడుచుకొనుటకు తువాలుల నందించిరి. భోజనము ముగిసినది. పరిచారికలను మర్యాద పూర్వకముగ పలుకరించి సిద్ధార్థుడు ముందు గదిలోనికిపోయి కూర్చుండెను. మిగిలిన వంటకము లన్నియూ ఇంటిలోని పనివారందరూ భుజింపుడని తెలిపి సౌదామని కూడ ముందు గదిలోనికి వచ్చెను. అంతలో నొక పరిచారిక పళ్ళెములో తమలపాకులు, వక్కలు, ఏలకులు, లవంగములు, వెండిగిన్నెలో సున్నము అమర్చెను.

సౌదామని తాంబూలము స్వీకరింతువా? అని అడిగెను. సిద్ధార్థు డలవాటు లేని పని అని తెలిపెను. సౌదామని బలవంతము చేయక తాను తాంబూలము స్వీకరించెను. ఆమె తాంబూలమును ఆకుపై ఆకుగ స్వీకరించు చున్నపుడు సిద్ధార్థు డామెను

తదేకదృష్టితో చూచుచు నుండెను. ఆమె చేతి వ్రేళ్ళు, హస్తము, చేతులు అతి సున్నితముగ కదలుచుండగ వాని సౌందర్యమును చూచుచుండెను. సున్నము వ్రాసిన ఆకులను నోటియందిడుకొని నములుచుండగ ఆమె పెదవులను, నోటిని పరిశీలనగ చూచెను. తాంబూలము కారణముగ ఎఱ్ఱని పెదవులు మరింత ఎఱ్ఱబడినవి. తెల్లని దంతములు దానిమ్మ గింజలవలె ఎఱుపును సంతరించుకున్నవి. తాంబూల మామె ముఖమునకు మరింత శోభ గూర్చినది. ఆమె ముఖము, చేతులు, కదులుచున్న నోరు చూచుచు సిద్ధార్థుడు భావ లోకముల లోనికి అదృశ్యమయ్యెను. ఇంతలో సౌదామని నవ్వుచూ "కన్నార్పక చూచుటలోని ఆంతర్యము?"

సౌదామని ప్రశ్నకు ఉలిక్కిపడి సిద్ధార్థుని నోటి నుండి అప్రయత్నముగ "పెదవులు" అని పలికి చటుక్కున ఆపినాడు. "సూటిగ నుండు వాడవు. ఎందుకీ ఉలికిపాటు. నీ భావములు ప్రకటించినచో నేనును ఆనందింతును కదా!" అని పలికినది. అప్పుడు సిద్ధార్థుడు మౌనముగ తలవంచుకొనెను. "పోనిమ్ము మరియేదైన మాట్లాడుకొందుము" అని పలికెను. సిద్ధార్థునికి లోన సిగ్గు, రోషము ఒక్కసారి కలిగినవి. తన కెప్పుడునూ ఇట్టి పరిస్థితి తారస పడలేదు. తనకు కలిగిన భావములు స్పష్టముగ పలుకుటయే తన కలవాటు. పలుకలేకుండుట ఓటమిగ అనిపించు చున్నది. దాని వలన రోషము కలుగుచున్నది. చెప్పుటకు ధైర్యమున్నను అభిమానము, సిగ్గు అడ్డు వచ్చుచున్నవి. తను ఇటువంటి ఇరుకులో ఎప్పుడునూ పడలేదు. ఇంతలో సౌదామని "స్నేహమంటివి, స్నేహమున అరమరికలుండవు కదా! దీర్ఘాలోచనలో పడుటకన్న మరి ఏదైన మాట్లాడుకుందము" అని కవ్వించినది.

సిద్ధార్థుడు మరింత రోషపడి భాషించుటకే నిర్ణయించు కొనినాడు. నిర్ణయము కలుగగనే తనలోన అలజడి తగ్గినది. వెంటనే ముఖముపై చిరునవ్వు యేర్పడినది. నవ్వుచు యిట్లని పలికెను. సభ్యత కొఱకే పలుకలేదు. నీవు స్నేహమును గుర్తు చేయగనే అలజడి తగ్గి పలుకుచున్నాను. నీవు తరచి తరచి అడుగుటచే తెలుపుచున్నాను. **నిజమునకు ముఖస్తుతి సద్గుణము కాదు**. అయినను ఇపుడు చేయక తప్పదు. నా మాటల యందలి సత్యమును స్వీకరించి స్తుతిగా భావింపక వినుము.

“నీవు నిస్సందేహముగ సౌందర్యవతివి. నీ ఈ సౌందర్య మెందరో పొగిడి యుందురు. నీవు తాంబూలము స్వీకరించు సమయమున, భోజనము చేయు సమయమున నీ హస్తములు, నీ వ్రేళ్ళు చేయు కదలికలు– భోజనము, తాంబూలము నమలుచున్న సమయమున ముఖము, పెదవులు, వ్రేళ్ళ కదలికలు చూచుచు నుంటిని. తాంబూలముతో ఎఱ్ఱబడిన నీ పెదవులు ఎఱ్ఱదనమునకే అందము కూర్చినవి. ఇట్లు చూచుట నాకు ప్రథమానుభవము. స్నేహభావముతో తెలిపితిని” అని పలికెను.

సౌదామని కొంత తడవు మౌనము వహించి ఇట్లనెను. “నీవు తెలిపినది నే నెరిగిన సత్యమే. ఇతరులు నా సౌందర్యమును మెచ్చుకొనినపుడు నా కానంద మనిపించదు. వారి మెచ్చుకోలు వెనుక స్వార్థమున్నది. నీ ప్రశంస వెనుక నాకట్టి స్వార్థము కనపడ లేదు. ఇంతకును నాకొక సందేహ మున్నది. వివరింపగలవా?

సిద్ధార్థుడు తలయూపెను. సౌదామని యిట్లని ప్రశ్నించెను.

“స్నేహమునకు, ప్రేమకు గల సంబంధమేమి? వాని మధ్యగల వ్యత్యాస మేమి? దేనిని ప్రేమ యందురు? దేనిని స్నేహ మందురు?”

సిద్ధార్థుడిట్లు పలికెను : “స్నేహమైనను, ప్రేమయైనను బంధము కారాదు. అపుడే అవి నిర్మలమై యుండును. బంధములేని స్నేహము, ప్రేమ ఆకాశమంత విశాలమై యుండును. స్నేహము ప్రేమకన్న మించినదని నా మతము. **చెట్టు పుట్ట పర్వతము నది నక్షత్రములు, ఆకాశము, సముద్రము వీటన్నింటితోను స్నేహము చేయవచ్చును. వీనితో చేయు స్నేహమున బంధము లేదు.** సౌదామని అడ్డుపడుచు నిట్లనెను. “ఇచట స్నేహము చేయుట అనగా అందు అంతర్లీతముగ ప్రేమ యున్నది కదా! చెట్టును జంతువును స్నేహముతో లాలించునపుడు, స్పృశించునపుడు ప్రేమ పుట్టును కదా! ఇచట నీవు పలికిన స్నేహము ప్రేమకు పర్యాయ పదమేమో?”

*సిద్ధార్థుడు :* సౌదామనీ! నీవు చాల తెలిసిన దానివి. అది నాకు తెలియును. నన్ను తెలుపమంటివి కదా! పూర్తిగ నా భావమును ఆవిష్కరింపనిమ్ము. అటుపైన ప్రశ్నింపవచ్చును.

సౌదామని నోటికి చెయ్యి అడ్డుపెట్టుకొని నవ్వుచు కూర్చుండెను. సిద్ధార్థుడిట్లు కొనసాగించెను. **“స్నేహమున ఒకరినొకరు మన్నించుకొనుటయే యుండును గాని ఒకరిపై నొకరు ఆధారపడుట యుండదు. స్నేహము బంధమైనచో అందుండి శత్రుత్వము పుట్టు నవకాశము కలదు. స్నేహితులు శత్రువులగుట,**

**శత్రువులు స్నేహితులగుట స్నేహబంధమున కుండును గాని స్నేహమున కుండదు.**"

*సిద్ధార్థుడింకను ఇట్లు పలికెను :* "నిజమునకు స్నేహమునకు ఫలము స్నేహమే. స్నేహమునకు యిచ్చుటయే తెలియును, పుచ్చు కొనుట తెలియదు. పండ్లను కోరి చెట్టుకు నీరు పోయుటకును, పండ్లను కోరక చెట్లకు నీరు పోయుటకును వ్యత్యాసము సులభము గనే తెలియును కదా! ప్రతిఫలము కోరక నిర్వర్తించునది స్నేహ మగును. అందాశింపకుండుటయే ఆనందమునకు కారణము. ఇవి అన్నియును ప్రేమలో కూడ నుండును. స్నేహము, ప్రేమ అప్రయత్నముగనే కలుగును. రెంటికిని మనస్సుతో సంబంధము లేదు. మనస్సుతో నిజమునకు పనికూడ లేదు. మనస్సనుమతి లేకయే నిజమైన ప్రేమ, స్నేహము జనించును కనుక అవి మనస్సు మాట వినవు. రెండునూ హృదయమున జనించు విషయములు. మనస్సు కూడ హృదయము నుండి పుట్టినదే. కనుక మనస్సు తోబుట్టువే కాని అది కనిష్ఠుడు. స్నేహము, ప్రేమ కనిష్ఠునకు జ్యేష్ఠ సోదరీమణుల వంటివి. స్నేహము, ప్రేమ మనస్సును చిన్నవానిని గను, అన్నీ తెలియని వానిగను చూచును. ఈ తమ్మునికి అక్కల భావము అర్థము కాదు. ఆ అక్కలు తమ్ముని కన్నియు తెలుపరు. మనస్సు అన్ని విషయముల యందు ప్రయోజనము కోరుచుండును. హృదయము ప్రయోజనమును కాక ఆనందమును కోరుచుండును. హృదయమున అది స్ఫూర్తికాగ, మనస్సు అనునది అవసరము, ప్రయోజనము. ప్రేమలో 'పొందుట' అన్న భావము లేక 'యిచ్చుట'

అన్న భావము మాత్రమే నిలచినచో అది స్నేహ మగును. పొందుట అను క్రీనీడ పడగనే స్నేహము ప్రేమగ దిగజారును.

"ఉదాహరణకు నూతన వధూవరులు ఒకరి నొకరు ప్రేమించుకొందురు. ఆ ప్రేమలో ఒకరి నుండి ఒకరు ఆశించుట మెండుగ నుండును. ఆ దంపతి ముప్పది సంవత్సరములు కలిసి జీవించిన తరువాత వారు ఒకరినొకరు ఆశించక స్నేహమున నుందురు. కావున ప్రేమ కన్న స్నేహము మిన్నది. స్నేహమున కృతజ్ఞతలు పలుకుట కూడ నుండదు. ఒకరి నొకరు ప్రతి నిత్యము ప్రశంసించుకొనుట కూడ నుండదు. కలసి యుండుటయే యుండును గాని ఆశించుట యుండదు. కనుక ప్రేమకు పర్యవసానము స్నేహ మగును. స్నేహము చలికాల మందలి భోగి మంటవలె వెచ్చగ నుండును. వేసవి కాలమందలి శీతల పానీయమువలె చల్లగ నుండును. స్నేహమున కామ ముండదు. ప్రేమకు కామ మను క్రీనీడ ఎప్పుడునూ పొంచియుండును. వెలుగుకు నీడవలె ప్రేమకు కామ మను వికృతి యున్నది. స్నేహమునకు అట్టి అపాయము లేదు. ఇది నా భావన."

సౌదామని సిద్ధార్థుని చూచుచు నుండిపోయినది.

*సిద్ధార్థుడు :* "ఎట్లున్నది నా సిద్ధాంతము?"

*సౌదామని :* "బాగున్నది. కాని నీది సిద్ధాంతమే కాని అనుభవైక సత్యము కాదని అనిపించు చున్నది. ఇంతకును అన్నిటి యందును నీవు కోరినది స్వాతంత్ర్యమని తెలిసినది.

ఏదియు బంధము కాకూడదని తెలిసినది. నావరకు నిజమగు ప్రేమకు, స్నేహమునకు వ్యత్యాసము లేదనిపించును. నేనింకను తెలియవలసినది యున్నది. నీకు కూడ తెలియవలసిన దున్నదని తెలిసినది. జీవితమే అన్నియును నేర్పగలదు. నీ వంటి స్నేహితుడు దొరకుట నా అదృష్టము. ప్రతి ఆదివారము నీవిచ్చుటకు భోజనమునకు వచ్చినచో చాల సంతోషించుదును. జీవితమును గూర్చి మనకు గల అవగాహనలను పంచుకొన వచ్చును."

ఇంతలో తేనీరు వచ్చినది. ఇద్దరును తేనీరు గొనుచు ఒకరి నొకరు చూచుకొనుచు పానము ముగించిరి. సిద్ధార్థుడు ఇక శెలవా? అని పిలికి, సౌదామని తలయూపగ గృహము వెలుపలకు బయలుదేరెను. సౌదామని అతనిని సింహద్వారము వరకు అనుసరించినది. ఆమె అచ్చట నిలబడగ సిద్ధార్థు డొకమారు మందహాసము చేసి ముందుకు సాగెను. సౌదామని చూచుచు నుండిపోయెను. సిద్ధార్థుడు వెనుతిరగక సూటిగ తన నివాసమునకు చనెను. సౌదామని లోన మరల నిట్లు భావించినది. ముందు చూపేగాని వెనుక చూపులేని మనిషి, త్వరలో ముందు వెనుకలు తెలియగలడు.

సిద్ధార్థుడు తన నివాసమున కేతెంచెనే కాని, అతని మనస్సు మాత్రము సౌదామని పలికిన చివరి మాటలతో నిండిపోయినది. తనకింకను తెలిసికొనవలసినది యున్నదని, స్నేహము, ప్రేమ విషయమున తన అవగాహన పరిపూర్ణము కాదని, ఆమె కూడ యింకను తెలుసుకొనవలసి యున్నదని స్పష్టముగ పలికినది. తనతో నిట్లు పలికినవా రింతవరకును లేరు.

తండ్రి అనురాగముతో స్నేహపూర్వకముగ సూచించినాడే గాని యిట్లు సూటిగ తనతో పలుకలేదు. పలికినను వినెడివాడను కానేమో! అపుడింకను ఆవేశము మెండుగ నుండెడిది కదా! ఈ పుష్కర కాలములో కొంత ఆవేశము తగ్గినను గోవిందుని సహవాసమున నేను చెప్పుట, అతను వినుటగ సాగినది. చెప్పుట అలవాటైన తనకు యింకొకరు తనకు చెప్పినప్పుడు అది తనకు చేదుగ నుండునని తనకిపుడు తెలియుచు నున్నది. తండ్రి చెప్పినను చేదనిపించలేదు. ఆయన తనకు చెప్పగలిగిన స్థానము నందున్నాడు. గోవిందుడు వినుటయే గాని చెప్పుట చేయలేదు. చివరకు తనకు హితము చెప్పబోయి భంగపడినాడు. బాధ పడినాడు. ఆ బాధ నుండి ఒక సత్యమును పలికినాడు. తనకు అహంకార మున్నదని హెచ్చరించినాడు. నిజమని తెలిసినది. బుద్ధుడు హెచ్చరించినపుడు కూడ తాను కొంత భంగపడినాడు. తండ్రి, బుద్ధుడు తనకు చెప్పగలిగిన స్థితిలో నున్నవారు. గోవిందుడు, సౌదామని తన తోటివారు. వారు కూడ తనకు సున్నితముగనే తమ భావములను చెప్పుచున్నారు. సౌదామని మాటలు తన మనసు చుట్టును తీతువు పిట్టలవలె తిరుగుచున్నవి.

భావ పరిష్కారమునకై సిద్ధార్థుడు గంగానదీ తీరమునకు సాయంకాల సమయమున చేరుకొనెను. నదీ ప్రవాహమును చూచుచు దాని ఉధృతమును, తన భావముల ఉధృతముతో పోల్చుకొని చూచుచు నుండిపోయినాడు. గంగా ప్రవాహము విశాలమై ఉధృతమై కళ కళ ధ్వనులతో పారుచుండగ సిద్ధార్థుని మనో ప్రవాహము అందు లయమైపోయినది. ప్రవాహ మందలి

ధ్వనితో సిద్ధార్థుని మనస్సేకత్వము చెందినది. సాయంకాలము గడచిపోయినది. సాయం సంధ్య కూడ గడచినది. చీకటిపడినది. సిద్ధార్థుని మనసు మరల లయము నుండి ఉద్భవించినది. మనసు పుట్టగనే చుట్టును గల చీకటిని చూచి అతడు కొంత నిశ్చేష్టుడైనాడు. తాను నదిని చేరి, నదిని చూచుటలో నిమగ్నమగుటయే తనకు తెలుసును. అప్పటికింకను సూర్యుడు పశ్చిమమున గోచరుడే. అప్పటి నుండి యిప్పటి వరకు తన కేమైనదో తెలియలేదు. మనస్సు లేని స్థితిలో తానెట్లుండెనో తనకి తెలియలేదు. ఒకటి మాత్రము తెలిసినది. భావముల ఉధృతము తగ్గినది. ప్రశాంత మనస్కుడై తన నివాసము చేరి క్లుప్తముగ భుజించి పరుండినాడు.



# 7

సోమవారము నుండి శనివారము వఱకు వ్యాపార బాధ్యతలను నిర్దిష్టముగ నిర్విరామముగ సాగించి ఆదివారము ఉదయముననే శుచియై సిద్ధార్థుడు గంగానదీ తీరమున మరల చేరినాడు. ప్రాతః కాలమున నది ఎంతయో ప్రశాంతముగ ప్రవహించుచు గోచరించినది. నదీ తరంగములు చల్లని పిల్లవాయువులను తన వైపునకు ప్రసరించుచున్నట్లుగ సిద్ధార్థునకు తోచినది. నదీమ తల్లి తనకు ప్రాతః సమయమున శుభాకాంక్ష లందించు చున్నట్లుగ సిద్ధార్థునికి భావన కలిగినది. ఆ పిల్లవాయువుల లాలనలో తన శరీరము, మనస్సు చల్లబడినవి. ఆ చల్లదనపు స్పర్శయందు సిద్ధార్థునికి అనురాగము గోచరించినది. చిన్నతనపు తల్లి స్పర్శ స్మృతిపథమున మెదలినది. కన్నుల వెంట నీరు జాలువారినది. గంగమ్మతల్లి తన తల్లిని పిల్లవాయువుల రూపమున తనకు స్పర్శగా అందించినది. కన్నులవెంట ధారగ నీరు కారుచుండగ అతడు చేతులెత్తి గంగకు నమస్కరించినాడు. పరలోకమున నున్న తల్లిని స్మరించి, నమస్కరించగ లోనుండి కట్టలు తెగి ప్రవహించినట్లు దుఃఖము వచ్చినది. తన తల్లి తననెంతో అల్లారుముద్దుగ పెంచినది. ప్రేమతో లాలించినది. సుద్దులు చెప్పినది. ఆమె ప్రేమను తాను పొందినాడు. యుక్త

వయస్సునకు పెరుగగ మనస్సునందు లేతదనము తగ్గి, తల్లి ప్రేమను మమకారముగ దర్శించినాడు. తానెంత మూఢుడు. ఆమె మనస్సెంత కష్టపడినదో? విధిలేక తల్లి తనను ఆశీర్వదించినదే కాని హృదయపూర్వకముగ కాదు. తల్లి దీవెన పొందని తనను దైవ మనుగ్రహించునా?

తల్లిని గుర్తుచేసిన గంగమ్మతల్లికి మరొకసారి మ్రొక్కగా తల్లిని గూర్చిన మరికొన్ని భావములు సిద్ధార్థుని మనస్సులో మెదలినవి. ఆత్మానుభూతి యను ఆశయము మనస్సు నావరించగ తాను పసితనము వలన తల్లిని నిరాదరించినాడని సిద్ధార్థుని కవగతమైనది. తల్లి కంటనీరు పెట్టక తన నాశీర్వదించి పంపిన ఘట్టము కన్నులలో మెదలినది. ఆమె ఎంతటి స్థితప్రజ్ఞురాలు. నా ఆశయము సిద్ధించుటకై ఆమె త్యాగమునకు సిద్ధపడినది. ప్రేమకు త్యాగము ప్రాణమని సిద్ధాంతమే తనకు తెలుసును. తల్లికి తదనుభూతి మిగలగా తనకు సిద్ధాంతము మిగిలినది. ఆమె జీవిత మంతయు పరికించి చూడగ సిద్ధార్థునికి ఆమె త్యాగమయి అని, ప్రేమమయి అని గోచరించినది. తన తండ్రి నిర్వర్తించు సమస్త కార్యములందును శ్రమ అని భావించక ఆమె సహకరించినది. అందరిని ఆదరించుట, ప్రేమించుట, భుజింపచేయుట, వారి సౌకర్యములను చూచుటలో పగలంతయు ఆమె శరీరము యంత్రమువలె పనిచేయుచుండగ హృదయము ఆనందానుభూతి పొంది యుండవలెను. లేనిచో యుక్త వయస్సు నుండి వృద్ధాప్యము వరకు అదే శ్రమతో, శ్రద్ధతో నిర్వర్తించుట దుర్లభము. ఆమె చేతి భోజనము భుజించిన వారందరును ఆమె యందలి మాతృమూర్తిని చూచిరి. వయస్సుతో నిమిత్తము లేక ఆమె అందరిని మాతృ

భావనతో మన్నించెడిది. ఆమె ఉన్నతత్త్వము తనకు తెలియలేదు. తండ్రి చేయు బోధనలను తనబోటి వారందరూ మనస్సుతో స్వీకరించగ, ఆమె సూటిగ హృదయముతో స్వీకరించినది. **మనసుతో బోధనలను స్వీకరించిన వారు, సిద్ధాంతములలోనికి ప్రవేశించుదురు. హృదయముతో స్వీకరించినవారు, సరాసరి దివ్యానుభూతిని పొందుదురు.**

జీవునికి వలసినది అనుభూతియే కదా! సిద్ధాంతములు కడుపు నింపవు. వాని వలన హృదయములు పొంగవు. బోధనల నుండి హృదయము పొంగినచో పర్యవసానము మనోవికాసము. మనసు వికసించినచో జీవునికి బుద్ధిలోక ప్రవేశము కలుగును. బుద్ధి లోకముననే ఆనందము లభించును. తన తల్లి సుశీలమ్మ బుద్ధి లోకమున జీవించుచు తదానందమును పొందుచు మనస్సు, ఇంద్రియములు, శరీరమును నిత్య నైమిత్తిక కర్మల యందు వినియోగించినది. ఆమె హృదయములోనుండి తన మనస్సు, ఇంద్రియములు, శరీరమొక సాధనముగ, వాహనముగ, యంత్రముగ వినియోగించినది. భగవద్గీతయందు ఈ స్థితినే కర్మసన్న్యాస యోగ మందురు. మనో, యింద్రియ, శరీరములు క్షర పురుషుడుగ, అందు వశించు జీవుడు అక్షర పురుషుడుగ భగవద్గీత కీర్తించును. ఆమె అక్షరమై క్షరమగు మనో యింద్రియ వ్యాపారముల నుండి విడివడి నిలచి వానిని వినియోగించుట తనకిప్పుడు తెలియ వచ్చినది. కొబ్బరి కురిడీ కొబ్బరి పెంకు నుండి విడివడి అందుండుట, వేరుశనగ పప్పు పరిణతి చెంది తొక్కునుండి విడివడుట, వెలగపండు వెలగపెంకు నుండి విడివడుట, పండిన

దోసపండు తీగ నుండి విడివడుట ఇత్యాది ఉదాహరణ లన్నియు ఒక్కమారుగ సిద్ధార్థుని మనస్సున మెదలినవి.

*"ఉర్వారుక మివ బంధనాన్మృత్యో ర్ముక్షీయ మామృతాత్"* అని పలుకుటయే తనబోటి వారికి తెలిసినది. తన తల్లి కది అనుభవైకము. నిజమునకు తాను వెదుకబోవు విషయము లన్నియు తన యింటిలోనే యుండగ తాను గ్రుడ్డితనమున ఇల్లు వదలినాడు. తనకిపుడు తోడు తల్లిదండ్రుల ఆశీర్వచనమే. ఇట్లు భావించు చుండగ భాస్కరుడు తూర్పున ప్రచండుడగుట ప్రారంభించెను. అతని కిరణముల చురుకుదనము సిద్ధార్థుని, అతని భావపరంపరల నుండి మేల్కొల్పినది. తాను ఈనాడు సౌదామని గృహమున భుజించు విషయము జ్ఞప్తికి వచ్చినది. వడివడిగ నింటికి పోయి సేద తీర్చుకొని మరల స్నానమాచరించి నూతన వస్త్రములను ధరించి సమయమునకు సౌదామని గృహమునకు చనినాడు.

సౌదామని ఎప్పటివలెనే, సిద్ధార్థు నాహ్వానించి అతనితో కలసి భుజించి తాంబూలము గ్రహించి సిద్ధార్థుని వంక చూచుచు ఈ వారము వార్త లేమి? విశేషము లేమి? వ్యాపారము బాగుగ సాగుచున్నదా? భావ వ్యాపారము కూడ సాగుచున్న దనుకొందును. నీ భావపరంపరలు నీకు జీవితమున సహాధ్యాయులవలె తోడుగ నుండును కదా! నీ భావములను, సిద్ధాంతములను మరికొన్ని వినుటకు నా మనస్సుత్సహించు చున్నది. స్నేహభావముతో తెలుపుము. శ్రద్ధగ వినెదను అని పలికెను.

*సిద్ధార్థుడు :* క్రిందటివారము నీకు వీడ్కోలు తెలిపి గంగానదీ

తీరము చేరితిని. గంగ సమీపమున కూర్చుంటిని. ప్రప్రథమముగ జీవితమున గంగ యొద్ద కూర్చుండుట జరిగినది. గంగానది చక్కని అనుభూతి నిచ్చినది. నా అంతులేని భావ పరంపరలకు గంగమ్మతల్లి విడుపు చూపినది. అప్రయత్నముగ భావము లాగినవి. అట్లెంత సేపుండునో నాకే తెలియదు. మరల ఈ ప్రాతఃకాలముననే నదీ తీరము చేరి, నదిని దర్శించుచు కూర్చుంటిని. చాలకాలము తరువాత తల్లిని, తల్లిప్రేమను హృదయము నావిష్కరించినది. తల్లి విలువ, తల్లిలేని లోటు మనసు రుచి చూచినది. మొదలు కొంత పరితపించినను అటుపైన కొంత యూరట లభించినది. ఇవి ఈ వారము విశేషములు. వ్యాపార మందువా అది మనసుతో నిర్వర్తించునది. బాగుగనే సాగుచున్నది. ఈ రోజు నేను నిన్ను వినదలచితిని. కావున నా ప్రసంగ ముండదు. స్నేహము, ప్రేమ, బంధము, స్వతంత్రము అను అంశములను గూర్చి నీ అభిప్రాయము తెలిపినచో సంతసించెదను.

సౌదామని కొన్ని క్షణములు మౌనముగ నుండి అటుపై ఇట్లు తెలిపినది.

"నా దృష్టిలో స్వచ్ఛమైన ప్రేమ, స్నేహము ఒకటియే. అవి నాణెమునకు బొమ్మ బొరుసుల వంటివి. ఒకటి లేనిదే రెండవది లేదు. రెండవది లేనిదే మొదటిది లేదు. ప్రేమ లేని సత్యము, సత్యము లేని ప్రేమ వుండవు. వానిని విడదీయుట మనో లక్షణము. స్వచ్ఛమైన ప్రేమ, సత్యము హృదయజనితములే గాని మనోజనితములు కావు. మనస్సున కంతు పట్టునవి కూడ కావు. మనో లోకమున ప్రేమ, స్నేహము అనువానికి కారణమున్నది.

అనగ ప్రేమించుటకు కారణము, స్నేహము చేయుటకు కారణము యుండును. హృదయలోకమున ప్రేమ, స్నేహము కారణము లేకయే కలుగును. ఎంత వెదకినను ప్రేమకారణము, స్నేహకారణము కనబడవు. **వెదకుట మనోలక్షణము. ఉండుట, అనుభూతి చెందుట హృదయ లక్షణము. అందువలన హృదయమున జనించిన విషయ ములను మనసుతో తర్కించుట నిరుపయోగము.** కొందరికి కొంద రన్న తెలియకయే యిష్టము కలుగును. ఆ యిష్టమునకు కారణ ముండదు. ఎందుకిష్టపడుచున్నాను అని తనను తాను ప్రశ్నించు కొనినను సమాధానము దొరకదు.

**"రసానుభూతి హృదయ లక్షణము. ఎందులకా అనుభూతి కలుగుచున్నది అని మనసు ప్రశ్నించునపుడు మౌనమే సమాధాన మగును.** ఉదాహరణకు పసివానికి పంచదార యిష్టము. నీకు పంచదార ఎందుకు యిష్టము అని అడిగినచో, యిష్టము అంతే అని తెలుపునుగాని యిందువలన యిష్టము అని తెలుపడు. ఇందు వలన యిష్టము అని తెలియునవన్నియు మనో లోకపు అనుభూతులే. ఎందువలనో తెలియక యిష్టపడుట ఆనందలోకపు అనుభూతి. అక్కడ ఎందువలన? అను ప్రశ్నకు సమాధాన ముండదు. పెద్దలు తరచు యిట్లను చుందురు. ''రసపట్టులో తర్కము కూడదు'' ఇది సత్యము. గోపయ్య నల్లనివాడు. రాధ తెల్లనిది. "నల్లనివాడు కదా! ఏమి బాగున్నాడు" అని తల్లిదండ్రులు పలికినపుడు, రాధ "ఏమో నాకు తెలియదు! నా కిష్టము అంతే" అనెడిదట. ఇట్టి విషయము లలో తర్క మేమిచేయగలదు. ప్రేమ ఈ విధముగ తర్కమున కందనిది. దానినే నీవు స్నేహ మనుచున్నావు. నీ కింకను ప్రేమాను భూతి కలుగలేదు. నిజమగు స్నేహము యొక్క అనుభూతి కూడ

లేదు. ఇవి కలిగినవారి ప్రవర్తనమే కొంత వింతగ నుండును. కొంత పిచ్చిగ గోచరించును. ఇక దివ్యప్రేమను అనుభూతి చెందిన వారి గూర్చి చెప్పనక్కరలేదు కదా! వారు లౌకికులకు పిచ్చివారి వంటి వారు. **అలౌకికులకే, అలౌకికులు అర్థమగుదురు. లౌకికులకు, లౌక్యము మాత్రమే అర్థమగును.**

"సత్య మన్నను ప్రేమ యన్నను ఒకటే. నిన్ను పిలిచి స్వయముగ వండి భోజనము పెట్టుట స్నేహమా? ప్రేమా? నీవు నా పిలుపునకు ప్రతిస్పందించుట, భోజనమును ప్రశంసించుట, నన్ను ప్రశంసించుట స్నేహమా? ప్రేమా? మునుపు నీవెప్పుడైన నిట్లు ఎవ్వరితోనైన ప్రతిస్పందించితివా? నీవు తెలిపిన నీ గత చరిత్రలో అట్టి సన్నివేశము లేదు. అపుడేల ప్రతిస్పందన లేదు. ఇప్పుడేల కలుగుచున్నది. కారణము చెప్పగలవా?"

*సిద్ధార్థుడు :* దానిని గూర్చియే ఆలోచించు చున్నాను. నిన్ను గూర్చి భావములు తెరలు తెరలుగ వచ్చుచున్నవి. మనసు నిన్ను నిరంతరము ప్రశంసించుచునే యున్నది. సరియైన కారణ మింకను తెలియదు. తెలిసినచో తెలిపెదను.

*సౌదామని :* తెలియక ఇష్టము పుట్టుటయే స్నేహము లేక ప్రేమ. ఎంతకాలము గడచినను కారణము తెలియలేదు. ఎందు వలననగా మన పరిచయము స్వార్థము నుండి పుట్టినది కాదు.

సౌదామని సిద్ధార్థునితో యింకను యిట్లనెను.

"స్నేహము, ప్రేమ యుండవచ్చును కాని స్నేహబంధము, ప్రేమబంధము యుండరాదని పలికితివి. బంధ మనుకొనుచు

పారిపోవువాడు ప్రేమానుభూతి గాని, స్నేహానుభూతి గాని పొంద లేడు. బంధ మనుకొనుట మనసు యొక్క అపరిపక్వతను తెలియ చేయునది. బాధ్యత అని అనుకొనినచో బంధ మనిపించదు. బాధ్యతల నామోదించుట, వానిని శ్రద్ధా భక్తులతో నిర్వర్తించుట పరిపక్వతను సూచించును. పెద్దల జీవితము తరచి చూచినచో వారు జీవితమున బాధ్యతపడిరే గాని, బంధము లనుకొని తప్పించుకు తిరిగినవారు కాదు. సన్నివేశముల నుండి పారిపోనూ లేదు.

"బంధము లనుకొని పారిపోవువాడు, బాధ్యతారహితుడే నగును. భార్యాపిల్లలు బంధమనుకొని బాధ్యతలను వదలి తపస్సుల కేగినవారికి ముక్తి లభించునా? ముక్తికాంత వారిని భ్రమ పెట్టుటయే జరుగును. భ్రమలోపడి మిడిమిడి జ్ఞానముతో యిట్టివా రితరులను కూడ భ్రమ పెట్టుదురు. వీరే స్వతంత్రము పేరున కేకలు పెట్టు చుందురు. వీరు తెలుపు స్వాతంత్ర్యము వీరికే లేదు. నినాదములు మాత్రమే యుండును. అవి వినుటకు బాగుండును గాని వాటి ననుసరించినచో జీవుడు రెంటికి చెడ్డ రేవడు కాగలడు.

"చిన్నతనముననే బాధ్యత లందుకొని బాధ్యతా నిర్వహణము ననే పిన్నలు పెద్దలైనారు. బంధితులు స్వతంత్రులైనారు. మోహితులు ముముక్షువులైనారు. దీక్షాయుత బాధ్యతా నిర్వహణమే జీవితమున స్వతంత్రమను సత్ఫలము నందించును. రాముడు, హరిశ్చంద్రుడు, నలుడు, ధర్మరాజు అట్టివారు. బాధ్యతలలోనే స్వతంత్రమున్నది. స్వతంత్రము పేరున బాధ్యతలను మరచువారు స్వతంత్రులు కాలేరు. బాధ్యతలు నిర్వర్తించుటకు వినయము, భక్తి, శ్రద్ధ ముఖ్యము. అహంకారము బాధ్యతకు శత్రువు వంటిది. అహంకార మున్నచోట అశ్రద్ధ యుండును. భక్తి, వినయము లుండవు. అపుడు బాధ్యతా

**నిర్వహణ ముండదు. కంసుడు, దుర్యోధనుడు, రావణుడు అహంకారమునకు ఉదాహరణములు. అహంకారమునకు విరుగుడు వంటివి బాధ్యత, ప్రేమ, స్నేహము.** ఇది నా భావన. నా అవగాహన. కొంతవరకు నా అనుభవము కూడ. స్నేహ భావమున తెలిపితిని. దీనిపై నీ అభిప్రాయమును తెలిపినచో సంతోషించెదను. అవసరమగుచో విమర్శ కూడ చేయుము.''

సిద్ధార్థుడు మారుమాటాడలేదు. అతడు శాంత గంభీరుడై నిలచి యుండెను. సౌదామని భాషణము అతనిని లోతులలో తాకినది. వెంటనే తన ప్రతిస్పందనము తెలుపుట తొందరపాటు చర్య యగును. అందువలన వివేకముతో నిట్లు పలికెను.

“సౌదామనీ! నీవు పలికిన పలుకులలో చాల లోతు యున్నది. వానిని మననము గావించి నాలో నేను చర్చించుకొని, విమర్శించుకొని మరల మనము కలసినపుడు నా అభిప్రాయము తెలిపెదను. ఇపుడే తెలుపుట త్వరపడుట యగును. త్వరపడుట యనగా పొరబడుటయే! కావున కొంత సమయము నిమ్ము. మన ఆదివారపు కలయికలో చక్కని భాషణము జరుగుచున్నది. మనసున కానందము కలుగుచున్నది. నా మెదడునకు వలసిన మేతను నీ వందించితివి. అది వారాంతము వరకు మేయుచు నెమరు వేయుచు గడుపగలదు. ఈ మేతనుండి ఏమి క్షీరము లందించునో నేనును వేచి చూచెదను. అటుపైన తెలిపెదను. మరియొక మాట. నీవు చాల తెలిసినదానవు, నాకది చాల ఆనందముగ నున్నది. మరి శెలవా?''

ఇంతలో తేనీరు వచ్చినది. ఇరువురును తేనీరు సేవించినారు. సిద్ధార్థుడు సింహద్వారము నుండి నిష్క్రమించు చుండగ

ద్వారముకడ నుండి సౌదామని చూచుచునుండెను. సిద్ధార్థుడు తన నివాసమునకు ప్రవేశించుటకు పూర్వము యొకసారి వెనుదిరిగి చూచెను. సింహ ద్వారముగ నిలచియున్న సౌదామనిని చూచెను. స్నేహ పూర్వకముగ చేయి నూపెను. సౌదామని సంతసించుచు సౌకుమార్యముగ తన చేయి నూపెను. ఆమె హస్తము కదలిక అతని మనస్సులో ముద్ర వేసినది. నివాసమున కేగినాడే గాని ఆమె భాషణము, చిరునవ్వు, చేతి కదలిక భావలోకమున తిరుగాడ సాగినవి. గంగానదీ తీరమే తనకు శరణ్యమనుకొనుచు హుటాహుటిన నదీ తీరము చేరినాడు.

గంగానది తీరము చేరిన సిద్ధార్థుడు నదీ ప్రవాహమును, నీటి ఒరవడిని, నీటి తరంగములను గమనించుచూ కూర్చుండెను. కాల ప్రవాహమువలే ఈ నదీ ప్రవాహము అనాదిగ సాగుచునే యున్నది. ఎన్నో ఘట్టములు గడచినవి. మరెన్నో ఘట్టములు గడువ గలవు. నది మాత్రము చిరంజీవియై నిలచినది. భరత భూమిపై జరిగిన సమస్త సంఘటనలకు సాక్షిగ నిలచినది. తన కర్తవ్యమందు తానున్నది. తన వద్దకు వచ్చినవారికి సేద దీర్చినది. తన యందు స్నానమాడిన వారికి పవిత్రతను చేకూర్చినది. సిద్ధార్థుడు నదిని గమనించు చుండగ నదియొక్క సాక్షి లక్షణము, కర్తవ్య దీక్ష అతని నాకర్షించినది. కర్తవ్యదీక్ష తనకున్నది. సాక్షియై తన భావ తరంగములను తాను ఎప్పటికప్పుడు చూచుకొనుచునే యున్నాడు. తనదైన ప్రయాణము నదివలె సాగించుచున్నాడు.

నదిలో ఉపనది కలిసినట్లుగ, తన భావ పరంపరలలోనికి సౌదామని భావపరంపరలు వచ్చి చేరుచున్నవి. నది ఉపనదిని నిమిడ్చుకున్నట్లుగ సౌదామని భావములను గుర్తించి, ఇముడ్చుకొను

ప్రయత్నమున తనకొక చిన్న కలవరము కలిగినది. ఉపనది నదితో సమానమైనదై, దాని ప్రవాహము కూడ సమానమైనదై యున్నప్పుడు, దాని సంగమున నదికి ఒరవడి ఎక్కువగును. నది రూపురేఖలు కూడ మారును. ఉపనది రూపురేఖలు సంతరించుకున్న నది, ముందు నది వంటిది కాదు, జీవిత యానములో ప్రతి జీవికిని కొందరు స్త్రీ, పురుషులు తారసిల్లుదురు. వారితో సన్నిహితత్త్వము పెరిగినకొలది వారి ప్రభావము జీవునిపై పడగలదు. అట్లే జీవుని ప్రభావము వారిపై పడగలదు. ఇరువురి చేతనా ప్రభావములలో ఎక్కువ చేతన కలిగిన స్వభావము, తక్కువ చేతన కలిగిన స్వభావముపై ప్రభావము చూపును. గురుశిష్యులు సంబంధమున గురువు ప్రభావము శిష్యునిపై పడుట, తండ్రీ తనయుల సంబంధమున తండ్రి ప్రభావము తనయునిపై పడుట, పెద్దల ప్రభావము పిన్నలపై పడుట, వీని కుదాహరణములు. సరిసమాన మగు ప్రభావమున్నచో మార్పు ఇరువురికిని కలుగగలదు. సిద్ధార్థుడీ విధముగ భావించుచు సౌదామని ప్రేమను గూర్చి, స్నేహమును గూర్చి, బంధమును గూర్చి, బాధ్యతను గూర్చి, స్వతంత్రతను గూర్చి పలికిన పలుకులు తన అవగాహనకు, కొంత విశాల దృక్పథము చేకూర్చినవి.

సౌదామని పలికినట్లు స్నేహము, ప్రేమల సంబంధము మనోలోకమున యొకరీతిగ నుండును. హృదయ లోకమున మరియొక రీతిగ నుండును. అట్లే మనసు క్రిందిలోకమైన కామ లోకమున గర్హనీయముగ నుండును. **మనోలోకము మధ్యమము, కామలోకము అధమము, హృదయలోక ముత్తమము. హృదయ లోకమునకు అనుభూతి లక్షణము. మనోలోకమునకు ప్రయోజనము**

**లక్షణము. కామలోకమున పశుప్రవృత్తి లక్షణము. కామలోకము పశువుల లోకము. మనోలోకము మానవుల లోకము. హృదయ లోకము దివ్య పురుషుల లోకము. దివ్యలోకమున నుండి చూచిన అన్నియు దివ్యములే.** మన లోకము నుండి చూచిన అట్లుండదు. సౌదామని హృదయము నుండి చూడుమని తనను హెచ్చరించినది. అటునుండి ప్రేమ, స్నేహము దివ్యములే అని తెలిపినది. బంధములు చూడకుము. బాధ్యతలు చూడుము అని తెలిపినది. హృదయము కలవారే బాధ్యతలను నిర్వర్తించువారు. అది లేనివారు బాధ్యతలను బంధము లనుకొని నిరాకరింతురు. బాధ్యత యందు బంధము లేదని తెలిపినది. ఎంత చక్కని విషయము!

తాను తండ్రి చేయు ధర్మకార్యములను కొనసాగించుచు స్వస్థల మందుండుట బంధ మనుకొనినాడు. వివాహము, సంతానము బంధ మనుకొనినాడు. సంఘము తన నుండి ఆశించునది తను బంధమనుకొని పారిపోయినాడు. తన తండ్రి యిట్లనుకొనినచో తా నుండెడివాడు కాదు. ఆయన సమస్త కార్యములను నిర్వర్తించుచు, ఆనందముగనే జీవితము గడిపినాడు. కాని ఇవి అన్నియూ బంధములని బాధ పడలేదు. కార్యభార మెంతయున్నను వ్యష్ట పడలేదు. ఆయన భావములు, కార్యములు, అన్నియు హృదయ జనితములు. తన సిద్ధాంతము లన్నియు మనోజనితములు. తల్లి కూడ తండ్రివలెనే హృదయమున నిలచి యానము సాగించినది. వారి నుండి యుద్భవించిన తాను పిందెగ నుండిపోయినాడు. తన సిద్ధాంతములతో ఎదుగలేదు. ఎండిపోయినాడు అని సిద్ధార్థుడు భావించినాడు.

సిద్ధార్థుని భావన లింకను ఇట్లు సాగెను. తాను పిందె. తన తల్లితండ్రులు పండిన ఫలములు. వారి లక్షణములు కూడ తన యందున్నవి. కాని తన చుట్టును తన సిద్ధాంతములు పెంకు గట్టినవి. పెంకు పగిలినచో పిందె పెరుగుటకు, కాయ యగుటకు, పండుటకు అవకాశముండదు. ప్రస్తుతము తన మనస్సను పెంకును నానబెట్టుట జరుగుచున్నది. గంగమ్మ తల్లి ఒక ప్రక్క నుండి, సౌదామని మరియొక ప్రక్కనుండి తన హృదయమును మేల్కొలుపుచు మంకుతనముతో కూడిన పెంకు వంటి తన మనసును కరుగబెట్టు చున్నవి. మనసు కరిగినపుడెల్ల హృదయ మావిష్కరింపబడి, కన్నీరు వచ్చును. కన్నీటి గాథ లన్నియు హృదయగాథలే. తన గాథయం దిప్పుడే కన్నీరు మొదలైనది.

బాధ్యతారహితునకు మోక్ష మెక్కడిదని సౌదామని పలికిన పలుకులు తన నుద్దేశించి పలికినవి కాకపోయినను, తనకవి గట్టిగ తగలినవి. దొంగ రక్షకభటుని చూసి భయపడినట్లు ఆమె పలుకులకు వులిక్కిపడినాడు. నిజమే ఉట్టి కెక్కలేనమ్మ స్వర్గమున కాశపడినట్లు, బాధ్యతలను సన్యసించిన తనకు మోక్షమెట్లు లభించ గలదు. గాలికి తిరిగిన వానికి ఏమియు మిగలదు. గాలిని మూట గట్టిన ఏమి ప్రయోజనము.

ఇట్లు భావించుచు గంగను చూచుచు నుండగ రాత్రి అయినది. చంద్రకాంతి గంగానదిపై ప్రతిబింబించి ఆ ప్రతిబింబ కాంతి తనను స్పృశించినది. మనస్సు చల్లబడినది. కాంతి లోనికి చనినది. హృదయము చల్లబడినది. మనసు కరగిన స్థితిలో అచటనే అర్ధరాత్రము వరకు గడిపి సిద్ధార్థుడు తన బసను చేరినాడు. మరునా డుదయము నుండి యథాప్రకారముగ వ్యాపార కార్య

క్రమములు సాగించినాడు. ఇంతలో మరల ఆదివారము వచ్చినది. యథాప్రకారము సౌదామని గృహమున కేగినాడు. చిరునవ్వుతో ఆమెను పలుకరించినాడు. సరళమైన భాషణముతో భోజన కార్యక్రమము ముగిసినది. అనంతరము సుఖాసీనులై యుండగ సౌదామని యిట్లు పలికినది.

"క్రిందటి వారపు నా భాషణము నిన్ను నొప్పించలేదు కదా! నా భావములను స్నేహపూర్వకముగ ఆవిష్కరించితిని. నా జీవితానుభవముతో జతపరచి నేను చేయు ఆలోచనలవి. నీ కెట్లనిపించినవో తెలియుట నాకు ముఖ్యము. మొగమాట మేమియు లేక తెలియబరచుము. వినుటకు సిద్ధముగ నున్నాను."

*సిద్ధార్థుడు :* నీవు పలికిన విషయములు నీ అనుభవములోనివి అని తెలిపినావు. కావున నీకవి సత్యములు. వానిని విని గొనిపోయి నదీతీరమున గంగమ్మకు నివేదించి పరిశీలించుకొనినాను. నాకు కూడ అవి సత్యమని గోచరించినవి. ఉన్నమాట చెప్పుటకు నాకు బిడియము లేదు. నీ భాషణము నాకు కొంత కనువిప్పు కలిగించి నది. కొంత చిక్కుముడి వీడినది. మనసున విజ్ఞానమే ప్రధానముగ సాగిన నా జీవితమునకు నీవు హృదయము నావిష్కరించుచున్నావు. మాతృమూర్తియైన భాగీరథి, నా హృదయమును మరింత వికసింప చేయుటకు తోడ్పడుచున్నది. హృదయపు రుచి ఈ మధ్యనే తెలిసినది. నీ వన్నట్లు హృదయము నుండి చూచినచో సమస్తము దివ్యమే. బంధ మేదియు లేదని, బాధ్యతయే యున్నదని, బాధ్యత బంధము కాదని, హృదయము నుండి చూడగ తెలిసినది. నీవు తెలిపిన వన్నియు నాకు నచ్చుటయేగాక, నాకు కొంత పరిష్కారమును కూడ తెలిపినవి. నా జీవితమున నీ పరిచయము,

స్నేహము ఒక అదృష్టముగ భావించుచున్నాను. ఇపుడు నా అన్వేషణమున కొంత యూరట లభించినది. ఈ విషయము నీతో చెప్పుటకు వార మంతయు క్షణమొక యుగముగ గడిపితిని. నిన్ను చూడవలెనని హృదయము మిక్కుటముగ స్పందించినది. వేచియుండుట సిద్ధించిన వాడనని గర్వపడుచుండెడి వాడను, కాని ఈ వారము వేచియుండుట దుర్భరమైన దనిపించుచున్నది. ఇప్పటికి హృదయము, మనసు శాంతించినవి.

*సౌదామని :* నీ వేమి ఇంతలో భావకవివై పోయినావు? గంభీరత, ధీరత, ఆత్మవిశ్వాసము తొంగిచూచు నీ ప్రవర్తనము అదృశ్యమై పిల్లకవి వలె ఏమేమో పలుకుచున్నావు, నేనేదో తెలిసీ తెలియక తెలిపినది నీలో ఏమేమో మేల్కొల్పినవి. సంతోషము.

*సిద్ధార్థుడు :* సౌదామనీ! నా కిదివరకున్నది మనోవిశ్వాసమే. నీ వది వూడబెరికినావు. ఇక ఆత్మవిశ్వాస మేర్పడువరకు నేను పరాధీనుడనే. సౌదామనీ ఇది పరిహాసము కాదు కదా!

సిద్ధార్థుడు సౌదామని యొక్క అవగాహనను విమర్శించుకొని అందలి సత్యమును గ్రహించి నిర్మలముగ, అరమరికలు లేకుండ, అభిమానము లేకుండ మనస్ఫూర్తిగ అంగీకరించుట సౌదామని ఊహించని విషయము. అత డావిధముగ ప్రతిస్పందించుటతో అతడు చాల ఉదాత్తుడని, సత్యభాషి యని తన భావన యందుగాని, చేతన యందుగాని దొర్లిన పొరపాట్లను అంగీకరించుకొని, సర్దుబాటు చేసుకొనగల ధీరుడని సౌదామని కనిపించినది. **చేసిన పొరపాట్లను విశదీకరించుకొని లోన అంగీకరించుటకు చాల సంస్కారముండవలెను. లోన అంగీకరించినను అది విస్పష్టముగ**

**వ్యక్తము చేయుటకు మరింత సంస్కారముండవలెను. లోకమున పొరపాట్లు చేయని వారుండరు. కాని చేసిన పొరపాట్లు భీరులై కప్పిపుచ్చుకొనుచు జీవించు చుందురు. ధీరులట్లు చేయరు.** కప్పి పుచ్చుకొను భీరులు ఎక్కువమంది బలహీనులే కాని దుష్టులు కారు. సౌదామని వద్దకు ఎందరెందరో ఉన్నత పదవులలో నున్నవారు, ధనికులు, పండితులు కూడ వచ్చుచు నుందురు. పగటిపూట వారికి తను తారసిల్లినప్పుడు గాని, సభలలో సమావేశములలో తనను చూచినప్పుడుగాని తానెవ్వరో తెలియనట్లుగ వారు ప్రవర్తింతురు. వారంతా భీరువులే. కాని సంఘములో పెద్దలు. సిద్ధార్థుడు, యిట్టి వారందరికన్న భిన్నమైనవాడు. ఋజుప్రవర్తన కలవాడు. చిన్నతనము నుండి తన్ను తా నుద్ధరించుకొను కార్యమును, తీవ్రమగు తపస్సుగ సాగించినవాడు. అతనికి సంఘముతో పెద్ద లంపటము లేదు. యిక ముందు వ్యాపారము వలన కలుగునేమో చూడవలెను. ఇట్లు సౌదామని భావించుచుండగ సిద్ధార్థుడు "దీర్ఘాలోచనలో పడినావేమి?'' అని ప్రశ్నించెను.

*సౌదామని :* నిన్ను గూర్చియే. నీవెంత నిర్మలుడవు, నిష్కపటివి, నిరభిమానివి, నిశ్చలుడవు, నిరాడంబరుడవు అని ఆలోచించు చున్నాను. ఇంతకును వ్యాపారానుభవ మెట్లున్నది. నీకున్న లక్షణములు వ్యాపారమునకు సరిపడునా?

*సిద్ధార్థుడు :* తప్పక సరిపడగలవు. తప్పక వ్యాపారమును వృద్ధి చేయగలను, ధనగుప్తుని మెప్పించగలను. వ్యాపారము నిమిత్తముగ సంఘములోని వివిధ శ్రేణుల, వర్గముల స్వరూప స్వభావములను తెలుసుకొనుచున్నాను. సంఘమును, ప్రపంచమును పండ్రెండు సంవత్సరములుగ దూరముగ నుంచిన

నేను మరి పంద్రెండు సంవత్సరములలో దానిని గూర్చిన అవగాహన, అనుభూతిని పరిపూర్తి గావించుకొన గలనని నా విశ్వాసము. యోగము పేరున నా మనస్సు, యింద్రియములు, శరీరమును ఎండబెట్టితిని. నిజమునకు యోగమట్లు చెప్పలేదు. నాయందలి తీవ్రభావము నన్నట్లు ఉసిగొల్పినది. నా యోగసాధన కొంత దూరము సాగగ మనసు యింద్రియములు ఎదురు తిరుగుట నారంభించినవి. వానికి బహిఃకరణములైన మనసు, యింద్రియములు, శరీరమును నిర్లక్ష్యముచేసి అంతఃకరణమున ప్రవేశించుటకు ప్రయత్నించినాను. పుష్కరకాలమట్లు చేయగ తెలిసిన విషయ మొకటియే. బహిఃకరణములను మచ్చిక చేసుకొనుచు; అంతః కరణముల యందు ప్రవేశించవలెనే గాని వాటిని ఎండబెట్టుట కాదు. ప్రయాణము చేయదలచినవాడు గుఱ్ఱము నెండబెట్టినచో ప్రయాణము సాగునా? గుఱ్ఱము చతికిలబడినది, ప్రయాణము ఆగినది. ఇప్పుడు గుఱ్ఱమునకు చికిత్స చేయుచున్నాను. దాని ఆలన పాలన చూచి దానిని శక్తివంతము గావించి మరల ప్రయాణము సాగించెదను. అందులకొక పుష్కరకాలము సరిపోవునని నా భావము.

*సౌదామని :* వ్యాపారమను పేరున ప్రపంచమున ప్రవేశించుచున్న నీవు అందు చిక్కుపడవని నమ్మకమేమి?

*సిద్ధార్థుడు :* నీవన్నది నిజమే. కాని చిన్నతనము నుండి నాలో ఏర్పడిన ఆశయము సహజమైనది. మధ్య వచ్చు వ్యాపారము, సంఘజీవనము నా ఆశయ నిర్వహణములో నేను నిర్వర్తించు కర్తవ్యము. అందువలన వ్యాపారము పెరిగినపుడు, ధనము కలిగి

నపుడు, సంఘములో పరిచయములు పెరిగినపుడు నేనందు చిక్కు పడక వుండగలనని నా విశ్వాసము.

*సౌదామని :* పంద్రెండు వత్సరముల తరువాత అన్నియును విడువదలచితి వన్నమాట.

*సిద్ధార్థుడు :* అదియే నా ప్రస్తుత భావన. అది మారునని కూడ నేను భావించుట లేదు.

*సౌదామని :* అయినచో నన్ను కూడ విడతువన్నమాట.

*సిద్ధార్థుడు :* నీ విషయమున, నా మనస్సున అట్టి నిర్ణయము లేదు. నీవు నాకు తోడు నీడ అను భావము మాత్రము స్పష్టముగ తెలియుచున్నది.

కార్తీకమాసము ప్రవేశించినది. ఆర్యావర్తమంతయు చల్లదనము ఏర్పడినది. గంగానది తీరవాసులందరు కార్తీక స్నానములు, కార్తీక దీపములు, అభిషేకములు కోలాహలముగ చేసుకొనుచున్నారు. సిద్ధార్థునికి ఆ సన్నివేశము పంద్రెండు సంవత్సరముల తరువాత అదే ప్రథమము. వనవాసము చేసిన పుష్కరకాలములో అతడు మాసముల పరిగణనము విసర్జించినాడు. మరల యిప్పుడు ప్రజా జీవన వాహినిలో ప్రవేశించగనే మాసములు, ఋతువులు, పౌర్ణిమలు, అమావాస్యలు అన్నీ తెలియసాగినాయి. పంద్రెండు సంవత్సరముల క్రితము తన పదునెనిమిదవ సంవత్సర ప్రవేశమున తాను ఇల్లు వదలినాడు. ఇప్పుడు తనకు ముప్పది సంవత్సరములు నిండినవి. ఈ పంద్రెండు సంవత్సరములలో తా నాశించినంత పురోగతి లేనప్పటికిని

ఆశయసిద్ధి కొరకు చేయు ప్రయత్నముననే తానున్నాడు గనుక అతడు అసంతృప్తుడు కాలేదు. అట్లని సంతృప్తుడును కాలేదు. తా నింకను అన్వేషకుడే! అంతర్ముఖాన్వేషణ తీవ్రతరము కాగ తన జీవస్వభావము తనను బహిర్ముఖుని గావించినది. స్వభావమును తగు మాత్రము మన్నించనిదే అంతర్ముఖయానము సాగదని తాను తన స్వభావముతో సహకరించుటకై బహిర్ముఖుడైనాడు. ప్రస్తుతము తనకు రెండు వ్యాపారములు. ఒకటి, ధనగుప్తుని వ్యాపారము నడిపించుట. రెండు, సౌదామనితో పరిచయము. ఆ పరిచయము స్నేహముగ మారుట, ఆమెను గూర్చి తనకు సద్భావము లేర్పడుట, సన్నిహిత భావము లేర్పడుట. ఆమెను మరల మరల చూడవలెనని హృదయమున ఆతురత కలుగుట. ఈ జీవనములోని భాగముగ గంగానదీ ప్రభావము తనపై నేర్పడుట.

ఇట్లు పర్యాలోకనము చేసుకొనుచున్న సిద్ధార్థునకు రాబోవు ఆదివారము కార్తీక పౌర్ణమి యని తెలియవచ్చినది. అది తన జన్మదినము. ఆనాటికి తనకు 31 సంవత్సరములు నిండగలవు. పౌర్ణమి ఆదివారమగుట అతనికి లోన సంతోషము కలిగించినది. కారణము పుట్టినరోజు నాడు సౌదామనితో సమయము గడుప వచ్చును. స్నేహ చిహ్నముగ ఆమెకు తన పుట్టినరోజు సందర్భముగ నొక పట్టుచీరను బహుమతిగ కొనిపోవలెనని భావించినాడు. సమీపమున గల వారణాసి పట్టణమున కేగి తనకు నచ్చిన పట్టు జరీచీర నొకదానిని కొనుగోలు చేసి ఆదివారమునకై ఎదురు చూడసాగినాడు.

ఇంతలో ఆదివారము కాలము రూపమున ఏతెంచినది. సిద్ధార్థుడు యథాప్రకారము ప్రాతఃకాలముననే నిద్రలేచి ఆసన,

ప్రాణామాయ, ధ్యానాది కార్యక్రమములు పూర్తి గావించుకొని, నూతన వస్త్రములను ధరించి తన నివాసమందలి వసారాలో కూర్చుని యుండెను. వాయవ్య ముఖద్వారము కల అతని నివాసము నకు, తూర్పునగల వసారా అది. సౌదామని నివాస ప్రహరీ యందలి వాయవ్య దిక్కున నున్నది. సౌదామని గృహమేగుటకు ప్రహరీకి ఈశాన్యముగ ఒక విశాలమగు ద్వారమున్నది. సిద్ధార్థుడు తన తూర్పు వసారాలో కూర్చుని యున్నచో ఈశాన్య ద్వారము నుండి వచ్చుపోవు వారందరు కనిపింతురు. అతడు ప్రతిదినము ఉదయమక్కడ కూర్చుండుట, సూర్యోదయ కాంతులను దర్శించుట నొక నలవాటుగ నేర్పడినది.

ఆదివారము, కార్తీక పౌర్ణమి సందర్భముగ సిద్ధార్థు డిట్లు కూర్చునియుండగ సౌదామని గృహము నుండి కొంతమంది పరిచారికలు, మరికొంతమంది పనివాండ్రు మూటలు, మూటలుగ నేవియో వస్తు సామగ్రి బయటకు గొనిపోవుట చూచెను. మనసున కుతూహలము పెరుగగ నొక పరిచారికను పిలచి విశేషమేమియో తెలుపమని కోరెను. పరిచారిక యిట్లు పలికినది: “నేడు కార్తీక పౌర్ణమి కదా! ఈనాడు సాదామనీ దేవి గంగానదీ తీరమున ఒక వేయిమందికి తక్కువ లేకుండ నిరుపేదలకు వస్త్రములు, ధనము, ధాన్యమును దానము గావించును.

*సిద్ధార్థుడు :* ప్రతి సంవత్సరము కార్తీక పౌర్ణమినాడే ఇట్లామె దానము చేయునా?

*పరిచారిక :* లేదు, ఆషాఢ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, మాఘ పూర్ణిమ, వైశాఖ పూర్ణిమ పర్వదినములందు ఇట్లు నిర్వర్తించును. మరియు వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, రథసప్తమిల యందు

కూడ నిర్వర్తించును. సంవత్సరమున కేడుమార్లు ఇట్లామె దానము చేయుట యిప్పటికి ఐదు సంవత్సరముల నుండి సాగుచున్నది. సంవత్సరమున ఏడు పర్యాయములు తన పరివారమంతటికి కూడ వస్త్రములు, ధనము, ధాన్యము బహూకరణము చేయుచు నుండును.

*సిద్ధార్థుడు :* అయినచో ఈ దినము సౌదామనీ దేవి కూడ గంగానదీ తీరమునకు చేరునా? నే నామెను పదకొండు గంటలకు కలువవలసి యున్నది. అందులకు అడుగుచున్నాను.

*పరిచారిక :* లేదు, అమ్మగా రచటికి రారు. ఈ ప్రపంచము విచిత్రమైనది. ఆమె ఇచ్చు దానము లందుకొనుటకు అందరునూ సిద్ధమే. కాని వృత్తిపరముగ ఆమె యొక వేశ్య అని తెలియగనే దాన మందరును పట్టరు. అందువలన ఆమె గృహముననే యుండి అజ్ఞాతముగ దానము చేయును. దానము పుచ్చుకొనువారు కూడ పుచ్చుకొనుటకే ఆసక్తి చూపుదురు. ఎవరు యిచ్చుచున్నారు అన్న ప్రశ్న సామాన్యముగ పుట్టదు. కావున దాన కార్యక్రమము చక్కగనే సాగును.

సౌదామని నిర్వర్తించు దాన కార్యక్రమమును విని సిద్ధార్థుడు కొంత తడవు నిశ్చేష్టుడైనాడు. ఆమె లోతైన మనిషి. తన కిదివరకే తెలియును. ఆమె చేయు గుప్తదానము లతనిని ఆకర్షించినవి. ఆమె తన మనసులో మరికొంత ఉన్నతమగు స్థానమున కెదిగినది. తాను వృశ్చికరాశి యందు జన్మించుటచే తనకు లోతులు అనిన యిష్టము. ప్రపంచపు ఆడంబరము తనకు సహజముగ నిష్టములేదు. డాంబికులనిన తనకు చులకన భావము. పవిత్రమగు విషయము లన్నియు గుప్తముగనే సాగవలెనని తన భావన. వానిని

గూర్చిన ప్రచారమునకు తన దృష్టిలో విలువలేదు. లోతుగల మనుష్యు లన్నచో తనకు గౌరవ మేర్పడును. సౌదామని లోతులు కాలక్రమమున తనకు తెలియగలవని భావించుచు సమయమునకై వేచియుండి నిర్ణీత సమయమునకు సిద్ధార్థుడు ఆమె గృహమును చేరినాడు.

ఎప్పటివలెనే సౌదామని సిద్ధార్థుని స్నేహపూర్వకముగ ఆహ్వానించినది. ఆసనము చూపినది. తాను ఆసీనుడైనాడు.

*సౌదామని :* ఈ రోజు స్వామి ప్రత్యేక కళ కలిగియున్నారు. నూతన వస్త్రములు ధరించినారు. కొంత నూతనముగ గోచరించు చున్నారు. ఏమైన విశేషమా?

*సిద్ధార్థుడు :* (నవ్వుచూ) విశేషమే. కార్తీక పౌర్ణమి నా జన్మదినము. పండ్రెండు సంవత్సరముల తరువాత మరల జన్మ దినము జరుపుకొనుటకు నిశ్చయించుకొంటిని. తత్ఫలితమే ఈ నూతన వస్త్రధారణము, నీ చేతి విందు. మరియొక చిన్నకోరిక కూడ నున్నది. సహృదయముతో మన్నింతు వనుకొనుచున్నాను.

*సౌదామని :* స్నేహితులము కదా! మొహమాటమేల? ఉన్నది వున్నట్లుగ పలుకవచ్చును. నీకా స్వాతంత్ర్య మున్నది. నాకును నీయందు స్వాతంత్ర్య మున్నది.

*సిద్ధార్థుడు :* నా పుట్టిన రోజు కదా! నీవు కూడ నాతో బాటుగ నూతన వస్త్రములు ధరించవలెనను ఆకాంక్ష కలిగినది. అందువలన నీకొఱ కొక పట్టుచీర తెచ్చితిని. నే నిదివరకెన్నడును వస్త్రములను కొన్నవాడను కాను. ఈ మధ్యనే నా కొరకై వస్త్రములు కొనుట నేర్చుకొంటిని. స్త్రీలకు ఎప్పుడునూ వస్త్రములు కొనలేదు.

ఇదియే ప్రథమము. నచ్చినచో, నచ్చినరోజున కట్టుకొన వచ్చును. ఇది స్నేహపూర్వకమగు కానుక!

*సౌదామని :* స్నేహపూర్వకమా! ప్రేమపూర్వకమా!!

సిద్ధార్థుడు మౌనముగ నుండిపోయెను.

*సౌదామని :* నీకు స్నేహము, ప్రేమ రెండు విభిన్న అంశములు కదా! అందులకే ప్రశ్నించితిని. నా సిద్ధాంతమున రెండునూ ఒకటియే. అది నీకు తెలియును.

*సిద్ధార్థుడు :* నీ సిద్ధాంతమే ఉదాత్తముగ నున్నదని తెలిపితిని కదా! ఇక రభస చేయకుము.

సౌదామని యిచ్చిన కానుక నందుకొని సిద్ధార్థుని ముందే అతను ఇచ్చిన బహుమతిని విప్పి చూసెను. ఆమె ముఖమున ఆనంద రేఖలు మెదలినవి. సిద్ధార్థుడది చూసి మనస్సున కుదుట పడినాడు.

*సౌదామని :* ఎఱ్ఱ పట్టుచీర! నా కెంతయే యిష్టము. నాకు గల చీరలలో ఎక్కువ చీరలు ఎఱ్ఱపట్టువే. జరీ కూడ చాల యున్నది. ఎక్కువ ధర వెచ్చించినట్లున్నావు. చాల బాగున్నది.

*సిద్ధార్థుడు :* నీ కేమిచ్చినను ఎక్కువ కాదు.

*సౌదామని :* అవును! మక్కువున్నచోట ఏదియును ఎక్కువ కాదు. నీ పుట్టిన రోజని తెలియనప్పటికిని, నీకును నేనొక జత వస్త్రములను ఏర్పరచి యుంచితిని. నా వారందరికిని ఈ రోజున వస్త్రప్రదానము గావించుదును. నా వారిలో నీవొకరిగ

భావించి కొనితెచ్చితిని. నీవు యిది స్వీకరించుము. నీకు జన్మదిన శుభాకాంక్షలు!

సిద్ధార్థుడు వస్త్రముల నానందముగ స్వీకరించినాడు. సౌదామని ఎప్పటివలెనే భోజనము సిద్ధార్థునికి వడ్డించినది. తాను తినలేదు. సిద్ధార్థుడు ప్రశ్నింపగ పౌర్ణిమలు, అమావాస్యలు, ఏకాదశి తిథులందు తాను భుజింపనని, జలములపై నుందునని తెలిపినది. సిద్ధార్థుడు మౌనముగ క్లుప్తముగ భోజనము ముగించినాడు.

*సిద్ధార్థుడు :* ఈ ఉపవాస వ్రతము లేమి? ఎవరైన పండితుడు తెలిపినాడా?

*సౌదామని :* నీకు తెలియనిదేమున్నది. పదిమంది వచ్చు పోవుచుండు యిల్లు ఇది. పండితులు కూడ వచ్చుచుందురు. ఒక పండితుడు ఉచిత సలహాగ ఉపవాస విషయము తెలుపగ నాచరించు చుంటిని. వచ్చిన వారందరు వారి వారి జ్ఞానము నా ముందు ప్రదర్శించుచునే యుందురు. వివిధములగు విషయములు తెలియుచుండును. ఈ విధముగ కొంత విజ్ఞానము కూడ నన్ను చేరినది. దానికేమిలే గాని ఈ రోజు నీ పుట్టినదినము కదా! తాంబూలము వేసుకుందువా!

*సిద్ధార్థుడు :* చిత్రము. నాకు విందు భోజనము, నీకు ఉపవాసము. అటుపైన తాంబూలము. సన్నివేశము, పుట్టినరోజు కదా! సరే నట్లే కానిమ్ము. నాకు తాంబూలము వేసుకొనుట చేత కాదు. నీవు సమపాళ్ళుగ అందించినచో నీ, నా తృప్తికై వేసుకొందును.

సౌదామని సమపాళ్ళుగ తాంబూలము తయారుచేసి అందించగ సిద్ధార్థుడు స్వీకరించెను.

# 8

సౌదామని సిద్ధార్థుల స్నేహము, క్రమముగ ప్రేమగ మారినది. అట్లు మారుటకు మరియొక రెండు సంవత్సరములు పట్టినది. సిద్ధార్థుడు వ్యాపారమును బాగా అభివృద్ధి చేయటముతో ధనగుప్తు డతనికి తన వ్యాపారములో భాగస్తుడుగ నేర్పరచుకొన్నాడు. సిద్ధార్థుడు మనసులో సౌదామనిని వివాహము చేసుకొని, ఆమె వృత్తి చెఱనుండి విముక్తి కలిగించాలన్న భావన మెండుగ రాసాగినది. తన కిపుడు 33 సంవత్సరములు నిండినవి. తన అంచనా ప్రకారము తానిక తొమ్మిది సంవత్సరములే బహిరంగ జీవనము కొనసాగించును. అటుపైన మరల అంతరంగ జీవనమే. అప్పుడామె గతి ఏమి? తన కామె యన్నచో త్రికరణశుద్ధిగ ప్రేమ కలిగినది. వివాహ మాడకుండ ఆమెతో జీవించుట తనకు సంస్కార మనిపించ లేదు. అట్లని వివాహ మాడినచో భవిష్యత్తున ఆమెను వదలివేయుట కూడ సంస్కారము కాదు. ఎడతెగని ఈ భావముతో కాలము గడపుచు సిద్ధార్థుడు తన భావములను సౌదామనికి వ్యక్తము చేయుటకు సమయమునకై వేచియున్నాడు. గంగానదీ తీరమున దీర్ఘముగ నాలోచించినను తనకు సమాధానము రాలేదు.

ఎప్పటివలెనే ఒక ఆదివారము సౌదామని గృహమున సంభాషణవశమున సౌదామని యిట్లు పలికినది.

"ఈ వారము జ్యోతిష పండితు డొక డేతెంచినాడు. అతడు పూర్వపరిచితుడే. నా జాతకమును పరిశీలింతునని పట్టు పట్టినాడు. నా జాతకము నాకు తెలియును. నా కేమియు తెలుప నవసరము లేదని, తెలిపినను వినలేదు. మొత్తమునకు జాతకము చూపించక తప్పలేదు. గతమంతయు చక్కగనే చెప్పినాడు. నా జీవితము నా అధీనమున లేక ఎట్లు నడచినదో చూచి కొంత నిశ్చేష్టుడైనాడు. నా రాచపుట్టుకను శ్లాఘించినాడు. పూర్వజన్మమున నేనొక తపస్వి నట. ప్రారబ్ధము మిగులుగ ఈ జన్మమిట్లు గడచుచున్నదట. త్వరలోనే నా జీవితమున మరియొక చక్కని మలుపున్నదట. జాతకముతో పాటు హస్తముకూడ చూచినాడు. హస్తమున మాత్రము రేఖలను చూచి నేను మరల తపస్సుకై జనిపోవుదునని ఆత్మ చింతనలో దేహము విడుతునని తెలిపినాడు."

*సిద్ధార్థుడు :* ఆశ్చర్యముగ నున్నది కదా!

*సౌదామని :* నా కాశ్చర్య మేమియును లేదు. నేనీ వృత్తియందు కొనసాగనని నాకు తెలియును. దేనికైనను కాలము కర్మము కలసి రావలెనని కూడ తెలియును. అంతవరకు వేచియుండుట నేర్చితిని. నా ఇరువది ఒకటవ సంవత్సరమున విధి నన్ను నడిపించిన తీరునకు ఒకనాడు కన్నీరు మున్నీరుగ నేడ్చుచుండగ ఆ రాత్రి నా కొక స్వప్నము కలిగినది. స్వప్నమున నొక దివ్య పురుషుడు గోచరించి యిట్లని పలికినాడు.

"సౌదామనీ! చింతింపకుము. ప్రారబ్ధ మెవ్వరికిని తప్పదు. నీ వృత్తిని గూర్చిన హీనభావము విసర్జించుము. నిర్లిప్తముగ నుండుము. నీవద్దకు చేరు ధన ధాన్యములను ఎప్పటి కప్పుడు పంచుచు నుండుము. నీ జీవితము యజ్ఞార్థమే యగును. యజ్ఞము, దానము, తపస్సు జీవునికి ముక్తిప్రదములు. ప్రస్తుతమునకు నీ జీవితమును యజ్ఞమునకు, దానమునకు వినియోగించుము."

అని పలుకుచూ, భగవద్గీత యందలి కొన్ని శ్లోకములను వినిపించి గీతా గ్రంథమును చూపించి అదృశ్యమయ్యెను. మరునాడే నావద్దకు అప్రయత్నముగ నొక భగవద్గీతా గ్రంథము, కాళీయ కృష్ణుని మూర్తి చేరినవి. ఆనాటి నుండి నేటి వరకు ప్రతిదినము గీతా పఠనము, శ్రీకృష్ణ ధ్యానము చేయుచు నుంటిని. శ్రీకృష్ణుడు నా ఆరాధ్య దైవము. నా కతడే సమస్తము.

సౌదామని యిట్లు పలుకుచుండగ, ఆమె ముఖము గంభీర మైనది. సిద్ధార్థుడు నిర్ఘాంతపోయినాడు. ఆమె కాళీయ కృష్ణుని ఆరాధించుట అతని దృష్టి నాకర్షించినది. తన తల్లికూడ కాళీయ కృష్ణుని ఆరాధించు చుండెడిది. ఆమెకును కృష్ణుడే సర్వస్వము. సౌదామనికిని తన తల్లికిని కల స్వభావ సారూప్యము అతనిని మరింత ఆతుర పెట్టినది.

*సిద్ధార్థుడు :* నిన్ను గూర్చిన లో విషయములు, నీకుగ నీవు చెప్పినప్పుడే వినవలెనని యింతకాలము వేచియుంటిని. నీ రాచ పుట్టుక ఇత్యాది విషయములు లోకులెరిగినవే నా కిదివరకు తెలిపినావు. వాటిని మించిన స్త్రీమూర్తి నీయందున్నదని నాకు గల పరిమిత జ్ఞానముతో నే నిదివరకే ఊహించి యుంటిని.

మొత్తమునకు జ్యోతిష్కుడు నీ చేతన యందు గల భావమును పునశ్చరణము గావించినాడు. నీ కభ్యంతరము లేనిచో నీ కృష్ణ మందిరమును నేను దర్శించవచ్చునా?

*సౌదామని :* తప్పక దర్శించ వచ్చును. నాకు కలిగిన స్వప్నమును ప్రథమముగ నీకే తెలిపితిని. మందిరమును కూడ నీకే చూపెదను.

సౌదామని పురోగమించుచూ దారిచూపగ, సిద్ధార్థుడు ఆమె పూజ గదిని చేరుకున్నాడు. లోపల ఒక చక్కని పాలరాతి మందిరము, మందిరములో దాదాపు రెండున్నర అడుగుల పొడవుగల కాళీయ మర్దనుడగు శ్రీకృష్ణుని విగ్రహము. ఎడమ చేతితో కాళీయుని తోక పట్టుకుని, కుడిచేతితో ఆశీర్వదిస్తూ, పాదములు మర్దన ముద్ర యందున్న సర్వాంగ సుందరమగు పంచలోహ విగ్రహమది. కాంతివంతమై, దీపాలంకారయుతమై మందస్మితము చేయుచున్న కృష్ణుని విగ్రహము సిద్ధార్థుని కొంటెగ పలుకరించుచు లోతట్టున నేవో అనుభూతులను కలిగించెను. మందిర మంతయు సువర్ణ పుష్పములతో అందముగ తీర్చబడి యున్నది. గంధపు ధూపము పూజగది నంతను పవిత్రము చేయుచు నున్నది. సిద్ధార్థుడు అప్రయత్నముగ మోకాటిపై వజ్రాసనమున కూర్చుని రెండు చేతులు జోడించి నమస్కరించగ అతని నోటి నుండి మరల నప్రయత్నముగ –

*"కాళీయఫణిమాణిక్య రంజిత శ్రీపదాంబుజ, దామోదరో యజ్ఞభోక్తా దానవేంద్ర వినాశకః "*అను శ్లోకము ఉచ్చరింపబడినది. హృదయము కొంత పొంగి కన్నులు చమర్చినవి. విపరీత భావము

లన్నియు ముహూర్తకాల మదృశ్యమై, సిద్ధార్థుడు అభావ స్థితియం దుండిపోయెను. అటుపైన లేచి సాష్టాంగ ప్రణామము గావించి, మొదటిసారిగ ఆమె చేతులను తన చేతులలోనికి తీసుకొని....

"మహదానందముగ నున్నది. నీచే ఆరాధింపబడు శ్రీకృష్ణుడు, నాకు హృదయమున చల్లని స్పర్శ కలిగించినాడు. గంగాదేవి కూడ ఇదియే స్పర్శ కలిగించినది. నీ అంతరంగ పరిశుద్ధ జీవనము నా కవగతమైనది. నీ విషయమున నిది నే ఊహించినదే అయినను నా ఊహకు మించిన అనుభూతి కలిగినది."

అని పలుకుచూ యథాప్రకారము ముందు గదిలోనికి చని తన ఆసనమున ఆసీనుడైనాడు. సౌదామని కూడ అతని వెంట వచ్చి తన ఆసనము గొనినది.

సిద్ధార్థుడు కొంత తడవు మౌనముగ నుండి యిట్లని ప్రశ్నించెను.

"శ్రీకృష్ణుని ఆరాధించుటలో నీ ఆంతర్యమును తెలుపుదువా?"

*సౌదామని :* నాకు **సమస్త జగత్తు కృష్ణమయమే! అతడు త్రిజగన్మోహనుడు. శ్యామసుందరుడు. వర్ణింప నలవికాని వైభవము కలవాడు.** అంతరంగమున అతని ఆరాధనమే నాకు పరిపూర్తి నిచ్చినది. అప్పటి నుండియే నాయందు ఘర్షణ అదృశ్యమైనది.

*సిద్ధార్థుడు :* భగవద్గీత యందు నీకు నచ్చిన కృష్ణ బోధయేమి?

*సౌదామని :* **కృష్ణుని ప్రతిపలుకు నాకిష్టమే. అతడు గీత యందు చేసిన అన్ని బోధల సారాంశము- తనకు సమర్పణ చెందు మని. అట్లు సమర్పణ చెందినచో తానే సర్వము స్వయముగ నిర్వర్తింతునని, ధర్మ విచికిత్సతో పనిలేదని, సర్వధర్మములు తన యందు పరిత్యజించి తనను శరణుజొచ్చిన వారిని సర్వ పాపముల నుండి నివృత్తి గావించి మోక్షమున నిలిపెదనని పలికినాడు. కేవలము పలుకుటయే కాదు. అట్లు ఎందరినో ఉద్ధరించినాడు. నావంటి పతితలకు అతడే శరణ్యము. ఉత్తములని, అధములని భావింపక శరణన్న వారిని రక్షించు పరిపూర్ణ కరుణాహృదయు డతడు. అత్యంత సన్నిహితుడు. అతని జీవితమందలి ప్రతి సన్ని వేశము నాకు బోధయే. గీతయందు ప్రప్రథమముగనే శ్రీకృష్ణుడు నాకు వలసిన పరిష్కార మందించినాడు. జీవుడు శరీరధారియే గాని శరీరము కాదని, శరీరము దుస్తులవలె జీవుడు గైకొనుట, విసర్జించుట చేయునని, శరీరము క్షరమని, జీవుడు అక్షరుడని బోధించినాడు. దేహ భావము నుండి జీవ భావమునకు మరలుటకు నాకీ బోధన ఎక్కువగ ఉపయోగపడినది. దేహమును ఎవరైనను సంఘహితమునకే వినియోగింపవలయును. నా విషయమున అట్టి సంఘ వినియోగము వైచిత్రి జూపినది. అంతరంగమున కృష్ణుని ఆరాధన వలన బహిరంగమగు వినియోగము నందలి ధర్మాధర్మ విచికిత్స పరిత్యజింపబడినది.**

అటులనే శ్రీకృష్ణుడు తెలిపిన యజ్ఞము, దానము, తపస్సు నందు యజ్ఞమును, దానమును నిర్వర్తించుచున్నాను. అంత రంగమున కృష్ణుని ఆరాధనే నా తపస్సు. నా వద్దకు చేరిన ధన ధాన్యములను మూడు నెలల కొకమారు పరులకు, పరివారమునకు

కృష్ణార్పణము చేయుచున్నాను. ఇది అంతయు కృష్ణుని బోధ ఆధారముగ జరుగుచున్నదే. దివ్యపురుషు డెవరో నన్ను కృష్ణ చైతన్యము వైపునకు నడిపినాడు.

*సిద్ధార్థుడు :* ఆ దివ్యపురుషుడు నీ కప్పుడప్పుడు స్వప్న దర్శన మిచ్చుచుండునా?

*సౌదామని :* స్వప్నమున నా 21వ సంవత్సరమున దర్శన మిచ్చిన దివ్యమూర్తి మరల ఏడు సంవత్సరముల తరువాత స్వప్న దర్శన మిచ్చి గీతాబోధనలు కొన్ని రహస్య ప్రకాశము గావించినాడు. మరల నిన్న రాత్రి దర్శనమిచ్చి, అనగా మొదటి దర్శనము నుండి 12వ సంవత్సరము దర్శనములైనవి.

*సిద్ధార్థుడు :* దివ్య దర్శనమునకు, ఆత్మ దర్శనమునకు నేనెంతయో అన్వేషించితిని. అది నేటికిని ఎండమావియే అయి నిలచినది. దైవ మెప్పుడు, ఎవరిని, ఏ విధముగ అనుగ్రహించునో జీవునికెట్లు తెలియును. నీ అంతరంగ జీవనము నాకెంతయో ఆనందము కలిగించుచున్నది. ఇది అనన్యసాధ్యము. నీకు ముప్పది మూడు సంవత్సరములు, నాకునూ ముప్పది మూడు సంవత్సర ములే. నీ ఆరాధన మంతయు అంతర్ముఖమే. నేనును అంతర్ముఖ దర్శనమునకే బహిర్ముఖాన్వేషణ గావించినాను. ఇంతకును ఇది అంతయు నా ప్రారబ్ధము.

*సౌదామని :* నీ వట్లు ఆత్మనింద గావింపగొనకుము. నీవును సత్సాధకుడవే. నీ స్వభావము తీవ్రము. నీకు విచికిత్స, విశ్లేషణ మెండు. అది కారణముగ మనస్సు అతి సున్నితమగు నీ

హృదయము చుట్టునూ కంచె వేసినది. దేనికైనను కాలము, కర్మము కలిసి రావలెను కదా! నీకు కూడ హృదయానుభూతి కలుగు సమయ మాసన్నమైనదని నా భావము. భాగీరథీ సాన్నిధ్యము, కృష్ణ సాన్నిధ్యము కొంత రుచి చూచితిని కదా! నా దృష్టిలో దివ్యమగు విషయములు, నీవు తరచును గంగాతీరమునకు చనుచుండుట మేలని నాకు తోచుచున్నది.

*సిద్ధార్థుడు :* నీవన్నది నిజమే. నేను గంగానదీ తీరమున పొందిన అభావ స్థితియే నీ పూజా వేదిక సముఖమున కూడ పొందినాను. శ్రీకృష్ణుని ఆరాధించిన నీవు, నాకేల గంగానదీ తీరమును సముచితమని భావించుచున్నావు. నేను కృష్ణధ్యానమున కర్హుడను కాదా?

*సౌదామని :* నీవు మొదటి నుండియు బ్రహ్మధ్యానము నాశించితివి. **బ్రహ్మము నిరాకారుడు. శ్రీకృష్ణపరబ్రహ్మము త్రిజగన్మోహనాకారము. నీ జీవ లక్షణమునకు సాకార ధ్యానము కన్న నిరాకార ధ్యానమే సరిపడును.** ఇది నా భావన.

*సిద్ధార్థుడు :* నీ వన్నదియు నిజమే.

*సౌదామని :* ఒక్క సూచన సుమా! సాకారుని నిరాకరించిన వారిని, నిరాకారుడు నిరాకరించగలడు. అతడు సాకారుడు మరియు నిరాకారుడు అను సమన్వయము ముఖ్యము. ఇది నా భావన.

*సిద్ధార్థుడు :* ఇది నా భావన అనుచూ సున్నితముగ చురకలు వేయుచున్నావు. మూడు సంవత్సరముల క్రిందటి సిద్ధార్థుడు, ఈ

నీ భావనలతో సమ్మతించెడివాడు కాదు. ఇప్పటి సిద్ధార్థుడు కొంత మెత్తబడినాడు. ఇంకను మెత్తపడవలసి యున్నది.

*సౌదామని :* ఎండిన గింజ మెత్తబడిననే కదా మొలక లెత్తును! దైవము కాలము రూపమున సిద్ధార్థుడను గింజను పిడకలో పెట్టి యుంచినాడు. ఇప్పుడా గింజను సారవంతమగు భూమి యందు నాటుటకు నీట బెట్టినాడు, గింజ మెత్తబడుచున్నది. ఇది నా భావన.

*సిద్ధార్థుడు :* ఇది నీ భావనయే కాదు, నా భావన కూడను. ఎండిన సిద్ధార్థుని గింజను సౌదామని యను నీటియందు నాన బెట్టుచూ, దైవము లీల చూపుచున్నాడు. మొండి వానికన్న మొండి వాడు దైవము. అందులకే నా అన్వేషణమున దైవము మొండికేసి నాడు. ఎట్లైనను నా అన్వేషణమున కిక్కడ ఒక సార్థకత చేకూరినది. నీ సహవాసమున యింకను మెత్తబడుట ఖాయము.

*సౌదామని :* నా సహవాసము కన్న గంగమ్మతల్లి సాన్నిధ్యము నీ కెక్కువ సహాయపడును.

ఇంతలో భోజనానంతర తేనీరు సేవించు సమయ మాసన్న మైనది. తేనీరు సేవించి సిద్ధార్థుడు హుటాహుటిని గంగానదీ తీరము చేరినాడు. గంగానది ఒడ్డున ఆసీనుడై తన ముప్పది మూడవ పుట్టినరోజును ఉదయము నుండి పునః పరిశీలన గావించినాడు. తన జీవితమున ఈ సంవత్సర మొక చక్కని మలుపు కలిగించినదని భావించినాడు. ఒక మంచి తోడు దొరికినదని భావించినాడు. సౌదామని తానూహించిన దానికన్న పదిరెట్లు ఉన్నతమైన జీవి

అని తెలిసి ఆనందపడినాడు. అంతరంగ మథనము, దివ్యపురుష దర్శనము, అంతరంగ ఆరాధనము, బహిరంగమున దానము, యజ్ఞార్థ జీవనము అతనికి నిరుపమానముగ తోచినవి. శ్రీకృష్ణ మందిరమున తనకు కలిగిన అనుభూతి, సౌదామని భగవద్గీత బోధనము, సాకార, నిరాకార ఆరాధనలు తలచుకొను సిద్ధార్థునకు సౌదామని దైవానుగ్రహపాత్రు రాలగుట, తానట్టి పాత్రతను పొందలేకపోవుట తీవ్రముగ బాధించినది. గంగను చూచుచు నుండగ భావములు కరిగి అంతర్వాణి యిట్లని వినిపించినది. "నీవు సాకారుని వర్జించుటచే నీ ప్రయాణము క్లిష్టమైనది."

ఇల్లు చేరిన సిద్ధార్థుడు దైవము సాకార, నిరాకార స్థితులను గూర్చిన భావన తీవ్రముగ చేసినాడు. అతడు నిరాకారుడే అయి నప్పటికిని, సాకారుడుగ కూడ నుండకలడు. సాకారత్వము అతడు తన ప్రకృతి నుండి కల్పించుకొనుచు సృష్టి చేయుట, సృష్టియందు నిరాకార, సాకారుడుగ నుండుట, లయమందు నిరాకారుడై వుండుట, అతడు సాకారుడైనప్పుడు అగ్ని, వాయువు, సూర్యుడుగ ఏర్పడుట, త్రిమూర్తులుగ త్రిశక్తులుగ నేర్పడుట, ఆదిత్యులుగ, రుద్రులుగ, ప్రజాపతులుగ ఏర్పడుట, అతడే కాలము రూపమున మన్వంతర కథ నడుపుట ఇత్యాది విషయము లన్నియు సిద్ధార్థునికి జ్ఞప్తికి వచ్చినవి.

తన తల్లి సాకార ఆరాధనము గావించినది. గౌతమబుద్ధుడు నిరాకారమును ధ్యానించి నిర్వాణ పథమును పొందెను. తన తండ్రి రెంటిని సమన్వయించుకొనెను. తాను నిరాకార దైవము పేరున సాకార స్థితిని గౌరవింపలేదు. పూజింపలేదు. పైగా

నిరసించుట, నిర్లక్ష్యము చేయుట కూడ చేసెను. గౌతమబుద్ధుడు నిర్లక్ష్యము చేయలేదు. తన నిర్లక్ష్యమే వ్రేలెత్తి చూపుచు ''మించిన తెలివి కలవాడవు, జాగ్రత్త సుమా!'' అని హెచ్చరించెను. తాను సాకారమును నిర్లక్ష్యము చేయుట వలననే తన మనసు, యింద్రియములు, దేహము తనకెదురు తిరిగినవి. అందులకే తాను మరల ప్రపంచమున పడినాడు. సాకార, నిరాకారములను సమన్వయించుకొనుటయే తన కర్తవ్యమని భావించుచు సిద్ధార్థుడు నిదురించెను. బ్రాహ్మీ ముహూర్తమున సిద్ధార్థునకు నిద్ర నుండి మెలకువ కలుగు సమయమున–

*"అవ్యక్తోవ్యక్త రూపశ్చ"* అని తండ్రి పలికినట్లు వినిపించెను. ఉలిక్కిపడి సిద్ధార్థుడు నలుదిశలా పరికించి చూచెను. తన తండ్రి తనకు కనిపించలేదు. ఉదయమున కొంత దుఃఖము కలిగెను. తండ్రి వాణి వినిపించినది. కాని తండ్రి రూపము కనిపించలేదు. రూపము కనిపించినచో ఎంత బాగుండెడిది. తనకు రూపమెట్లు కనిపింపగలదు. తాను రూపమును నిరాకరించిన దౌర్భాగ్యుడు కదా! అని చింతించుచు కాలకృత్యములను గావించి ప్రాణాయామ, ధ్యాన కార్యములందు నిమగ్న మయ్యెను. ధ్యానము నందున్న సిద్ధార్థునకు "దైవము అవ్యక్తుడు మరియు వ్యక్తుడు. నీవు అవ్యక్తము నుండి వ్యక్తమునకు వచ్చితివి. రెంటిని సమన్వయించుకొనుము. అపుడు నీవు సిద్ధార్థుడ వగుదువు. నా ఆశీర్వచనము నీకు తోడుగ నుండును.'' అనుచు తండ్రి వాణి హృదయమున వినిపించెను. సిద్ధార్థుడు తనకు తండ్రి తోడుగ నున్నాడని తెలిసి సంతసించెను. తండ్రినే గురువుగ భావించి ప్రతినిత్యము ధ్యానము సాగించెను.

సిద్ధార్థుని జీవితమున ముప్పది ఐదు సంవత్సరములు నిండి 36వ సంవత్సరము ప్రారంభమైనది. ధనగుప్తుడు సిద్ధార్థుని సమర్థతను మెచ్చి తన మొత్తము వ్యాపారమునం దతనికి అర్ధ భాగము కల్పించి తనతో సమానముగ సత్కరించెను. ధనగుప్తుని చర్య సిద్ధార్థున కవగతమైనది. అతడు క్రమముగ వ్యాపారమంతయు తన కప్పగించి విశ్రాంతిగొను దృష్టిలో నున్నాడని గ్రహించిన సిద్ధార్థు డిట్లనెను: "మీరు నాకు సరిసమానమగు భాగమును వ్యాపారమున కల్పించి సంఘమున నన్నొక ముఖ్యమగు సభ్యుడుగ నుండుటకు దోహదము గావించినారు. అందులకు నేను కృతజ్ఞుడను. కాని ఒక విషయము. ఇప్పటినుండి 7 సంవత్సరముల తరువాత నేనీ వ్యాపారమును విసర్జించగలను. సంఘ జీవనమునకై వ్యాపారమున జేరితిని. తదనుభవము నాకు దక్కుచున్నది. 12 వత్సరములు ఈ పట్టణమున వుండుటకు నిశ్చయించుకొని వచ్చితిని. ఐదు సంవత్సరములు గడచినవి. మరి 7 సంవత్సరములే యుందును. ముందుగ మీకు తెలియచేయుట నా ధర్మము. ఈ నా నిర్ణయము మారదు.

*ధనగుప్తుడు :* అటుపై నేమి చేతువు?

*సిద్ధార్థుడు :* ఏమి చేతునో ప్రస్తుతమునకు తెలియదు కాని పట్టణము వీడిపోవుట తథ్యము.

*ధనగుప్తుడు :* అట్లే కానిమ్ము. నీవంటివా రసలు వ్యాపారమునకు దొరుకుట నా అదృష్టమని భావించితిని. నిజమునకు నీవు వ్యాపారమును చక్కగ పెంచి, నీకును నాకును కూడ సంపద పెంచితివి. నీకు కూడ నేను కృతజ్ఞుడను. నీ స్థానమున

మరియొక రున్నచో యిపుడు నీవందిన స్థితిని చాల అదృష్టముగ భావించెడివారు.

సిద్ధార్థుడు ధనగుప్తుని అనుమతితో గృహమున కేగెను. ఆ వారాంతమున ఆదివారము రాగ యథాప్రకారము సౌదామని గృహమున కేగెను. భోజనాదికములైన వెనుక ఇరువురికిని సంభాషణ యిట్లు సాగినది.

*సౌదామని :* 7 సంవత్సరముల తరువాత వ్యాపారమును, పట్టణమును వీడిపోవుదువని తెలిసినది, నిజమేనా?

*సిద్ధార్థుడు :* నిజమే!

*సౌదామని :* సౌదామని స్నేహము నేమి చేతువు?

*సిద్ధార్థుడు :* స్నేహమును, స్నేహితురాలితో సహా కొనిపోవుదును. నీతో స్నేహము నాయందు ప్రేమగ పర్యవసానము చెందినది. అన్ని విషయములందు నీవు నాకో సరియైన తోడునీడ. నీ పరిచయము నాకు దైవమందించిన వరము. నీ సహవాసమున నా అన్వేషణకు సమన్వయము కుదిరినది. మనసును మించి, హృదయము ప్రవర్తించు టారంభమైనది. స్నేహము ప్రేమగ పర్యవసానము చెందవచ్చును. నీ సిద్ధాంతము నా యందు సత్యమై నిలచినది. నీ వంగీకరించినచో కాళీయ కృష్ణుని సాక్షిగ నిన్ను వివాహమాడి ధర్మబద్ధమగు దాంపత్య జీవితమును జీవితాంతము నెరపుదును. నేనున్న చోటనే నీవును వుందువు. నీకు సమ్మతమగుచో నన్ను నీ కృష్ణ మందిరమునకు గొనిపొమ్ము.

సిద్ధార్థుడు వివాహ విషయమై ప్రతిపాదించి వెడలిపోయెను. సౌదామని దీర్ఘాలోచనలో పడినది. తన కిప్పుడు వివాహ మవసరమా? వివాహ ప్రయోజనము తన కిపు డేమి యున్నది? ప్రపంచపు దృష్టిలో తాను పతితురాలు. ఇపుడు వివాహమాడినను ప్రపంచమున కది అవహేళనగనే యుండును. ప్రపంచము విషయము తనకు తెలియును. సగటు భావనలతో సాగిపోవునది ప్రపంచము. సగటు మానవులు కోట్లాదిమంది యున్నారు. వారు వచ్చిపోవుచు నుందురు. వారిని ప్రపంచము గుర్తించదు. సగటు మనిషి నెవ్వరూ పట్టించుకొనరు. సంఘపు సగటు సిద్ధాంతములను పాటింపని వారిని సంఘము గుర్తించుచుండును. సంఘము గుర్తింపు పొందినవారు రెండు విధములు. ఒకరు సంఘపు సిద్ధాంతములను పట్టించుకొనక సంఘమునకు మేలు చేసినవారు. వీరు మహాత్ములు. మరియొకరు కేవలము సిద్ధాంతములను వ్యతిరేకించినవారు. ఇందు కొందరు అపకారము కూడ చేయుదురు. వీరిని గూర్చియే సంఘమున వార్తలుండును.

తాను పై ఈ రెండు తెగలకు చెందినది కాదు. తనను గూర్చి సంఘము భావన తన దురదృష్టము. సంఘమున కొందరికి జీవితము తమ వశముకాక విపరీత ధోరణులలో నడుచుచుండును. స్వభావపరముగ తనయందు దుర్గుణము లేమియు లేవు. విధి వశమున తానీ వేశ్యావృత్తి యందు స్థిరపడినది. ఆ వృత్తి యందు తన కాసక్తి లేదు. నిజమున కా వృత్తి కారణముగనే తనకు సహజ వైరాగ్య మబ్బినది. విధి తనయందు ఒక వైచిత్రిని చూపెను. అది ఏమన, వేశ్యావృత్తి నుండి వైరాగ్యము క్రమముగ దేహభావము నశించగ, వైరాగ్యమున జీవించుచున్నది. ప్రపంచపు పోకడలలోని

తేలికతనము తెలిసినది. లోకుల ధర్మము లన్నియు బీరకాయలోని నేతి వంటివి. పరిస్థితులు విషమించినచో వారు నమ్మిన ధర్మములు వారే పాటింపరు. ఏది ఏమైనను తనకు కలిగిన వైరాగ్యము కారణముగ తాను దానధర్మములు మొదలిడినది. తా నందించు దానధర్మము లందుకొనుటకు లోకులు సిద్ధమే. తన నాదరించు వారు లేరు. తన నాశ్రయించిన సేవకులు కూడ తన యందు కలిగియున్న అనురాగము కూడ అంతంత మాత్రమే.

తన ఈ ఒంటరి జీవితమున ప్రేమమయుడు కరుణామయు డైన సద్గురు ఒకరు ప్రవేశించుటయే తనకు తన జీవితమున ఆశాకిరణమై నిలచినది. లోకమున తన అంతఃశుద్ధి నెరిగిన మహాత్ముడాయన. ప్రవాహమున కొట్టుకొనుపోవు వానికి దొరికిన ఆధారమువలె తనకు సద్గురు వాశ్రయము దక్కెను. హృదయమున ఈ ఆత్మీయ సంబంధమును కేంద్రముగ నేర్పరచుకొని తాను జీవితమును గడుపు చున్నది. తనకిపు డే ఆకాంక్షయు లేదు. గురు, దైవ ప్రార్థనలు, దానధర్మములు, ఆశ్రయించినవారి సంరక్షణ, తన కర్తవ్యములుగ జీవితము సాగుచుండుగ, విధివశమై సిద్ధార్థుడు తనకు తారసపడుట జరిగినది. అతని జీవితమూ విచిత్రమైనదే. సగటు జీవితము కాదు. సిద్ధార్థుడు సంప్రదాయమును విసర్జించి, సత్యదర్శనమునకై తపన చెందుచున్నాడు. తనను సంప్రదాయము విసర్జించినది. అతడు సంప్రదాయము విసర్జించుట అవివేకమని తన కనిపించు చుండును. సంప్రదాయము విసర్జించుట నేల విడిచి సాము చేయుట వంటిది. అతను విసర్జించిన తీరు కూడ అతని ఉద్రేకమును ప్రకటించినదే కాని వినియోగపడలేదు. అది గమనించిన సిద్ధార్థుడు వరద వంటి ప్రవాహమును

వదలి శరదృతువు నందలి ప్రవాహము వలె సాగుటకు నిర్ణయించుకొనినాడు. ఇహలోక సౌఖ్యమును విస్మరించుట వలన తనయం దేర్పడిన అసమానతలను దిద్దుకొనుటకై ధనార్జనము గావించుచు, దాన ధర్మములు చేయుచు యిపుడు వైవాహిక జీవితమునకు ఉత్సహించు చున్నాడు. అతని కిపుడు వలసినది వైవాహిక జీవితానుభూతి. ఆ అనుభూతి కూడ అతనికి తాత్కాలికమే అని తనకు తెలియును. త్రికరణశుద్ధి కలవాడగుటచే వివాహము కావించుకొనక తనను పొందుట భావ్యము కాదని భావించి వివాహమును ప్రతిపాదించినాడు. అతడు సంప్రదాయ మును విసర్జించెనే కాని వ్యక్తిగత సంస్కారము లెన్నడూ విసర్జించ లేదు. ధనార్జన విషయమున కూడ సిద్ధార్థుడు ఎట్టి అతిక్రమణము చూపక వృద్ధి చెందుట తనకు తెలియుచునే యున్నది. అతని దృష్టిలో వివాహ మావశ్యకము. కాని తనకో.....?

సౌదామని యింకను యిట్లు భావించెను. తాను వివాహము నభిలషించినపుడు జీవితమున అది సంభవింపలేదు. తన మనసున వివాహేచ్ఛ తొలగిన తరువాత, వివాహ మిపుడు తనను వరించు చున్నది. ఇది దైవలీల! **కోరిన వారికి కోరినపుడు, కోరినవి లభింపవు. కోరనపుడు లభించును. లభించుట, లభింపక పోవుట కాలమును కర్మమును బట్టి జరుగును గాని, కోరుట కోరకపోవుట పైన ఆధారపడి లేవు. కోరిన వారికి కోరినపుడు లభింపక, కోరనపుడు లభించును. కోరికలు తీరుట, తీరకపోవుట అన్నవి, నిజేచ్ఛపై కన్న కాలముపై నెక్కువ నాధారపడి యున్నది. కోరిన వారిని కోరికలు వరించనట్లే, విసర్జించిన వారిని, విసర్జింపబడిన విషయములు విసర్జించవు. కోరుట, విసర్జించుట అంతయూ కాలమే నిర్వర్తించుచుండును.**

**మహర్షులకు సహితము యిట్టి ఘటనలు తప్పలేదు.** తానెంతటిది. నిర్లిప్తత యిట్టి సమయమున వాంఛనీయము.

"విశ్వ గురువగు నారదునకు కూడ క్లిష్ట పరిస్థితులు తప్పలేదు." అనుచు, నవ్వుచు సిద్ధపురుషు లొకరు ప్రవేశించిరి.

"నేను స్త్రీ వ్యామోహము నుండి ఉత్తీర్ణుడనైతిని. నీవు తప్ప మరియొక సంగము నాకిక మనసున పడదు అని నారద మహర్షి మహా విష్ణువుతో విన్నవింపగ, శ్రీ మహా విష్ణువు నవ్వెనట. ఆయన నవ్వునుండి విష్ణుమాయ జనించి నారదుని ఆవరించెనట. నారద మహర్షి ఒక అతి సామాన్య స్త్రీ వ్యామోహమున పడెనట. తత్ఫలిత ముగ సంసారమున పడెనట. బహుసంతానమును కనెనట. ఒకటి కాదు, రెండు కాదు, అరువదిమంది అట. తెలిసినవారు, తెలియనివారు అందరూ మాయనుబడుట దైవక్రీడ! అందుండి బయల్పడుట అతని కృప. నీవిక క్రమముగ ప్రస్తుతమున్న వాతావర ణము నుండి రక్షింపబడు సమయ మాసన్నమైనది. నీ జీవితమున సిద్ధార్థుని ప్రవేశ ముండును. ప్రవేశము దైవసంకల్పము. సిద్ధార్థుని వలన నీకును ప్రయోజన మున్నది. నీవు విచిత్రమగు మార్గమున వైరాగ్యము పొందిన దానవు. సిద్ధార్థునకు వైరాగ్యము సహజముగ నున్నది. అతని ఐహిక రతి ఒక ప్రయోగము. సిద్ధార్థుడు తన జీవితమును సత్యదర్శనమునకు అర్పణము గావించిన సాహసి. జీవితమునే యొక ప్రయోగశాలగ మార్చుకొని, జీవితమున వివిధ కోణములనుండి పరిశీలించుచున్నాడు. తనను తాను పరీక్షించుకొను చున్నాడు. త్రికరణశుద్ధి అతని బలము. **అతడు స్ఫూర్తిమంతుడు, బుద్ధిమంతుడు, బలవంతుడు. అతని**

**మనోబలము విశిష్టమైనది. తాను నమ్మినదానిని అనుసరించుచు సత్యమునకై ఆరాటపడు చున్నాడు. పట్టుదల కలవాడే గాని మూర్ఖుడు కాడు. తనకు తానే ఉపాధ్యాయుడు, విద్యార్థి. అక్షరములా అతను అన్వేషి. "అన్వేషకుడు" అతని సార్ధక నామము.** సిద్ధార్థుడు అను నామము, అతని తండ్రి అతని యందు గుర్తించిన గుణ విశేషము. అతడు నిన్ను కోరుటలో, వివాహము ప్రతిపాదించుటలో ఉభయులకు శ్రేయస్సు కలదు. అతడు సర్వమును విసర్జించి పుష్కరము కాలముపైన అన్వేషణము గావింపగ విసర్జింపబడిన విషయము లతనిని విసర్జించలేదు. బుద్ధిమంతు డగుటచే వెంటబడుచున్న భావములను కొంతవరకు అంగీకరించి మరియొక ప్రయోగము చేయుచున్నాడు. ధనార్జన అందొక భాగము. అది నీకును ధనగుప్తుని వలన తెలిసినది. అట్లే అతని వివాహ ప్రయోగము కూడ. అతడు నీవలెనే వివాహమును, దాంపత్య జీవితమును కోరినవాడు కాదు. భావమున అనివార్య మగుటచే దైవసంకల్పముగ అంగీకరించు చున్నాడు. నిన్ను త్రికరణశుద్ధిగ గౌరవించుచున్నాడు. నీ వ్యక్తిత్వ మతనికి మొదట ఆశ్చర్యము, అటుపైన ఆనందము కలిగించినది. మొదట స్నేహ భావమే కాని కాలక్రమమున ప్రేమ భావమైనది. అందులకే త్రికరణశుద్ధిగ నీతో వివాహము కోరుచున్నాడు.

నీ జీవితమునకును యిది యొక చక్కని పరిష్కారము. కొంత కాల మతనితో హృదయ రంజకముగ జీవించి నీవు కడతేరగలవు. అతడును కడతేరగలడు. ఇరువురికిని వలసిన సిద్ధి లభించును. ఇరువురి అన్వేషణము పరిసమాప్తి అగును. అతని మార్గమున నీవొక పనిముట్టువు. అట్లే నీ మార్గమునకు కూడ

అతడొక పనిముట్టు. ఇది మీ యిరువురి యందు దైవము చూపు అనుగ్రహము. మిగిలిన వివరములన్నియు నీకే తోచగలవు."

సిద్ధపురుషుని దర్శనమున సౌదామని పరితృప్తి చెందినది. అంతయూ బుద్ధిమయకోశమున గోచరించిన దివ్య సన్నివేశము. మనోలోకమునకు మరల ఆమె తిరిగి వచ్చుసరికి సిద్ధపురుషు డంతర్ధాన మయ్యెను.

ఆదివారము వచ్చినది. సిద్ధార్థుడు ప్రాతఃకాలముననే కాల కృత్యములు తీర్చుకొని గంగానదీ స్నానమున కేగెను. హాయిగా స్నానమాచరించి నూతన వస్త్రములను ధరించి ఒక వృక్ష ఛాయ యందు నదీతీరమున కూర్చుండెను. గంగానదీ ప్రవాహమును పరికించుచుండెను. ఉత్సుకతతో ప్రవహించు గంగను చూచి కొంత తడవు తన్మయుడయ్యెను. హిమాలయములలో పుట్టి పర్వతములు, కొండలు దాటుకొనుచు, పల్లపు ప్రాంతమున ప్రవహించుచు, మార్గమున ఎందరెందరినో పవిత్రము గావించుచు సాగర సంగమము చేయు గంగకన్న పవిత్రమగు జీవన మేమున్నది? అందరిని పవిత్రులను చేయుటయే గంగ పని. పాపము లంటనిది గంగ. పాపములను నశింపజేయునది గంగ. ఎందరెందరో ఋషులు, మహర్షులు గంగలో స్నానము చేయక నుండజాలరు. ప్రస్తుతము తనకు మార్గదర్శిని గంగయే. తన జీవితమున నొక నూతన మలుపు ఏర్పడు సమయ మాసన్నమైనది. క్రిందటివారము సౌదామనికి త్రికరణశుద్ధిగ తన మనోభావములను ప్రకటించెను. సౌదామని సమాధానము తన కీనాడు లభ్యమగును. దాని ననుసరించి జీవితమున వలసిన మలుపులు ఏర్పడగలవు. ఇట్లు

భావించి లేచి గంగకు నమస్కరించి తన నివాసమున కేగెను. నిర్ణీత సమయమునకు సౌదామని గృహమున కేగెను.

సౌదామని చిరునవ్వుతో ఆహ్వానించి సముచితాసనము చూపి కుశల మడిగినది. ముక్తసరిగ సంభాషణము సాగినది. యథావిధిగ భోజనాదికములు ముగించినారు. వివాహ విషయమును గూర్చి ఎట్టి ప్రస్తావన సౌదామని చేయకపోయినను సిద్ధార్థుడు స్థిరమతియై వేచియుండెను. క్రిందటి వారము తన అభిప్రాయము తెలిపినాడు. సమాధానము తెలుపుట సౌదామని వంతు. మరల కోరు స్వభావము సిద్ధార్థుని యందు లేదు. అతనిది అర్థించు స్వభావము కాదు. తనకు వేచియుండుట, మౌనముగ నుండుట తెలియును. కావున మౌనముగ వేచియుండెను.

భోజనానంతరము ఇరువురును సముచితాసనములపై కూర్చుండిరి. సౌదామని గంభీరముగ నిట్లనెను: నీవు చేసిన వివాహ ప్రతిపాదనము ఈ వారమంతయు నా మస్తిష్కము వేడెక్కించినది. నా జీవితమునకు ఇదియొక వూహించని మలుపు. ఎదురుచూడని అదృష్టము. కాని యొక ప్రశ్న. సమాధానము అంతర్ముఖముగ నాకు తెలిసినదేయైనను అడుగుట భావ్య మనిపించుచున్నది. ఏడు సంవత్సరముల తరువాత ధనగుప్తుని భాగస్వామ్యము విసర్జింతు వని తెలిపితివి. అట్లే ఈ భాగస్వామికి కూడ పరిమితి కలదా?

సిద్ధార్థుడు : వివాహము జీవిత భాగస్వామ్యము. జీవితాంతము బాధ్యతతో నిర్వర్తించవలసినది. విసర్జించుట కవకాశము లేదు. నా జీవితమున నాకుగ నేను ఏర్పరచుకొన్న బాధ్యత యిది. నేను స్వభావ సిద్ధముగ స్వతంత్రుడనే గాని

బాధ్యతారహితుడను కాను. ధనగుప్తునితో నాకు గల సంబంధము పరిమితమైనది. ధనార్జనము, సంఘసేవ కర్తవ్యములుగ అది సాగుచున్నది. నా మనసున దానికొక పరిమితి నిర్ణయించుకొంటిని. అందులకే కాలపరిమితి ఏర్పరచితిని. నీ విషయమున నే నేర్పరచుకొను సంబంధము, ఆత్మ సంబంధమని భావించుచున్నాను. నా ప్రతిపాదన ఉభయులకు నొక పరిష్కారము చూపగలదని నా అవగాహనము.

సౌదామని సిద్ధార్థుని చేయి తన చేతిలోని కందుకొని మునుపతడు కోరిన విధముగ తన పూజా మందిరమునకు గొనిపోయెను. కాళీయ కృష్ణుడు సాక్షిగ దాంపత్య జీవనమునకు ఇరువురును మానసికముగ వాగ్దానములు గావించుకొనిరి. ఆ సాయంకాలము సౌదామని పరివారమును, ధనగుప్తుని పరి వారమును ఆహ్వానించి తమ నిర్ణయమును ప్రకటించి అందరికిని విందు భోజన మేర్పాటు గావించిరి.

సిద్ధార్థుడు సౌదామనిల ఆంతర్య మెరిగిన కొందరు, వారిరువురు గావించిన నిర్ణయమును శ్లాఘించిరి. చౌకబారు మనస్తత్వము గలవారు రకరకములుగ గుస గుస లాడిరి. ధనగుప్తుడు విస్తుబోయెను. అతనికి నోట మాట రాలేదు. సిద్ధార్థుని గూర్చి ఆలోచింప సాగెను. ఇంతలో ఎంత వాడయ్యెను. తానిచ్చిన అవకాశమును సమర్థతతో మలచుకొని పెరిగి పెద్దవాడై సంఘమున కీర్తి ప్రతిష్ఠలు సంపాదించటమే కాక తాను వలచిన స్త్రీని కూడ గెలుచుకొనెను. సౌదామని సరియగు గమ్యము చేరినదని ధనగుప్తుడు భావించుచు శూన్యములోనికి చూచుచు నుండెను.

# 9

సౌదామని సిద్ధార్థులు అన్యోన్యానురాగాలతో జీవనము గడుపసాగినారు. ఇరువురు భోగభాగ్యాలు అనుభవింప సాగినారు. ఇదివరకు జీవితమున సంపద యున్నను సౌదామనికి దానిపై ఇచ్ఛలేదు. భోగానురక్తి లేదు. ఆమె హృదయమునకు, మనస్సునకు, దేహమునకు అన్వయము కుదిరి, సమన్వయాత్మకమై తృప్తిని, ఆనందాన్ని ఇవ్వసాగినది. తాను మెచ్చిన పురుషుడు తనకు లభించి నచో ఏ స్త్రీయైనను తృప్తి చెందగలదు కదా! సిద్ధార్థుడు రూపసి, దృఢమైన మనోబలము, శరీరబలము కలవాడు. తన జీవితమును ప్రయోగశాలగ నేర్పరచుకొని జీవితపు లోతులకై అన్వేషించు మేధా సంపత్తి కలవాడు. సమృద్ధిగ ధన మార్జించువాడు. హుందాతనము కలవాడు. అన్నిటినీ మించి అతను అన్వేషకుడు. అట్టివాడు తన పురుషుడుగ లభించుటచే ఆమె జీవితము చిగురించి ఫలించినట్లు భావించసాగినది. ఉత్తమ క్షత్రియుని పుత్రికగ జన్మించి కాలవశమున పతనమై మరల పవిత్ర స్థితిని చేరుట ఆమెకు అమితాశ్చర్యము కలిగించినది. అంతరంగమున తనకు గల తపన, తనను చీకటి జీవితము నుండి వెలుగులోనికి

కొనివచ్చినట్లుగ ఆనందపడినది. సామాన్యమగు పద్ధతులలో గాక విపరీత ధోరణి తన జీవితమున కన్పట్టును. రహదారులందు పయనించుట సర్వసామాన్యము, క్షేమంకరము కూడ. దారి తెలియని అడవులలో నడుచుట అసామాన్యము. అడవులలో దారులుండవు. అపాయములు మెండుగ నుండును. క్షణక్షణము ప్రాణభీతితో మెలగవలసి యుండును. అట్టి దారి తెన్ను లేని అపాయకరమగు మార్గమున జీవితము సాగి, ఇపుడొక నిర్దిష్టమగు మార్గమున పయనించుట తనకే ఆశ్చర్యము గొలిపినది– ఇది కలా, నిజమా అనిపించుచుండినది. నిజమనుకొను స్థితికూడ నొక స్వప్నమే కదా అనికూడ అనిపించును. జాగ్రదావస్థకు స్వప్నావస్థకు కూడ శాశ్వతత్త్వము లేదని తెలిసిన లోతైన స్త్రీ సౌదామని. ఆమె వివాహమున కంగీకరించుటలో సిద్ధార్థుని దరి చేర్చుట కూడ ఒక ముఖ్యకారణము. మోక్షగామియై జీవిత మారంభించి మధ్యేమార్గమున "కామి కానివాడు మోక్షకామి కాడు." అని తెలిసి అతడు మరల ప్రపంచమున ప్రవేశించినాడు. ధనకాంత, కీర్తికాంతలను వశము చేసుకొనినాడు. వానిని అనుభవించుచునే యున్నాడు. వాని పరిమితత్త్వములను కూడ తెలిసికొను చున్నాడు. త్వరలోనే వానిని విసర్జించుదునని కూడ ప్రకటించి యున్నాడు. ఇపుడు తనతో యున్నాడు. "ఆ కాంతలను విసర్జింతును కాని ఈ కాంతను విసర్జించను" అని వాగ్దానము గావించి వివాహము చేసికొనినాడు. అతనికి కాంతా సుఖము నందించుట, సౌదామని తన కర్తవ్యముగ భావించినది. వైవిధ్యములగు రతి క్రీడలతో అతనిని పరితృప్తుని గావించుచు నున్నది. ఏ సుఖ మనుభవించుచున్నను సిద్ధార్థుడు అందు అన్వేషకుడుగా కూడ నుండుట చూచి సౌదామని

విస్తుపోయినది. **ప్రధానముగ సిద్ధార్థు డన్వేషకుడు. అతడు అన్నిటి యందును అన్వేషణమే ప్రధానముగ రుచి చూచువాడు. ధనము, కీర్తి, కాంత సుఖముల యందు అతడు అన్వేషకుడుగనే యుండి పోయెను. వాటికి వశము కాలేదు. అతడు వైవాహిక జీవితమును అనుభవించుచు కూడ అవశుడై నిలచెను.** అది కారణముగ సౌదా మనికి సిద్ధార్థునిపై ఇనుమడించిన గౌరవము కలిగినది.

సిద్ధార్థుడు నిజమునకు జితేంద్రియుడే. ఇంద్రియ భోగములను తగుమాత్రము కూడ అనుభవింపక నిరాకరించుట వలన కలిగిన విఘ్నములను తొలగించుట కతడు మార్గమున వెనుదిరిగి, అసంపూర్ణానుభవమును సంపూర్ణము గావించుకొను చున్నాడు. ఆ ప్రయత్నమున తనకు సౌదామని లభించినది. అది దైవికము. తాను అభిలషించిన వన్నియు ఆమె నుండియే లభించినవి. ఆమె జీవితము నతని నాకర్షించినది. ఆమె మట్టిలో కూరుకుపోయిన మాణిక్యమని తెలిసినది. కాకుల మధ్య వశించు పావురమని తెలిసినది. మృగముల మధ్య సంచరించు సాధుజీవి అని తెలిసినది. తనవలెనే ఆమె కూడ ఐహిక జీవన మంతయు స్వప్నముగ భావించుచు కాలమిచ్చు పరిష్కారమునకై వేచియున్నది. వారిరువురి కలయిక పరస్పర పరిష్కారమునకు తెర యెత్తినది.

సౌదామని సిద్ధార్థుల జీవితము ఆనందదాయకముగ దాన ధర్మములతో సాగుచుండగ ఐదు సంవత్సరములు గడచినవి. సిద్ధార్థునకు నలుబది రెండవ సంవత్సరమున ప్రవేశించు కాలమాసన్న మయ్యెను. అతడు సౌదామనితో ఒకనా డిట్లనెను.

రాబోవు కార్తీక పౌర్ణమికి నలుబది యొక్క సంవత్సరములు నా జీవితమున పూర్తియై నలుబది రెండవ సంవత్సరము మొదలగును. నీ కెట్లును భోగ భాగ్యములయం దాసక్తి లేదు. నీ దేహాభిమానము కూడ అంతంత మాత్రమే. నేనొక పుష్కరకాలము శమదమాదులతో కూడిన తపో మార్గమున వనముల యందు జీవించి ఆకలిని జయించితిని. వాక్కును కూడ మౌనముతో జయించితిని. నిద్రను జయించితిని. అటుపైన యింద్రియ పరితృప్తికై మరియొక పుష్కర కాలము ఐహిక జీవనము గడిపితిని. దాదాపు నీవలనే నాకు కూడ ఈ ప్రపంచపు ధనమందు కాని, కీర్తియందు కాని మోహము లేదు. మమకారము కూడ లేదు. నీకును, నాకును కూడ ఆత్మాన్వేషణమునకు వలసిన అర్హత ఏర్పడినదని నా భావన. నే నీ స్థితిని చేరుటకు నీవే ప్రధాన సాధనమై నిలచితివి. నీవు, నేను ఈ ప్రాంతము నుండి నిష్క్రమించి ఒక ప్రశాంతమగు నూతన జీవితమును ఏ నదీ తీరముననో ఏర్పరచుకొనినచో ఎట్లుండును?

*సౌదామని :* చాల బాగుండును. నీ ఈ నిర్ణయము కొఱకే వేచియున్నాను. నా జీవితమన కిది తుది మలుపు కాగలదు.

*సిద్ధార్థుడు :* నే నెప్పుడేది ప్రకటించినను నీవెపుడూ ఒక అడుగు ముందే వున్నావు. నీవు నా కోసమై వేచియున్నటువంటి సహాధ్యాయివి అనిపించుచుండును. నిజమునకు అన్ని విషయముల యందు నాకన్న నీకే అవగాహన ఎక్కువ అనిపించుచుండును. నీవొక తపస్వినివి. బాహ్యజీవనముతో సంబంధములేక అంతరంగ మున నీదైన పవిత్రతను నెలకొల్పుకున్నావు. నీకన్నియు ముందే తెలియుచు నుండును అని నా కనిపించుచున్నది. నీతో నన్ను

పోల్చుకొనుట సరికాదు. అయినను పోల్చి చూచుకొన్నచో నీ సముఖమున నాకు నేనొక మందబుద్ధి ననిపించును. నా ఆలోచన, వివేచన చాల స్పష్టముగ నుండునని, చురుకుగ నుండునని నా కిసుమంత గర్వము లేకపోలేదు. కాని నీ సాన్నిధ్యమున అదియును ఇగిరిపోవు చున్నది.

*సౌదామని :* యథార్థవాదివి. నేడేల ఈ ప్రశంసామార్గమును పట్టినావు. నా వలన పొందవలసిన సహకార మింకేదైనను యున్నదా?

*సిద్ధార్థుడు :* నే పలికినది యథార్థమే. ఆశించునది నీ సాంగత్యమే. నీ కన్న నాకిక ఆప్తు లెవరు?

*సౌదామని :* అందరికి ఆప్తుడైనవా డొకడున్నాడు. అతడే మన ఇరువురిని కలిపినాడు. అతడు కనపడడు. కాలము రూపమున వ్యక్తమగుచు నుండును. అతడిపుడు మనలను అనుగ్రహించ పూనుటయే నీ నుండి సంకల్పముగ వ్యక్తమగు చున్నది. ప్రస్తుతము శ్రావణ మాసము నడచుచున్నది. భాద్రపద, ఆశ్వయుజ మాసము లలో యిచ్చటి కార్యకలాపముల నన్నింటిని ఆస్తిపాస్తులతో సహా పరిత్యాగము చేయుదము. సమ్మతమేనా?

సిద్ధార్థుడు తన సహవాసి చేసిన ప్రకటనకు అమితా నందము చెందెను. ధనగుప్తునకు తన నిర్ణయము తెలిపి నెలరోజులలో వ్యాపారము నుండి నిష్క్రమింతునని, తగిన ఏర్పాట్లు గావించుకొనమని తెలిపెను. ధనగుప్తుడు మొదట విస్తుపోయెను. అమిత లాభము లార్జించుచున్న వ్యాపారమునందు భాగస్వామియై

యున్న సిద్ధార్థుడు, ఎట్టి పారితోషికములను కోరక నిష్క్రమించుట అతని ధీరత్వము ధనగుప్తుని మనస్సును ఆకర్షించినది. సిద్ధార్థుని వలననే తన వ్యాపారము పదిరెట్లు పెరిగినది. తన వంతు కర్తవ్యముగ అంతరాత్మ బోధ ననుసరించి ధనగుప్తుడు సిద్ధార్థునకు విస్తారమగు మూల్యమును చెల్లించి, భవిష్యత్తున ఉపయోగపడ గలదని తెలిపెను. ధనగుప్త డందించిన మూల్యము సిద్ధార్థునకు జీవితాంతము సరిపడునంత విస్తారమైనది. సిద్ధార్థుడు కృతజ్ఞతతో నందుకొని ఆ మరునాడే ఆ ధనమును స్వగ్రామమునకు దానధర్మములకై తరలించెను.

"ధనగుప్తునితో గల అనుబంధము పరిష్కరింపబడినది. నే నిపుడు ముక్తుడను." అని నవ్వుచూ సిద్ధార్థుడు ఇంట ప్రవేశించగ సౌదామని నవ్వుచూ "ధనగుప్తునితోనే గాక ధనము నుండి కూడ ముక్తుడవైతివి కదా! నే నపుడే వినియుంటిని. నాకు ఆశ్చర్యము కలుగలేదు. నీ విశ్వాసము చాల దృఢమైనది."

*సిద్ధార్థుడు :* నీకెవరైన గూఢచారు లున్నారా? ఏ విషయము తెలిపినను నీ కప్పటికే తెలిసియుండును. ఇదెట్లు సాధ్యము? పారితోషికము నిన్ననే అందుకొంటిని. వెంటనే దానధర్మాదులకై స్వగ్రామము పంపితిని. నీకపుడే ఎట్లు తెలిసినది?

*సౌదామని :* నిన్ను గూర్చి తెలిసిన దానను. నీవు చేయు పనులు తెలియుట కేమంత విద్య కావలయును. భవిష్యత్ జీవన మును గూర్చి, పోషణమును గూర్చి ఒకించుకైనను ఆలోచించ కుండుట సాహసమేమో?

*సిద్ధార్థుడు :* తల్లి గర్భమున నున్న శిశువునకు జన్మించగనే క్షీరము అవసరమగును. శిశువును పుట్టించినవాడు తల్లి వక్షోజముల యందు క్షీరమునుకూడ పుట్టించుచున్నాడు కదా! ప్రకృతి సృష్టియం దిట్టి ఏర్పాటు కలదు. ఈ మాహాత్మ్యమును గుర్తించిన వానికి భవిష్యత్తును గూర్చిన భయముండదు. "నారు పోసినవాడు నీరు పోయును" అను సామెత యందలి సత్యమును పరిపూర్ణముగ విశ్వసించిన వాడను నేను.

*సౌదామని :* రెండు నెలల గడువులో సర్వమును పరిత్యజింతు వని భావించితిని. నీవది రెండు రోజులలో పూర్తి గావించినావు. ఇక నావంతు కర్తవ్యము మిగిలినది.

*సిద్ధార్థుడు :* నీకు ఆస్తిపాస్తులు, పరివారము నాకన్న మిన్నగ యున్నవి. వివేచనతో నిర్ణయము చేయుము. త్వరపడ నవవసరము లేదు.

సౌదామని తన పరివారము నంతను సమావేశపరచి తన నిష్క్రమణ నిర్ణయమును తెలిపెను. పరిచారికలు దిగ్భ్రాంతి చెందిరి. వారందరికిని సౌదామని పూజ్యురాలు. వారి యోగక్షేమములను పరిరక్షించుచున్న యజమాని. ఆమె లేనిచో తాము దిక్కులేని వార మగుదుమని భావించి కంట తడిపెట్టిరి. వారితో సౌదామని ఇట్లు పలికినది: "నా నిష్క్రమణము మహాప్రస్థానము వంటిది. తిరుగులేని ప్రయాణము. నా ఈ ప్రయాణమున నా కాస్తిపాస్తులు అవసరము లేదు. నా ఆభరణముల అవసరము కూడ లేదు. అన్నియును మీకే పంచుదును. సమస్త ధనమును కూడ మీకే

పంచుదును. మీ జీవితముల యందు, నిర్ధనత్వముండదు. మీరు స్వేచ్ఛగ జీవించ వచ్చును. కాలము రూపమున దైవము నా కొక పరిష్కారము నిచ్చినాడు. మీకును స్వేచ్ఛ నొసంగ దలచినాడు. కావున నిస్పృహ చెందక మీమీ మార్గముల జీవించుడు."

*ముఖ్య పరిచారిక :* దేవతా మందిరమును, కాళీయ కృష్ణుని కొనిపోవుదురా? లేక నిచటనే వదలివేతురా?

*సౌదామని :* వదలివేయుటకే నిర్ణయము.

*పరిచారిక :* అట్లయినచో మే మంగీకరింతుము. ఈ భవన మును కాళీయ కృష్ణుని దేవాలయముగ మలచుకొందుము. మీ ఈ విశాలమగు గృహమును దేవస్థానముగ ఏర్పరచుకొందుము. మీ రందించిన ధనమును, ఆస్తిపాస్తులను మీ రేర్పరచిన దానధర్మాది కృత్యములకు వినియోగించి మిగిలినది భుజింతుము. మిమ్ములను మా హృదయములందు పదిలపరచుకొని ధర్మకార్యములను నిర్వర్తించుచు జీవింతుము. తల్లివలె మమ్ములను పోషించితిరి. మే మెప్పటికిని మిమ్ములను మరువలేము. మీ వంటి స్త్రీమూర్తి సమాజమున అరుదుగ గోచరించును. మేమెప్పటికిని మీ విధేయు లమే. భవిష్యత్తున మీకంతయు శుభపరంపరలే నుండవలెనని ప్రతినిత్యము ప్రార్థింతుము.

సౌదామని వారి భక్తి వినయములకు ముగ్ధయైనది. నాటి నుండి తన కున్నదంతయు తన పరివారమునకు పంచి సిద్ధార్థునితో పయనమగుటకు సంసిద్ధయైనది. అనుకున్న గడువునకు పక్షము రోజుల ముందే ఇరువురును గ్రామమును వీడిరి.

సౌదామని, సిద్ధార్థులు ఉత్తరదిశగ పయనమైరి. ప్రశాంత మగు ప్రదేశమున సామాన్యమగు జీవితము జీవించుచు, ధ్యానము ప్రధానమైన ప్రయోజనముగ ముందు జీవితము సాగవలెనని వారి భావన. పల్లెలు, పట్టణములు చూచుచు, వాటిని దాటుచు ముందుకు సాగిరి.

*సిద్ధార్థుడు :* మన మెచట స్థిర నివాస మేర్పరుచుకొనినచో బాగుండును.

*సౌదామని :* గంగానదీ తీరమైనచో బాగుండును!

*సిద్ధార్థుడు :* నా మనసులోని మాటనే నీవును పలికినావు. నీకేదైన ప్రదేశము తెలియునా?

*సౌదామని :* నదీ మార్గముననే ఉత్తరదిశగ సాగుదము. మనసుకు నచ్చినచోట స్థిరపడ వచ్చును.

ఇరువురును పక్షము రోజులు ప్రయాణము గావించి హరిద్వారమున కేగిరి. అప్పటికి కార్తీకమాసము ప్రవేశించినది. గంగానదీ స్నానమొనర్చి దీక్షాయుతులై ఇరువురును ముందుకు సాగిరి. ఋషీకేశమును చేరుటకు పూర్వము వారికొక పవిత్ర స్థలము గోచరించినది. వారచట స్థిరపడుటకై నిర్ణయించుకొనిరి. స్థానికుల సహాయమున నదీ తీరముననే ఒక ఎత్తైన ప్రదేశమున నివాస మేర్పరచుకొనిరి. ఆ కుటీరము నుండి గంగానది దర్శన మగుచుండును. సూర్యోదయము కూడ కన్పించుచుండును. చేరువనే నొక కుగ్రామము కూడ కలదు. కార్తీక శుద్ధ ఏకాదశినాడు

వారిరువురును నిర్దిష్టమగు దినచర్య నొకటి ఏర్పరచుకొని జీవించు టారంభించిరి. దినచర్యలో ఎక్కువ భాగము ధ్యానమునకై కేటా యించబడినది. రెండవ ప్రధాన అంశము నదీప్రవాహ దర్శనము. మూడవ అంశము త్రికాల నదీస్నానము. నాలుగవ అంశము నదీతీరమున తత్త్వ విచారము. ఇరువురును ఒకరికొకరు తోడ్పడు చున్నను, ఒకరికొకరుగనే సాధన సాగించిరి. ఆహార పానీయము లను తగుమాత్రము గొనుచు దేహ పోషణము విషయమున కూడ శ్రద్ధ వహించి యున్నారు. వారిరువురి జీవితము సమీపముననే గల ఒక వృద్ధుని ఆకర్షించినది. అతడు దూరము నుండియే వారిని గమనించుచు నుండెడివాడు.

నలుబది రోజులు ఒకే దినచర్యను పాటించుట సాధకుని మనోబలమునకు ఒక పరీక్ష. స్థిరమతులు కానిచో మండలదీక్షను నిర్వర్తించలేరు. సౌదామనీ సిద్ధార్థులు పదునైదు మాసములలో తొమ్మిది మండలదీక్షలను నిర్వర్తించిరి. ఒక మండల దీక్షకును మరియొక మండల దీక్షకును నడుమ పదిరోజుల విరామము నేర్పరచుకొనిరి. విరామము లేని దీక్ష పొసగదు. సృష్టి నిర్వహణ ములో కూడ సూక్ష్మముగ నిట్టి విరామము లున్నవి. విరామ మందు జీవుడు తన సహజ స్థితిని తెలియగలడు. **దీక్ష సహజ స్థితి కాదు కదా! దీక్షలను నిర్వర్తించుట వలన తన సహజ స్థితి యందు శుభంకరమగు మార్పులు గోచరించును. దీక్షా ఫలితము విరామ స్థితియందే తెలియదగును. దీక్షకు ముందున్న స్థితికిని, దీక్షా నిర్వహణము తర్వాత స్థితికిని జీవునికి తన సహజ స్థితిలో**

**కొంత పురోగతి కనిపించును. అట్లుకానిచో దీక్ష కేవలము శ్రమయై మిగులును.**

దీక్షాయుత జీవితమును గడుపుచున్న వారికి ప్రధానముగ ఈ క్రింది మార్పులు సహజమగును.

1. శరీరము తేలిక పడుట. అనగా శరీర కణములందు తమస్సు హరింపబడి తేలిక యగుట.

2. శుచి యందు ఆసక్తి కలుగుట. శుచియగు పదార్థము లను భుజించుట. శుచియగు ప్రదేశములయందు సంచరించుట. శుచిగల మనుష్యులతోనే కలయుట. శుచియగు భాషణము చేయుట. శుచియగు భావములే యుండుట.

3. దినచర్య యందలి దీక్షయందు ఆసక్తి పెరుగుట.

4. కాలమును వృథాచేయక దివ్యత్వముతో అనుసంధాన మునకై ప్రయత్నించుట.

5. మౌనము సహజస్థితియై అవసరమునకే వాక్కును వినియోగించుట.

6. వాక్కుయందు స్పష్టత. ఆలోచన యందు నిశితత్త్వము కలుగుట. అటుపైన ఎదుటివారి భాషణము నందలి సత్యా సత్యములు ప్రస్ఫుటముగ తెలియుట.

7. సాధనకు దేహము అంతరాయము కాకుండుట.

సౌదామని, సిద్ధార్థుల దినచర్యను పరికించుచున్న వృద్ధుడు ఒకనాటి సాయంకాలము వారిని సమీపించి ఆప్యాయతతో యిట్లు పలికినాడు: "మీ రిరువురును ఈ ప్రదేశమునకు వచ్చినది మొదలు మిమ్ములను నేను ఆసక్తితో గమనించు చున్నాను. పిన్న వయసు లోనే తపోదీక్షలు స్వీకరించినట్లుగ కన్పట్టుచున్నది. దివ్య దర్శనమే ధ్యేయముగ, దీక్షాయుతముగ మీ దినచర్యలను నడుపుకొను చున్నారు. పవిత్ర గంగానదీ తీరమున చేరి ఈ విధమగు దినచర్యను చాలమంది ప్రయత్నింతురే కాని ఫల మంతంత మాత్రమే. నేను నా చిన్నతనము నుండి హిమాలయములందే వశించుచున్నాను. ఈ హిమాలయములందు ఎందరో సిద్ధపురుషులు కలరు. ఎన్నియో పవిత్ర ప్రదేశములు కూడ కలవు. వానిని సందర్శించుట వలన మీ ప్రయత్నము సుగమ మగునేమో! దీనిని గూర్చి ఎపుడైన ఆలోచించి తిరా?

*సిద్ధార్థుడు :* తాతా! నీ వన్నది సత్యమే. కాని తత్సంబంధమైన ప్రేరణ లోన కలుగవలెను కదా?

*వృద్ధుడు :* తాతా! అని పిలిచితివి. చాల సంతోషము. నీ విపుడు నాకు మనుమడవైనావు. నీ వన్నది కూడ సత్యమే. లో ప్రేరణము ముఖ్యము. వారు చెప్పినవి, వీరు చెప్పినని ఆచరించుట వలన కాలము వృథా అయి మరణము సమీపించును. నిర్దిష్ట మార్గమున నడచుటయే శ్రేష్ఠము. అదియే నిజమగు దీక్ష!

*సిద్ధార్థుడు :* ఎవరు చెప్పినవి వినకపోవుట సరికాదేమో తాతా! అట్టివాడు మూర్ఖుడు, అహంకారి కాగలడు కదా! పెద్దలు

చెప్పినది వినవలెనని, విని వివేకించ వలెనని, త్వరపడి నిరాకరించ రాదని తెలియుసరికి, తెలిసిన పెద్దవారు పరలోకమున కేగిరి. వారున్నపుడు విలువ తెలియలేదు. విలువ తెలిసినపుడు వారు లేరు. ఆప్యాయముగ పలికితివి గనుక నా జీవితమున నే నేర్పరచు కొనిన ఈ లోటును వ్యక్త పరచితిని.

*వృద్ధుడు :* అట్లనుకొనకుము. అంతయూ ఈశ్వరేచ్ఛ! ఈశ్వరుడే అందరికిని గురువు. అతడు అందరి హృదయము నందును యున్నాడు. మనల నందరను లోనుండి నడిపించువా డతడే. **ఏ జీవి ఎట్లు తరించవలెనో ఈశ్వరునికే తెలియును. ఇతరులకు తెలియదు.** నీ జీవిత మెట్లు సాగినదో తెలుసుకొను యిచ్ఛ నాకు లేదు. అంతయూ ఈశ్వరేచ్ఛ అని తెలిపితిని కదా! కావున చింతింప పని లేదు. మన ఈ కలయిక కూడ ఈశ్వరేచ్ఛయే! నీ వన్నట్లు లో ప్రేరణ ముఖ్యము. **పెద్దలు చెప్పు వాక్యమందు సత్యమున్నది. ఆ వాక్యములను పెడచెవిని పెట్టక వివేకించి వివేకముతో ప్రవర్తించుట ముఖ్యము.**

*సిద్ధార్థుడు :* పెద్దవాడివి. తాతా! చిన్నతనము నుండి పెద్దవారి యందు నాకు గౌరవ మెక్కువ. అది కారణముగ వారితో సంభాషించుట ఎక్కువగ సాగలేదు. నా తండ్రి అన్ని విషయములు తెలిసిన పవిత్రమూర్తి. ఆయన నాకు చాల స్వాతంత్ర్య మిచ్చినాడు. నా స్వతంత్ర బుద్ధికి ఎపుడునూ అడ్డు తగుల లేదు. బుద్ధిమంతుడవు, నీవే తెలుసుకొనగలవు అనుచూ నన్ను నాకు వదలివేసినారు.

*వృద్ధుడు :* కారణమేమో తెలియునా? నీవు నీ బుద్ధికి తోచినదే చేయుదువు. బుద్ధికి తోచనిది చేయవు. అన్నియూ తెలిసిన

నీ తండ్రికి అదికూడ తెలిసి యుండుటచే నిన్ను నీకు వదలినాడే కాని నిన్ను పూర్తిగ వదలలేదు సుమా!

*సిద్ధార్థుడు :* అది నీ కెట్లు తెలియును?

*వృద్ధుడు :* **అన్నియూ తెలిసినవా రట్లే యుందురు. వారెవరి స్వతంత్రతకు అడ్డుపడరు. వారు ఈశ్వర సంకల్పము తెలిసి ప్రవర్తింతురు.** నీ బుద్ధికి నిన్ను వదలినను, బుద్ధికి మించిన లోకముల నుండి నీయందు పుత్ర వాత్సల్యముచే నిన్ను రక్షించుచునే యుండునని నా భావన.

*సిద్ధార్థుడు :* నీ వన్నది సత్యము. కనువిప్పు కలిగినపుడెల్ల తండ్రి కనపడి ఆశీర్వదించుచునే యున్నాడు. కాని తదుపరి కర్తవ్యము తెలుపుట లేదు.

*వృద్ధుడు :* నవ్వుచూ, స్వతంత్రబుద్ధివి కదా! తెలిపినచో పాటింతువని నమ్మకము యింకనూ కుదరలేదేమో!

*సిద్ధార్థుడు :* నీవన్నది సత్యము. తాతా! నీవొక వృద్ధుడవలె గోచరించుచున్నావు. సిద్ధుడవు కూడానా? నన్ను గూర్చి నీవు పలుకు భావముల వలన నీకు చాల తెలియును అనిపించుచున్నది.

*వృద్ధుడు :* వృద్ధుడనే. చాలాకాలము జీవించి యుండుటచేత కొంత అనుభవము గడించితిని. ఇంతకునూ నీ స్వతంత్రబుద్ధి గురించి ఏమనుకొనుచున్నావు.

సిద్ధార్థుడు : బుద్ధిబలముతో పరమును సాధింపలేక పోయితిని. ఇహమును సాధించ గలిగితిని.

వృద్ధుడు : కారణము?

సిద్ధార్థుడు : బుద్ధి అహంకారమునకు లోబడియుండు అంతఃకరణము. **దైవము అహంకారమునకు అతీతమగు తత్త్వము. బుద్ధితో మనో లోకములు, ఇంద్రియ లోకములు, భౌతిక లోకములు సాధించుకొన వచ్చును. సాధించు చున్నవి సిద్ధించుచున్నపుడు, అహంకారము కూడ పెరుగు చుండును. అహంకారము బుద్ధికి స్వామియై యుండగ అట్టి బుద్ధి మరియొక స్వామి నెట్లు పొందగలదు?**

వృద్ధుడు *:* నీ స్వతంత్ర బుద్ధియందు అహంకార మున్నదని గుర్తించితివా?

*సిద్ధార్థుడు :* బాగుగ గుర్తించితిని. అహంకారము పాలెక్కువే. నాకు బాగుగ ఆలోచించ గలనను అహంకార మున్నది. సమర్థుడను అను అహంకార మున్నది. సంకల్పబలము కలవాడను అను అహంకార మున్నది. చేపట్టిన దంతయు దీక్షతో విజయవంతము గావింప గలనని అహంకార మున్నది. అట్లే అవసరమగుచో దీర్ఘకాలము ఉపవసింప గలనని, నిద్రలేమిని భరించ గలనని, మౌనమును పాటింప గలనని అహంకార మున్నది. కాని ఇవి ఏమియు నాకు దైవమును సిద్ధింపచేసుకొనుటకు వినియోగ పడలేదు.

వృద్ధుడు *:* నీ యందు ప్రజ్వలమై వెలుగుచున్న బుద్ధి, నీది అనుకొనుట వలన నీ కీ అవరోధము కలుగుచున్నదేమో! **నీ యందు నిక్షిప్తమై యున్న బుద్ధి అను వెలుగు ఈశ్వరునిది అని**

**అనుకొని చూడుము. మనసు, ఇంద్రియములు, శరీరమువలె బుద్ధి కూడ భగవత్ ప్రసాదమే అని భావించి చూడుము. బుద్ధిలోకము నందు నీకు కలుగుచున్న భావములకు మూలమును చూడుము. నా బుద్ధి అనుకొన్నచో అహంకారము పనిచేయును. "నాది కాదు నీది" అని భగవంతునకు సమర్పణ చేసినచో దైవము పనిచేయును.** అందులకే మనవారు "నమః, నమః" అనుచు నుందురు. అట్లే "శివాయ, శివాయ" అనుచు నుందురు. 'నేను కాదు శివుడే' అని జ్ఞప్తి తెచ్చుకొను మార్గమది. నీ బుద్ధిని దైవమునకు సమర్పించి, నా బుద్ధి అను అజ్ఞానమును వదలి చూడుము. కేవలము నాకు తోచినది తెలిపితిని కాని నీకు ఉపదేశించు నంతటి వాడను కాను.

*సిద్ధార్థుడు :* ప్రయత్నింతును. చాల ప్రయత్నములు గావించిన వాడను. దీనినేల ప్రయత్నింపరాదు? నీవన్న దానిలో సత్యము లేకపోలే దనిపించుచున్నది.

ఇంతలో సౌదామని వారిరువురికిని, తనకును ఉపాహారము, తేనీరు గొనివచ్చినది. సిద్ధార్థునితో నిట్లనినది. "తాతతో ముచ్చట్లు చాల తడవైనది. తాత మాటలు నీకింపుగ నున్నట్లున్నది. ఇంతకును దేనిని గూర్చి మీ చర్చ?"

*వృద్ధుడు :* దైవమును గూర్చి, మనగూర్చి జరుగుచున్న చర్చ యిది.

*సౌదామని :* చర్చించనలవి గాని వాని గూర్చి ఎంత సేపైనను చర్చించవచ్చును. ఇతర చర్చల కన్న ఈ చర్చ రుచికరముగ నున్నది. నా చేతి ఈ ఉపాహారము కూడ రుచి చూచుచు, రుచికర మైన చర్చను కొనసాగింపుడు.

*సిద్ధార్థునితో వృద్ధుడు :* దీటైన సహధర్మచారిణి దొరికినది. ఇంతలో ఎంత సత్యము తెలిపినది. మాటలతో తెలుసుకొనలేని వాని గూర్చి మాటాడుట వృథా అని హెచ్చరించుచునే కాలమట్లు వృథా చేయుట వ్యర్థము కాదని కూడ తెలిపినది. ఈమె వాక్కునందు గల విశిష్టతను గమనించితివా? నీ కన్న ముందే దైవమును తెలియగలదేమో అనిపించుచున్నది. చాల ముచ్చటగ పలికినది. నాకు సంతోషము కలిగినది.

ముప్పురునూ ఫలహారము స్వీకరించిరి. అటుపై వృద్ధుడు మరల కలయుదునని నిష్క్రమించెను. సౌదామనీ సిద్ధార్థులు చీకటిలో తారకలను చూచుచు కొంత తడవైన వెనుక కుటీరమున ప్రవేశించిరి. "బుద్ధిని భగవంతునికి సమర్పణ చేయుము." అని వృద్ధుడు పలికిన మాటలు సిద్ధార్థుని యందు మరల మరల వినబడుచున్నవి. వృద్ధుడు పలికిన మాట సత్యమే అనిపించినది.

*సౌదామని :* సిద్ధార్థస్వామి దీర్ఘాలోచనలో పడినట్లున్నారు?

*సిద్ధార్థుడు :* నీకంతయూ వేళాకోళమే. నీ వన్నట్లు ఆలోచించుచునే యున్నాను.

*సౌదామని :* వేళాకోళము నా ప్రవృత్తిలో లేదు. కొంత హాస్యము మాత్రమున్నది. **జీవితమున హాస్యమొక వరము. హాస్యము జీవితమును తేలిక పరచును. హాస్యము లేనివారికి జీవితము బరువై యుండును. నా బరువైన జీవితమును హాస్యముతోనే తేలికగ గడిపితిని. దైవమును చేరు మార్గమును కూడ హాస్యము కారణముగ నాకు తేలికగ నుండునని నా విశ్వాసము.** నేను నమ్మినది మధురా

నాథుడగు శ్రీకృష్ణుని. అతని జీవిత మంతయూ భయంకరము. కాని చిరునవ్వుతో నిర్వర్తించి ఆనందమును పంచి పెట్టినాడు. అతని ఆరాధనమున నాకు లోపలి ఆనందము కొంత దక్కినది. తత్ఫలితమే ఈ హాస్యము. నీకు వెగటుగ నున్నదా?

*సిద్ధార్థుడు :* నీ లోపలి ఆనందము, వెలుపలి హాస్యమే నాకు ఆరవ ప్రాణమై ఊపిరిని, ఉత్సాహమును యిచ్చు చున్నది. నీవు ఎట్లు దీనిని పొందితివో నాకెపుడును ప్రశ్నగనే యుండును. నా యందు ఈ హాస్యము తక్కువ.

*సౌదామని :* కాదు. లోన ఆనందము తక్కువ. అన్వేషణము ఎక్కువ. ఆలోచనల తీవ్రత ఎక్కువ. తీవ్రముగ నాలోచించుట నేర్చుకొంటివి. ఆలోచనా తీవ్రత వలన ఆనందము కాలిపోయినది. ఎంత ఆలోచింతువు? దైవమునకు కొంత వదలిపెట్టినచో అతడు ఆనంద స్వరూపుడగుట వలన కొంత ఆనందము కూడ యుండును. అంతయూ అతనికి వదలిపెట్టినచో ఆనందమే యుండును. జీవితమున అవశ అయిన నేను అంతయూ దైవమునకే వదలినాను. అతడు నాకు వరముగ ఈ ఆనందము నిచ్చినాడు. దైవమును చేరుటకు కూడ నా ప్రయాణము ఆనందము ఆధారముగనే సాగును. ఆనందమార్గము నందు, నందనందనుడు నాకెపుడును తోడుగనే యుండును.

**“నీవు సమర్థుడ వగుటచే నీ వశమున నీవు జీవించుచుంటివి. అన్నిటినీ వశపరచుకొంటివి. దైవమును కూడ వశపరచుకొనవలెనని**

**నీ ఆకాంక్ష! దైవమునకు వశపడుట నా ఆకాంక్ష! మనల నిరువురిని ఒక చోట చేర్చుట దైవకాంక్షగ గోచరించుచున్నది."**

*సిద్ధార్థుడు :* నీ మాటలలో ఎప్పుడునూ లోతైన సత్యములను ప్రకటింతువు. నిజమునకు నీవు చూచిన లోతులను జీవితమున నేను చూడలేదు. జీవితమును స్వాధీనమున నడిపినవాడను నేను. పరాధీనమున నడిపిన దానివి నీవు.

*సౌదామని :* **స్వాధీనుడు, పరాధీను డగుటయే పరిష్కారము. పరాధీనమనగా పరుని అధీనము. పరుడనగా దైవమే! అంతయును దైవమునకు సమర్పించి జీవించుట నా కభ్యాస మగుటకు దైవమే నాకు విచిత్ర జీవనము నొసగినాడు.** ప్రతిక్షణము నన్ను దైవమే నడిపించుచున్నాడు అని భావించుచు జీవించుచున్నాను. నీవు స్వాధీనుడవై జీవించి యిపుడు పరాధీనుడ వగుటకు ఆకాంక్షించు చున్నావు. అభ్యాసవశమున స్వాధీనుడుగనే నిలబడి యున్నావు. స్వాధీనమనగా అహంకారమునకు లోబడి యుండుటయే కదా! పరాధీనమనగా అట్టి అహంకారము దైవమునకు సమర్పించుట. నిన్ను సమర్పించుకొనినప్పుడే దైవము అనుగ్రహించును. దైవము అనుగ్రహించినప్పుడు అహంకారము దైవ వశమున ఉండును. అహంకారముతోపాటు బుద్ధి, చిత్తము, మనస్సు, ఇంద్రియములు, శరీరము కూడ దైవ వశములై యుండును. ప్రస్తుతమంతయూ నీ అహంకారవశమున నున్నది. నీ స్వాధీనతయే నీకు ప్రస్తుతము విఘ్నమై నిలచినది.

*సిద్ధార్థుడు :* తాత పలికిన పలుకు కూడ నిదియే. నీవును అదే పలుకుచున్నావు. అతడు బుద్ధిని భగవంతునికి సమర్పణ

చేయమనెను. నిజమునకు నా యందలి బుద్ధి భగవంతునిదే యనెను. నీవొక మెట్టు ఎక్కువ పలుకుచున్నావు. నన్నే భగవంతునికి సమర్పణ చేసుకొన మనుచున్నావు. ఇపుడు నాకు యిరువురు గురువులు. ఇక భయము లేదు.

*సౌదామని :* కాదు ముగ్గురు. నిజమునకు ఒకరే. అది మీ తండ్రిగారు. ఒకడే మూడగునట. మూడుగ చూచినచో ముడి పడునట. ఒకటిగ చూచినచో ముడి విడునట.

*సిద్ధార్థుడు :* మరీ తికమక పెట్టకు. ఒకటి, మూడు, ఒకటి. ఇట్లు రహస్యార్థములతో భాషించుటలో నీకు నీవే సాటి.



# 10

సిద్ధార్థుడు ఉదయముననే గంగానదీ ప్రవాహమును చూచుచూ వుండెను. నదీ తరంగముల వేగముతో పాటు ఆలోచనల వేగము కూడ శ్రుతి కలిసినది. గంగ జీవనది. తన యందు జీవమున్నది. గంగ జీవమే గంగ ప్రవాహముగ వర్తించు చున్నది. తనకును అంతే. ప్రవాహ మాధారముగ తరంగములకు నదిలో నిరంతరత్వ మేర్పడు చున్నవి. తనయందు తరంగములు తరంగములుగ భావము లేర్పడుచున్నవి. గంగకొక నిర్దిష్టమైన మార్గమున్నది. తన కట్టి మార్గ మింకను దొరకలేదు. గంగ సాగర సంగమము చేయుచున్నది. అనంత మగుచున్నది. తానట్లు దైవ సాంగత్యము పొందవలెనని భావించినాడు. తన మార్గమున అన్నియునూ అవరోధములే. గంగకును అవరోధములు కలిగినవి. కాని గంగ అవరోధముల నధిగమించి సాగినది. ఇట్లు భావ పరంపరలు సాగుచుండుగ ఒక హస్తము వెనుక నుండి చల్లగ స్పృశించినది. వెనుతిరిగి చూడగ వృద్ధుడు నవ్వుచు కనిపించినాడు.

వృద్ధుడు *:* గంగ యందు నీకేమి కన్పట్టు చున్నది.

*సిద్ధార్థుడు :* తరంగములు, నీరు, ప్రవాహము, వేగము, శబ్దము గోచరించుచున్నవి.

*వృద్ధుడు :* తరంగముల కాధారము నీరు. నీటి పారుదల కాధారము ప్రవాహము, దాని వేగము. శబ్దము దాని గుణము. నీ యందును ప్రాణప్రవాహ మున్నది కదా! అదియును శబ్దము చేయుచు నుండును కదా! ప్రాణ ప్రవాహమును గమనించినచో ఆలోచన లను తరంగముల నుండి లోని కేగగలవు. తరంగములు బాహ్యములు. నది లోపల నున్నది ప్రవాహమే కదా! అచట తరంగములు లేవు. అట్లే నీవును నీ ప్రాణ ప్రవాహమును గుర్తించి నచో లోనికి మునక వేయగలవు. అట్లు మునుగుటయే ఆలోచనలు అను తరంగముల నుండి విముక్తుడగుట. తరంగములను దర్శింపక వాని కాధారమైన ప్రవాహమును దర్శించుము. తరంగములు దర్శించు చున్నచో ప్రవాహ దర్శన మంతంత మాత్రమే యుండును. కాల మంతయు ఆలోచనా తరంగములతో వృథా యగును.

సిద్ధార్థుడు వృద్ధుని కన్నులలోనికి చూచెను, అనేకానేక ప్రశ్నలు చిగురించినవి. ఇతడెవరు? పిలువని పేరంటముగ వచ్చి అడుగనిదే సలహాల నిచ్చుచున్నాడు. క్రిందటి దినము బుద్ధిని దైవమునకు సమర్పణము చేయమనెను. నేడు ప్రాణ ప్రవాహమును గమనించ మనెను. ఇట్లేల తనపై చనువుగొని పలుకుచున్నాడు? యింతలో చటుక్కున వృద్ధు డిట్లనెను: 'నే నెవరో' అని ఆలోచించుటకన్న నేను తెలిపినది నీ మనసునకు నచ్చినచో

ఆచరించి చూడుము. ఆలోచనలు చాల చేసితివి. ఆచరణ మార్గమునకై తపన చెందుచుంటివి. నీ తపన తపస్సుకాగా నీకు సహాయము చేయదలచి, స్వయముగ ఉచిత సలహాల నిచ్చితిని. దానిని కూడ నీ ఆలోచనా పిండిమరలో వేయకుము. ఆచరించి చూడుము.

శాంత గంభీరమైన ఆ వాక్కులు సిద్ధార్థునికి హెచ్చరికగ తోచెను. నదీ ప్రవాహముతో ప్రాణ ప్రవాహమును పోల్చి గమనించు చుండెను.

తనయందలి ప్రాణము ఉచ్ఛ్వాస, నిశ్వాసగ ఎడతెరపిలేక సాగుచున్నట్లుగ గోచరించెను. శ్వాస ఆలోచనా తరంగముల కాధారమైన శక్తి ఎచ్చట నున్నదో పరికించి, అది హృదయము నందున్నట్లు గోచరించెను. హృదయము నుండియే సమస్త ప్రాణ ప్రసారము, రక్త ప్రసారము జరుగుట గమనించెను. హృదయమందు శ్వాస స్పందనముగ నుండుట గమనించెను. స్పందనము వలననే శ్వాస జరుగుట, గుండె కొట్టుకొనుట, అది కారణముగ రక్తము ప్రవాహమై శరీర మంతయు సంచరించుట, మరల గుండెను చేరుట గోచరించెను. రక్త ప్రవాహము మరల గుండెను చేరి పరిశుద్ధియై మరల శరీర మంతయు ప్రవహించుట గమనించెను. గంగ సముద్రమున చేరి అట నుండి ఆకాశము చేరి మరల పరిశుద్ధమగు నీరుగ వర్షించుట గోచరించెను. అట్లే హృదయము నందలి ప్రాణ ప్రవాహము ఊర్ధ్వముగ ఆకాశము కూడ చేరగలదని తెలిసినది. తెల్లని వెలుగొకటి భాసించెను. సిద్ధార్థుడు మెల్లగ కన్నులు తెరచెను.

సిద్ధార్థుడు మరల కనులు మూసుకొని శ్రద్ధతో శ్వాసను గమనించెను. మూడు దీర్ఘమగు శ్వాసలను గమనించగనే తన శ్వాస కాధారమగు స్పందనమును చేరెను. స్పందన మందే మనసు లగ్నము చేసెను. స్పందన మందు లగ్నమైన మనస్సు ప్రథమముగ ఉపశమనము పొందెను. మార్గశ్రాంతుడు అయిన బాటసారికి దొరికిన చల్లని నీడవలె సిద్ధార్థునకు, స్పందన స్పర్శ ఊరట నిచ్చెను. అచటనే యుండవలె ననిపించెను. అచట కేవలము స్పందన ప్రక్రియ మాత్రమే యుండెను. దానిని గమనించుచు ఊరట చెందుచు, అచటనే యుండగ అతని శ్వాస సూక్ష్మమై నిర్వర్తింపబడుచున్నది. (అనగ పీల్చుట, వదలుట ప్రస్ఫుటముగ గాక సున్నిత మయ్యెను.) హృదయ స్పందన యందు మాత్రమే లగ్నమైన మనసును, స్పందన ప్రక్రియను పరిశీలింపసాగెను. ఆ ప్రక్రియ ముడుచుకొనుట, విచ్చుకొనుటగ దర్శనమయ్యెను. అదియెట్లు ఆ విధముగ నిర్వర్తింపబడుచున్నది? అనుస్యూతముగ నిర్వర్తింపబడుచున్నదే! దానిని నిర్వర్తించు ప్రజ్ఞ ఏదై యుండును? నిర్వర్తించునది తాను కాదని తనకు తెలియును. అది నిర్వర్తింపబడుట వలననే తా నున్నాడని కూడ తెలిసినది. స్పందన మా విధముగ అనుస్యూతముగ నిర్వర్తింప బడనిచో వ్యక్తిగతమగు ఉనికియే లేదు. మనో వ్యాపారమే లేదు. మనో వ్యాపారమే లేనిచో యింద్రియ వ్యాపారమును లేదు. స్పందనమే లేకున్నచో రక్త ప్రవాహమే లేక దేహము కూడ నుండదు. ఇట్లు దేహమునకు, యింద్రియములకు, మనసునకు, తనకు ఆధారమై, అహర్నిశలు తన హృదయమందు నిర్వర్తింపబడుచున్న స్పందన క్రియకు

ఆధారమగు ప్రజ్ఞ సిద్ధార్థుని అమితముగ ఆకర్షించినది. అది లేనిచో తాను లేడు. తన దేహము లేదు. తాను, తన దేహము లేక అది యుండునా? స్పందన ప్రక్రియయే తాను. పరస్పర మొకరికొకరు ఆధారమా? లేక తన మనసు కూడ లేక అది యుండునా? ఇట్లు ప్రశ్నల పరంపర పెరుగగ సిద్ధార్థుడు కన్నులు తెరచెను.

తాను మరల ప్రశ్నల రూపమున మనస్సులోనికి దిగజారెనని, తత్కారణముగ స్పందనమును గమనించుట మరచెనని, తత్ఫలిత ముగ కన్నులు తెరుచుకొనెనని తెలిసి నవ్వుకొనెను. ఆలోచన స్పందనము నుండి ప్రశ్నలలోనికి అభ్యాసవశమున జారిన దనిపించినది. ఇంతలో గంగను చూత మనిపించినది. గంగపై చాల వస్తువులు తేలుచు ప్రయాణము చేయుచున్నవి. అవి తరంగములపై తేలియాడుచున్నవి. తరంగముల కారణముగ ఒయ్యారముగ కదలు చున్నవి. తేలుచున్న వాటికి తరంగము లాధారము. తరంగములకు ప్రవాహ మాధారము. ప్రవాహమే లేనిచో తరంగములు లేవు. వాటిపై తేలియాడు వస్తువులును కదలవు. అట్లే స్పందనమే లేనిచో ప్రవాహము లేదు. ఆలోచనలు లేవు, యింద్రియ వ్యాపారమును లేదు. ఇట్లు గంగకును, తనకును సామ్య మేర్పరచుకొని సిద్ధార్థుడు మౌనముగ చాల తడవట్లే యుండిపోయెను. తదుపరి కుటీరమున కేగెను.

కుటీరమున సౌదామని ధ్యానము నందుండెను. సిద్ధార్థునకు ఆనందముతో పాటు విస్మయము కూడ కలిగెను. ఎంత నిశ్చల ధ్యానమున నున్నది. ముఖము ప్రశాంతమై గంభీరముగ నున్నది.

శరీరమున కదలికలు లేవు. ముఖమున చిన్న స్మితరేఖ గోచరించు చున్నది. బహుశః ఆమెకు మనసు అంతర్గతమై యుండవచ్చును. తన కీనాటికి, ప్రప్రథమముగ అంతర్గతమైనది. తనకు కలిగిన అనుభూతికి తాను ఆనందపడి ఆమెకు తెలుపబూని లోనికి రాగ, ఆమె కూడ అదే స్థితియందుండుట ఆనంద కారణము, విస్మయ కారణము ఆమెకు సిద్ధించిన విధానము. ఆమె కన్నియు స్వల్ప ప్రయత్నముననే సిద్ధించును. తన కత్యంత శ్రమతోగాని ఏదియూ సిద్ధించదు. మొదటి నుండియు శ్రమపడినగాని లభించదని తాను శ్రమించినాడు. ఆమెకు సరళముగనే సర్వము సిద్ధించుచున్నవి. ఆమె మనసు తేలిక. దుర్భరమగు విషయములను భరించి, వైరాగ్యము చెంది, ప్రాపంచిక విషయములందు ఆమె మనసు తేలియుండును. తన కాలోచన మెండు. ఆమెకు అనుభూతి మెండు.

ఇంతలో సౌదామని కనులు తెరచినది. సిద్ధార్థు డిట్లు పలికెను : "ప్రతిదినము గంగాతీరమున ధ్యానము చేయుచుంటిమి కదా! నీ వీ రోజున కుటీరము లోపల చేసితి వేమి?''

*సౌదామని :* **మనసు లోపలికేగు ప్రయత్నము లోపలనే చేయవలె ననిపించినది. తపస్విజనులు గుహలలో దూరి హృదయ గుహలలో దూరుదురట! అది సత్యమే అనిపించుచున్నది.**

*సిద్ధార్థుడు :* తపస్వి జనులు బహిః ప్రదేశమున కూడ తపస్సులు గావించి హృదయమును చేరిరి.

సౌదామని : అది నీకు నచ్చిన మార్గము. ఇది నాకు నచ్చిన మార్గము. ఎట్లైనను గుహను చేరుట ముఖ్యము. నీ వీనాడు కొంత సంతోషముగ గోచరించుచున్నావు. గుహ ప్రవేశమైనదా ఏమి?

*సిద్ధార్థుడు :* నా ముఖము. కేవలము గుహాముఖమునే చేరితిని. నీవు ప్రవేశించితివి.

కాలకృత్యములు గావించుకొని, సిద్ధార్థుడు గంగాతీరమును చేరి, మరల ధ్యాన మారంభించెను. మనసున స్పందనమును గూర్చిన కుతూహలము మెండుకాగ మనసును శ్వాసపై లగ్నము చేసెను. స్పందనముతో మనసు అనుసంధానము చేసెను. స్పందన మున లగ్నమైన మనసు, ఇతర భావముల నన్నింటిని విసర్జించెను. స్పందన స్పర్శ మనస్సునకు సున్నితముగ కలిగెను. స్పందన శబ్దము కూడ నిశ్శబ్దముగ ద్వయాక్షరిగ వినిపించెను. స్పందనమును, శబ్దమును వినుచు నుండగ శ్వాస అతి సున్నిత మయ్యెను. శ్వాస సున్నిత మగుచున్నకొద్ది స్పందనా స్పర్శ శబ్దము చేరువగు చుండెను. ద్వయాక్షరి శబ్దము *'సోఽహం'* అని వినిపించినది. *'సోఽహం'* *'సోఽహం'*, *'సోఽహం'* అనుచూ వినిపించుచున్న శబ్దమును వినుచు, స్పందన ప్రక్రియను గమనించుట మొదలిడెను. స్పందన ప్రక్రియ విచ్చుకోలు, ముడుచుకోలుగ గమనింపబడెను. శబ్ద మాధారముగ ప్రక్రియ జరుగుచున్నదా లేక ప్రక్రియ ఆధారముగ శబ్ద మేర్పడుచున్నదా? అను విచారణ మనసున కలిగెను. తాను, ప్రక్రియ, శబ్దము అను మూడు అంశములుగ ధ్యానమున మిగిలినవి. శబ్దమును వినుచు, ప్రక్రియను గమనించుచు చాల

తడవు సిద్ధార్థు డట్లే వుండిపోయెను. తన ప్రజ్ఞకు మగత ఏర్పడగ తెలియని స్థితియం దట్లే వుండిపోయెను. మరల మగత నుండి మెలకువ రాగ **నిద్ర వంటి స్థితి కలిగినదని** భావించెను.

మరల స్పందన ప్రక్రియను, శబ్దమును వినుట ప్రారంభించెను. ప్రక్రియకు, శబ్దమునకు చేరువకాగ మరల నిద్రవంటి స్థితి కలిగినది. అట్లు చాల తడవు వుండిపోయెను. మరల మెలకువ వచ్చెను. ఇట్లు పలుమారులు తనను మగత ఆవరించుట జరిగినది. ఈ మగతకు కారణమేమి? అను ప్రశ్న ఉదయించినది. ధ్యానము చేయుట, మనసు అంతర్గత మగుట, మగతను చెందుట మరల మగత నుండి బయల్పడుట సిద్ధార్థునకు చాల దినములు సాగినవి. మగతకు కారణము దేహమందలి తమస్సు అని భావన కలిగినది. తమస్సును తొలగించుకొనుటకై అతడు ఆహారము తేలిక గావించుకొనెను. జలములు గ్రోలుట ఎక్కువగను, ఆహారము స్వీకరించుట తక్కువగను చేసెను. స్పందనము చేరులోపల శ్వాసను చాలమార్లు దీర్ఘముగ పీల్చుట, వదలుట చేసెను. ఇట్లు ఆహారము నందు మార్పు, శ్వాస పెంపు చేయగ నలుబది దినములలో ధ్యానమున మగత తగ్గెను.

ధ్యానమున స్పందనమును, స్పందన శబ్దమును గమనించు చుండగ, మగత చేరువగుచుండగ మగతను గమనించు తీక్షణమగు ప్రజ్ఞ గమనించుట ఆరంభించినది. అపుడు మగత మొదట దట్టమగు మబ్బులవలె తన మీదుగ సాగిపోవుట గమనించెను. అటుపైన పొగమంచువలె స్పష్టాస్పష్టమగు మబ్బులుగ

సాగిపోయినవి. క్రమముగ పొగమంచు వీడి తెల్లని సున్నితము, కాంతివంతమగు చోటులో సాగుచున్నట్లుగ భావన కలిగినది. సిద్ధార్థుడు గమనించుచునే యుండెను. క్రమముగ శీతాకాలమందు ప్రభాత సమయమున గోచరించెడి తెల్లని పొగమంచు యందు తా నున్నట్లు గమనికకు వచ్చెను. పరిసరము లంతయు తెల్లని పొగమంచువలె నున్నవి. స్పందన శబ్దము పుట్టుచోటు దూరముగ ఒక కేంద్రముగ గోచరించినది. ఆ చోటు స్పష్టాస్పష్టముగ అమిత కాంతివంతముగ స్పందన ప్రక్రియతో గోచరించినది. ఆ కేంద్రము నుండే శబ్దము వినపడు చున్నది. ఆ కేంద్రమే స్పందించుచు నున్నది. అది అత్యంత కాంతివంతముగ గోచరించుచున్నది. తాను ఆ కేంద్రము పరిధిలో నున్నాడు. తానున్న ప్రాంతమంతయు తెల్లని పొగమంచు వలె యున్నది. వలయాకారముగ నున్న ఆ తెల్లని పొగమంచు ఆవరణలో తా నున్నాడు. ఆ ఆవరణ కేంద్రమున శబ్దము, వెలుగు, స్పందన ప్రక్రియ గోచరించుచున్నవి. *'సోఽహం'*, *'సోఽహం'*, *'సోఽహం'* అనుచూ వినిపించుచున్న ఆ శబ్దముపైనే సిద్ధార్థుని మనసు లగ్నమైనది.

ప్రతినిత్యము శ్రద్ధతో దీర్ఘకాలము సిద్ధార్థుడు ధ్యానము చేయుచు నుండెను. అతని ధ్యాస అంతయూ ధ్యానమే. సుఖాసీను డగుట, శ్వాస ఆధారముగ స్పందనము చేరుట, స్పందన ప్రక్రియను గమనించుట, స్పందన శబ్దమును వినుట, తత్ఫలితముగ బాహ్యాము లను మరచుట, అటుపైన మగతలోనికి ప్రయాణము, మగతను గమనించుట, మగతను దాటి స్పష్టాస్పష్టమగు పొగమంచువలె గోచరించు చోటును చేరుట, ఆ చోటులో స్పందన శబ్దము,

స్పందన ప్రక్రియ ఒక కేంద్రముగ సుదూరముగ గోచరించుట, అది కాంతివంతముగ గోచరించుట, ఆ కేంద్రమునకు ఉన్ముఖుడై తాను సాగుట జరుగుచు నుండెడిది. ఇట్లు చాలకాలము సుదీర్ఘ ధ్యానములు సాగినవి. ధ్యానమున జరుగుచున్న కాంతి దర్శనము, శబ్ద స్పర్శనము, అతని ధ్యానమునకు వూత మిచ్చుచున్నవి. కావున ధ్యానము సుదీర్ఘ మయ్యెను. మరల మరల ధ్యానము చేయు ఆసక్తి కలిగెను. వెలుగు, శబ్దము తన నాకర్షించు చుండగ అవి పుట్టిన చోటుకు చేరవలెనను ఆసక్తి మెండైనది. కాని తానెంత ప్రయత్నించినను తనకు, స్పందన కేంద్రమునకు దూరమట్లే యున్నది. తనకు, కేంద్రమునకు అనుసంధానముగ శబ్దము, వెలుగు యున్నవి. వాని నాధారముగ గొని ముందుకు సాగుచున్నను, కేంద్రము కూడ సాగుచు, అదే దూరమున వుండిపోయినది. తాను ముందుకు సాగినకొలది, కేంద్రము కూడ అంతమాత్రము వెనుకకు సాగుచున్నది. ధ్యానములో ఈ స్థితిని చేరిన సిద్ధార్థుడు మనసున విచారణ చేయసాగెను.

తాను తీవ్రమగు ధ్యానము చేయుచున్న ఈ కాలమంతయు సౌదామనికూడ కుటీరమున ధ్యానము సాగించినది. ఆమె తన సహాధ్యాయి. సాధన విషయమున ఆమె స్థితి ఎట్లున్నదో తానీ మధ్యకాలమున కనుగొనలేదు. ఆమె కూడ తెలుపలేదు. ఆమె తనకు తానుగ ఎప్పుడునూ ఏమియూ తెలుపలేదు. ఇతర విషయములు మాత్రమే సంభాషణా రూపమున తమ నడుమ సాగుచున్నవి. ఆమె వద్ద ఒక సౌలభ్యము వున్నది కదా! ఆమెకు సూక్ష్మ విషయములు అనుగ్రహ రూపమున భాసించుచున్నవి. ఇట్లు భావించి సిద్ధార్థుడు సౌదామనిని ఇట్లు పలుకరించెను.

*సిద్ధార్థుడు :* నీ అంతర్ముఖ సాధన ఎట్లు సాగుచున్నది.

*సౌదామని :* నా సాధన గూర్చి తమ కెందుకో? ఈ విషయ మును గూర్చి నీవు ప్రశ్నించి సంవత్సరము దాటినది. ఇపుడేల గుర్తు వచ్చినదో?

*సిద్ధార్థుడు :* సహాధ్యాయి వని అడిగితిని.

*సౌదామని :* సహాధ్యాయిని అయినచో సాధనా కుశల మడుగుటకు సంవత్సరము పట్టునా?

*సిద్ధార్థుడు :* నీ కిష్టమైనచో చెప్పవచ్చును. అడుగవలె ననిపించినది అడిగితిని.

సౌదామని : స్వాభిమానమునకు తక్కువ లేదు. ఇతరులకు కూడ నదియుండునని తెలియవలెను కదా!

*సిద్ధార్థుడు :* నీ వభిమానవతివి. అది నాకు విదితమే. నాది దురభిమానము. అది నాకును నీకును విదితమే. దురభిమాని యగు నన్ను నీకు సమర్పించుకొని ఎప్పటికప్పుడు వీపు సాపు చేసుకొనుచున్నాను.

*సౌదామని :* సాధన విపరీత ధోరణిని చేరినది.

సిద్ధార్థుడు : నీదా? నాదా?

*సౌదామని :* నాకు నా సాధనయే తెలియును. నా సాధన గూర్చియే తెలుపుచున్నాను. నేనిపుడు ఆకాశమునకు నిచ్చెనలు వేయుటకు శ్రమపడుచున్నాను.

*సిద్ధార్థుడు :* ఆకాశమునకు నిచ్చెనలు వేయుట ఏమి? చమత్కారములు చాలించి విషయమును తెలుపుము.

*సౌదామని :* ధ్యానమున గురుస్మరణ గావించి భ్రూమధ్యమున గమనించుచు నుందును. క్రమముగ మన కుటీరము, గంగాతీరము, పరిసరములు గమనిక నుండి జారిపోవును. భూమిపైన చోటులో నున్నట్లనిపించును. ఆ చోటు మొదట కొంత చీకటిగను, క్రమముగ బూడిదరంగు గను అటుపైన స్పష్టాస్పష్టమగు కాంతితో కూడిన పొగమంచుగను, ఆ పొగమంచు చోటులో చంద్రబింబమువలె గోచరించు సూర్యబింబము దర్శన మిచ్చుచు నుండును. నిచ్చెనలు వేసుకొని ఆ బింబమును చేరవలెనని ప్రయత్నము సాగుచున్నది. ఆకాశమున గల సూర్యునికి భూమిపైన చోటులో నున్న నేను నిచ్చెన నెట్లు వేయగలను, అచటికి నేనెట్లు చేరగలను అని భావించుచు నుందును. చాలకాలము నుండి ఇట్లు భావించుచుండగ నేను నమ్మిన సిద్ధపురుషుని వాక్కు లిట్లు వినబడినవి.

"సిద్ధపురుషుడు నాతో నిట్లనెను." అని సౌదామని సిద్ధార్థునితో నిట్లు తెలిపినది.

"**పురుష ప్రయత్నమే సర్వస్వము కాదు. కాలము రూపమున దైవము అనుగ్రహించును. అట్లనుగ్రహించు వరకును ఎవ్వరైనను వేచి యుండవలసినదే. పురుష ప్రయత్నము లేనిదే దైవానుగ్రహము లేదు.** పొలమును దున్ని విత్తనములు నాటుట, నీరు పోయుట ప్రతినిత్యము పాదులను కలయత్రిప్పుట, కలుపులను ఏరివేయుట హెచ్చరికగ వ్యవసాయదారుడు నిర్వర్తించును. కాలము రూపమున

పొలము పెరుగును. కంకెలు వేయును. పంట చేతికందుట, అందకపోవుట కాలము రూపముననే జరుగును. వ్యవసాయ మనగా విశిష్టమగు కృషి. అందు నిరంతర ప్రయత్నము శ్రద్ధ, భక్తి, జ్ఞానములతో కూడియుండును. నిరంతరత్వము, శ్రద్ధ, భక్తి, జ్ఞానములు చేయు పనియందు జొప్పించినచో కార్యము సఫల మగుటకు అవకాశ మేర్పడును. అటుపైన అనుగ్రహము కాలము రూపముననే ఫలముల నిచ్చును. అనితర సాధ్యమగు తపస్సు చేసిన పర్వతరాజ పుత్రి అపరిమితమగు సంకల్పబలముతో శివుని చేరుటకు ప్రయత్నించినది. ఆమె ప్రయత్నమునకు దేవతలు, సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు అబ్బురపడిరి. ఆమె హిమవంతుని పుత్రిక యగుటచే అచంచలమగు సంకల్పసిద్ధి కలిగి తపస్సు చేసిననూ, శివుని అనుగ్రహము కలుగలేదు. కేవలము చేత చాలదని తెలిసి వేచియుండుట నేర్చినది. కాలక్రమమున శివు డనుగ్రహించినాడు. పార్వతి శివునిచే పొందబడినది. అట్లే జానకి రామునిచే పొందబడినది. రుక్మిణి కృష్ణునిచే పొందబడినది. భక్తులు భగవంతునిచే నిట్లే పొందబడుదురు.

"తపస్సు జీవుడు చేయు ప్రయత్నము, అందు ముందు తెలిపిన నాలుగు గుణము లుండవలెను. అటుపై వేచియుండుట నేర్వవలెను. సూర్యోదయ సమయమున కమలము విచ్చుకొని సూర్యకాంతికై వేచియుండును. కాలక్రమమున సూర్యకిరణము కమలమును చేరును. కిరణముచే కమలము పొందబడినది గాని కమలము కిరణమును పొందగలదా? పొందబడుటకు వేచియుండుట ముఖ్యము. ఆతురత పడరాదు. విసుగు

చెందరాదు. నిరాశను పొందరాదు. నీవు చేయుచున్న సాధనను అట్లే కొనసాగించుము. కమలమువలె నీ ప్రజ్ఞను వికసింపజేసి నీవు చూచుచున్న **గమ్యముచే పొందబడవలెనని ఆకాంక్షించుము.** తపస్సున నిదియే తుది మెట్టు. ఈ స్థితి యందు త్వరపడుట అనగా పొరబడుటయే. ఎంతకాలము వేచియుండవలెను అను ప్రశ్న నీ యందు ఉద్భవించినచో, ఆ ప్రశ్న సద్దుమణుగు నంతకాలమని, సమాధానపడుము. నైమిత్తిక కర్మలు (నిత్యకృత్యములు) ఎట్లునూ క్లుప్తము కావించితివి. ఇతర సమయమంతయూ తపోనిష్ఠయందే యుండుము.

"విశ్వామిత్ర మహర్షి ఈ విషయమున మనకు మార్గదర్శకుడు. అతడు క్షత్రియుడగుటచే పురుష ప్రయత్నమున నెక్కువ విశ్వాసము కలిగియుండెడి వాడు. తన సంకల్పబల మాధారముగ అమిత వేగముగ తపోలోకమును చేరెను. బ్రహ్మత్త్వమునకై అఱ్ఱులు జాచెను. పురుష ప్రయత్నముతోనే బ్రహ్మలోకమును చేరవలెనని భావించెను. భంగపడెను. దానిని పొందలేక అనేక విధములగు త్రిప్పటలకు గురి అయ్యెను. చివరకు ఓర్పు వహింపక తప్పలేదు. వేచియుండుట నేర్వక తప్పలేదు. స్వయముగ తనకు తానే ఈ విషయమును ప్రకటించెను. **ప్రయత్నమెంత గొప్పదో వేచియుండుట కూడ అంతే గొప్పది. నిజమునకు ఓర్పు గలవారే నేర్పు గలవారు. త్వరపడువారు పొర పడువారు.** వశిష్ఠ మహర్షి ఓర్పు, రాముని ఓర్పు, యుధిష్ఠిరుని ఓర్పు, భీష్ముని ఓర్పు ఉదాహరణములు. సిద్ధి పొందిన వారంద రును, ఓర్పు కారణముగనే సిద్ధిని పొందిరి. అట్లని ప్రయత్నము

చేయక వేచియుండుట అజ్ఞానము. ప్రయత్నము వలన పారము చేరవచ్చును. అటుపై పరమును పొందుటకు వేచి యుండవలెను. **ప్రతి కార్యమును పారము వఱకు ప్రయత్నింపవలెను. అటుపై వేచియుండవలెను. పారము చేరిన వెనుక ప్రయత్నించుట రజస్సు, పారము చేరక వేచియుండుట తమస్సు. నదీ తీరము చేరిన వెనుక తీరమున నావకై వేచియుండుట తెలివి. నదీ తీరము చేరకయే నావ కొఱకు వేచియుండుట సోమరితనము.**

"సౌదామనీ! నీ ప్రయత్నము ప్రతినిత్య మిట్లే కావించు చుండుము. అటుపై వేచియుండుము. నిత్యము ప్రయత్నము, వేచి యుండుట సాధనగా యుండుము. ఈ వేచియుండుటనే నిజమగు ధ్యాన మందురు. ఈ వేచియుండుటయే సత్త్వమున యుండుట అని తెలియుము. నీ ప్రయత్నమంతయు రజస్సుగ సాగి అంతమున సత్త్వమున చేరవలెను. **అసంపూర్ణ ప్రయత్నము తమస్సు, విపరీత ప్రయత్నము రజస్సు, సంపూర్ణ ప్రయత్నాంతమున వేచియుండుట సత్త్వము.**"

సిద్ధుని బోధను సౌదామని తెలుపగా, సిద్ధార్థుడు నిశ్చేష్టు డయ్యెను. అతనిని గంభీరమగు మౌన మావరించినది. సౌదామని యందు సిద్ధపురుషుని చూపు, అనుగ్రహము ఆశ్చర్యము కలిగించి నది. ఆమెకు అనుగ్రహమున్నది. సాధన యందు ఆసరా యున్నది. తన కది లేదు. అందులకే తన ప్రయత్నము కష్టతరము. తన అహంకారమే తన శ్రమకు కారణము. ఆసరా తనకును తండ్రి రూపమున, గౌతమబుద్ధుని రూపమున దరి చేరినది. తా నహంకా రియై అందివచ్చిన సహాయ సహకారములను త్రోసి పుచ్చెను.

దురభిమానమే అహంకారము. పెద్దలను లెక్కచేయని వాడు, పెద్దలందరికి పెద్దయైన దైవము నెట్లు చేరగలడు. తన సంకల్ప బలము వజ్రము వలె పటిష్ఠమైనను మార్దవము లేకపోవుట వలన దానిని మూర్ఖత్వ మావరించినది. ప్రేమానురాగ మూర్తులైన తల్లిదండ్రులు ఒక్కసారి జ్ఞప్తికిరాగా సిద్ధార్థునకు కన్నుల వెంట నీరు వచ్చినది. ఆపుకొన ప్రయత్నము చేసినను హృదయము పొంగి తెరలు తెరలుగ దుఃఖము ముంచుకు వచ్చినది. ఏడ్చుట అసభ్యమని తెలిసియు కూడ అవశుడై, వెక్కి వెక్కి ఏడ్చెను.

ఈ అవస్థను గమనించిన సౌదామని భయపడెను. ఆమె సిద్ధార్థు నెప్పుడూ ఇట్లు చూడలేదు. నిజమునకు సిద్ధార్థు డెప్పుడునూ దుఃఖపడినవాడు కాదు. శ్రమ, దీక్ష జీవితముగ సాగించిన సిద్ధార్థునకు దుఃఖ మావరించుట సౌదామనిని కలవర పరచినది. అతని దరిచేరి అతనిని చాల తడవు ఓదార్చినది. అటుపైన దుఃఖమునకు కారణమేమని ప్రశ్నించినది. సిద్ధార్థుడు స్వస్థుడై యిట్లు పలికెను : ''సౌదామనీ! నే నదృష్టహీనుడను. కలసి వచ్చిన అదృష్టమును నిర్లక్ష్యము చేసితిని. మూర్ఖత్వము, పట్టుదల నన్ను తప్పుదారి పట్టించినది. **సంకల్పబలము వేరు, మూర్ఖపు పట్టుదల వేరు.** తండ్రినే గురువుగ, దైవము నా కీ జీవితమున ప్రసాదించినాడు. నేను మూర్ఖుడ నగుటచే తండ్రి తెలిపిన మార్గము విసర్జించి, తండ్రి యంత కావలెనని ప్రయత్నించితిని. సులభమగు మార్గము పెద్దలిచ్చినది గనుక, దానిని నా తండ్రి యనుసరించి సాక్షాత్తు దైవమే అయ్యెను. **అప్రయత్నముగ నాకు లభించిన సర్వోత్కృష్టమగు మార్గమును వదలి, చిల్లర దారులలో**

**ప్రవేశించుట ఎంత దౌర్భాగ్యము? నాకన్న దౌర్భాగ్యుడుండునా?** నే నీ జీవితమున కోల్పోయిన తల్లిదండ్రుల ఆశీర్వచనము నాకు దైవము కూడ నియ్యలేదు. గురువును ధిక్కరించిన ధూర్తుడను. కనుక అదృష్ట విహీనుడను. అనుగ్రహమునకు అపాత్రుడను. నేను తల్లిదండ్రులకు గావించిన దుఃఖము నన్ను నీడవలె వెంటాడుచున్నది. స్వచ్ఛందముగ నన్ను ఆశీర్వదించి పంపిన తల్లిదండ్రు లెంతటి గంభీరులో వారికి నాయందు గల ప్రేమే నాకు స్వాతంత్ర్య మిచ్చినది. నేను స్వతంత్రముగ ఎన్ని చేసిననూ, వారిచ్చిన మార్గపు విలువ నే పొందినవా టన్నిటికన్నా అత్యధికము మరియు శ్రేష్ఠము. వారి ఋణము తీర్చుకొనుటకు వారి పేరున ధర్మకార్యములు చేయుట నన్ను నేను సమాధాన పరచుకొనుటయే.

"నీవు నావలె ఉత్తమమగు జన్మమును పొందలేదు. కాని నీ యందు సహజముగ వినయము, విధేయత యుండుట వలన క్రమముగ ఒక దివ్యమగు అదృశ్యహస్తము నిన్ను నడిపించుచున్నది. నేను జన్మతః అదృష్టవంతుడనే. యోగము, వైభవముగల కుటుంబమున పుట్టితిని. వాని విలువ తెలియక విసర్జించి శ్రమ పడుచున్నాను. **నేను శ్రమతో సాగుచున్నాను. నీవు అనుగ్రహముతో సాగుచున్నావు. నీ ప్రయాణము నదిలో నావ నెక్కి చేయు ప్రయాణము. నా ప్రయాణము కూడ నదీ ప్రయాణమే కాని నాకు నావ లేదు. నేనే ఈదవలసి వచ్చుచున్నది.** నావ సౌలభ్యము నిరాకరించిన వాడను. నావ రూపమున నీకు సిద్ధపురుషుడు నండగ నున్నాడు. నేను దురహంకారముతో నావను విసర్జించి ఈదుట ప్రారంభించినాను. **సద్గురువు సాన్నిధ్యము విలువ నీ**

**సాంగత్యమున నాకు విశద మగుచు నున్నది.** అత్యంత క్లిష్టమగు జీవిత ఘట్టముల నుండి నీ వెప్పటి కప్పుడు రక్షింపబడుచూ సాగుచు నున్నావు. **విధి వక్రించిననూ గురు వనుగ్రహించుటచే నీవు ఉత్తీర్ణురాల వగుచున్నావు. విధి అనుగ్రహించిననూ, వక్రబుద్ధితో నేను కష్టములను సృష్టించుకొని కష్టపడుటను గొప్పగ భావించుచూ, మూర్ఖుడనై ఎప్పటి కప్పుడు ఎదురుదెబ్బలు తినుచూ సాగుచున్నాను. నాకు నిష్కృతి లేదనిపించు చున్నది.**

"ధ్యానమున నీవు పొందిన అనుభూతినే నేనునూ పొందు చున్నాను. నాకునూ నీవలె బింబ దర్శనమైనది. ఆ తేజో బింబమును చేరుటకు ప్రయత్నించు చున్నాను. కాని అది చేరువగుట లేదు. నేనునూ నీవలె ఆకాశమునకు నిచ్చెనలు వేయుచున్నాను. నీవు పలికిన పలుకులు నాకు చాల పూరట కలిగించినవి. సిద్ధులు, మహాత్ములు ఉపాయము నెరిగిననారు. నిజమే. సూర్యుడే కిరణముల రూపమున వచ్చి, సిద్ధముగ నున్న కమలములను స్పృశించును కాని కమలములు సూర్యుని చేరగలవా? ఉమ, సీత, రుక్మిణి ఇత్యాది ఉదాహరణల యందు చరమ రహస్య మున్నదని మా తండ్రిగారు తెలుపుచున్నప్పుడు నా కవగాహన కాలేదు. పెడచెవిని పెడితిని. **సద్గురువులు ఉపాయము లెరిగినవారు. వారు మార్గమును సుగమము చేయుదురు. తెలిసినది కనుక ఇపుడు తపస్సున వేచియుందును. మరియొక మాట, సిద్ధపురుషుని నన్ను గూర్చి ఎపుడైన ప్రశ్నించి వివరము లడిగితివా? వారు నా గూర్చి ఏదైన భావన చేసిరా?**"

*సౌదామని :* అడిగితిని, స్నేహితుడవు, సహాధ్యాయివి. ధర్మ మార్గమున నా చేతి నందుకొనిన వాడవు. అడుగక ఎట్లుండగలను?

సౌదామని యిట్లు పలికినది : "సిద్ధుడు నిన్ను గూర్చి నీవనుకొను చున్నదే తెలిపినాడు. నీ జీవితము వడ్డించిన విస్తరి కాగా, దాని విలువ తెలియక పరిపరి విధముల అన్వేషించుచు దైవమును చేరుటకు త్రిప్పలు పడుచున్నావట. చంకలో పాపను పెట్టుకొని ఊరంత వెదికిన చందముగ నీ జీవితము సాగినదని, దానికి కారణము నీ స్వతంత్రబుద్ధి యని తెలిపినాడు. కాని నీ త్రికరణశుద్ధి విషయమున నిన్ను చాలా ప్రశంసించినారు. నీవు నమ్మిన దారిని నీవు త్రికరణశుద్ధిగ ఆచరించుట వలన నీవు పాట్లు పడుచున్నను పతనము చెందవని, క్రమముగ అన్నియు విశదమగు నని తెలిపినాడు. మన వద్ద వున్నదానికై ఇతర ప్రదేశములలో అన్వేషించిన దొరకదని, అన్వేషణ అంతర్గతము గనుక దానిని వున్నచోటనే వుండి తెలియవలెనని, పరిస్థితులు మార్చుకొనుట వలనను, పరదేశము లేగుటవలనను అది లభించు వస్తువు కాదని తెలిపినారు. ఈ విషయమున ఒక చిన్న కథను కూడ తెలిపినారు.

"గొల్ల పిల్లవా డొకడు ఊరి పొలిమేరలలో గొఱ్ఱెలను కాయుచు పొలములలో వాటిని సంచరింపజేయుచు నుండెడివాడు. మధ్యాహ్న సమయమున ఒక నిర్మానుష్యమగు శివాలయమున భుజించి విశ్రాంతి గొనెడివాడు. ఆ శివాలయముననే నిద్రించెడి వాడు కూడ. అతనికి అడపా దడపా ఒక కల వచ్చుచుండెడిది. ఆ కల యందొక నిధి గోచరించు చుండెడిది. మొదట అతడది

లెక్కచేయ లేదు. కాని నొకే కల మరల మరల వచ్చుచుండుటచే నిధిని కనుగొనవలెనని సంకల్పించెను. దానితో తన దారిద్ర్యము కూడ తీరునని, సర్వసౌభాగ్యములు కలుగునని భావించెను. కలలో తనకు కనుపించిన నిధి నొక అత్యంత ప్రాచీనమగు శివాలయము క్రింద నిక్షిప్తము చేయబడినట్లుగ తెలియుచుండెడిది. అత్యంత ప్రాచీనమగు శివాలయ మెక్కడ ఉన్నది అను ప్రశ్న పుట్టెను. పెద్దలను విచారింపగ భూగోళముపై అత్యంత ప్రాచీనమగు శివాలయము హిమాలయముల కుత్తరమున నున్నదని తెలిపిరి. గొల్ల పిల్లవాడు హుటాహుటిని వున్న ఊరు వదలి, ఉత్తరమునకు ప్రయాణము సాగించెను. అతడున్నది దక్షిణ భారతమున. అతడేగ వలసినది భారత సరిహద్దులకు వెలుపల ఉత్తరముగా నున్న ప్రదేశము. ధైర్యము, స్థైర్యము వహించి ప్రయాణము సాగించెను. ఆ ప్రదేశమునకై అతను అన్వేషణ త్రిసప్తములుగ ఇరువదియొక్క సంవత్సరములు సాగినదట."

సిద్ధార్థుడు వులిక్కిపడి ఇట్లనెను : "అతడు ప్రయాణము ప్రారంభించినపుడు అతని వయసెంత? పదునెనిమిది సంవత్సర ములా?

*సౌదామని :* నీ కెట్లు తెలుసును? నిజమే. అపుడతనికి పదునెనిమిది సంవత్సరములట.

*సిద్ధార్థుడు :* తెలియుట కేమున్నది. ఆ వెట్టిగొల్లను నేనే అయి వుండవలెను. సిద్ధుడు నా కథయే నీకు తెలిపియుండ వచ్చును. కానిచో ఆ గొల్లవాడు నా పూర్వ అవతారమైనను కావచ్చును. ఇంతకును ఆ తరువాత ఏమైనది.

*సౌదామని :* ఏమైనది? అన్వేషణ సాగించు చుండగ ఒక దేవాలయము హిమాలయపు ఉత్తర ప్రాంతములో గోచరించినదట. అచ్చట ఒక వృద్ధుడు కూడ గోచరించెనట. ఆ వృద్ధునితో పరిచయము గావించుకొని అచట స్థిరపడినాడట. పరిచయము సన్నిహితము కాగా ఒకనాడు గొల్లవాడు తన స్వప్న వృత్తాంతమును వృద్ధునికి వివరించినాడు. వృద్ధుడు నవ్వి వూరకుండెను. గొల్లవాడు తరచి తరచి అడుగగా వృద్ధు డిట్లు పలికెను : “నిధిని గూర్చి నేనును స్వప్నములు గాంచితిని. నీకును నిధికిని గల దూరము మునుపెట్లున్నదో, ఇపుడునూ అట్లే యున్నది.” నిధి ఎక్కడ నున్నదో తెలుపమని గొల్లవాడు బలవంతము చేయగా గొల్లవాని స్వగ్రామము పేరు చెప్పి, వూరి వెలుపల శివాలయమును గూర్చి వివరించి, నవ్వుచూ యిట్లనెనట. “నీ వున్నచోటే నిధి యున్నది” అని పలికెను. గొల్లవానికి మొదట గుండె బరువైనది. అటుపైన తిరుగు ప్రయాణము చేసెను. “నీ వున్నచోటే నిధి యున్నది!” అను మాట మంత్రమై నిలచినది. స్వగ్రామము చేరుసరికి మంత్రరహస్యము తెలిసినది. శివాలయమును చేరి, ధ్యానమున అంతరంగమును చేరి తనలోని వెలుగును గాంచెనట. అది మణిమయ కాంతివలె గోచరించినది. **చిత్ర విచిత్ర కాంతులతో గూడిన “లోనిధి కనబడినది”, సంతృప్తు డయ్యెను.**

సౌదామని యింకను యిట్లు పలికినది : “సిద్ధుడు నిన్ను గూర్చి తెలిపిన విషయములలో చివరిమాట నీకంతయు శుభమే కాగలదని, నీకు నీవే గురువని, నిన్ను నీవే ఉద్ధరించుకొందువని కూడ తెలిపినాడు. పెద్దల మాటలు పెడచెవిన పెట్టుట వలన

కొనితెచ్చుకొనిన కష్టనష్టములకు నీ జీవిత మొక తార్కాణమని, గతించిన దానిని విస్మరించి ముందుకు సాగమని కూడ తెలిపెను.”

సిద్ధార్థుడు, సాయంకాలపు ఉపాహారము సేవించి విశ్రమించుటకు పడక చేరెను. ఆలోచనా పరంపర యథాతథంగా అతనిని ఆవరించినది. అతడు సహజముగ ఆలోచనాపరుడు. ఆత్మావలోకనము అతని ఆస్తి– పునరావలోకనము అతని అభ్యాసము. వసారాలో వెల్లకిలా పడుకొని గంగానదీ ప్రవాహ ప్రణవముతో శ్రుతి గలిపి ఆకాశములోని నక్షత్రములను చూచుచూ కన్నులు మూసెను. ఆనాటి తన ధ్యానానుభూతి, సౌదామనితో సంభాషణము, ఆమె పొందుచున్న అనుభూతి, తనలో రగుల్కొనుచున్న పశ్చాత్తాపము, సిద్ధుని హిత వాక్యము, పునరావృతమైనవి. “ఉన్నచోటే నిధి వున్నది.” అను సత్యము సిద్ధుడు పలికినపుడు సిద్ధార్థునికి తన తండ్రి గుర్తు వచ్చినాడు. భాష వేరైనా, తండ్రి తెలిపిన భావన కూడ అదియే. తానిప్పటికి నిధి దర్శనము చేసినాడు. నిధిని చేరుట మిగిలియున్నది. సిద్ధుడు వేచివుండటము, గమ్యము నాహ్వానించటము అను సుళువు సౌదామనికి తెలిపినాడు. అది తనకునూ సత్యమనిపించింది. తాను పురుష ప్రయత్నము వలన చేరవలసిన ప్రదేశము చేరినాడు. అచట నుండి గమ్యము దర్శనమైనది. దానిని చేరుటకు ప్రయత్నించగ దూరమట్లే నిలచినది. కనుక వేచియుండి ఆహ్వానించటమే. కర్తవ్యము అనుగ్రహము రూపమున అందవలసినపు డందును. గమ్యమును పొందుట కాక గమ్యముచే పొందబడుట అను సత్యము అద్భుతమగు రహస్యము. ‘తనకు తానే గురువు’ అని

సిద్ధుడు తెలిపిన మాట తనకు నిజమునకు రుచింపలేదు. తా నిదివర కంతయూ అట్లే భావించినాడు. గౌతమబుద్ధుడు ఆ విషయమున నాకు హెచ్చరిక కూడ గావించినాడు. తనకు తానే గురువు అనునది సత్యమైనను, ఆ స్థితికి చేరుటకు సద్గురువు ఆవశ్యకత తన కిపుడిపుడే విశదమగుచున్నది. సౌదామని తన కీ విషయమున ఉదాహరణమై నిలచినది. ఇట్లు భావించు చుండగ మరునాడు కార్తీక పౌర్ణమి అనియు, తన నలుబది తొమ్మిదవ జన్మదిన మనియు జ్ఞప్తికి వచ్చెను. అతనికి ఆ విషయమై ఒక భావము ప్రకటితమై ముఖమున మందస్మిత మేర్పడెను. పుట్టిన దినము కార్తీక పౌర్ణమి అని గర్వించినచో ఫల మేమున్నది. **దేహమునకు చావు పుట్టుకలు వచ్చుచు పోవుచు నుండును. జీవున కవి లేవు. కావున మరునా డుదయము ప్రతిదినము వలెనే దినచర్య సాగింతును.** ప్రత్యేక భావము వలన ఉపయోగ మేమియు లేదు. తనయందలి నిధి సరసన చేరియుండుట కర్తవ్యమని భావించి, విధుల కుపక్రమించెను.

నిదుర యందు స్పష్టాస్పష్టముగ స్వప్నమొకటి గాంచెను. అందు స్పష్టముగ తల్లిదండ్రులు తేజోమయమూర్తులై దర్శనమిచ్చిరి. మందస్మితముతో ఆశీర్వదించుచు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిరి. తండ్రి పలికిన పలుకులిట్లు వినిపించినవి. **''కాదనుకున్నను జన్మదినము జన్మదినమే. దాని విలువ దానికున్నది. నిరాకరించుట మార్గము కాదు. సర్వమును సమన్వయించుకొనుట మార్గము. అందివచ్చినది నిరాకరించుట వలననే నీ జీవితము అష్టవంకరలుగ సాగినది. గతించిన దానికి వగచుట వివేకము కాదు.**

**నిరాకరించుటయు మార్గము కాదు. కాంక్షించుట ఎంత అజ్ఞానమో నిరాకరించుట కూడ అంతే అజ్ఞానము. రెంటినీ సమన్వయించి తదతీతమగు సంయమమును చెందుము. నీవు సిద్ధార్థుడవని గుర్తుంచుకొనుము. సంకల్పబలము, త్రికరణశుద్ధి గల ప్రతి జీవుడు సిద్ధార్థుడే!** నీవిపుడు ధ్యానము చేయుచున్నది బింబ దర్శనము. దానిని చేరుటకు వలను కాదని తెలిసినది కదా! కాని అది నిన్ను చేరుటకు పెద్దలు మంత్ర మిచ్చిరి. దానిని హంస మంత్ర మనిరి. '*సోఽహం*' అనునది హంసమంత్రము. '*సోఽహం*' అనగా ''అది నేనే.'' ఆ బింబము నేనే అని భావింపుము. భ్రమర కీటక న్యాయమున బింబమే నీవుగ అనుభూతి చెందగలవు. సారూప్య భావమున బింబమే నీవుగ అనుభూతి చెందగలవు. సారూప్య భావమున బింబమే నీవుగ సిద్ధించగలవు. దీనినే వేదములందు *''అసావాదిత్యో బ్రహ్మ''* అనిరి. ఆ కనపడుచున్న సూర్యబింబము, నేను ఒకటే అని అర్థము. భావశుద్ధిగల నీవు ఈ భావసిద్ధిని పొందుము. **శుద్ధి గలవానికి సిద్ధి తథ్యము**'' అని పలుకుచు తల్లిదండ్రులు అదృశ్యమగుచుండగ స్వప్నముననే సిద్ధార్థుడు తల్లిదండ్రులకు సాష్టాంగ నమస్కారము గావించి *మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ!* అనుచు గద్గదముగ పలికినాడు. ఆ పలుకులతో అతనికి మెలకువ వచ్చినది. అవి స్వప్నమున పలికిన పలుకులు కావు. వైఖరీ వాక్కుగ వెలువడినవి. కన్నుల వెంట అశ్రువులు జాలువారినవి. బ్రాహ్మీ ముహూర్తమున వచ్చిన స్వప్నము సిద్ధార్థునికి ఆనందము కలిగించినది. తన నలుబది తొమ్మిదవ జన్మదినము సార్థకమైనదని భావించి వెను వెంటనే

నిత్యకృత్యము లాచరించి అందు అభ్యంగన స్నానము, నూతన వస్త్రధారణము గావించినాడు. ధ్యానమున కుపక్రమించు నపుడు మరల *మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ!* అని పలుకుచూ కన్నులు మూసెను. అర్ధనారీశ్వర రూపమున తల్లిదండ్రులను దర్శించి గురుశ్లోకమును పఠించెను. తన తల్లిదండ్రులే తన గురువులని తెలిసి వినమ్రుడై హృదయమున పాదాభివందనము గావించి ధ్యాన నిమగ్నుడయ్యెను.

తదేక దీక్షతో సిద్ధార్థుడు ఫాలభాగమున బింబ దర్శనము చేయుచు **మానసికముగ "సోఽహం" మంత్రము నుచ్చారణ చేయుట ఆరంభించెను. ఆ బింబమే తా నను భావము అతనికి గురుకృప వలన క్రమశః సిద్ధించసాగినది. తపోకాలము కూడ క్రమముగ పెరుగుతూ వచ్చినది.** ధ్యానమున క్రమముగ పరిసరములన్నియు అదృశ్య మగుచుండెడివి. మొత్తమంతయు వెలుగై నిండగ అందు తాను స్పందనాత్మక ప్రజ్ఞగ నిలచియుండెడి వాడు. "సోహ" మను మంత్రము గానమువలె సాగుచుండగ సిద్ధార్థుడు ఉపశమనము పొందుచు నుండెడివాడు. క్రమముగ ప్రశాంతత పెరుగుచుండగ అతని రూపురేఖల యందు మార్పులు కలిగి శుభలక్షణములు స్థిరపడినవి. శరీరమునందు రకరకముల మార్పులు జరుగుట గమనించెను. శరీరముకూడ తేలికగుచున్నట్లు తన కనిపించు చుండెను. అంతకు ముందు కూడ ఆహారము, దప్పిక స్వల్పమే అయినను శరీరము తేలుచున్నట్లు అనిపించెడిది కాదు. నడచు చున్నపుడు శరీరము తేలిపోవుచున్న ట్లుండెడిది. అపుడపుడు పరిసరము లదృశ్యమై వెలుగు నిండుచు నుండెడిది. క్రమముగ ఈ

విధమగు సాధన మూడు సంవత్సరములు జరిగినది. సిద్ధార్థునకు అంతరంగమున స్థిరము చిక్కినది. **ధ్యానమున ఆనంద మధికమైనది. తాను వెలుగు తప్ప ఇతరములు లేని స్థితి ఏర్పడుచు నుండెడిది. "అది తానే (సోऽహం) అను మంత్రము గురుకృప వలన భాసించుచునే యుండెడిది.** సాలోక్య, సామీప్యములు చేరిన సిద్ధార్థునకు సాయుజ్య, సారూప్య స్థితులను గూర్చిన ప్రయత్నమే సాగుచు నుండెడిది. అది తానగుట యింకను జరుగలేదు. అట్లు జరిగినచో సాయుజ్య మగును. అపుడు తాను కూడ ఆ వెలుగున యిమిడిపోయినచో సారూప్యస్థితి లభించును.

కృషియందు వేచియుండుట కెట్టి అభ్యంతరము లేని స్థితి అతని మనసున కేర్పడినది. నిత్యకృత్యములు మినహా యితర సమయములందు ధ్యాస అంతయూ ధ్యానముగనే యుండెడిది. అతని యందు జరుగుచున్న మార్పు లన్నియూ సౌదామని గమనించు చుండెడిది. ఆమె కూడా సిద్ధుని కృప వలన వేచియుండుట నేర్చినది. వికసించిన తెల్లని కమలమును తన భ్రూమధ్యమున భావించుచూ కాంతి స్పర్శకై వేచియుండుట నేర్చినది. ఆమెకు అనేకానేక కాంతి దర్శనము లయ్యెడివి. తత్కారణముగ సాలోక్యము లభించినది. క్రమముగ రకరకముల కాంతి దర్శనములు నిశ్చలమగు కాంతిగ మిగిలినది. ఆమె కూడ సిద్ధార్థునివలె కాంతి యందు స్థిరపడినది. ఇరువురును వారమున కొకమారు వారి వారి అనుభూతులను గూర్చి సంభాషించుకొను చుండెడివారు. ఇనుమడించిన ఉత్సాహముతో ఇరువురునూ ధ్యాన యోగమున కాలమును గడుపసాగిరి.

# 11

ఒకనా డుదయమున చాల కాలము తరువాత వారిని కలియుటకు వారెరిగిన తాత వచ్చినాడు. గంగాతీరమున వారు కుటీర మేర్పరచుకొనినపుడు కనపడిన వృద్ధుడు మరల ఉదయము ననే నాలుగు సంవత్సరముల తరువాత దర్శన మిచ్చుట వారికి ఆనందము కలిగించినది. “తాతా! ఇన్నాళ్ళేమైతివి? ఎటనుంటివి? మమ్మొదిలి ఎటు పోయితివి?” అని సౌదామని ప్రశ్నించుచూ ఉపాహారమును, తేనీటిని అందించెను. తాత నవ్వుచూ “ఇచటనే యున్నాను. ఎచటికీ పోలేదు. దూరమున నుండి మిమ్ములను గమనించుచున్నాను. మీ తపస్సున కంతరాయము కలిగించరాదని మిన్నకుంటిని. మొత్తమునకు మీ రిద్దరునూ స్థిరమతులే. సాధన బాగుగా సాగుచున్న దనుకొందును. అంతయూ గంగమ్మ తల్లి అనుగ్రహము. గంగ, గీత, గోవిందుడు, గౌరి మిమ్మనుగ్రహించ వలెనని నా దైనందిన ప్రార్థనలలో దైవమును ప్రార్థించుచున్నాను.’’

సిద్ధార్థుడు నవ్వుతూ ఇట్లు ప్రశ్నించెను. ‘‘తాతా! నాదొక ప్రశ్న. గంగ, గీత అనుచూ నాలుగు పదములు తెలిపినావు. నాలుగున్నవా ఒకటియే యున్నదా?’’

*తాత :* వున్నది యొక్కటే నాలుగుగ, నలుబది కోట్లుగ, కోటానుకోట్లుగ ప్రకటించబడి యున్నది.

*సిద్ధార్థుడు :* మరి నాలుగు పలుకనేల? ఒకటియే పలుక వచ్చును కదా!

*తాత :* ఒకటి పలికినచో మిగిలిన మూడు విస్మరించుట, నిరాకరించుట జరుగును కదా! ఒకటియే యున్ననూ, ఆ ఒకటిని అన్నిటియందు చూచుటకు మనవారు రాయి, రప్ప, చెట్టు, చేమ, జంతువు, మనిషి, దేవతల రూపములలో దానిని చూపుట నేర్పిరి. ఇది సమన్వయమని తెలియక సతమత మగుట జరుగుచుండును.

*సిద్ధార్థుడు :* ఏక మనేకమైనది అను సత్యము నాకు విదితమే. అనేకమునం దేకము గాంచుట సాధన అనునది కూడ సత్యమే. కాని అనేక విధములగు ఆరాధనలు చేయుచున్నవారు ఏకత్వమును కోల్పోవుట కూడ సహజముగ జరుగుచున్నది. మా తండ్రిగారు అనేకానేకములగు ఆరాధనములు, క్రతువులు, యజ్ఞములు నిర్వర్తించుచు అనేక విధముల దేవతల నారాధించుచు అన్నిటి యందునూ ఒకటిగ నున్న దానిని దర్శించెడి వారు. కాని వారి పరివారమున మరియొక రట్లు నాకు గోచరింపలేదు. వివిధములగు ఆరాధనలు చేయునపుడు, వివిధములగు దేవతలను సేవించు చున్నప్పుడు వివిధత్వము సంభవించుటకు అవకాశ మొక్కువున్నది. వివిధములగు విగ్రహములను, చిత్రపటములను ఏర్పరచుకొని యిన్నిటి యందున్న ఒకే అంతర్యామిని దర్శించుట సులభము కాదు. ఇంతకన్న ఒక రూపము, ఒక నామము ఆశ్రయించుట మేలనిపించును.

*తాత :* **ఒక రూపము, ఒక నామమునకు దైవమును పరిమితము చేసి ఆరాధన చేయువారు అభ్యాసవశమున ఆ నామ రూపమునకే దైవమును పరిమితము చేసి యితరములను నిరాక రించును. మతములు, సిద్ధాంతము లట్లే పుట్టినవి. వాని పేరున కలహములు కూడ పుట్టినవి.**

*సిద్ధార్థుడు :* అట్లయినచో నామమునకు, రూపమునకు అతీతమైన తత్త్వము నారాధించుట ఉచితము కదా!

*తాత :* ముమ్మాటికీ కాదు. అట్లు చేయువారు కనపడుచున్న ప్రపంచమును, జీవులను నిరాకరించుట జరుగును. ప్రపంచము తుచ్ఛమని, జీవులు పాపులని భావించుచు, సమగ్ర దైవ స్వరూపమును తెలియక, కనపడని దానిని గూర్చి అఱ్ఱులు చాతురు. కనపడుచున్న దైవమును చూడక కనపడని దైవమును చూచుట సాధ్యమా? నీ వట్లే చేసితివి కదా! నిరాకరించినది మరల ఆదరించవలసి వచ్చినది కదా! ఎటు చూచిననూ నిరాకరణ మార్గము కాదు. *"అనిరాకరణమస్తు, అనిరాకరణమస్తు"* అని వేదములు ఘోషించుచున్నవి. బ్రహ్మము అన్నిట, అంతట యున్నాడు గనుక తన యందు, అఖిల భూతముల యందు దానినే దర్శించుట, కాలమును దేశమును బట్టి కర్తవ్యము నాచరించుట యొక్కటే మార్గము. ఏది చూచిననూ "అదే యిదిగ నున్నది" అని తెలియవలెను. "ఇది అదియే" అని గుర్తించు చుండవలెను.

*'ఓం ఇతి ఏతత్'* అని ఉపనిషత్తులు తెలుపుచున్నవి. "ఇది అది'' యే అయినపుడు 'ఇది'ని దైవముగా చూడలేనివాడు

'అది'ని గ్రహింపలేదు. భగవత్ తత్త్వము విశ్వమంతయూ వ్యాప్తి చెంది యుండగ కొన్నిటిని ఆదరించుట, కొన్నిటిని నిరాదరించుట ఎందులకు? అది అసమగ్రము కదా!

*సౌదామని :* తాతా! విగ్రహముల ద్వారా దైవము నారాధించు వారు ఎట్టి భావన కలిగి యుండవలెను?

*తాత :* నీవు కాళీయ కృష్ణుని ఆరాధించు చుంటివి కదా! విగ్రహమునకు మరియొక పేరు ప్రతిమ. ప్రతిమ అనగా ప్రతీక. అన్ని రూపములు ప్రతిమలే. **ఒక ప్రతిమ యందు అంతర్యామి నాహ్వానించి ఆరాధించుట సంప్రదాయము. అంతటా వ్యాపించిన వానిని పూజించుటకు, ఆరాధించుటకు ప్రతిమ ఒక సౌకర్యము. ఏర్పరచుకొన్న సౌకర్యమునుండి అంతటా వ్యాపించిన వానితో అనుసంధానము కూర్చుకొన్నచో అంతర్యామి ఆరాధనము కాగలదు. అట్లుకాక కేవలము ప్రతిమకే పరిమితము చేసినచో యితర మంతయూ నిరాకరించి నట్లగును. శ్రీకృష్ణుడు అంతర్యామికి ప్రతీక.** కాళీయ కృష్ణునిగ నీ వేర్పరచుకొనినపుడు, తద్వారా ఆరాధించునపుడు, ఆ అంతర్యామి తత్త్వము ఆ ప్రతిమ ద్వారా నిన్ననుగ్రహించ కలదు. మొత్తము వెలుగు ఒక దీపము కాంతితో మనకు వెలుగు నిచ్చుచున్నది కదా! దీపము ప్రతీక, మొత్తము వెలుగునకు ప్రతీక. నీకు శ్రీకృష్ణుడు అంతటా నిండియున్నవాడని తెలియుటచేతనే కాళీయ కృష్ణ విగ్రహము నందు మోహపడక దానిని పరిచారికలకు బాధ్యతతో నప్పగించి వచ్చితివి. రూపమొక సౌలభ్యము. కాని భ్రమతో ఆరాధించిన వారికి, **తత్త్వమును**

**రూపమునకు పరిమితము చేయు అపాయము కలుగును. రూపములను తత్త్వమునకు వాహికలుగ దర్శించుట సమన్వయ మగును. రూపము నందు కాంక్షగాని, నిరాదరణగాని అసమగ్రము.**

గురువులను, దైవములను నడిపించు నొకే తత్త్వము వారి వారి నుండి ఆయా క్రియలను నిర్వర్తించుచుండును. ఇందరున్నా రనుకొనుట ఒక సత్యము. ఇందరుగ ఒకడే వర్తించు చున్నాడని, నర్తించు చున్నాడని తెలియుట పరమ సత్యము. అందులకే గంగ, గౌరి, గీత, గోవింద ఒకటియైన నాలుగు. నాలుగుయైన ఒకటి.

అందించిన ఉపాహారమును అందుకొని తాత నిష్క్రమించ బోగా సౌదామని తాత నిట్లడిగినది. మీ అవగాహన ప్రకారము **ఈ కనబడుతున్న ప్రపంచము, దానిని నడిపించుచూ కనబడని శక్తి, శక్తి కాధారమైన ప్రజ్ఞ, అన్నిటికీ ఆధారమైన తత్త్వము, ఇవన్నియూ వేరు వేరు స్థితులలో నున్న ఒకే దైవమని, ఇందేదియు విస్మరింపరాదని, విస్మరించినంత మేర అపరిపూర్ణత యుండునని తెలియవచ్చు చున్నది.**

*తాత :* అదియే సమగ్రమగు అవగాహన. గడ్డిపరకతో సహితము అన్నిటి యందు దైవమును దర్శించుటే మార్గము. తన లోపల, వెలుపల నున్నది దైవమే. తానుగ లోపల నున్నాడు. లోపల నున్న తానును చూచు ప్రయత్నములో మీరున్నారు. ఆ ప్రయత్నములో బయలును విస్మరింపరాదు. లోపల దేనిని చూడగోరు చున్నారో అది బైట కూడ నున్నది. లోపల, బైట అనునవి కూడ నిజమునకు లేవు. అందువలన అఖండమైన తత్త్వమును

కన్నులు మూసినప్పుడు కన్నులు తెరచి చూచుచున్నప్పుడు కూడ దర్శించుటకు ప్రయత్నింపవలెను.

పూర్వము ఇంద్రద్యుమ్నుడను రాజు మీవలెనే అంతర్ముఖుడై, దీర్ఘకాలము ధ్యానము గావించెనట. మీకు గోచరించు చున్నట్లే అతనికిని అంతరంగమున వెలుగు గోచరించినదట. ఆ వెలుగు దర్శనమున కాకర్షితుడై దానిని పొందు ప్రయత్నము చేయుచు సంవత్సరములపాటు ధ్యానమును చేసెనట. అంతరంగ దర్శనము నకు ప్రాధాన్యత నిచ్చి బహిరంగమును విస్మరించెను. ఆ సమయ మన అగస్త్య మహర్షి అచ్చటికి వచ్చెను. అగస్త్యుడు సాక్షాత్తు భగవంతుడే. మహత్తరమగు తేజోమూర్తి. అట్టివాడు సమీపించి నను, లో వెలుగు దర్శనమున కంతరాయము కలుగునని ఇంద్రద్యుమ్నుడు ఎదురుగా నున్న అగస్త్యుని విస్మరించెను. పరిస్థితిని గమనించిన అగస్త్యుడు, ఇంద్రద్యుమ్నుడు ఏనుగువలె పుట్టవలెనని సంకల్పించెను. అది శాపము కాదు వరమే! **మూఢుడై, లుబ్ధుడై బహిరంతరములను వ్యాపించియున్న భగవంతుని, అంతరంగముననే చూచుచు బహిరంగమును విస్మరించుట అపరిపక్వత.** అట్టి అపరిపక్వతతో సతమత మవుతున్న ఇంద్రద్యుమ్నుని ఉద్ధరించుటకు అతనికి ఏనుగు జన్మ సంకల్పించి అగస్త్య మహర్షి అతనిని ఉద్ధరించినాడు. ఏనుగు రూపమున నున్న ఇంద్రద్యుమ్నుడు లోపలికి చూచుటకు వలను పడదు. ఏనుగు పశువు కదా! పశు వనగా బైటికి చూచుటయే తెలిసిన జంతువు. మానవుడు కూడ పశువే. అతడు కూడ సామాన్యముగ బైటకే చూచును. కాని **భక్తి జ్ఞాన యోగముల ద్వారా**

**లోపల చూచుట నేర్చును. లోపల చూచుటలో నిమగ్నమై బైట చూచుట మానును. ఇట్లొకటి ఆదరించుట, ఒకటి విస్మరించుట ఏదో ఒక కన్ను పొడుచుకొనుట వంటిదే. లోపల బైట కూడ చూచువారు ఋషులు, వారే సిద్ధులు.**

ఏనుగు జన్మ ఎత్తుట వలన గజేంద్రుడు అయిన ఇంద్రద్యుమ్నుడు ఆరాధన అంతయు బయలునకే చేసెను. బయలునే చూచుచు చేసెను. బయలు ఆలకించుటకే ప్రయత్నించెను. అపుడు కూడ విష్ణు దర్శనము చేసెను. పూర్వజన్మమున లోన చూచిన వానినే ఈ జన్మమున బైటకూడ చూచెను. పరిపూర్ణడయ్యెను. భాగవత మూర్తిగ శాశ్వతుడయ్యెను.

మీరిరువురును చాలకాలము నుండి లో దర్శనమునకు ప్రయత్నించు చున్నారు. బహిర్దర్శనమును విస్మరింపకుడు. ఇది తెలుపుటకే నేను ఉదయముననే పనిగట్టుకొని వచ్చితిని. మీ రిరువురకును శుభము కలుగవలెనని నా ఆకాంక్ష!

*సౌదామని :* తాతా! నీ అభిమానము, ఆదరణ, అనుసరణీయమగు, సున్నితమగు ఉపదేశము మాకు ఆనందము కలిగించుచున్నది. నీ వన్నట్లే సమగ్ర సాధన చేయుదుము. ఇంతకును నీవీ గ్రామమున నుందువా? లేక వచ్చి పోవుచుందువా? నిన్ను తాతా! అని పిలుచు చున్నాము. నీ పేరేమి? ఎచటనుందువు? ఏమి చేయుచు నుందువు? మా యందు నీ కెందులకు ఇంత అభిమానము.

*తాత :* మనుమరాలవు. చాల ప్రశ్న లడిగినావు. నేనొక ప్రదేశమునకు కట్టుబడిన వాడను కాను. నా నివాసము హృదయమే. మనందరి నామములు నిజమున కొకటే. అందువలన ప్రత్యేకముగ నామధారణ లేదు. కాలమును, దేశమును బట్టి చరించుచున్నాను. తలిదండ్రులు పెట్టిన పేరు గోపన్న.

సంభాషణానంతరము గోపన్న వెడలిపోగా సౌదామని సిద్ధార్థులు ఆ దినము తాత చెప్పిన విషయములను నెమరు వేసుకొనుచు అందలి సారాంశమును బుద్ధితో గ్రహించిరి. **ఒకటిగ నున్నను, బహుళముగ నున్నను, వున్నదొక్కటే! లోపల, బైటగ కనిపించుచున్నది కూడ నొక్కటే. ఒక్కటే యిన్ని రకములగు స్థితి మార్పులు చెందుచున్నది.** ఆవరణలు ఏర్పడుట వలన లో, బయలు ఏర్పడు చున్నవి. ఆ ఒక్కటిని అన్నిట, అంతట దర్శించుట సమగ్ర సాధన. అది కన్నులు మూసియు చేయవచ్చును. కన్నులు తెరచియు చేయవచ్చును.

పై విషయములను గ్రహించిన సౌదామని, సిద్ధార్థులకు ధ్యానము అను వ్యామోహము క్రమముగ ఆవిరివలె యిగిరి పోయినది. దినచర్య అంతయూ దైవ చింతనతోనే సాగినది. చింతన, స్మరణ మనసునకు సంబంధించినదని, దానికొక నామము అవసరము లేదని కూడ తెలిసినది. దానిని గూర్చిన భావన మెళకువ వున్నంతకాలము నిలచుట ఆరంభించినది.

పై విధమగు భావము వలన మార్గమే గమ్యమైనది. పూర్వము వారికి గమ్యము సుదూరముగ గోచరించినది. దానిని

చేరుటకు చేయు ప్రయత్నమున ఇరువురికిని సద్గురు రూపమున ఉపదేశమైనది. సౌదామని అంతరంగమున సిద్ధు డుపదేశింపగ సిద్ధార్థునకు అర్ధనారీ రూపమున తల్లిదండ్రు లుపదేశించిరి. ఇరువురికిని కలిపి తాత యగు గోపన్న చరమోపదేశము చేసినాడు. దాని కారణముగ కన్నులు మూసినపుడు, తెరచినపుడు దైవమును చూచుట నేర్వ నారంభించినారు. ఇట్లు నేర్చువారికి గమ్యము ఎట్ట నెదుటయే యుండును. **గమ్యమును చేరుట యను మాయ తొలగును. గమ్యమును చేరుట అను భావము కూడ ఒక మాయా వర్ణమే. తన యందున్న దానిని చేరుట యేమున్నది. తానదియే అని తెలియుటయే గాని, చేరుట అని ప్రత్యేకముగ నేమియు లేదు. దేనిని గూర్చి తాము వెదకుచుండిరో అది తమ యందు, అఖిల భూతములయందు యున్నదని తెలిసినపుడు చేయవలసినది అనుసంధానమేగాని మరియొకటి కాదు. సాధన అంతయూ యున్న దానిని వెదకికొనుటగ కొంతకాలము సాగును. తానుగ నున్న దానిని వెదకుట వలన దొరకదని తెలియును. తానుగ నున్నదని తెలియుటయే తెలివి. అది అన్నిటియందు కూడ నున్నదని తెలియుట సంపూర్ణమగు తెలివి. ఇట్లు తెలియు మార్గమున నిలచిన వారికి యిక వెదకులాట లేదు. అన్వేషణ లేదు. వుండుటయే యుండును. ఇట్లుండుట నేర్చినవారు సత్త్వమున నిలచినవారు. అన్వేషించువారు రజస్సున నిలచినవారు.**

సత్త్వమున నిలచిన సౌదామని, సిద్ధార్థులు నిత్యతృప్తితో, దైవమును నిత్యజీవితమున గమనించుచు, ఆనందముగ నుండుట నేర్చిరి. అన్నిటా దైవమును చూచుట వలన, అపుడపుడు దివ్యమగు

వెలుగే గోచరించెడిది. రూపములు గోచరించెడివి కావు. రూపము లదృశ్యము లైనపుడు వాని నామములు కూడ జ్ఞప్తి నుండి జారెడివి. ఒక గోవును చూచినపుడు భౌతికమగు గో రూపము మాయమై అది దివ్యమగు వెలుగుగ గోచరించినపుడు ''అది గోవు అను జ్ఞప్తి కూడ జారిపోయినది.'' రూపము జారిన వెనుక, నామము జారుట తరచు జరుగు చుండెడిది. అట్లే ఒక వృక్షమును చూచినపుడు వృక్షాకారమున వెలుగే కనిపించెడిది. ఇట్టి చిత్ర విచిత్రానుభూతులతో నామము, రూపముతో కూడిన జగత్తును, నామరూపాతీత జగత్తును దర్శించుచూ చిత్రమగు అనుభూతియం దుండెడివారు.

*"విష్ణుఁ డింతియ కాని, వేఱొండు లేదని, యొత్తిలి నగుచుండు నొక్కచోట."* అను ప్రహ్లాదుని అనుభూతి వారియందు సత్యమై నిలచినది. ఆహ్లాదముగ కాలము గడుపు చుండిరి. దినచర్య అంతయూ యాంత్రికముగ జరుగుచుండగ వారి ప్రజ్ఞలు దివ్యత్వము నిమిడి యుండెడివి. వారికిక సంశయములు లేవు. అన్వేషణలు లేవు. వుండుటయే వున్నది. ఆ వుండుట కూడ వైభవముగ సాగుచు నున్నది.

అదిమాఘపౌర్ణమి. సౌదామని, సిద్ధార్థుడు ఇరువురును ప్రాతః కాలముననే గంగానదీ స్నాన మాచరించి కుటీరమున సౌదామని, గంగానదీ తీరమున సిద్ధార్థుడు ధ్యానమున కుపక్రమించిరి. పౌర్ణమి ప్రభావమున గంగానది పరవళ్ళు త్రొక్కుచూ సాగుచు నున్నది. ఎందరెందరో సిద్ధులు, మహాత్ములు బ్రాహ్మీముహూర్తము

నుండి గంగానదిలో స్నానము చేయుచు నున్నారు. దిగంబరులు, జటాధరులు, విభూతిధారులు, లింగధారులు, కపాల మాలికా ధారులు వేలకు వేలుగ తండోపతండములుగ నదీ స్నానము చేయుచూ ఉల్లాసముగ తీరము చేరుచున్నారు. తీరమును కొందరు చేరుచుండగ మరికొందరు నదీ ప్రవేశము చేయుచున్నారు. మహా జ్ఞానుల నుండి సామాన్యుల వరకును అందరును విశేషముగ స్నానములు గావించుట చూచిన సిద్ధార్థునకు ఆ దినము 'కుంభ మేళా' యని తోచినది. యావద్ భారతమందలి పుణ్యమూర్తులు, హిమాలయము లందలి పుణ్యమూర్తులు ఆ పర్వదినమున గంగా స్నాన మొనర్చిరి. మాఘ పౌర్ణిమయే యొక విశిష్టమగు పౌర్ణమి. కుంభరాశి యందు బృహస్పతి సంచరించు చుండగ వచ్చునది కుంభమేళ. కుంభమేళా యందు మాఘ పౌర్ణమి అత్యంత ప్రభావితమై యుండును.

తా నెరిగిన సమస్త ఋషి పరంపరను, గురు పరంపరను సిద్ధార్థు డొకమారు స్మరించినాడు. కన్నులు మూసుకొని శ్వాస మార్గమున స్పందనము చేరి, స్పందనాత్మకుడై దహరాకాశమున చరించుచు సూక్ష్మ స్పందనము చేరినాడు. పరిసరమందలి నామ రూపము లన్నియూ నీలి వెన్నెల కాంతిలో కరగిపోయినవి. తనకునూ తన దేహమున్నట్లు అనిపించలేదు. తా నున్నానని జ్ఞప్తి మాత్ర మున్నది. దేహము గోచరించుట లేదు. తాను కేంద్రముగ తన చుట్టును అపరిమితమగు నీలకాంతి గోచరించుచు నున్నది. ఎటు చూచిననూ నీలమే. ఆకాశమున సూర్యుడెట్లో తానుకూడ నట్లే కేంద్రమై అంచులేని పరిధి. తనకును ఆ పరిధికిని నడుమ

దశదిశల మిరుమిట్లు కొలుపు నీలకాంతి. ఆ కాంతి కూడ ఆకాశ జలములవలె తరంగములతో కూడియున్నవి. తనను తాను పరిశీలింపగ స్పందన మొక్కటియే తెలియుచున్నది. తానున్నానను ప్రజ్ఞ యున్నది కాని తనకు తాను గోచరింపలేదు. తనకు తన రూపము గోచరింపలేదు. అట్లెంత తడవుండెనో సిద్ధార్థునకు తెలియదు. తాను, అనంతమగు నీలాకాశమే మిగిలియున్న స్థితి యది.

కొంత తడవునకు సిద్ధార్థునకు గంగానది గోచరించెను. తీరమున ధ్యానమున నిలిచియున్న తన శరీరము గోచరించినది. క్షణకాలము వులికిపడెను. తా నెచటో చోటులో నున్నాడు. దూరమున తన దేహము పద్మాసీనయై యున్నది. తదేక దృష్టితో దేహమును చూచిన సిద్ధార్థుని యందు తానా దేహము కాదని, అది తన నివాసమని స్ఫురించినది. వెనువెంటనే అతడు దేహమున మేల్కాంచినాడు. కన్నులు తెరచి పరిసరములను పరికించినాడు. అప్పటికి సాయం సంధ్య కూడ దాటిపోయినది. పూర్ణచంద్రుని కిరణములు గంగానదీ తరంగములపై ప్రతిబింబించుచు నున్నవి. వాయువు శీతలమై అతని మేను పులకింపగ కొంత తడవు అచటనే యుండి, నెమ్మదిగ లేచి కుటీరము వైపునకు సాగినాడు.

కుటీరము సమీపించు చుండగ మనసున సౌదామని మెదలినది. తాను పొందిన అనుభూతి ఆమెకు తెలియ చెప్పవలెనని మనసున ఉత్కంఠ కలిగినది. వడివడిగ కుటీరము చేరినాడు. సౌదామనీ! అని పిలుచుచూ లోని కేగినాడు. అతడు

చూచిన దృశ్యము అతని కాశ్చర్యము కలిగించినది. సౌదామని యింకను నిశ్చలమగు ధ్యానమునందే యున్నది. ఆమె ముఖము తోజోమయమై యుండెను. ఆమె ధ్యానమున కంతరాయము కలిగింప నిచ్చగింపక సిద్ధార్థుడు స్నానాదికములు గావించి ఉపాహారము తానే వండి రెండు పళ్ళెములలో అమర్చి మరల సౌదామని వద్ద కేగెను. సౌదామని యింకను అట్లే నిశ్చలముగ నున్నది. ఆమెయందెట్టి కదలిక లేదు. మరికొంత సమయము వేచియుండి అటుపైన ఆమె నాసాపుటముల వద్ద వ్రేలిడి చూడగ ఆమె యందు శ్వాస లేదు. ఆమె వక్షస్థలమున అరచేతి నుంచి పరిశీలించినాడు. స్పందనము తెలియుటలేదు. చెవితో వినుటకు ప్రయత్నించిన వినికిడి అందలేదు. హస్తముతో ఆమె భుజమును పట్టి కుదిపినాడు. సౌదామని అతని హస్తములలోనికి వాలిపోయినది. సిద్ధార్థుడు ముహూర్తకాలము నిశ్చేష్టుడైనాడు. తన సహవాసి పౌర్ణమి గడియలలో దేహము విడచినది. దేహము విడచుట కంతకన్న పుణ్యదినము లేదు. ఆమె తనకు బహిః ప్రాణము. గంభీరమూర్తి. ఆమె లోతులు తెలియుటకు తనకే సాధ్యము కాలేదు. కష్టనష్టములను మ్రింగి నవ్వుచూ, తనను నవ్వించుచూ నుండెడిది. సాధన విషయమున కూడ తనకన్న యొకింత ముందుగ సాగుచుండెడిది. ఆమె ఎంత కష్టనష్టముల కోర్చినదో అంత అనుగ్రహము పొందిన ధన్యజీవి!

సిద్ధార్థుడు సౌదామని ముఖము నొక్కమారు పరిశీలించి కన్నులార చూచెను. నుదిటిపై నుండి శిరోజములను తన దక్షిణ హస్తముతో నిమిరెను. అటుపైన ఆమె శరీరమును తన

హస్తములలో కెత్తుకొని గంగానదీ ప్రవాహములోని కేగెను. గంగకు నమస్కరించి ఆ దేహమును నదీ ప్రవాహమున చేర్చి నమస్కరించి వెనుతిరిగెను. అతడిక కుటీరమునకు పోలేదు. తదేక దృష్టితో ఉత్తర ముఖముగ సాగెను. హిమాలయములలో ప్రవేశించెను.

సిద్ధార్థునకు అన్వేషణ పూర్తియైనది. అంతటా, అన్నిటా దైవమే నిలచిన స్థితి ఏర్పడినది. సౌదామని నిష్క్రమించుట చేత, అతడిక శేషజీవితము ఒంటరి. దైవముననే నుండుట నేర్చినవానికి వుండుట యందే ఆనందముండును. అట్లుండుటకు దేహము ఆవశ్యకము కాదు. దేహమున్ననూ అది బంధము కాదు. అతనికిక గమ్య మేమియు లేదు కనుక కాలమును దేశమును బట్టి తిరుగాడు చుండెను. నీరు లభించినచో గ్రోలును. ఆహారము కూడ లభించినచో భుజించును. ఇట్లు సంచరించుచున్న సిద్ధార్థు డొకనాడు ఒక పెద్ద రావిచెట్టు క్రింద విశ్రాంతిగ కూర్చుండెను. శరీరము అలసియుండుటచే సన్నని నిద్ర ఆవేశించినది. నిదుర లేచుసరికి, రావివృక్షము క్రింద తన ప్రక్కన ఒక బౌద్ధ భిక్షువు గోచరించెను. అతడునూ విశ్రాంతి గొనుచున్నాడు. అటుపైన అతడునూ మేల్కాంచెను. ప్రక్కననే నున్న సిద్ధార్థుని చూచిన భిక్షువు మందస్మితము చేసెను. ''శ్రమ వలన కొంత నిదుర కలిగినది. శ్రమ తీరినది. దేహధారులము కదా! దేహధర్మములు పాటింపక నుండుట అసాధ్యము. చాలకాలము తరువాత సన్నని నిదుర వచ్చినది.'' అని మృదుమధురముగ పలుకుచు, భిక్షువు ముందుకు సాగబోగా సిద్ధార్థుడు ''మిత్రమా! గోవిందా! నన్ను గుర్తింపలేదా? నిన్ను నేను గుర్తించితిని'' అనుచూ భిక్షువు హస్తమును, తన

హస్తముతో పట్టెను. గోవిందుని కాశ్చర్యము కలిగినది. ఎదుట నున్న వ్యక్తిని తేరిపార చూచినాడు. ''ఆశ్చర్యము. నీవు నా సిద్ధార్థుడవా? రూపురేఖ లెంత మారినవి! కంఠము మాత్రమట్లే యున్నది. సిద్ధూ! నిన్ను గూర్చి తలవని దినము లేదు. ఇన్ని సంవత్సరములకు దైవము మనలను కలిపెను. నాకు చాల సంతోషముగ నున్నది. ఇంతకను నీ అన్వేషణ ఫలించినదా! నీవు కోరిన దైవము నిన్ను అనుగ్రహించినాడా? ముందీ విషయము తెలుపుము.''

*సిద్ధార్థుడు* : **అనుగ్రహింపబడినాను. తల్లిదండ్రుల రూపముననే అనుగ్రహము లభించినది. మలుపులు చాల తిరిగిననూ జీవితము ఫలించినది. మనము బాల్యము నుండి వెదకిన విషయము వెదకినచో దొరుకునది కాదు. అది తెలియవలసినదియే. తెలియుటకు వెదుక నవసరములేదు. తల్లిదండ్రులను విసర్జించ నక్కరలేదు. అడవులలో తిరుగనక్కరలేదు. మనమున్నచోటనే అది యున్నది. అది తెలియుటకు అంతరాయము నా యందలి రజస్సే అని కూడ తెలిసినది. రజస్సు కాలము రూపమున హరింపబడగ సత్త్వమున నిలచితిని. సత్త్వము నిత్య సత్యమైనది. అనుగ్రహము వర్షించినది.** అందే జీవించు చున్నాను. తిరుగు చున్నాను. నే నుండుట యనగా అది యుండుటయే. నిజమున కిపుడు సిద్ధార్థుడు లేడు. నామ మాత్రమే యున్నాడు. ఉన్న దదియే. నీ యందు కూడ నాకు గోచరించున దదియే.

గోవిందుడు ఆనందభరితుడై సిద్ధార్థుని కౌగలించుకొని ''నీవు నిజముగ సిద్ధార్థుడవు. నేనును సిద్ధార్థుడనే. మన

తల్లిదండ్రు లే లోకము లందున్నను మన ఈ సిద్ధి వారికి తృప్తిని కలిగించగలదు. ఇంతకునూ ఇపుడు నీ పయనమెటు?"

*సిద్ధార్థుడు :* నాకు గమ్యము లేదు. గతియు లేదు. కాలమును దేశమును బట్టి దైవముననే తిరుగాడు చున్నాను. దేహము రాలిపోవు నంతవరకు పంచభూతము లందలి దివ్యత్వమును అనుభూతి చెందుచు నుండెదను. లోన స్ఫురించిన విధముగ సంచరించుటయే. నాకిక ఏ ఉనికి లేదు. లో ఉనికియే నా ఉనికి. లోపల బైట వ్యాపించియున్న దైవమునం దుండుటయే పని.

*గోవిందుడు :* నీకు సంచారము మాత్రమే యున్నది. నాకు బుద్ధుడు ప్రచారమును కూడ కర్తవ్యముగ నందించినాడు. ధర్మ ప్రచారము చేయుచు సంచారము చేయుచు నుందును. **సంచారము నందున్నను, ప్రచారము నందున్ననూ అంతయూ దైవము నందుండియే నిర్వర్తించు చుందును. దైవమే నిర్వర్తించు చున్నట్లు కూడ భావన కలుగుచు నుందును.** గోవిందుడు లేని స్థితిని తరచూ అనుభూతి చెందుదును. సిద్ధార్థునివలె గోవిందుడు కూడ నిర్వాణము చెందినాడు. ఇక మిగిలినది దైవమే!

– *సంపూర్ణము* –

**DHANISHTA PUBLICATIONS**
D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Ashram Regulation for Entry | E/G/S |
| 13. | An insight into the WTT | E |
| 14. | Atmasadhana Sutramulu | T |
| 15. | Avathara of Synthesis | E |
| 16. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 17. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 18. | Book of Prayers | E |
| 19. | Cow | K/T/E/Hi |
| 20. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 21. | Dharmavigrahudu – Sri Ramudu | T |
| 22. | Dhanakamuni Katha | T |
| 23. | Doctrine of Eternal Presence | E |
| 24. | Gayatri Mantra Avagahana | T |

*The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.*

| | | |
|---|---|---|
| 25. | Geetopanishad - Gnana Yogamu | T |
| 26. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 27. | Geetopanishad - Karma Yogamu | T |
| 28. | Geetopanishad - Sankya Yogamu | T |
| 29. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 30. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 31. | Good Friday | E/S |
| 32. | Healers Handbook | E |
| 33. | Health & Harmony | E/G |
| 34. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 35. | Himalaya Guruparampara | T/Hi/K |
| 36. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 37. | Just Adjust | E |
| 38. | Jyotirlinga Yatra | T |
| 39. | Kapila and Kardama | E/G/S |
| 40. | Katha Deepika | T |
| 41. | Lectures on Secret Doctrine - I | S/E |
| 42. | Lectures on Secret Doctrine - II | E |
| 43. | Lectures on Secret Doctrine - III | E |
| 44. | Listening to the Invisible Master | E/S/K |
| 45. | Lord Maitreya – The World Teacher | E/S |
| 46. | Life and Teachings of Master Jupiter | E |
| 47. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 48. | Mana Master garu | T |
| 49. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 50. | Mars - The Kumara | E/G/S |
| 51. | Mercury - The Alchemist | E/G/S |
| 52. | Maria Magdalena | E/S |
| 53. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 54. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 55. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 56. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 57. | MASTER C.V.V. - Yogamu | T |
| 58. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 59. | Master K. Parvathi Kumar - Short Biography | E |

| | | |
|---|---|---|
| 60. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 61. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 62. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 63. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 64. | Marana Rahasyam (Markandeya) | T |
| 65. | Marana Rahasyam (Savitridevi) | T |
| 66. | Master CSG | E |
| 67. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 68. | Moon - The Key | E |
| 69. | New Age Hospital Management | E |
| 70. | Nutrients For Discipleship | E |
| 71. | OM | T/K/E |
| 72. | Occult Meditations | E/G/S |
| 73. | Om Namo Narayanaya | E/G/S |
| 74. | On Change | E/S |
| 75. | On Healing | E |
| 76. | On Love | E/G/S |
| 77. | On Service | E/G/S |
| 78. | On Silence | E/G/S |
| 79. | PARIKSHIT-The World Disciple | E |
| 80. | Pranayamam | T |
| 81. | Prayers | E/G/S |
| 82. | RUDRA | E |
| 83. | Rukmini Kalyanam | T |
| 84. | Sai Sukthulu | T/K |
| 85. | Sai Ki Amruthavani | Hi |
| 86. | Sanghaneethi | T |
| 87. | Saraswathi-The Word | E/G/S |
| 88. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 89. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 90. | Shodosopachara Pooja - Avagahana | T |

**Please visit our website (www.dhanishta.org / info@dhanishta.org) for prices**



# అసంగుడు

**మాస్టర్ పార్వతీకుమార్**

"మంచి చెడుల జన్మస్థాన మొకటే. చీకటి వెలుగుల జన్మస్థానము కూడ ఒకటే. జ్ఞానమున్నచోటే అజ్ఞానము కూడ యుండును. దీపమున్నచోట నీడ కూడ యుండును. సృష్టి యందు ద్వంద్వములు సహజము. ద్వంద్వముల యందు ఒక దానిని కోరి రెండవ దానిని విసర్జించువాడు నిరంతరము పోరాట మందుండును."

* * *

"దైవమును చూచిన సంగముండదు. సంగముండిన దైవముండడు. అసంగమే అస్త్రము. అసంగ మనగా దైవముతో సంగము. ఇతర ఏ సంగములైనను మాయయే. దైవసంగమే సత్యము. అదియే "అ"తో సంగము, అసంగము."

సత్యదర్శనమునకు వివిధ మార్గములుండుట వైభవము, సౌలభ్యము. జీవుడు తన స్వభావమునుబట్టి తనకు నచ్చిన ఒక మార్గమును నిర్దిష్టముగా అనుష్ఠింప వలెను. గమ్యమునకు పది మార్గము లున్నవని, పది మార్గములయందు కొంత నడుచుట వృథా శ్రమయే కాని నడుచువాడు గమ్యమునకు చేరువ కాడు కదా!

సత్యాన్వేషణ మార్గములు పలు రకములు. సత్యము ఒక్కటియే! మార్గములు వేరుగా కనిపించును. గమ్యము మాత్రము ఒక్కటియే! ఈశ్వరుడు జీవులను ఎట్లు అనుగ్రహించదలచినాడో జీవులకేమి తెలియును? కాలమే తెలుపగలదు!

సంకల్పబలము, త్రికరణశుద్ధిగల ప్రతి జీవుడు సిద్ధార్థుడే!

ISBN 978-81-89467-77-7

9 788189 467777 >

ధనిష్ఠ